# అనగనగా ఓ మంచికథ

2016



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 172

# కౌముది మాసపత్రికలో 2016 జనవరి నుంచి డిసెంబర్ వరకూ

# ప్రచురించబడిన అలనాటి ఆణిముత్యాలు

## విషయసూచిక


| ఏడాది | నెల | కథ పేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|---|
| 2016 | 01 | హామీ పత్రం | యర్రంశెట్టి సాయి | 3 |
| | 02 | అవిశాల హృదయుడు | ప్రభు | 8 |
| | 03 | అనురాగ ప్రస్తారం | బుచ్చిబాబు | 13 |
| | 04 | దొంగ సొత్తు | దాసరి సుబ్రహ్మణ్యం | 29 |
| | 05 | నీలిమేడ | ఆత్రేయి | 34 |
| | 06 | సాక్షి | ముళ్ళపూడి వెంకటరమణ | 40 |
| | 07 | దొంగలున్నారు జాగ్రత్త | శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి | 50 |
| | 08 | మధురక్షణాలు | టి వి రత్నావళి | 55 |
| | 09 | బీ | బుచ్చిబాబు | 59 |
| | 10 | తాను వలచినది రంభ | కొడవటిగంటి కృష్ణమూర్తి | 73 |
| | 11 | నేను పెద్దవాడినయ్యానా ? | పి ఎస్ నారాయణ | 83 |
| | 12 | తిరుపతికొండ మెట్లు | అడవి బాపిరాజు | 90 |

# హామీ పత్రం

## - యర్రంశెట్టి శాయి

### ( 1979 జనవరి, విపుల మాసపత్రిక నుంచి పునర్ముద్రణ)

దిక్సూచీ సంపాదకులకు,

నేను దిక్సూచీ పత్రిక దురభిమానిని. వారం, వారం తమరు అందిస్తున్న విలువయిన నవల నన్ను పరవశింపజేస్తోంది. కథలు ఆణిముత్యాల్లా ఉంటున్నాయి. 'దిక్సూచి తెరలు' లో తమరు రాస్తోన్న సందేశం గుండెల్ని హత్తుకుపోతోంది. సినిమా వార్తల ద్వారా మన తెలుగు దేశపు నటులు ప్రపంచంలోనే అగ్రనటులని తెలుపుతున్నందుకు నాకు పట్టరాని ఆనందంగా ఉంది. కార్టూన్లు కడుపుబ్బ నవ్విస్తోన్నాయి.

గత సంచికలో మీరు పూర్తిచేసిన నవల 'చీమలు దూరని చిట్టడవి' చాలా బావుంది. మరీ మరీ బావుంది! ఒకటికి ఎనిమిది సార్లు చదివాను. ఆది 'కాకులు దూరని కారడవి' అని అదివరకు నేను చదివిన నవలకు కాపీ కాకుండా ఉన్నట్లయితే మరింత బావుండేది. 'కాకులు దూరని కారడవి' నవల రాసింది ప్రఖ్యాత రచయిత్రి శంభూదేవి. మరి ఆ నవలను 'చీమలు దూరని చిట్టడవి' రచయిత జుగళ్ కిషోర్ గారు ఎందుక్కాపీ కొట్టారో ఏమాత్రం అర్థం కావడం లేదు. అలా కాపీ కొడుతుంటే చూసి మందలించాల్సింది పోయి మీరెందుకు ఆదరిస్తున్నారో అస్సలు అర్థం కావడం లేదు. మూడు నెలలపాటు శ్రమపడి కాపీ నవల చదవాల్సిన ఖర్మ మాకేమీ పట్టలేదు. గ్రహించగలరు. ఇది మా అందరి అభిప్రాయం!

శంకర్, పద్మ, ప్రసాద్, సుజాత, భగవాన్, అమ్మాజీ, బాబు, రమ ఇంకా వారి
బంధువులూ, మిత్రువులూ, శత్రువులూ వగైరా వగైరా ! హైదరాబాద్ –

★ ★ ★

దిక్సూచి ఎడిటర్ గారూ!

మీరు ప్రచురించిన 'చీమలు దూరని చిట్టడవి' నవల అంతకు ముందు ప్రచురింపబడిన 'కాకులు దూరని కారడవి' కి పరమ కాపీ ! ఆహ్హాహ్హాహ్హా...

పాఠకేశ్వరావు, తెనాలి.

★ ★ ★

'చీమలు దూరని చిట్టడవి' నవల అంతకు ముందెప్పుడో మేము చదివిన 'కాకులు దూరని కారడవి' నవలకు కాపీ! ఇలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తపడండి_

ఉగ్రనరసింహం, కత్తులపూడి.

★ ★ ★

పాఠకులకు మనవి,

'చీమలు దూరని చిట్టడవి' నవల 'కాకులు దూరని కారడవి' నవలకు కాపీ అని అనేకమంది పాఠకులు వ్రాశారు. ఈ విషయమై మేము ఆ నవలా రచయిత శ్రీ జుగళ్ కిశోర్ గారిని అడగగా ఆయనీవిధంగా వ్రాస్తున్నారు. పాఠకులు గమనించి సహృదయంతో అర్థం చేసుకోగలరు_

ఎడిటర్.

★ ★ ★

ఎడిటర్ గారికి,

నా నవల 'చీమలు దూరని చిట్టడవి' 'కాకులు దూరని కారడవి' నవలకు కాపీ అన్న ఆరోపణలొచ్చినట్టు తెలియజేశారు. 'కాకులు దూరని కారడవి' అనే నవల నేను చదవనే లేదు. అసలా పేరుతో నవల ఒకటి వెలువడినట్లు కూడా నాకు తెలీదు. ఒట్టు ! మామామయ్య కొడుకు రేంజర్ గా పని చేస్తున్న ఓ అడవిని చూడ్డానికెళ్ళినప్పుడు, ఆ అడవిలో చీమలు లేకపోవడం గమనించి ఈ నవల అల్లాను. కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ నా నవల కాపీ కానేరదు. అక్కడక్కడ పోలికలుంటే అది కేవలం యాదృచ్ఛికం. పాఠకులు నన్ను నమ్మవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

రచయిత, జుగళ్ కిశోర్.

2

మీ (మా) పత్రిక అద్భుతంగా ఉంటోంది. ఇంకా బోలెడు అద్భుతంగా అభివృద్ధి చేస్తారని ఆశిస్తాను. 'కళ్ళల్లో కాపురం' కథ బావుంది. చివరకు హీరోయిన్ మళ్ళీ భర్తను కలుసుకొని క్షమించమని అడిగి ఇద్దరూ ఒకటయితే ఇంకా బావుండేది. అలాకాక భర్త స్నేహితుడిని పెళ్ళాడటం అంతగా రుచించలేదు _

ఇట్లు
పతివ్రత, పాలకొల్లు.

★ ★ ★

'కళ్ళల్లో కాపురం' కథ పరమచెత్త. ఇలాంటి అవాంఛనీయమైన కథలు ప్రచురింపవద్దని మనవి. భర్త ఎన్ని బాధలు పెట్టినా భార్య చివరకు అతనినే చేరుకోవాలి. ఇద్దరూ ఒకరి తప్పులొకరు క్షమించుకోవాలి. భర్త బయటగ్గెంటినా చావబాదినా ఇల్లు వదలకూడదు. అతని కాళ్ళు పట్టుకు వేలాడాలి. అంతేకాని ఆ భర్త స్నేహితుడిని పెళ్ళాడటం ఏమిటి ? రచయితకు బుద్ధిలేదు. భారతదేశంలో జరగాల్సిన, లేక రాయాల్సిన కథ కాదు ఇది __

ఇట్లు

మహా సాధ్వి, మంగాపురం.

★ ★ ★

దిక్సూచిలో ప్రచురింపబడిన 'చీమలు దూరని చిట్టడవి' నవల నేను 1972లో రాసిన 'కాకులు దూరని కారడవి' నవలకు కాపీ. ఆ నవల రచయిత రాసిన జవాబు నాకు సంతృప్తికరంగా కనిపించలేదు. కాపీ కాకపోతే అన్ని సన్నివేశాలు ఒకటిగా ఎలా వస్తాయో ఊహించలేకపోతున్నాను. కనుక ఇది యాదృచ్ఛికం కాదని నా అనుమానం ! మీకు నేను నవంబరులో పంపిన నవల 'చీకటిలో చిట్టెమ్మ'ను అంగీకరించారాలేదా _ _

రచయిత్రి శంభూదేవి, హైదరాబాద్.

★ ★ ★

'చీమలు దూరని చిట్టడవి' నవల 'కాకులు దూరని కారడవి' నవలకు కాపీ అని చాలామంది రాశారు. ఆ విషయం ఎంతవరకూ నిజమో నాకు తెలీదుగానీ 'చీమలు దూరని చిట్టడవి' నవల ఆ మధ్య (తారీఖు గుర్తులేదు) ఓ తెలుగు పత్రికలో (ఏ పత్రికో గుర్తులేదు) నేను చదివిన 'మట్టి మీది మాణిక్యాలు' అనే కథకు మక్కీకి మక్కీ కాపీ! (దాని రచయిత పేరు గుర్తులేదు) గమనించ గలరు.

శివతాండవరావ్, తాండవపురం.

★ ★ ★

'చీమలు దూరని చిట్టడవి' నవల 'కాకులు దూరని కారడవి' అనే నవలకు కాపీ అన్న ఉత్తరాల గోదు చూశాను. వెంటనే 'కాకులు దూరని కారడవి' నవల తెప్పించి చూశాను. నిజమే ఈ రెండు నవలలూ ఒకటే – ఇప్పుడు నాకో ధర్మ సందేహం వచ్చింది. అసలు ప్రఖ్యాత బెంగాలీ రచయిత కరుణాకిరణ్ సన్యాల్ రాసిన 'ఏక్ తో సింగాడే' అనే నవలకు ఈ రెండూ కాపీ! మరి దీనికి జుగళ్ కిషోర్, శంభూదేవి గార్లేమంటారో తెలుసుకోవాలని ఉత్సాహంగా ఉంది.

పరాయి ప్రభు, కలకత్తా.

3

గతవారం పరాయి ప్రభుగారి లేఖ, శివతాండవరావ్ గారి లేఖ చదివాను. 'మట్టి మీది మాణిక్యాలు' అనే కథ నేనింతవరకూ చదవలేదు. ఆ మాటకొస్తే అసలు నేను నా కథలు తప్పితే వేరే కథలు చదవను. నాకు తెలుగు తప్పితే మరో భాష రాదు. అంచేత బెంగాలీ కథ 'ఏక్ తో సింగాడే' ని కాపీ కొట్టడమ్ ఎలా సాధ్యమవుతుంది ? ఇలా లేనిపోని అభాండాలు వేస్తే నా మనసు పాడయిపోతుంది.

రచయిత్రి శంభూదేవి.

★ ★ ★

నా నవల 'చీమలు దూరని చిట్టడవి' ఇన్ని నవలలకూ, కథలకూ, ఇతర భాషల కథలకూ కాపీ ఎలా అయిందో నాకేం బోధ పడటం లేదు. ఇంక జన్మలో కథలు రాయనని ఇందు మూలముగా అందరికీ హామీ ఇచ్చుచున్నాను.

రచయిత జుగళ్ కిషోర్

★ ★ ★

'చీమలు దూరని చిట్టడవి' నవల, 'కాకులు దూరని కారడవి' నవల ఈ రెండూ కూడా 'ఒక అడవికథ' అనే తెలుగు చిత్రం కథకు కాపీ! సారీ! కాపీ కాదు ! అదే ! కావాలంటే 'ఆ చిత్రం' ఎవరయినా చూసిన వాళ్ళుంటే అడగండి! చెప్తారు...

సినాట్రా, సికింద్రాబాద్,

★ ★ ★

'చీమలు దూరని చిట్టడవి' 1959లో రిలీజయిన 'ఒక అడవికథ' తెలుగు చిత్రానికి కాపీ ! ఆ చిత్రంలో కథనే కొద్ది మార్పులతో రచయిత రాశారు. 'కాకులు దూరని కారడవి' రచయిత్రి గారు కూడా మరి జవాబివ్వాలి _

పుష్పవినాశ్, గుంటూరు.

★ ★ ★

4

'చీమలు దూరని చిట్టడవి' నవల, 'కాకులు దూరని కారడవి' నవల, మట్టి మీది మాణిక్యాలు కథ, ఏక్ రోసింగాడే అనే బెంగాలీ కథా, ఇవన్నీ పాత తెలుగు చిత్రం 'ఒక అడవి కథ'కు కాపీ అని ఉత్తరాలు ప్రచురింపబడటం చూశాను. కాని 'ఒక అడవి కథ' చిత్రం నేను చిన్నప్పుడు చూసిన ఒక ఇంగ్లీష్ కథకు కాపీ! ఆ కథ పేరు మర్చిపోయాను. ఆ సినిమాకు సంబందించిన వారెవరయినా ఆ వివరాలు తెలియజేస్తే వారికి ఋణపడి పోతాను _

ఋణేగ్రేసర్రావు, గుణదల.

★ ★ ★

'ఒక అడవి కథ' తెలుగు చిత్రానికి కథను సమకూర్చింది నేనే! అది ఒక ఇంగ్లీషు కథకు కాపీ అని గుణదల ఋణేగ్రేసర్రావు గారు రాశారు. నిజం చెప్పాలంటే అది నిజం కాదు ఒక అడవికథ చిత్రానికి 'కేటికేటిపారు' అనే తమిళ చిత్రం ఆధారం. కనుక ఒకవేళ అలా ఓ ఇంగ్లీష్ కథనే కాపీ కొట్టటం జరిగినట్లయితే అది ఆ తమిళ చిత్ర రచయిత బాధ్యతగా గమనించ గోర్తాను. సాధారణంగా తెలుగు రచయితలంతా అనువాదకులే! కనుక కాపీ కొట్టే ఆవసరం ఆస్కారం లేదు.

సినీ రచయిత – సింహాద్రి.

★ ★ ★

'ఒక అడవి కథ' తెలుగు చిత్రానికి మూలం 'కేటి కేటి పారు' అనే తమిళ చిత్రమని ఆ సినీ రచయిత శలవిచ్చారు. నిజానికి ఆ చిత్రానికి మూలం 'ఇధర్ దేఖో' అనే హిందీ చిత్రం. దాన్ని కాపీ కొట్టి తమిళంలో తీశారు. ఆ తరువాత తెలుగులో వచ్చింది. సినీ రచయిత సింహాద్రి గారు ఈ విషయం తెలుసుకోగలరు.

క్రిటికేశ్వర్రావ్, తెనాలి.

★ ★ ★

మీరు ప్రచురించిన 'చీమలు దూరని చిట్టడవి' నవల బావుందని మా పక్కింటి ఆమె చెప్పింది. ఆ సంచికలకోసం ఎంత గాలించినా దొరకడం లేదు. ఆ కాపీలు వి.పి.పి.లో పంపగోర్తాను.

తీరికేశ్వరమ్మ, తిరుమల–2

★ ★ ★

ఎడిటర్జీ,

ఇకనుంచీ ఏ కథ మరే కథకి కాపీయో, ఆ కథ ఇంకే కథకి అనువాదమో, ఆ అనువాదం మరే చిత్రం కథకు ఆధారమో ముందే తెలియజేస్తారని ఆశిస్తాము. ఇలా ఆలశ్యంగా తెలియడంవల్ల నేను అనేక పందాలుకట్టి ఓడిపోతున్నాను.

ఒక దురభిమాని, దురహంపూర్.

## 5

తెనాలి క్రిటికేశ్వర్రావ్ గారు పప్పులో కాలేశారు. 'ఒక అడవి కథ' తెలుగు చిత్రానికి మూలం 'ఇదర్ దేఖో' అనే హిందీ చిత్రమని రాశారు. కానీ అది నూటికి నూరుపాళ్ళూ తప్పు. 'ఒక అడవి కథ'కు మూలం 'వేర్ వింటర్ వెంట్' అనే ఆంగ్ల చిత్రం. 1948లో ట్వంటీనైన్త్ సెంచరీ కాట్ వారు ఆ చిత్రం నిర్మించారు. కావాలంటే క్రిటికేశ్వర్రావ్ గారు ఆ సినిమా చూసిన వారినెవరినైనా సంప్రదించవచ్చు.

రంధ్రాన్వేషణ్, మొగల్ సరాయ్.

★ ★ ★

నేను ఈ మధ్యనే దిక్సూచీ సంచికలు మా బంధువులింట్లో చదివాను. 'చీమలు దూరని చిట్టడవి' ప్రఖ్యాత ఆంగ్ల రచయిత ఎమరపాట్ బామ్ రాసిన 'ది బ్లేజర్స్ బ్రిడ్జ్' అనే నవలకు పిచ్చి కాపీ! దీన్నే 'ఫోటోస్టాట్ కాపీ' అని కూడా మనం పిలుచుకోవచ్చు. ఇలాంటి ఫోటోస్టాట్ కాపీలు ప్రచురించకండి.

ఆంగ్ల కమలాకరం, న్యూఢిల్లీ.

★ ★ ★

మీ (మా) పత్రికలో ప్రచురింప బడుతున్న ధారావాహిక సీరియల్ వచ్చే సంచికలో ముగుస్తున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే ఆ కథ మేము ఘనా దేశంలో ఉన్నప్పుడు టి.వి.లో డ్రామా గా వచ్చింది. మరి ఆ రచయిత ఆ సమయంలో ఘనాలో ఉన్నారేమో మాకు తెలీదు.

నటరాజ్, న్యూయార్క్.

★ ★ ★

పాఠకులకు, రచయితలకు విజ్ఞప్తి,

చీమలు దూరని చిట్టడివి ఉరఫ్ కాకులు దూరని కారడివి, ఉరఫ్ మట్టిమీది మాణిక్యాలు ఉరఫ్ ఏక్ తో సింగాడే, ఉరఫ్ ఒక అడవికథ ఉరఫ్ కేటి కేటి పారు ఉరఫ్ ఇధర్ దేఖో ఉరఫ్ వేర్ వింటర్ వెంట్ ఉరఫ్ ఈగిల్స్ ఇన్ జంగిల్స్ ఉరఫ్ – ఇంకా పేరు తెలీని కథలూ, చిత్రాలూ, టీవీ డ్రామాలూ – వీటన్నిటి గురించి ఇంకా మా పత్రికలో ప్రచురింప బడుతున్న ఇతర కథలూ, సీరియల్స్ గురించీ ఎవరేమి రాసినా ప్రచురింప బడవు. ఇంతటితో ఈ రకం ఉత్తరాలు ప్రచురించడం ఆపివేస్తున్నాం.

ఇకనుంచీ మా పత్రికలో కేవలం కాపీలు మాత్రమే ప్రచురిస్తామని అందరికీ తెలియజేస్తున్నాము. రచయిత ప్రతి రచనకూ వెనుక అది తన స్వంత రచన కాదనీ, కాపీయేననీ, అది ఇంతకు ముందే ఎప్పుడో ప్రచురింపబడిందనీ హామీ పత్రం జతచేసి పంపాలి ! అలాంటి హామీలేని రచనలు ప్రచురణకు స్వీకరింపబడవు. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరపడం సాధ్యం కాదని గమనించ కోరుతున్నాము.

ఎడిటర్ దిక్సూచి.

★★★

# అవిశాల హృదయుడు

- ప్రభు

(1957 మార్చి 2, తెలుగుస్వతంత్ర నుంచి పునర్ముద్రణ)

స్వింగ్ డోర్స్ చప్పుడు విని, తల ఎత్తకుండానే "ఇంక ఈ రోజుకి ఫైల్సు చూడనని చెప్పేను..." అన్నాడు చిరాకుగా శ్రీపతి.

"సారీ సర్" తడబడ్డది వొచ్చిన అమ్మాయి కంఠం... "ఇవి ఫెయిర్ కాపీలు.. హెడ్ క్లర్క్ నన్ను వెళ్ళి సిగ్నేచర్స్ తీసుకోమన్నారు..."

ఆమె కాగితాలతో తలుపుకీ, టేబిల్ కీ మధ్య అట్లానే నిలబడ్డది. మరి రెండు సంతకాలు చేసి శ్రీపతి తల ఎత్తి చూశాడు. సిపాయి వచ్చేడని అనుకుని తాను చిరాకుగా మాటలాడేడు. టైపిస్టు కొంత ఆలశ్యంగా కాపీలు ఇచ్చి ఉంటుంది. హెడ్ క్లర్క్ కి మామూలు ఇలాగ శిక్షించడం.

ఆమె తనవంక చూడడం లేదు. తరువాత ఆమె వినే వాక్యాల వరుస సూటిగా చూడనిచ్చేది కాదు. "ముఖంలోకి సూటిగా చూడలేరు.. సిన్సియర్ గా పనిచెయ్యక.. నిజంగా, మీ వర్కు ఇవేళా ఆలశ్యం కావాలా?"

అనుకోని కటుత్వం వొచ్చింది శ్రీపతి గొంతుకలోకి "A pack of insincere fellows... ఎవ్వరూ తమ విధిని గౌరవించరు..."

ఆమె మాట్లాడలేదు. ఎవ్వరూ ఆఫీసులో ఇలాటి మాటలకి తిరిగి మాట్లాడరు.

ఏదో అనబోయి మానేశాడు శ్రీపతి. ఒక రోజు గుమాస్తాగా కాకపోయినా, మరొక చిన్న ఉద్యోగంలో తన స్థితి జ్ఞాపకం వొచ్చి. వెనువెంటనే ఎందుకని ఆ రోజు తానంత చిరాకుగా ఉన్నాడో తెలియ వొచ్చింది తనకి. ఉదయం టపాలో తన ఉత్తరం రాలా. ఆమె రాయలా. తనకి తెలీకుండానే ఈ ఆరేడు గంటలూ అందరికీ తన చిరాకు పంచి పెడుతున్నాడు.

Sincerity...

తన భార్య తననిట్లా అంటే? ఆమె ఎన్నడూ అనదు. విశాల ఉత్తరం రాకపోతే తాను బాధపడినా, ఆ సంగతి ఆమెకి తెలిసినా ఇలాగ అడగదు. నిజానికి ఆ ఇద్దరిలోనూ ఎవరి జీవితం వారిదే. విశాల నించి వినకపోతే తనకి కాలం గడవదు. అది నీతి అయినా అవినీతి అయినా, sincere అయినా కాకపోయినా, తన మానసిక జీవితానికి దోహదం ఆమె, ఆమె ఉత్తరాలూ.

సిగ్గుపడ్డాడు శ్రీపతి... కుర్చీలో జేరబడి “ఇవేళ సంతకం చెయ్యాలా?” అన్నాడు.

“రాత్రి మెయిల్ కి పోవాలి...”

“ఆల్ రైట్... ఆల్ రైట్...”

పార్లమెంటు ప్రశ్న. సమాధానం ఈ రాత్రి వెళ్ళక తప్పదు.

త్వరగా సంతకం చేసి అప్పుడు మీదికి చూశాడు. అన్నీ అంకెలు. ప్రాణం లేనివి, కాని, ఎంతమంది ప్రాణాలని తీస్తాయి!

అన్ని కాపీలు సంతకం చేశాక వొంగి వాటిని తీసుకుని ఆఫీసులోకి నడిచింది టైపిస్ట్. డిస్పాచి ఆమెదేనని జ్ఞాపకం వచ్చింది శ్రీపతికి, ఏదో తెలివి వొచ్చినట్లు.

త్వరగా డ్రాయర్ తాళం తీసి ఇంటికి బయలుదేరాడు. అంతా అర్ధవిహీనంగా కనిపిస్తోంది తనకి. ఈ సంసారమూ, ఆఫీసూ, ప్రపంచం, మనుషులు అన్నీ, అందరూ...

విశాల ఎందుకని ఉత్తరం రాయదు? పెళ్ళి చేసుకుంటుందా ? తనకి చెప్పకుండా?

బాధగా నవ్వుకున్నాడు శ్రీపతి. ఒక రోజు ఆమె తప్పక పెళ్ళి చేసుకుంటుంది. కాని తనకి ముందు చెప్పకుండా కాదు.

కొద్ది దూరము నడిచేసరికి అలసట వొచ్చింది తనకి. ఈ రెండేళ్ళనించీ Exhaust అయిపోయాడు తాను. భౌతికంగా, మానసికంగా..

నెమ్మదిగా తలుపు తోసుకుని మెట్లు ఎక్కేడు. వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. జోళ్ళూ కోటూ సిపాయ్ సాయంతో వొదిలించుకుని. ఫేన్ పెట్టి, కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళేడు సిపాయ్.

“రామయ్యా వస్తావయ్యా...”

రేడియో గ్రామ్ లోనించి వినిపిస్తున్నదెవరో తనకి తెలుసు. తన రేడియోలో అడిగిన పాటలు రావు ఆ సంగతి తెలిసినవాళ్ళు...

“మైనె దిల్ తుఝ్ కొ దియా...”

భగవాన్! భగవాన్! అనుకున్నాడు ఇంకా నీరసంగా చేరబడుతూ శ్రీపతి. ఈమె తనకి దూరంగా ఎందుకు ఉండదు? ఈ ఇంటికి మొదటిసారి వొచ్చినప్పుడు ఆమె తనతో మాట్లడితే జన్మ తరించిపోతుందని అనుకున్నాడు తాను. మాటలాడితే తన ఏదో Vanity సంతృప్తి పడుతుందని కాదు... ఆమె అచ్చు Lux బొమ్మల్లే ఉండేది. ఆమె దూరంగా ఉండి మాట్లాడకపోతే, తన మనస్సు బాధ పడుతుందని ఆ రకం Situations తను భరించలేదు. అందుకని, నిజానికి ఆ బాధలో తన విషయం మరిచిపోగలనని అతననుకున్నాడు. తనకి కావాల్సింది ఇలాంటి బాధ; సమస్య. మేలుకుని ఉన్నంత సేపూ ఆలోచించి బాధపడడానికీ, ఆ మధ్యన తననీ, తన సంసారాన్నీ, తన విశాలనీ, మరిచిపోడానికీ. ముందు విశాల తనకి తానై ఆప్యాయత చూపించినా, కొంతకాలం వరకూ ఆమె నిండు మనస్సుని తాను చూడలేకపోయాడు. కాని, తమ మధ్య మొదటినించీ Reserve లేదు.

శ్యామల మొదట చాలా Aloof గా ఉండేది. తనకి కావాల్సిన Situation వొచ్చింది. నిజానికి భార్యకూడా ఉన్నా తాను మరో ప్రపంచంలోకి పోగలిగే వాడప్పుడు. శ్యామల కోసం బెంగపెట్టుకుని. అట్లా పూర్తిగా నమ్మేవాడు తాను.

ట్రేలో టీ, బిస్కట్లూ ఉంచి లోపలికి తెచ్చింది శ్యామల.. రేడియోగ్రామ్ పాట వెనుక పాట వినిపిస్తోంది.

“చాలా అలిసిపోయారా ? .. లేచి టీ త్రాగండి!”

వెనెలమల్లే మాటలాడుతుంది శ్యామల క్రొత్తలో ఆ గొంతుక వినిపించి తహ తహలాడే వాడు తాను. అలాగ ఆమె దూరంగా ఉండి ఉంటే ఇవన్ని మరిచిపోగలుగును తాను. కానీ.. భగవాన్!

అంత వేడిలోనూ రిఫ్రిజిరేటర్ లోంచి నడిచి వొచ్చినట్లుంది శ్యామల లేత ఉదుకులాం పరిమళాలలో. పాలూ వెన్నెలా కలిపి వేసిన చిత్తరువల్లే.

ఒక్కసారి విశాల జ్ఞాపకం వొచ్చింది తనకి. ఆ క్షణంలోనే, శ్యామలకి తనమీద కోపం వొస్తే బాగుండుననిపించింది తనకి ఇలాంటి disappointment కావాలి. ఆ బాధలోకాని జీవితం మీద గౌరవం రాదు తనకి.

ఆమె రెండు కప్పుల్లో టీ పోసి తనకి ఒకటి అందించింది. ఆమె అంత అందంగా ఎట్లా ఉంటుందో!

నెమ్మదిగా తాగుతూ, ఆలోచనలో పడ్డాడు శ్రీపతి. "బిస్కట్స్ కూడా తింటారు కొందరు టీతో" అంటూ ఒకటి చేతికి ఇచ్చింది శ్యామల 'థాంక్స్' అనబోయి ఊరుకున్నాడు శ్రీపతి.

నిశ్శబ్దంగా టీ త్రాగడం ముగించి శ్యామల గంభీరంగా... "ఎవరితోనైనా దెబ్బలాడారా ఈ రోజు?" అన్నది.

"ఆఁ ప్రపంచంతో ! మరి పనిలేక" అన్నాడు శ్రీపతి విసుగ్గా.

"మరి ఎందుకట్లా ఉన్నారు?"

శ్యామల తననట్లా అడగలేదు. ఎప్పుడూ గంటలతరబడి మాటలాడినా, వ్యక్తిగతమైన ప్రశ్నలు వేసే అలవాటు ఆమెకి లేదు. కొంచెం ఆశ్చర్యం వేసింది. తనకి తనకి మరీ దగ్గరగా వొస్తుందా?

"ఆయేన బాలమా... వాదాకర్ కే..."

చల్లగా వినిపిస్తోంది పాట బాధగా.

ఆమె ప్రశ్నకి ఏ సమాధానం చెప్తే ఆమె గాయపడుతుందో వెతుకుతోన్న శ్రీపతి ఒక్కసారి కరిగిపోయాడు. ఆమెని భరించలేడు తాను– అంత సౌందర్యం. తానేం చేసినా కోపం రాదు ఆమెకి – విశాలకీ .. ఆమె ఆతృతగా తన వొంక చూస్తున్న చూపులు. తన నడిగిన ప్రశ్నలోని మార్ధవమూ అన్నీ తనకదే చెప్తున్నాయి నిస్సహాయుడు తాను. విశాల దగ్గర అట్లా అనిపించదు కాని విశాల వేరు, శ్యామల వేరు!

ఒక్కసారి లేచి ఆమెని వొదిలి గదిలోకి వెళ్ళాడు. అద్దంలో తన ముఖం అలిసిపోయి, చెమటగా నల్లగా ఎంత అసహ్యంగా ఉంది! ఇప్పుడూ ఈ సుందరి తనని అసహ్యించుకోదెందుకని?

త్వరగా బాత్ రూమ్ కి పోయి షవర్ క్రింద నిలబడి స్నానం చేశాడు శ్రీపతి. తన ఆలోచనలు విపరీతంగా సాగుతున్నాయి. బహుశా ఇది సహాయం చెయ్యవచ్చు.

చల్లటి నీళ్ళు నెత్తిమీద పడ్డాక కొంత నయం అనిపించింది తనకి. సాయంత్రం ఐపోయింది. ఎంత త్వరగా తెమిలినా, ఇరవై నిముషాలకి కాని, ఇవతలకి రాలేకపోయాడు తల దువ్వుకుంటుంటే ఒక్కసారి భయం వేసింది. ఆమె ఏమనుకుంటుంది? తన మీద కోపం వచ్చి లేచి వెళ్ళిపోయిందా?

తాను తిరిగి వచ్చేదాకా ఆమె అట్లానే కూర్చుంది.

"సారీ శ్యామలా... ఏదోలా అనిపించింది. క్షమించండి..." నిజంగా విచారంగా అన్నాడు శ్రీపతి.

తిరిగి తాను కుర్చీలో కూర్చున్నాడు. ఆమె ఏదో ఆలోచనలో పడింది తనకీ జవాబు ఇవ్వలేదు.. ఏమనో? సాయంత్రం వొచ్చిన దగ్గరనించీ తాను మాట్లాడని విషయం జ్ఞాపకం వొచ్చి ఒకసారి ఎంతో నీచంగా Feel అయాడు శ్రీపతి ఆమె ప్రవర్తనని తలుచుకునీ, తన వర్తన చూసుకునీ.

ఎప్పటినించో పాటలు వినిపించడంలేదు. అలాగే మరొక పావుగంట గడిచిపోయింది.

"బయటికి వెడదామా?..." అన్నాడు సంశయిస్తూనే శ్రీపతి. ఎలాగైనా ఆమెని ఆలోచనలనించి ఈవలికి తేవాలని.

"మిమ్మల్ని అడిగిన దానికి సమాధానం చెప్పాలి..."

సమాధానం...

ఆమెని తప్పించుకోవడం కుదిరేలాగ కనిపించలేదు శ్రీపతికి. అందమైన అమ్మాయిలతో అబద్ధాలడడం మరీ అందంగా కనిపిస్తుంది తనకి. కాని, ఈ రోజు...

"మనుష్యులు ఎందుకని బాధపడతారు శ్యామలా?"

బాధగా, లేతగా చిరునవ్వు నవ్వింది శ్యామల. ఇన్నాళ్ళలో తానంత వేదనని ఈ అందగత్తె కళ్ళల్లో చూడలేదు. ఏమిటి జరుగుతోంది ఈ వేళ? ఏమి రోజిది?

"మీరు బాధపడడం కాదు... ఏదో అగ్ని తినేస్తోంది మిమ్మల్ని ఏదో ఒక బాధ లేకపోతే మనుషులు జీవించలేరు. కాని, ఒక్కొక్క నిప్పు మనసులో రగులుకుంటే దానిని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు..."

అంత అందమైన కళ్ళకి X-Ray శక్తి తప్పక ఉంటుందనే విషయం మరిచిపోయాడు శ్రీపతి. అప్పటిదాకా తాను నిజం చెప్పాలి లేదా మానాలి కాని మోసగించడం లాభం లేని పని.

అలాగ కొంచెం సేపు కూర్చుని, శ్యామల బయటికి వెడదామన్నది. పార్కుదాకా నడిచి అతను బెంచీ మీద కూర్చున్నాడు. ఆమె కొంచెం దూరంగా గడ్డిలో కూర్చున్నది. అతనూ క్రిందికి దిగబోయి, ఆమె వారించడాన్న అట్లానే ఉండిపోయాడు. ఎప్పుడూ అలాగ జరగలేదు... ఇవాళ...

ఆమె తలవొంచుకుని ఆలోచిస్తూంది. ఆ ప్రశాంతతలో, మసక వెలుతురులో కూడా ఆమె ముఖంలో వున్న బాధని శ్రీపతి ప్రస్ఫుటంగా చూడగలుగుతున్నాడు. తనకేమీ బోధపడలేదు కాని, తన అంతరాంతరాలలో దాచుకున్న కథలామెకి తాను చెప్పకుండానే తెలిసినట్లున్నది. అవును, నిస్సందేహంగా తన విశాలా, అన్నీ ఆమెకి తెలుసును.

అలాగే కూర్చున్నారు – శ్రీపతీ, శ్యామలా. చాలాకాలం గడిచిపోయింది. రాత్రి ఐపోయింది. కొంచెం అవతల ఉన్న విద్యుద్దీపపు కాంతి సగం ఆమె మీదపడి, ఆ ముఖంలో బాధని ద్విగుణీకరిస్తున్నది.

తన మనసులో ఉన్న ఆవేదనకన్న ఎన్నో రెట్లు ఆమెని దహించి వేస్తున్నదని క్రమంగా బోధపడింది శ్రీపతికి. ఎందుకో! ఎందుకో!!

హటాత్తుగా ఆమె లేచి నిలబడి శ్రీపతి ప్రక్కన కూర్చున్నది "మనుష్యులు ఈ ఆవేదనలో ఎందుకు దహించుకు పోతారో తెలుసునా?" అన్నది, రహస్యమల్లే.

అతని చేతులు ఆమె చేతుల్లో ఉన్నాయి. చల్లగా, లాలనగా శ్రీపతి వెయ్యి డిగ్రీల జ్వరం తప్ప ఏమీ తెలీని స్థితిలో ఉన్నాడు దైహికంగా. ఆమె సాన్నిహిత్యానకాదు.

"నాకు తెలుసునండీ... మనసు ఉన్న ప్రతిజీవీ, మరొక హృదయంలో–మరి కొన్ని హృదయాలలో జ్యోతులు వెలిగిస్తారు. వాటి ఆ అగ్నిని చల్లార్చే శక్తీ వాళ్ళకి ఉండాలి. లేకపోతే ఇద్దరూ ఆ అగ్నికి ఆహుతి అవుతారు."

ఆమె ఆగిపోయింది. ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. గుమ్మందగ్గిర ఆమె మళ్ళా అతని చేతులు పట్టుకున్నది–మరిచిపోయినట్లు.

"మనం ఆర్పలేని మంటలని హృదయాలలో రగులు కొల్పడం కన్న పాపం లేదు లోకంలో... కాని... ముందు అట్లా అనిపించదు. అందుకనే మనుషులట్లా దహించుకు పోవడం."

ఆ క్షణంలో ఆమె ప్రజ్వలిస్తున్న అగ్ని లాగ, తాను తడిపొగలాగా అనిపించారు శ్రీపతికి. తనని వొదిలి ఆమె చివాలున తనగదికి వెళ్ళిపోయింది. ఏమిటి దీని అర్థం ?

నీరసంగా వొచ్చి కుర్చీలో కూలబడ్డాడు శ్రీపతి. టేబిల్ మీద ఏవో ఉత్తరాలు.

అందులో ఆమె ఉత్తరం ఉండదని అతనికి తెలుసును. మరీ నిరాశగా ఆ సాయంత్రాన్ని నెమరువేసుకోసాగాడు శ్రీపతి. శ్యామల చెప్పినది నిజమని అనిపించింది అతనికి కాని, తన విషయంలో ప్రయోగించడానికి అతనికి ధైర్యం లేకపోయింది. విశాలకి తాను ఎన్నడూ ద్రోహం చెయ్యడు. తన సర్వస్వం... తన ఆశా, ప్రణయమూ అన్నీ ఆమె.

బద్ధకంగా వొంగి టేబిల్ లాంప్ వేసి ఉత్తరాలు తీసుకున్నాడు. అందులో ఆమెది. తప్పు డెలివరీ కాబోలు!

త్వరత్వరగా విప్పి నాలుగు పేజీలూ చదువుకున్నాడు శ్రీపతి ఎక్కడికో వెళ్ళడాన్న టైముకి ఉత్తరం రాయలేకపోయింది విశాల. తనకి తెలుసు... తనకి తెలుసు...

ఒక్కసారి చల్లబడ్డాడు తాను! ఆ సాయంత్రం జరిగినదంతా త్వర త్వరగా మరిచిపోయి.

వెన్నెల వొచ్చిందని వెళ్ళి వాకిట్లో కూర్చుని విశాలనీ, పూర్వపు రోజులనీ తలుచుకోసాగాడు శ్రీపతి–హాయిగా. విశాలలో మాధుర్యం ఉంది; ఆమెలో ప్రణయం ఉంది.

"...మైనె దిల్ తుఝ్ కొ దియా..."

శ్యామల తిరిగి రికార్డులు పెడుతోంది — తన కోసం!... విశాలని కళ్ళల్లోకి తెచ్చుకుని, తేలికగా నవ్వుకున్నాడు శ్రీపతి.

"...మైనె దిల్ తుఝ్ కొ దియా..."

పాటలో కరిగిపోయాడు శ్రీపతి. శ్యామల మంచి అమ్మాయి. వాళ్ల బావ అమెరికానించి రాగానే పెళ్ళి చేసుకుంటుంది. విశాల ఎవరిని చేసుకుంటుందో!...

"...మైనె దిల్ తుఝ్ కొ దియా..."

ఎవరో పాటని ఆపేశారు. అయ్యో! అనుకుని. తిరిగి తన కలలలోకి జారిపోయాడు శ్రీపతి.

★★★

.

# అనురాగ ప్రస్తారం

- బుచ్చిబాబు

(కృష్ణాపత్రిక స్వర్ణోత్సవ సంచిక నుంచి)

సృష్టిలో ఏ ఇద్దరూ వొకలా వుండరు. అంతే కాదు. ఏ ఇద్దరి శీలము, ప్రవర్తనా, మనస్తత్వము వొకలా వుండవు. సృష్టివైచిత్ర్యమంటే ఇదేనేమో అనిపిస్తుంది. మానవ జాతిలో ఇంతటి వైవిధ్యమున్నప్పటికి, మనుషుల్ని తెగల కింద్రా, జాతుల కింద్రా, కూటాల కింద్రా, విడదీసి, వారి వారి ప్రవృత్తులను బట్టి, ఫలానా తెగకిచెందిన వ్యక్తులుగా వర్ణించి, అంతస్థు నిర్ణయించి, విలువకట్టి విడిచెయ్యడం సాధ్యమవుతోంది సాంఘీక చరిత్రకారులకి.




నియంత నెరుగుదుం, రౌడీ నెరుగుదుం, కానీ ఏ ఇద్దరు నియంతలూ, వొకేరకం దౌర్జన్యకాండ కొనసాగించలేదు ఏ ఇద్దరు రసికులూ వొకే రకం ప్రణయకాండకు పూనుకోలేదు. ఏ ఇద్దరి వెఱ్ఱీ వొకే ఫక్కీలో వ్యక్తమవదు. ఏ ఇద్దరు కవులూ, వొకే మాదిరి కావ్యం రచించలేదు, లోకంలో పెద్దమనుష్యులంతా వొకే రకం పెద్దమనుషులేమో తెలియదుగాని, రౌడీలలో వున్న వైవిధ్యం ఇంకెవరి లోనూ లేదంటారు. అయినా వీరందరూ వైఖరిని బట్టి, బుద్ధిని బట్టి తెగలుగా మనకి పరిచితులే. వైవిధ్యంలో పోలికనీ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడగల శక్తి వొక్క మానవుడికే వుందేమో !

ఈ రకంగా తెగలక్రింద విడదీసి విలువలు కట్టే చరిత్రకారులు పురుషులవడం మూలాన కాబోలు, స్త్రీలలో ఇంతటి

వైవిధ్యం కనబడదు. పద్మినీ, హస్తినీ వగైరా జాతులుగా వర్ణించడం ఎరుగుదుం, వారి అసూయ, సహనం, గయ్యాళితనం, చాంచల్యం ఇవన్నీ మానవ చరిత్ర ప్రారంభమైనప్పటినుండి ఎరుగుదుం. ఆధునిక యుగంలో, ఈ జాబితాకి ఒకటి రెండు చేర్చాలేమో! చదువుకొన్న స్త్రీ అంటే ఇంగ్లీషు విద్య ఆర్భాటం. 'పురుషుడికి ఎందులోనూ తీసిపోదు' అని సూచించే వొక ధీమా, హుందాతనం, లాంటివి జతపడవచ్చు ముందు ముందు. ఈ తెగలనాధారంగా చరిత్ర వ్రాసేవారికి, ఈ స్త్రీ, పురుష తారతమ్యమే కనబడక, వ్యత్యాసాల ప్రశంశ విడిచేసి, అందరిని వొకలాగే పరామర్శించే పరిస్థితి ఏర్పడుతుందేమో !

ఈయనేదో కథ చెప్తున్నాడు చదువుదామని ప్రారంభిస్తే, వ్యత్యాసాలు, పోలికలూ అంటూ వొక వ్యాసంతో విసిగిస్తున్నాడేమిటని పాఠకుడు చీకాకు పడతాడని నేనెరుగక పోలేదు. కథ వ్రాసేవాడు, సూటిగా కథ చెప్పుకుపోవాలి, అప్రస్తుతమైన వస్తువులో అదెంతటి వైజ్ఞానిక విలువగలదైనా శక్తి సామర్థ్యాల ప్రకర్షలో విసిగించడం, కథానిక పట్ల అపచారమనీ ఎరుగుదును, కానీ, ఈ కథకి– పోలికలు, వ్యత్యాసాలు వీటి ప్రశంస చాల అవసరం. కథ ప్రారంభించి, నేనిందాక చెప్పిందంతా, కథ మధ్యలో అక్కడక్కడా పాఠకుడు చటుక్కున గమనించే అవకాశం ఇవ్వకుండా పొందుపరచి కథ ముగించి వేయవొచ్చు అట్లా చెయ్యడం, పాఠకుణ్ణి దగా చెయ్యడంలా తోచే, ముందు చెప్పివేశాను.

సృష్టిలో ఏ ఇద్దరూ వొకలాగుండరన్న వాక్యంతో ఈ కథ ప్రారంభించాను. ఈ వాక్యంలో యధార్థాన్ని పాఠకుడు ఎంతవరకు అంగీకరిస్తాడో నాకు తెలీదు. వెనక్కి వెళ్ళి వ్రాసింది చదువుకుంటే, సందేహాలు నాలోనే రేకెత్తుతున్నాయి. కవలపిల్లలు వొకేలా వుండేవారు ప్రవర్తనలో, రూపంలో కూడా లేకపోలేదు. 'వాడు అచ్చంగా వాళ్ల నాన్నే' అంటే పోలికమాట అట్లావుంచి, బుద్ధి, మనస్థత్వం, ఎంత సమంగ వున్నవో ఉదహరించడమే అవుతుంది. ఇట్లాంటి పోలికలన్ని వొకే కుటుంబంలో వ్యక్తులకు అన్వయిస్తాయి, కాని వేర్వేరు కుటుంబాలలో వ్యక్తులకు అన్వయించవు. అట్ల అన్వయించే ఇద్దరు వ్యక్తులను గురించే నే చెప్పబొయ్యేది.

"అచ్చంగా మీ ఆవిడలాంటావిణ్ణి చూశాను మొన్న రైల్లో ప్రసాద్" అంది రంగనాయకమ్మ, హరిప్రసాద్ తో.

"వెదుదురూ, మీ రెప్పుడూ ఇట్లాంటివే అంటూంటారు." అన్నాడు ప్రసాద్.

"అవుతే వెళ్ళిపోతున్నాను" అని లేచింది రంగనాయకమ్మ, ప్రసాద్ లేచాడు. కంగారుపడ్డాడు ఏం అనాలో తెలిసింది కాదు.

"మరోక్షణం ఆగితే కామాక్షి వొస్తుంది ఆలయానికెళ్ళిందాలి. ఆలస్యమైందంటే లక్ష్మణరావు ఇంటికని బైలుదేరింది లెండి"

"మరొకసారొస్తాలే" అంటూ గుమ్మందాటి మెట్లగదిలోకొచ్చింది.

"కాస్త టీ యేనా పుచ్చుకోకుండా వెడతారా? కుర్రాణ్ణిపంపుతాను కాసేపు కూర్చోండి."

రంగనాయకమ్మ మళ్ళా లోపలికొచ్చింది. కూర్చుని గోడని తగిల్చిన ఫోటోలకేసి చూస్తూ.

ఏదో వెదుదురూ అన్నాడన్నమాటే గాని, ప్రసాద్ కి తన భార్యలా వుండే వ్యక్తిని గురించి వినాలనివుంది. తనూ ఆమె చూస్తున్న గోడమీద, ఫోటోలకేసే చూస్తున్నాడు రెండు ఫోటోలున్నాయి. ఒకటి ప్రసాద్ పెండ్లినాటిది. రెండోది, ఆరేళ్ల తర్వాత, ఇటీవల భార్య కామాక్షి బస్ట్ .. ఇటలీనుంచి దూరపు చుట్టం తెచ్చిన కెమేరాతో తీసింది.

"ఈ మధ్యన తీసిందే. కామాక్షిది నాదీ తీశాడు. బాగా రాలేదు అందుకని ప్రదర్శించలేదు ఇంతకీ మన మొహం బాగా లేకపోతే, కెమేరా ఎంచేస్తుంది? ఏమంటారు ?" అన్నాడు ప్రసాద్ రంగనాయకమ్మ నవ్వింది.

"ఎవరి మొహం వారికి బాగుండకేం? బాగానే వుంటుంది. కావల్సిన వాళ్ళ ఆక్షేపణలకి భయపడి బైటపెట్టం. మీ మొహానికేం, నిక్షేపం లాంటి మొహం."

"అమ్మయ్య, ఆ ఫోటో కూడా ఫ్రేమ్ లో పెట్టించి గోడని తగులుస్తాను. మా ఆవిడ అభ్యంతరం పెట్టినా సరే." అన్నాడు.

"అదేవన్న ముక్క. ఆవిడ అభ్యంతరం ఎందుకుంటుందీ." ప్రసాద్ నవ్వడం చూసి, "పరిహాసమా అవుతే నేనూ నవ్వుతాలే" అని నవ్వడం సాగించింది.

"మరి మీరు చూసినామె.. ఇల్లాగే వుండాండి ?"

"చెప్పొద్దు పొమ్మంటివిగా!"

"వొద్దంటే చెప్పమనే. మీరా మాత్రం గ్రహించలేరా ఏం !"

రంగనాయకమ్మ వయస్సు యాభై. లావు, తగ్గ ఎత్తు, మెడనిండా నగలు, గుండ్రని మొహం, మెలితిప్పి బిగించికట్టిన జడకొప్పు అందులో చామంతి పూలు జీవితంలో పేచీలు, సమస్యలు ఎరుగని వాగ్ధోరణి, అడక్కపోయినా సలహా ఇచ్చే హుందాతనం వ్యక్తపరిచే మనిషి.

"కామాక్షి లేదుగనకనే తెగించి అడిగావు. ఆ మాత్రం గ్రహించలేనా ప్రసాద్ ?"

"మీరెరుగరు. కామాక్షి మునుపటికి మల్లె కాదు. చాలా మారిపోయింది. మీరు చూసి మూడేళ్ళైందేమో !"

"నాకు చెప్తావెందుకోయ్. ఆ మాత్రం అసూయ లేకపోతే ఆడదే కాదు. దానికి సిద్ధపడి, దిగమింగుకొని, మొగాడే మారతాడు. మా ఆయన్ని చూశాగా. నువ్వూ అంతే. అచ్చంగా కామాక్షి కళ్ళు, ఛాయ, జుట్టు వొంకులు, ఎత్తు, పొడుగు, ఆఖరికి నడక కూడా. అంతా కామాక్షే. కామాక్షి అనుకుని పలకరించా. 'అతనెక్కడ?' అని అడిగాను తెల్లబోయింది. సమాధానం లేదు. ఏమిటి చెప్మా అని తెల్లబోయాను. నేనూ అక్కడికే అన్నాను. ఉలకదు, పలకదు, రైలు దిగుతూ చెప్పింది, వాళ్లది కాకినాడట. మెడికల్ కాలేజీలో చదువుతూందిట. పొరబాటైంది. మా ప్రసాద్ భార్య కామాక్షివనుకున్నాను. ఫలానా ప్రసాద్ అని నిన్ను గురించి, అదే నువ్వు గాయకుడివని చెప్పాను, ఆమె నవ్వింది. ఇల్లాగే ఆమెని కామాక్షి అనుకుని, ఇదివరలో ఇద్దరు ముగ్గురు పలకరించి, పొరబాటు సర్దుకున్న వృత్తాంతం చెపితే ఆశ్చర్యపోయి, కామాక్షితో చెప్పెయ్యాలని వొచ్చా." ప్రసాద్ ఆ వ్యక్తిని ఊహిస్తూ ఏమీ సమాధానం ఇవ్వలేదు.

కుర్రాడు తెచ్చిన టీ త్రాగి, లేచింది రంగనాయకమ్మ.

"మరి వెళ్లొస్తా, అచ్చంగా కామాక్షి కళ్ళే. ధగ ధగ మెరిసి పోతూ, నిలబెట్టే చూపులు.."

"ఇంతకీ ఆమె పేరు చెప్పారు కారు." అన్నాడు ప్రసాద్.

"చూశావా ఎంత తెలివితక్కువ దాన్నో. పేరు అడగనే లేదు." అని వెళ్ళింది.

ఆనాటి సంభాషణతో కథ ప్రారంభమైందనవచ్చు. జీవితంలో సంఘటనకి తుది మొదళ్ళు స్ఫుటంగా ఉండవు కథానికలో కూడా వుండక్కరలేదన్న నినాదం రష్యన్ రచయిత చెకోవ్ తో ప్రారంభమై ఆధునిక రీతుల్లో తుదిమొదళ్ల విషయం అట్లావుంచి అసలు వొస్తువే లోపించే స్థితి ఏర్పడింది సరే. ఇదంతా ఈ కథకి అప్రస్తుతం గనక, ప్రారంభం వున్నదని మాత్రం చెప్పి విడిచివేస్తాను.

కామాక్షిలాగా వున్నామెను చూసిన మరో ఇద్దరు స్నేహితులు ఆ వ్యక్తిని వర్ణించడంతో ప్రసాద్ లో వింత ఊహలు రేగుతున్నాయి. ఆమెను చూడాలని వుంది; తన భార్య, భార్యగాకాక మరో వ్యక్తిగా తటస్థపడటం ఊహలో వింత అనుభవం. అది యథార్ధమైనప్పుడు తానెట్లా తట్టుకుంటాడు ?

ఓవేళ ఇదంతా అతిశయోక్తేమో. అచ్చంగా అల్లా వుండే వారు సృష్టిలో వుండరు. కాని రంగనాయకమ్మ పొరబడే ఘటం కాదు. ప్రసాద్ లో కొత్తరకం వేదన బైలుదేరింది. అందుకు కారణం లేకపోలేదు.

ప్రసాద్ లో కళా తృష్ణ చాలా వుంది. సంగీతం అభ్యసించాడు. కాలేజీలో కచ్చేరీలు చేసి గాయకుడుగా గొప్ప భవిష్యత్తుగల వ్యక్తిగా పేరు తెచ్చుకున్నాడు. తరువాత 'లా' చదువు పూర్తి చేసి, ప్లీడర్ గా ప్రాక్టీస్ పెట్టాడు. కామాక్షిని చేసుకున్నప్పుడు అతని వయస్సు ఇరవై నాలుగు. ఇప్పుడు ముప్పై వొకటి. ఈ ఏడు సంవత్సరాలలోనూ, గాయకుడిగా పైకి రాలేదు. అతను లలిత సంగీతం బాగా సాధన చేసిన రోజుల్లో శాస్త్రీయ సంగీతం లోపించిందన్నారు జనం; శాస్త్రీయ సంగీతం సాధన చేసిన రోజుల్లో, టెక్నిక్ చాలదని కొందరు; టెక్నిక్ ఎంత బాగుంటేనేం, గాత్రం బాగుండాలయ్యా అని మరికొందరు, చేసిన విమర్శనలతో అభిరుచి సన్నగిల్లి వెనుక వున్న ఆ కాస్త పేరుకూడా వినబడటం అరుదైపోతోంది.

దానికి బదులు మరో రకం పేరు ప్రచారంలో కొస్తోంది. కామాక్షి భర్తగా చెప్పుకుంటున్నారు ప్రసాద్ ని. కామాక్షిలో వొక్కటే విశేషం వుంది. అది ఆమె సౌందర్యం.

పెండ్లినాడు ఆమె వయస్సు పంధొమ్మిది. బంగారం లాంటి శరీరచ్ఛాయ, తీగలాంటి మనిషి, 'కత్తిలాంటి నడుం', చరిత్రలో చీకటి గుహలు, వాటిల్లో ఆరిన కాగడాలు, పగటిని చీకటిచేసే వెన్నెల లాంటివి స్మరణ కొస్తాయంటారు కొందరు ఆమె జుట్టుని చూచి; రెకులు విప్పని మందారం మొగ్గ ఆమె నోరు, గులబిరంగుతో మెరిసే పల్చటి చిగుళ్లకింద తళుక్కుమనే పళ్ళ వరస, చిరునవ్వుతో వింతగా మెలికలు తిరిగే బుగ్గలకింద గీట్లు, పెదవులకొసలలో పడే లేత వొంపులు చూసిన వారు, కలకాలం స్మరించుకుంటారుట. వీటన్నిటికంటె చెప్పుకోతగింది ఆమె కళ్ళలో తళుకు, రెప్పలకింద ఏదో వెలుగు. వెన్నెల పిలుపుకి పొంగిపొయ్యే సముద్ర కెరటంపై నురుగులో వెలుగు. సంధ్యకి సిగ్గుపడి కళ్ళు మూసుకుంటే, చందమామ చక్కలగింతకి ఉలిక్కిపడి వొక్కసారి కళ్ళుతెరిచిన ప్రకృతికన్య చూపులో వెలుగు.. ఏవేవో చెప్తారు, కామాక్షి కళ్ళలో సౌందర్యం గూర్చి.

ప్రసాద్ సంగీతం అభ్యాసం చేసి కీర్తికాంతని అన్వేషించిన మొదటి రోజుల్లో ఆమె చక్కదనం గూర్చి పట్టించుకోలేదు. ఏడేళ్ళు గడిచినై. సంతానం కలుగలేదు, సంగీతం మరుగునపడింది, ఏదో అసంతృప్తి. ఖర్చుకాని కొన్ని శక్తులు అతన్ని నలువైపులా నెట్టుతున్నాయి. కాని తలుపులు మూసి వున్నాయి. అవి బైటపడే మార్గం కనబడదు.

ప్లీడరు వృత్తి మీద మనస్సు లగ్నం కావడం లేదు. అతనికి ఆ నల్లకోటంటేనే తలనొప్పి. ఆ కాలరు, ఆ గబ్బిలం కోటు విప్పి దూరంగా పడేసే వరకూ అతనికి తోచదు. సాయంత్రం క్లబ్బు చీట్లాట. క్లబ్బుల్లో ఎన్నో సమావేశాలు, ఉత్సవాలు, జరిగినా, అతని సంగీత కచ్చేరి ఏర్పాటు చెయ్యాలని ఉబలాట పడిన వారూ కనబడరు, కొత్తలో వొకటి రెండు సంవత్సరాలు అతని కచ్చేరికి కామాక్షి కూడా వొచ్చి ప్రేక్షకులలో కూర్చునేది. ఇప్పుడామె రావడం లేదు. అందుకని కచ్చేరీలు ఏర్పాటు చెయ్యడం మానుకున్నారా? ఏమో ఎవరు చెప్పగలరు. ప్రజల అభిరుచులమీద తీర్పు చేసేట్లంత తీవ్రమైన అసంతృప్తి ఇంకా రాలేదేమో అతనిలో !

ఆ రోజున కోర్టునుంచి ఇంటికి వెళ్లకుండా, తిన్నగా క్లబ్బుకెళ్ళి, రాత్రి ఎనిమిదింటికి ఇంటికి చేరుకున్నాడు హరిప్రసాద్. ఆ కోటు కాలరు తీసేసి స్నానం చేసి, వరండాలో ఈజీచైర్ లో కూర్చున్నాడు. కామాక్షి మందహాసం చేసి, పలకరించి, కోర్టు విశేషాలేమిటనడిగింది.

"ఏముంటై. ఏమీలేవు ప్లీడర్లు గబ్బిలాలైతే, జడ్జి ఎలుగుబంటి, క్లయింట్లందరూ కాకుల రెట్టలూ. పబ్లిక్ ప్రోసెక్యూటర్ గుడ్లగూబా..."

"సరే ఇవన్నీ ఎపుడూ విన్నవేగా" అతనిలో విసుగు గమనించి "నేను చెప్పనా, విశేషం? ఇందాక మనింటికి శోభాసుందరొచ్చింది. ఇప్పుడిప్పుడే వెళ్ళారు. ఆవిడా రంగనాయకమ్మ గారూనూ." అని, అతనేమంటాడో విందామని ఆగింది కామాక్షి.

"ఆవిడెవరు ?"

"అదే. అచ్చంగా నాలాగుండే ఆవిడ."

"ఉందా?"

"ఏమీ లేదు. రంగనాయకమ్మ కల్పన. ఆవిడలావు. నాకంటే కాస్తంత పొట్టేమో కూడా. వీసం అంత మెల్ల... మెడిసన్ పూర్తయి ఇక్కడ హాస్పిటలులో నాలుగు నెలలపాటు ట్రైనింగ్ కొచ్చిందట. ఆవిడకి ముప్పై పై మాటే. నాకింకా పాతికేళ్ళు నిండందే"

"అవునవును, అందరికీ ఏళ్ళు కలుస్తూవుంటే, మనకి తగ్గిపోతూంటాయి. నాకప్పుడే ముప్పైరెండు వొస్తోంది. అందులోంచి ఏడు తీసెయ్యి నీ వయస్సుకి.. ఇంతకీ పాతిక దాటాక, అసలు వయస్సెంతో చెప్పిన స్త్రీ సృష్టిలోనే లేదులే.. మెల్ల కన్నా ?"

"ఏమోనండి బాగా కనపడింది, తల పక్కకి వొంచినప్పుడు.. ఆవిడ విషయం, రంగనాయకమ్మ మీతో చెప్పిందటగా, నాతో మీరు చెప్పనే లేదు." అంది కామాక్షి.

"అవును, ఆమధ్య అన్నట్లుంది. ఏముంది పెద్ద చెప్పేటందుకు. చెప్పకపోతే, వొక్క మెల్ల కన్నుతో విడిచేశావు, చెపితే, గుడ్డిదవునేమో కూడా..."

"మీరే చూసి మెచ్చుకొని గానం చెయ్యండి."

కామాక్షి చివాలున లేచి లోపలికెళ్ళింది. ఆ రకం అలక నిత్యమూ అతనెరుగున్నదే. మొదట్లో బుజ్జగించి, బ్రతిమలాడేవాడు అలవాటు పడిపోయి, అది కూడా మానుకున్నాడు. రంగనాయకమ్మ తనతో చెప్పినట్లు తను ఆమెతో ఎందుకు చెప్పలేదో ఆలోచిస్తూ, పత్రిక చూస్తున్నాడు.

ఆదివారం సాయంత్రం క్లబ్బులో ప్రసాద్ పాటకచ్చేరి. జనం వో వందమంది పోగైనారు, మెంబర్లు మినహా, వాద్యాల మధ్య ప్రసాద్ గానం సాగుతూంది. వారు కూర్చున్నచోట ఫాన్ లేదు. అతను మధ్యమధ్య చెమట తుడుచుకుంటున్నాడు. ఎగదువ్విన క్రాఫింగ్ నుదిటి మీదికి కాడలుగా విడిపడుతూంది. లాల్చీ, పంచికట్టు, సిల్కు కండువా వేసుకున్నాడు. ఆరింటికి దీపాలొచ్చాయి. కళైన మొహం ప్రసాద్ ది. కళ్ళు మూసుకుని ఆలాపిస్తూంటే, తన్మయుడైన కళాజీవిగా సభకి వొక శోభని కూరుస్తాడు.

కళ్యాణి రాగ ప్రస్తారంలో, పల్లవి జోరుగా సాగుతోంది. ముందు కూర్చున్న వారిలో వొకరిద్దరు చేసిన కరతాళధ్వనులు అందుకునేవారు కనబడలేదు. జనం పల్చబడ్డారు. మరొక్క అంశంతో ముగించ నిశ్చయించి, సరస్వతి రాగంలో 'అనురాగములె' ప్రారంభించాడు. కళ్ళు మూసుకుని తన్మయుడై చాలాసేపు గానంచేసి, కళ్ళు తెరిచి చూశాడు. హాలులో సగంపైగా జనం వున్నారు. కరతాళధ్వనులు చేస్తున్నారు. చివర వరసలో బెంచీమీద ఆరంభంలో తను చూడని స్త్రీ ప్రేక్షకులు కొందరు కనిపించారు.

జనం లేచి వెడుతున్నారు వాద్యాల వ్యక్తులు వాద్యాలను సర్దుకుంటున్నారు. క్లబ్బు నిర్వాహకులలో వొకరు, కృతజ్ఞతా వాక్యాలు చెబుతున్నారు మొహం తుడుచుకుని, క్రాఫ్ సవరించుకుని, ప్రసాద్ లోపలగదిలో ఫాన్ కింద కుర్చీలో కూర్చున్నాడు. అతని మొహం ఎర్రబడింది. ఆవిరి పట్టినట్లు చర్మం అదొకలాగైంది. బెంచిమీద స్త్రీలు లేచి వెడుతున్నారు. ఒకామె గదివైపు వొస్తోంది. అవును, కామాక్షనుకుని క్షణం బెదిరి, కామాక్షికి కచేరి విషయం తెలియపరచలేదన్న సంగతి జ్ఞప్తికి తెచ్చుకుని, తమాయించుకుని, ఆ వొచ్చినామెను ఆహ్వానించాడు.

"చాలా బాగుందండి. క్షమించాలి. టైముకి రాలేకపొయ్యాను. హాస్పిటల్ లైఫ్ ఎట్లాంటిదో తెలుసుగా! నే వొచ్చిన నాలుగైదు నిమిషాల్లోనే, మీరు ముగించివేశారు, ప్రసాద్ గారు"

ఏదో సిగ్గు ఆవరించి, అతను మాట్లాడలేక పోతున్నాడు.

"థాంక్స్. ఇన్విటేషన్ మీకు చేరిందో లేదో... అని..."

"మిమ్మల్ని గురించి వినడమేగాని, నేనెప్పుడూ మీపాట వినలేదు. ఎల్లుండి సాయంత్రం టీకి రావాలి" రంగనాయకమ్మ ఊళ్ళో లేరట. మీ... వారిని.. ఆమెకూడా... వొస్తారు కదూ?"

ఆమె కళ్ళలోకి చూశాడు. అంతా కామాక్షిలాగె వుంది. కామాక్షికంటె కాస్త లావు. కొంచెం పొట్టేమో. ఆమె తల వొంచింది. తీక్షణమైన చూపు అందులో ఇంద్రజాలం వుంది. ఆ చూపు ప్రసరించిన చోటంతా లోహాన్ని అయస్కాంతం లాగినట్లు చలనం లేక లొంగివుంటుంది. కంటిపాపలో దట్టమైన నలుపులేదు. తేనెలా తేలిపోయి, ఊదారంగులోంచి వొచ్చిన నలుపు. అందుకే కామాక్షి మెల్లని వ్యాఖ్యానించింది అమాయకురాలు.

"థాంక్స్ ! అల్లాగే... శోభా..."

"...సుందరిని."

ఇంటి వైనం చెప్పి, వెళ్ళింది. ఎర్రటి పట్టుచీరమీద. తెల్లటి మల్లిమొగ్గ డిజైన్ చీర, వొంపులు తిరిగి నుదిటి మీదికి జారే చిరు వెంద్రుకల కూర్పుగల జుట్టుముడి, వొంటిరంగుతో కలిసిన పసిడిరంగు జాకెట్టు, వెడుతుంటే వెనకభాగం వొంపులు, లయతో కదిలే దృశ్యం చూస్తూ కుర్చీలో వుండిపొయ్యాడు ప్రసాద్. మొర్నాడు కచేరి ప్రశంస తెచ్చింది కామాక్షి.

"నాకు చెప్పలేదుగా"

"నువ్వు రావని తెలుసు. అందుకే చెప్పలేదు."

"ఆవిడొచ్చిందటగా. అందుకేగా నాకు చెప్పకపోవడం."

"అచ్చంగా నాలా వుందా?"

"అవును, మొదట చూడగానే నువ్వే అనుకున్నాను"

"అందంగా వుందా?"

లేచి దగ్గరగా వెళ్ళి, జడని స్పర్శిస్తూ మొహం తనవేపుకి తిప్పుకున్నాడు.

"నీ అంత అందమైంది."

"నాది మెల్లకన్నంటారా ఏం కర్మ?"

కామాక్షి మూతి ముడుచుకుంది. అప్పుడే ప్రసాద్ కి మరింత ఆకర్షణీయంగా వుంటుంది. కాని ఆ నోట్లోంచి వెలువడే పలుకులికి అదిరి, ఆ చక్కదనం నిదానంగా తిలకించే అవకాశం అతనికి కలగదు.

"మెల్లకాదు. ఊదారంగులో కంటిపాప నలుపు, ఓరగా చూచినప్పుడు, ఆ యాంగిల్ లో అల్లా కనిపించొచ్చు. అయినా అందమైన కళ్ళే."

"మాట్లాడారా?"

"ఆమే పలకరించింది."

"నేను నమ్మాలనే మీరు చెప్పేమాట? ఇన్విటేషన్ రహస్యంగా, నాకు చెప్పకుండా పంపించుకున్నారుగా."

"ఇందులో రహస్యమేముంది. క్లబ్బువారు హాస్పిటల్ డాక్టర్లనందర్నీ ఆహ్వానించారు."

“ఏమంది? సంగీతం మెచ్చుకుందా?”

“ఆహా! చివర్లో వొచ్చింది, వినలేదట.”

“ఇంకా?”

“ఇంకేం లేదు.”

భుజంమీద చెయ్యి తొలగించి లోపలికెళ్ళి మంచం మీద పరుంది కామాక్షి. వెనకాలె వెళ్ళాడు.

“ఎందుకు కోపం?”

“నాకేం కోపం లేదు.”

అని లేచి, వొచ్చే కన్నీటిని కొంగులో నిలుపుకుంటూ వంటింటివైపువెళ్ళింది కామాక్షి.

ప్రసాద్ కి ఏమీ అర్థం కాలేదు ఆడది ఎందుకేడుస్తుంది? ఏదైనా, అవాంతరం జరిగి, ఆపదొస్తే, ఎవరికేనా జబ్బుచేస్తే, అపచారం జరిగితే, ఏడవడం అతనికి తెలుసు. ఎన్నో అర్థంకావతనికి. వాటిల్లో ఇదొకటి.

మొర్నాడు, దోవ కనుక్కొని శోభాసుందరింటికి వెళ్ళేసరికి ఆరు దాటింది. గుమ్మందాటి లోనికి ఆహ్వానించింది ప్రసాద్ ని.

“ఆమె రాలేదా?”

తల పంకించాడు.

“మీ కోసం ఐదింటినుంచి వైట్ చేస్తున్నాం. కొందరు ఫ్రెండ్స్ ని కూడా పిలిచాను. ఇప్పుడిప్పుడే వెళ్ళారు. ఇంక మీరు రారనే నిశ్చయం చేసుకున్నాస్మాండి.”

“క్షమించాలి. ఆ వీధనీ, ఈ వీధనీ చెప్పడం, అల్లా వెళ్ళడం, తీరా మీ ఇల్లు కాకపోవడం. చటుక్కున పట్టుకోలేక పొయ్యాను. అదే ఆలస్యం.”

వరండా ముందు పూల మొక్కలున్నాయి. కింద సమంగా కోసిన గడ్డి, నాలుగైదు కుర్చీలున్నాయి. బల్లమీద టీ సంరంజాం. ఇద్దరూ కూర్చున్నారు.

“ఉండండి, క్షణంలో వొస్తాను. టీయా ? కాఫీయా ?”

“ఏదైనా సరే.”

ఆమె లోనికెళ్ళింది. నల్లరంగు పల్చటి చీర. సన్నని గులాబి బోర్డర్ తెల్లటి జాకెట్టు, చేతికి వాచ్, రెండు జడలు. మెళ్ళో నగలే లేవు. లేకేం .. ముత్యాలదండ పమిట కింద కదలడం చూశాడు.

వరండా ముందు దీపం వెలిగింది. శోభాసుందరి కొన్ని కప్పులు, ప్లేట్లు, టీపాట్ తెచ్చి బల్లమీద పెట్టింది.

“తీసుకోండి.”

అతను తింటున్నాడు.

“మీరో...?”

“అయిందిగా కంపెనీ కోసం, సెకండ్ డోస్... ఆల్ రైట్.” పాట్ లో టీ కప్పులో పోసుగుంది. సంభాషణ సాగటం లేదు.

“మీరొచ్చి ఎంతకాలమైంది?”

“నెలేగా”

“అవునవును, రంగనాయకమ్మ చెప్పింది.” అన్నాడు ప్రసాద్.

“కామాక్షి గార్ని చూడాలని పట్టు పట్టిందామె. విట్టీ లేడీ, భలే కబుర్లు చెబుతుంది. నన్ను కామాక్షనుకుని రైల్లో పలకరించిన ఇన్సిడెంట్ చెప్పే వుంటుంది కదూ.”

శోభాసుందరి నవ్వు, లైటు నీడలో ఉదయించడానికి బద్ధకిస్తున్న లేత సూర్యబింబంలా మెరిసింది. ఆ రోజ్ కలర్ చిగుళ్ళు కాస్తబ్కనబడటం, ఆ నవ్వులో ప్రత్యేకమైన అందం. జుట్టు నీడ నుదిటిమీదా, ముక్కునీడ గడ్డం పైనా నవ్వుకి వంగిన బుగ్గలనీడ పెదవులపైనా, స్తనాల నీడ ఒళ్ళోనూ పడి, దేనికేసీ పరిక్షగా చూడలేకపోతున్నాడు. అంతా కామాక్షే . కాస్తంత ఎదిగిన కమాక్షి . ఒక నిండుతనం ఆమెలో లేనిది. గుండ్రని బుజాలు.

పదునైన చేతివేళ్ళు, సన్నగా వొదిగి వొంపుతిరిగిన నడుంపై, బింకంగా, స్థూలంగా పమితిమడతలో మరుగుపడటం తెలీని వక్షం. మెడకిందికి నునుపుగా జారిపోయిన..

అతని కాలు తగిలి బల్ల కదిలి, దానిమీద టీపాట్ ఆమె వొళ్ళో పడింది. చివాలున లేచి, టీపాట్ ని పట్టుగున్నాడు. టీకి తడిసి వేడెక్కిన తొడపై అతనిచెయ్యి పడింది. దాన్ని తొలిగిస్తూ దాని మీద ఆమె చెయ్యి పడింది. దీపం ఆరింది. ఇద్దరూ లేచారు.

“ఎవరది ? పిన్నీ నువ్వేనా, దీపం తీసేస్త ?”

“అవును వెన్నెట్లో దీపం గిట్టదుగా నీకు” అన్నది దూరంగా పిన్ని కంఠం కాబోలు.

“వారున్నారని చెప్పానుగా.”

“అవునే, మరిచా సుమా. వేస్తున్నా.” దీపం వెలిగింది.

“సారీ! నే చూళ్ళేదు.”

“ఫరవాలేదు. డ్రెస్ చేంజ్ చేసి వొస్తాను.”

ఆమె లోపలికెళ్ళింది.

అతను చందమామ కేసి చూశాడు. మేఘాల వలలోంచి బైటపడింది; అస్పష్టమైన నీడలు పడుతున్నాయి చుట్టూ. వెన్నెలవలె అతని మనస్సు చల్లగా వుంది. కాని ప్రశాంతంగా లేదు. కామాక్షినీ, ఈమెనీ వొక్కసారి పోల్చిచూడాలి. కాని వారిద్దరూ కలియడం ఎట్లా ? ఎప్పుడైనా శోభాసుందరిని తనింటికి పిలవాలి.

ఆకుపచ్చరంగు చీర, ఎర్రజాకెట్టు వేసుకొని వచ్చింది శోభా సుందరి.

“ఈ చీర కట్టుకోవడం అంటె ఎట్లాగో వుంటుందండి” అందామె.

“ఏం?”

“మొన్న మీ ఇంటికొచ్చినప్పుడు, ఆమె ఈ రంగు చీరె వేసుగున్నారు. అప్పడినుంచీ భయంగానె ఉంది.”

“భయమెందుకు?”

‘అంటే’ అని వాక్యం చివ్వర చేర్చలేకపోతున్నాడు ప్రసాద్. అలా అనాలని అనిపించడం లేదు.

“మీ ముందు మరీ అదోలా వుంటుంది. ఐదారు పర్యాయాలు జరిగింది, కామాక్షి అనుకొని నన్ను పలకరించడం. కాదని నేను చెప్పడమూ. మిమ్మల్ని గురించి విన్నాను. మీరు గాయకులట. అప్పడినుండీ, మిమ్మల్నీ ఆమెనీ చూడాలని ఉండేది. ఈ ఊరొచ్చాక అది వీలయింది.”

“డిసప్పాయింట్ అయ్యారా ?”

“ఏమో. నేనా విషయం ఆలోచించలా. ఆమెలా నే వున్నానీ అనుకోవడం లేదు. వారూ వీరూ అంటే తప్ప. ఆవిడవి చాలా అందమైన కళ్ళు. మంచి ఛాయ. పెద్ద జడ. ఆ మధ్య జబ్బుచేసి నా జడ వూడిపోయిందనుకోండి. మీకేమనిపిస్తోంది ? అడగొచ్చా ?”

“నాకూ ఎల్లాగోవుంది. కాస్తంత పోలిక వున్నమాట నిజమే . కాని, మీ దగ్గర, ఇప్పుడున్నట్లు చూస్తే ఆమె జ్ఞాపకం, అంటే ఆమెని చూస్తోన్నట్లు అనిపించడం లేదు.”

ఆమె తలకాస్త పక్కకి వొంచి నవ్వింది. అల్లావొంచి నవ్వటం అలవాటు కాబోలు. అలా నవ్వినప్పుడే ఆ పళ్ళ చక్కదనం, అతన్ని కలవర పెడుతోంది. ఏ వొస్తువుకేసి కేంద్రీకరించి చూడకుండా, పరధ్యానంగా చూసినప్పుడు; రెండు పాపలు, మధ్యకి రాక కదలడం వల్ల కాబోలు, కామాక్షి, మెల్లని విమర్శించింది. ఆ విమర్శకి కళ్ళులేవు.మళ్ళా ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె తల వొంచుకుంది. కామాక్షి కళ్ళే అందమైనవి. ఈమె కళ్ళలో లేని వొక వెలుగు ఆమె కళ్ళల్లో వుంది. ఒప్పుకోవాలి. కళ్ళు బాగుండగానే సరికాదు; వాటిని వినియోగించడంలో వుంటుంది అందం. ఆ నేర్పు, ఆ మెళుకువ, శోభాసుందరిలో వున్నాయి. ఆలయంలో స్తంభం మీద చెక్కిన ప్రాచీన శిల్పంలా, స్థబ్దుగావుంటే, శిల్పికి నచ్చొచ్చు; కామాక్షి అట్లాంటిది. కదలిక, సజీవమైన వొక వొయ్యారం, లాలన, అవున్నాయి శోభలో.

“కారణం చెప్పమంటారా ?”

ఉలిక్కిపడ్డాడు ప్రసాద్.

“మీరు రోజూ, చూస్తూ, ఎరుగున్న భార్యకావడమే. నేను దూరపు కొండను... అవునా ?”

“మీరెట్లా గ్రహించారు ?”

“నా మొహం గ్రహింపు. ఊహ. కొన్ని సందర్భాలలో అవతలవారి మనస్సులో ఏముందో ఇట్టే తెలిసిపోయినట్లు అనిపిస్తుంది. కామాక్షి చాలా చక్కనిది...”

“ఊరికే అందంగా వుండడం చాలదనుకుంటా. ఆ అందాన్ని ఎల్లా చెప్పాలో తెలియదు. సరిగ్గా వినియోగించడంలో, పోనీ ప్రయోగించడంలోనూ వుంది. కవి మామూలు పదాలనే, అందంగా ప్రయోగిస్తాడు... ఏమో గంద్రగోళంగావుంది.. మరి నే వెళ్ళనా...?”

లేచాడు.

“అప్పుడే మీ సంగీతం వినాలనుకున్నాను. సాయంత్రం స్నేహితులను కూడా అందుకే ఆహ్వానించాను... మరి...”

“మరో అవకాశం వుండదంటారా ?”

“అది మీరు చెప్పాలి. నాకేం నేను ఎప్పుడు పడితే అప్పుడు సిద్ధమే... ఉండండి అక్కడిదాకా వొస్తాను....”

ఇద్దరూ లేచారు. ఆమె లోపలికెళ్ళింది. ప్రసాద్ మండువాలోకొచ్చి, గదులు, ఇల్లు పరకాయిస్తున్నాడు, ముందుగది తలుపు మీద చెయ్యి ఆనించి నిలబడ్డాడు. ఎవరో చటుక్కున తలుపు మూశారు లోపలినుండి. ఆ రెండు తలుపుల మధ్య వేలునలిగి, నెప్పి సూచిస్తూ కేక వేశాడు హరిప్రసాద్. శోభా సుందరి బైటకొచ్చింది, ఏమిటంటూ.

“ఏం లేదు. తలుపు సందులో వేలు నలిగింది...”

“మా పిన్ని వేసిందేమో తలుపు. ఆమెకి మా చెడ్డ భయం. దీపాలు తీసెయ్యడం, తలుపులు మొయ్యడం అంటే మహా ఇష్టం. ఉండండి. డాక్టర్నిగా... చిన్న బాండేజ్ వేస్తాను...”

లోపల్నించి, సీసాలు, కత్తెర, బాండేజ్ క్లాత్ తెచ్చి, అతని వేలుకి కట్టుకట్టింది. ఇద్దరూ బైటకి నడిచారు.

ఆమె ముందుగా నడుస్తున్నప్పుడు, అతను వొకడుగు వెనకపడి నడుస్తున్నాడు; అతను ముందుగా నడుస్తున్నప్పుడు ఆమె వొకడుగు వెనకపడి నడుస్తోంది. సంభాషణలేదు; రోడ్డపక్క చెట్ల ఆకుల గుసగుసలు తప్ప. చెట్ల నీడల మధ్య దాగిలిమూతలాడుతున్న వెన్నెల కాంతుల మీద కాలుపడాలన్న వారి నడక వొంకరటింకరగా సాగి రోడ్లు విడిచేసి, కాలిబాటగుండా రాళ్లగుట్టల కాపలా మధ్య పచ్చదనం కాపాడుకున్నా పచ్చికబయలికి చేరుకున్నారు. రాతిగుట్టల నీడలు గుండ్రంగా వారికాళ్లమీద పడుతున్నాయి.

“ఎందుకంత వొగురుస్తున్నారు ? ఆయాసమా..అమ్మ! నాకూ ఆయాసంగానే వుంది” అని శోభాసుందరి పైన కప్పుగున్న మఫ్లర్ తో మొహం తుడుచుకుంటోంది.

“ఆయాసం కాదు, మీతో నడుస్తుంటే ఏదో ఎక్సైట్మెంట్.”

“ఓయబ్బ, ఎందుకో.”

“చెప్పలేను, ఇదొక కొత్త అనుభవం, మీలో ఏదో వుంది. అది నన్నిల్లా చేస్తుందేమో. ఆ రోజు కచ్చేరిలో కళ్ళు తెరిచి మిమ్మల్ని చూడంగానే, ఇంక పాడలేక, ముగించి వేశాను. సిగ్గా? కాదు. పాడేటప్పుడు, నా మొహం ఎట్లాగో అవుతుంది. అది చూసి మీరేమనుకుంటారో అనీ ? ఏమో !” ప్రసాద్. రాతి బండమీద కూర్చుని ఆమె మొహం నీడగా సాగారి మరో రాతిబండ మీద కదలడం చూస్తూ కూర్చున్నాడు.

“నాలో ఏమీ లేదు. చాలా సామాన్యురాల్ని. కామాక్షిగారు ఎంతో అందంగా వుంటారు. ఈ మెడిసిన్ చదువులో ఏముందో తెలీదు. మనిషి శరీరం పట్ల కుతూహలం గాని, అభిమానంగాని వుండదు. అందచందాల ప్రస్తావొచ్చినప్పుడు నవ్వుబుద్దేస్తుంది. అద్దంలో చూసుకుంటే అస్తిపంజరమే కనిపిస్తుంది.” అన్నదామె.

“నాకట్లా కాదు, మూలపడి, బూజుపట్టి పాతదైన మనస్సు మిమ్మల్ని చూశాక, ఎక్కడికో ఎగిరిపడుతోందంటే నమ్ముతారా?”

ఆమె నవ్వుతోంది.

"నాకు మనస్సుతో పరిచయం లేదు. ఎన్నోసార్లు శరీరాలని కోశాం. మనస్సు కనబడలేదు."

"అట్లాంటి అభిప్రాయాలు మీలో కలిగాయంటే అందుకు కారణం మనస్సు కాదంటారా? రోతపుట్టించినట్లే, మనస్సు ప్రేమను కూడా పుట్టించడం అసహజం అంటారా ?"

"ఆ మాట కాస్తా వాడేశారా?"

ఆమె కళ్ళలో బాధ, అలకా కూడా కనిపించాయతనికి. తలవొంచి, మేఘం వెనక మరుగుపడ్డ చందమామని చూస్తోంది.

"ఏదేనా తప్పుగా అన్నానా?"

ఆమె చెయ్యి పట్టుగున్నాడు ప్రసాద్. చేతిని తీసి రెండు అరచేతులమధ్యా వుంచి చటుక్కున తోసేసింది. మఫ్లర్ జుట్టుమీదికి లాగి మడిచి కట్టింది. అతని చెయ్యి ఆమె గడ్డం మీద పడింది. మెత్తగా తగిలింది. చల్లగా కింది పెదవి కిందికి లాగినప్పుడు, లేతచిగుళ్ళు మనిషి కంటబడని గులాబీలో లేత ఎరుపుతో మెరిసాయి. తల అటు తిప్పేసింది.

"మీరేమీ తప్పుగా అనలేదు. నాకు తెలీదు ప్రేమంటే.  నా జీవితంలో అది లేదు." తన వెంపు తిప్పుకున్నాడు ఆమె మొహాన్ని. ఆమె కళ్ళల్లో కన్నీరు వొక తెరలా, చందమామమీద నల్లమేఘం పొరలా కదుల్తోంది.

"అడగొచ్చా.  ఎందుకో ?"

"నేను చెప్పలేను."

"సరే, వెడదాం లేవండి"

తన చేతిని లేవడానికి ఊతగా ఇచ్చాడు. ఆమె లేచింది. మెల్లగా నడుస్తున్నారు.

"పోనీ ఇప్పుడుందంటే, స్వీకరించేటందుకు సిద్ధంగా వున్నారా?"

"మీరా ప్రశ్న అడగనే కూడదు. నేను చెప్పే స్థితిలోనూ లేను; ఇంటిదగ్గర కామాక్షి..."

ఆమె వాక్యం పూర్తికాకుండానే  అందుకున్నాడు ప్రసాద్.

"అవును మనిద్దరిమధ్యన కామాక్షి నీడ పడుతోంది."

"అదొక్క నీడే కాదు."

"అంటే ? నేనడక్కూడదు కాబోలు."

మెయిన్ రోడ్ మీదికొచ్చేశారు. చెట్ల నీడల మీద పాదాలు పడేటట్లు నడుస్తున్నారు.

"రంగనాయకమ్మ గారు మీకన్నీ చెప్పే వుంటారు."

"నాకేమీ చెప్పలేదు. ఏముందని చెప్పడానికి ?"

ఆమె నవ్వుతోంది.

"చూశారా, ఇద్దరికీ మతుల్లేవు అటు వెళ్ళడం బదులు, ఇటొచ్చాం.  తిన్నగా తిరిగి మా ఇంటికి..."

ప్రసాద్ నవ్వుతున్నాడు. ఆలోచనలో, ఎక్సైట్మెంట్ లో ఎటునడుస్తున్నారో తెలిసింది కాదు.

"ఫరవాలేదులెండి.  మిమ్మల్ని మీ ఇంటిదగ్గర భద్రంగా విడిచేసి వెడతాను."

"అవును, నేను మిమ్మల్ని మీ ఇంటిదాకా సాగనంపుతాను. అక్కడనుండి నన్ను సాగనంపడానికి మీరు నాతో మా ఇంటిదాగా వొస్తారు. ఇల్లా తెల్లవార్లు తిరుగుతూందాం..."

ఆమె లోపలికెళ్ళింది. పిన్ని కాబోలు గట్టిగా గడియ వేసిన చప్పుడైంది. ప్రసాద్ ఇంటికి చేరుకునేటప్పటికి రాత్రి పదైంది.

ఆనాటినుండి ప్రసాద్ కి భార్య కొత్తగా కనబడసాగింది. ఏడేళ్ళుగా, రోజూ ఎరుగున్న భార్యే; తలవొంచి చూచినప్పుడు, బాహాటంగా నవ్వినప్పుడు చిగుళ్ళ ఎఱుపు, బుగ్గవొంపు ..ఇవన్నీ కొత్తగా వున్నాయి. ఆలయంలో శిలాప్రతిమ కదలినట్లయింది. శిలాప్రతిమ సంతానం కనదు. కామాక్షీ అంతే; వైద్యం

అయింది. జాతకంలో నలుగురు సంతానంవున్నా, ఇంతవరకూ ఆ చిహ్నాలే లేవు తన మాటేమిటి? పరీక్షలు చేయించుగున్నాడా? తోటివారు ఆ లోటుకి బాధ్యత భార్యమీదే వేసేస్తారు. మొగజన్మకి యీ సమాజంలో ఆ మాత్రం పలుకుబడుంది.

తొమ్మిదింటికి చంద్రుడుదయించాడు క్రాఫింగ్ చేసుకున్న వాడిలా. పౌర్ణమి వెళ్ళిన నాలుగోనాడు డాబా మీద పూలదండ కడుతోంది కామాక్షి. ఉదయం తలంటు పోసుగున్న వెంట్రుకలు జారి మెడంతా కమ్మివేశాయి. గాలికి చీరపమిటి వక్షం మీద ఎగిరి పడుతోంది. వెనకాల నిలబడి, ఆమె తల తనవైపు తిప్పుకున్నాడు హరి ప్రసాద్. కళ్ళల్లోకి చూశాడు.

"కాటికి కరిగిపోయిన నలుపు కాదుస్మా"

"ఉండండి" తోసేసి దూరంగా జరిగింది కామాక్షి.

"వెయ్యి రెట్లు అందమైన కళ్ళు నీవి."

"అంటె ?"

"అదే, ఆమెకంటే ఎంతో అందమైన దానవు."

"ఇప్పుడు తెలుసుకున్నారా?"

"సత్యాలన్నీ పాతవేనట. వాటిని మళ్ళా స్మరించుగునే పరిస్థితి ఏర్పడి, అవకాశం రావాలంటారు...." ఆమె మొహాన్ని దగ్గరగా తీసుకుంటున్నాడు.

"ఏమిటిదంతా.. ఇవాళ. మరో పార్టీలో ఏమన్నా పుచ్చుగున్నారా. అదే.. ఆ లోకైక సుందరి శోభాసుందరి పార్టీలో."

"అదేమిటి, శోభా సుందరి పార్టీ ఏమిటి?"

"దాస్తే మాత్రం దాగుతుందా. ఆ మధ్య పార్టీకని వాళ్ళింటికి వెళ్ళారుటగా. ఇందిర చెల్లెల్ని కూడా పిల్చిందట. వాళ్ళంతా వెళ్ళిపోయింతర్వాత మీరు వెళ్ళి ఏకాంతంగా కష్టంసుఖం చెప్పుకున్నారుట !"

"ఏకాంతంగా వుంటే ఏం చెప్పుకున్నదీ వాళ్ళకేం తెలుసు? అసలు విషయం చెప్పనా? మనిద్దర్నీ ఆహ్వానించింది నాపాట వినాలని. ఇల్లు వైనం తెలుసుకుని, నిన్ను తీసుకెడదామని వెళ్ళాను. కనుక్కుని అక్కడికి చేరే సరికి పొద్దుపోయింది. వాళ్ళంతా వెళ్ళిపోయారు." ప్రసాద్ కి ఆమెపై కోపం వచ్చింది. తనీ ఆబద్ధాలు చెప్పడానికి ఆమె అల్లాంటి తికమక ప్రశ్నవేసినందుకు. అసూయ ప్రకటన_ వొక నటనగా అప్పుడప్పుడు ముద్దుగా వుంటుందతనికి. కాని నిజంగా అసూయ, వేళ్ళేసుగుని భూమిలో పాతుకుపోతే ఆ చెట్టుకింద నిలబడలేడతను.

"అవును ఆ రాత్రి ఇంటికి అర్థరాత్రొచ్చారుగా..."

"అర్ధరాత్రా, పది కూడా అవందే..."

"ఏవేం చెప్పుకున్నారో?"

"తెలుసుకున్నావుగా. కష్టంసుఖం..."

లేచి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

"ఇటు చూడు" చేతుల మధ్య ఆమె మొహం తీసుకుని "ఏం చెప్పిందో చెప్పనా? ఆమెకంటే నువ్వెంతో చక్కనిదానివట; తను జీవితంలో... నువ్వు వినడం లేదుగా చెప్పను..."

పూలదండ జడలోంచి జారింది. గాలికి పమిట లేచింది. అతని మొహం ఆమె వక్షంలో దాచుకున్నాడు.

"ఇంక నేనెందుకు? మా వూరు వెళ్ళిపోతాను." అంటోంది.

"ఈ క్షణం నిన్నెంతగా ప్రేమిస్తున్నానో నువ్వెరుగవు. ఆమెతో మాట్లాడినంతసేపూ, ఆమెలో నిన్ను చూసి నేనెరగని నిన్ను చూసి "

ఆమె అతని తల నిమురుతోంది. కన్నీటి బిందువు నుదిటిమీద పడింది.

"ఏదో జరిగింది. మీధోరణే వేరుగా వుంది. నేను ఊహించలేననా..."

"ఏమీ జరగలేదు. ఆమె ద్వారా నిన్ను తెలుసుకున్నాను. నీకది అర్థం కాదు. నీ కన్నీరు నాకర్థంకానట్లు..."

చంద్రుణ్ణి మేఘం కప్పివేసింది ఆమె చీరకొంగు అతని మొహాన్ని కప్పివేసినట్లు.

★ ★ ★ ★

భర్తలో మార్పుకి కామాక్షి తట్టుకుంది; హర్షించింది. అసూయగా ప్రకటించినా ... అతనిమీద కొత్త అధికారం సంపాదించుకుంది; అతనిద్వారా ఆమెను కూడా లోబరుచుకున్నట్లుంది. అది ఆమెకి కొత్త అనుభవం. భర్తవుండగా ఆమెతో కలిసి మాట్లాడాలనుంది; విజయం తనదైనట్లు ఆమెకి తెలిస్తే చాలు. ఒకమారు స్నేహితులింట్లో పార్టీకి ప్రసాద్ తనూ వెళ్ళినప్పుడు, శోభా సుందరి కూడా వొచ్చింది.

కాని వారు ముగ్గురూ విడిగా మాట్లాడుకునే అవకాశం రాలేదు. వారిద్దరి మధ్య చూపుల పరామర్శ తను గమనించి, బాధపడింది. మొగాళ్ళని నమ్మకూడదు. పురుషుడు తన అవసరం కోసం ఎంత ప్రేమైనా ప్రకటించగలడు. తనని నిజంగా ప్రేమిస్తున్నాడా, లేక తను అనుమాన పడకుండా, ఇదంతా తెచ్చిపెట్టుకున్న ప్రకర్షా ? పైగా ప్రతివాడూ ఆడదాన్ని నమ్మకూడదంటాడు. ఇంకెప్పుడూ తాను ఇట్లా రాకూడదని నిశ్చయించుకుంది.

ఆ నెలంతా, కొత్త కేస్ హడావుడిలో గడిపాడు ప్రసాద్. విద్యాసాగర్ ఆస్థిదావా పెద్ద వ్యవహారం. పెద్ద ప్లీడరు మాణిక్యాలరావు చేతులో పడింది ఆ వ్యవహారం. మాణిక్యాలరావు దగ్గర ప్రసాద్ జూనియర్ గా పనిచేస్తున్నాడు. పార్టీలు ఆ సాయంత్రం ఊరెడుతుంటే, సాగనంపడానికి తనూ స్టేషన్ కెళ్ళాడు.

సంధ్య కాటుకెట్టుగున్నట్లు చీకటి కమ్మింది. భూతద్దంలో చూసినట్లు ప్లాట్ ఫారమ్ లైట్లు ఎబ్బెట్టుగా వున్నాయి. ఏదో బండి రావాలిట. మరో గంటకి కాని రైలు కదలదట. అటూఇటూ పచార్లు చేస్తున్నాడు ప్రసాద్. రిస్ట్ వాచ్ చూశాడు. ఏడు దాటింది. ఇంకా నలభై నిమిషాలుంది. విద్యాసాగర్ తాలూకు జనం గార్డుపెట్టె ముందు మూగారు. వాళ్ళతో ప్రసంగిస్తున్నాడు. మరో పదినిముషాలు గడిచింది. పేలిన తారాజువ్వలా, ప్లాట్ ఫారం జనం రేగారు ఎందుకో. ఏమీ లేదు . వొకడు కదిలితే అంతా కదలడమే. దాహంగా వుంది. కూల్ డ్రింక్ కోసం ఇంజన్ వైపు నడుస్తున్నాడు.

ఇంజన్ ఇవతల పెట్టెలో లేడీస్ కంపార్ట్ మెంటుంది. దీపం వెలుగులో శోభాసుందరి కళ్ళు మెరుస్తున్నాయి.

“మీరా... మీరు ?”

“ఆ.. నేనే . మీరు ?”

ఇద్దరూ నవ్వుతున్నారు.

“ఫ్రెండ్స్ వెడుతుంటే.. వొచ్చాను. మీరు ?”

“ఇంటి కెడుతున్నా. రెండు నెలలపాటు.” అన్నదామె.

“రెండు నెలలే. నాతో చెప్పకూడదూ ?”

“ముందుగా అనుకోలేదు. వెళ్ళాల్సిన పరిస్థితి వొచ్చింది. మా బాబయ్య వొంట్లో బాగాలేదు...”

అతని మొహంలో దిగులు చూసింది.

“దగ్గరలో వొక ఊళ్ళో వున్నామంటె ధైర్యంగా, నిబ్బరంగా వుండేది. చప్పున రండేం..”

కంపార్ట్మెంట్ లో ఫాన్ తిరగడం లేదు. లోపల ఉక్కగా వుందని బైటకి దిగింది శోభాసుందరి. ఇంజన్ వైపు నడుస్తున్నారిద్దరూ. డ్రైవర్ పచార్లు చేస్తూ సిగరెట్టు కాలుస్తున్నాడు. ఇంజన్ దాటి ముందుగా పట్టాలు పక్కగా వెడుతున్నారు. అక్కడంతా బొగ్గునుసి, రేగడి.. గలీజుగావుంది. ఇంకా దూరంగా పట్టాలు దాటి గుట్టదగ్గర నిలబడ్డారు.

“ఫరవాలేదు. ఇంకా ఇరవై అయిదు నిముషాలుంది లెండి” అన్నాడు.

“బండిలో పిన్ని వొక్కత్తే వెళ్ళిపోతుంది. మీరేమో మీ ఇంటికెడతారు. నేనొక్కదాన్ని దిగడిపోతాను, కదూ!” నవ్వుతూంది శోభాసుందరి. చీరకొంగు జడచుట్టూ కప్పి, గాలికి జుట్టు రేగకుండా అదుముకుంటోంది. చీకటిగా వుంది. చీకటి నీడలు లేవు. రెక్కతెగిన పక్షికి మల్లె సిగ్నల్ కనబడుతోంది.

“నన్ను గురించి అంతే అభిప్రాయమా?” అన్నాడు.

“మీకు భార్య వుంది.”

“ఉన్నప్పుడు, మరొకరిని ప్రేమించడం సాధ్యం కాదంటారా?”

“నాకు తెలియదు. చెప్పండి.”

"ఏమిటో శోభా! ఒక్కొక్కసారి మాటలనవసరం. ఏమీ చెప్పుకోకుండా అంతా తెలిసినట్లవుతుంది. ఇప్పుడు నాకల్లా వుంది." అని ప్రసాద్ లేచి, కాలువొంచి దానిమీద చెయ్యి ఆనించాడు.

"నాకు తెలుసులెండి."

చెయ్యి తీసుకుంది.

"ఏం తెలుసు?"

"ఏమీ తెలియదని" నవ్వుతోంది.

చేతిని తన బుగ్గకి రాస్తోంది. రెండు చేతులూ ఆమె మెడచుట్టూ వేశాడు.

"నన్ను ఆమెగా భావించి కదా, మీకు నా మీద ఇంతటి కారుణ్యం ?"

"ఆమెని మిమ్మల్నిగా భావించి, ఆమెపై కారుణ్యం అంటే నమ్ముతారా ?"

"అది మీకే తెలియాలి."

చేతులు తొలగించి దూరంగా వెళ్లి కూర్చుంది.

"నే నేమీ కోరడం లేదు సుందరీ."

ఆమే మాట్లాడదు. తలవొంచుకుంది. చీకట్లో కన్నీరా? అతనికి కనబడ్డం లేదు. తలపైకెత్తాడు. నుదుటిని అధరంతో తాకాడు.

"అమ్మయ్య" అని లేచి మొహం తుడుచుగుంది.

"ఏం జరిగింది?"

"ఒక భూకంపం నుండి తప్పించుగున్నాను మీరామాట అనడంతో. మీరు కోరరు. కోరినా నేనివ్వలేను. రంగనాయకమ్మ చెప్పలేదా? నాకు వివాహమైంది. ఎనిమిదేళ్ళైంది. అప్పుడు నా వయస్సు ఇరవైయ్యొకటి. తల్లితండ్రి చిన్నప్పుడే పొయ్యారు. బాబయ్య చదువు చెప్పిస్తున్నాడు. ఇరవై వేలు కట్నం వొప్పుకుని. పదే ఇచ్చాడు. మిగతా డబ్బుతో నా మెడిసిన్ పూర్తి చెయ్యమంటాడు, తనకి జబ్బుచేస్తే చూసేందుకట. నా భర్త స్కూల్ ఫైనల్ ఫేలయ్యాడు; నే చదవడానికి వీల్లేదన్నాడు... ఏడాదిలో విడిచేశాడు, ఇంక పదినిమిషాలే వుంది."

"వెడదామా?"

రైలు వైపుకి నడుస్తున్నారు.

"మిమ్మల్ని విడిచేసిన మనిషున్నాడంటే, సృష్టి వైచిత్రికి ఆశ్చర్యపడాలి."

"ఎందరెందరో ప్రొఫెసర్లు నా స్నేహం కోరారు. వివాహం అయిందీ అని తెలియగానే దగ్గర స్నేహానికి సాహసించలేదు, మీ లాగనే ..."

ఇంజన్ దగ్గర కొచ్చేశారు. డ్రైవర్ లోపలికెళ్ళి కూత వేయించాడు. చీదిన తూటాలా. ఫ్లాట్ ఫారమ్ జనం పెట్టెల ముందు మూగారు; దీపం చుట్టూ కోటి కీటకాలు మూగాయి. ఆమె పెట్టెలోకెక్కింది... అతను కిటికి మీద చెయ్యి ఆనించాడు. చేతిని అభయమిస్తున్నట్లుగా వేళ్ళలో స్పృశిస్తోంది.

"ఎడబాటు శరీరాలకే. మనసులకి కాదు కదా" అన్నాడు ప్రసాద్ మెల్లగా.

ఆమె కళ్ళల్లో నీరు, కరిగి ద్రవమైన గాజుని గొట్టంలోంచి ఊదగా పడిన బొట్టువలె, వొక్కటై, సాంద్రత తెచ్చుగుని, అతని చేతిమీద పడింది.

"మనస్సులకే ఎడబాటు. అదే ట్రాజెడి."

మరోసారి కూసి, కదిలింది రైలు. వోపికలేని ఆవులింతలా. ప్రసాద్ దిగడిపొయ్యాడు. ఏవేవో తలలు, చేతులు, కాళ్ళు, నీడలు, దీపాలు, రంగులు, నవ్వులు, ఏడ్పులు.. మనస్సు దిగ విడిచి సాగిపోతున్న శరీరాలు అతనిముందు నుంచి కదిలాయి.

రెండు నెలలు గడిచినై. హరిప్రసాద్ విద్యాసాగర్ కేస్ కాగితాలు చదివి నోట్సు తయారు చేయడంలో నిమగ్నుడయ్యాడు. సంగీత సాధనకి వ్యవధి వుండడం లేదు. రెండు మూడు వాయిదాలకి, మాణిక్యాలరావుతో కలిసి కోర్టులో హాజరయ్యాడు. ఊరునుంచి రైలుదిగి ఇంటికొచ్చేటప్పటికి సాయంత్రం ఏడైంది. క్లయింటు విద్యాసాగర్ ధనికుడు. ప్రయాణాలకి కార్ ఏర్పాటు చేశాడు.

ప్రసాద్ లోపలికి రాగానె రంగనాయకమ్మ ఎదురైంది.

“శుభవార్త. ఏం బహుమానం ఇస్తారు. ఉచితంగా కచ్చేరి చెయ్యడం మట్టుకు కాకుండా ?”

“ప్రస్తుతం జడ్జీగారికి జబ్బుచేసి కేసు వాయిదా పడటమే మాక్కావల్సినశుభవార్త. కచ్చేరీ చెయ్యకపోవడమే నా బహుమానం.” అని నవ్వుతున్నాడు.

“ఘటికుడవే, ఏమోననుకున్నాను. ఊహించలేవా... ఉండు. కాఫీ నే తీసుకొస్తాను. అమ్మాయిని పిలవకు...”

“ఏం? జ్వరమా? డ్రైవర్ కి కూడా కాస్త టీ ఇవ్వాలి.”

“ఆ మాత్రం ఊహించలేవు. ఇంతేటయ్యా.. ఎన్నాళ్ళనుండి, ఏది కావాలని తపస్సు చేస్తున్నారో, అది జరిగింది, నామాట నమ్మకంలేదుగా. ఆవిడ నోటంటే విందురుగాని... రా అమ్మా.. రా, శోభాసుందరీ.. నువ్వు చెబితేకాని నమ్మడుట...”

“నిజం?”

ప్రసాద్ మొహం ఎర్రబడింది. శ్వాస వేగంగా వొస్తోంది. శోభా సుందరి బైటకొచ్చింది. తెల్లఖద్దరు చీర. ఊదారంగు జాకెట్టు వేసుగుంది. జడ మెలితిప్పి కట్టింది. చేతులలో బాగ్ బల్లమీద పెట్టింది.

“ఎగ్జామిన్ చేశాను. రంగనాయకమ్మ చెప్పారుగా నిజమే. మరి వెడతాను.” బాగ్ తీసుకుని సర్దుకుంటోంది.

“నే చెప్పానా ? వొంటకి ఎవర్నేనా కుదుర్చు. అమ్మాయిని చెయ్యనివ్వకు. నేనూ వెళ్ళనా?” అని లేచింది రంగనాయకమ్మ.

“కార్లో దింపనా, మీరూ రండి.” అన్నాడు శోభాసుందరినుద్దేశించి. ముగ్గురూ కాఫీలు తీసుకున్నారు. డ్రైవర్ కి టీ తెచ్చింది రంగనాయకమ్మ. ప్రసాద్ వెనకాల గదిలోకొచ్చి మంచం మీద పరున్న కామాక్షిని క్షణం చూచి నవ్వుతూ వొచ్చి కార్లోకెక్కాడు. ముగ్గురూ బైలుదేరారు. “ముందు మా ఇంటికే.” అన్నది రంగనాయకమ్మ. “ఆలస్యానికి వీల్లేదు. రేపే ఇవ్వాలి వొకపార్టీ ఏమండీ శోభాసుందరి గారూ. అవునంటారా?” ఆమె నవ్వుతోంది; ఏమీ మాట్లాడదు. రంగనాయకమ్మ ఇంటివద్ద కారు నిలిచింది. ఆమె దిగింది.

“మా ఇంట్లో కాసేపు కూర్చోరు?”

“మరో మారొస్తాను. కేసు గొడవ, ప్రయాణం బడలిక...”

“శుభవార్తకి పట్టరాని సంతోషం, ఆందోళన... సరె.”

ఆమెలోనికి వెళ్ళింది. కారు శోభాసుందరి ఇంటికి వెళ్ళింది. నిలిచింది. ఇద్దరూ దిగారు.

“థ్యాంక్స్” అని శోభాసుందరి లోపలికి వెళ్ళబోతూంది.

“ఉండండి, నేనలా చెప్పుకోవాలి థ్యాంక్స్, వారు వెయిట్ చేస్తూ వుంటారేమో నువ్వెళ్ళిపో, నేను తరవాత ఇంటికెడతాలే.” అన్నాడు ప్రసాద్ డ్రైవర్ తో. కారు కదిలింది.

ఇద్దరూ లోనికి వెళ్ళారు. బైట కుర్చీలు లేవు. మందువాగదిలో కుర్చీ అమర్చి కూర్చోమంది.

ఎవ్వరూ ఏమీ మాట్లాడ్డం లేదు.

“ఈ పత్రిక చూస్తూ వుండండి” అని లోపలికెళ్ళి, మరో చీర ధరించి వొచ్చింది శోభాసుందరి.

“మీ బాబయ్య కెట్లావుంది”

“చాలా నయం”

“మీ పిన్ని...?”

“అక్కడేవుంది...”

“ఉత్తరం వ్రాస్తారనుకున్నాను.”

“మీరు వ్రాస్తారేమోనని నేనూ అనుకున్నాను...”

“అనుకోడం చాలు.”

“ఓ యబ్బ! మహా మృదువుగా అబద్ధాలాడగలరు లెండి.”

“అబద్ధమా ?”

ఆమె చేతిని తీసుకున్నాడు.

"చేతిని గుండెలమీద పెట్టుకోడం చిన్నప్పుడు ఆటగా ఎరుగుదును."

"మీరు చెప్పనక్కర్లేదు _ మాటలతో నిమిత్తం లేకుండానే ఋజువుచేశారుగా..."

చెయ్యి తొలగించి, బైటకొచ్చింది. మెట్లమీద కూర్చుంది. చూరు నీడ నుదుటి మీద పడుతోంది.

"అంటే ? మీరు నా జీవితంలో ప్రవేశించకపోతే అది జరిగేదే కాదంటే నమ్ముతారా? నేను మరిచిపోలేదు మీరన్నమాట. శరీరాలు విడిపోవడం కాదు, మనస్సులు విడిపోవడం ట్రాజెడీ అని..."

"మనసిక్కడా, శరీరం అక్కడా అనుకోమంటారా?"

"ఇంత చౌఅవుగా అనగలిగారంటే, నాలో ఏదో లోటుండాలి."

"కోపమా? నేననకూడదు. నాకే అధికారమూ లేదు. నాకేమీ తెలీదు. అనుభవం లేదు. క్షమించండి."

ఆమెకళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి, అతను దగ్గరగా వొచ్చి, ఆమెగడ్డం పట్టుకున్నాడు. తలని తన గుండెలమీద ఆనించాడు.

"మీకు నేనంటే నమ్మకం లేదా ఏం కావాలి?"

"జీవితంలో ఏదైనా వున్నవారికి, ఇంకేమన్నా కావాలనిపిస్తుంది. మీకన్నీ వున్నాయి. మీరు సంగీత విద్వాంసులు; కామాక్షి భర్త; బోలెడు ప్రాక్టీసు, తండ్రి కాబోతున్నారు..."

"మీరిల్లావుంటే నే చూడలేను, వెళ్ళిపోతాను." అని లేచాడు ప్రసాద్.

"ఆలస్యమైంది, వెళ్ళండి. కామాక్షి కనిపెట్టుకుని వుంటుంది." తనూ లేచింది. బైటకి నడిచారు. ఇదివరకు వెళ్ళిన తోవనే వెడుతున్నారు.

"నేను మీరనుకున్నంత ప్రముఖ వ్యక్తిని కాను. నేనో గొప్ప సంగీత విద్వాంసుడుగా పేరు పడలేదు; నాకేమీ ప్రాక్టీసూ లేదు. కాస్తో కూస్తో పెద్దలిచ్చిన ఆస్తివుందిగాన బండి నడుస్తోంది. ఇంక తండ్రినంటారా..! సృష్టి చక్రం; దాన్ని కదిల్చింది మీరు. అది నిలిచి పోకుండావుండే భారం మీ మీదనేవుంది..."

"అమ్మో. అంత భారమే. నాకు మీ జీవితంలో స్థానం లేదు. ఉండకూడని పరిస్థితి. చిన్నప్పుడు వొక మేస్టరనేవాడు; కోర్టు, హాస్పిటల్ ఈ రెంటికీ దూరంగా వున్నవాళ్ళు ధన్యజీవులనీ. నా భర్తకి కోర్టు తప్పింది కాదు, నాకు హాస్పిటల్ తప్పింది కాదు. కదిలే చక్రంలో వేలు పెడితే, వేలు తెగడం, చక్రం విరగడం. రెండూ జరుగుతాయి. నేను రానన్నాను. రంగనాయకమ్మ చంపుకు తింటే కాదనలేకపోయ్యాను. వొచ్చి చూడమంది. పరీక్ష చేశాను కామాక్షిని. నిర్ధారణ అవగానే, ఎల్లాగో అయింది. నేనేదో అపచారం చేసినట్లు. పురుడు సమయంలో నేనిక్కడ వుండను. ఉండకూడదు."

"ఎందుకు?"

"ఉంటే, నేను రాకతప్పదు. ఏదన్నా జరిగిందంటే, నేనేదో చేశాననే జనం ఎందరో వుంటారు సమాజంలో; ఇప్పటికే, నేనే మొగుణ్ణి వొదిలేశానని చెప్పుకుంటున్నారు. మా బాబయ్య అనేవాడు, పెండ్లి చెడిపోతే భార్యనీ, ప్రేమ చెడిపోతే భర్తనీ నిందిస్తుంది సంఘం.. అని."

"మరి మీ జీవితం ఎప్పుడూ ఇంతేనా ?"

"సమాజానికి చేతనైనంత సహాయం చెయ్యడమే నా ఆదర్శం. ఇంకేదీ కోరను. కోరితే, అది లభిస్తుంది. అది లభించిన మరుక్షణం, నా ఆదర్శం నశిస్తుంది. ఈ క్షణం, ఇక్కడ తప్ప, వెనక్కి, ముందుకు చూడలేను, షెల్లీ స్కైలార్క్ లాగ." ఆమె కళ్ళంట నీళ్ళు కదుల్తున్నాయి. ప్రసాద్ చీరకొంగుతో తుడుస్తున్నాడు. అప్రయత్నంగా ఆమె వక్షం మీద తల ఆనించాడు. అతని కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి.

"నేను.. నేను.. మిమ్మల్ని విడిచి వుండలేను..."

"ఉన్నారు. ఉండాలి; మనిషి శరీరం పట్ల నాకు గౌరవం లేదు. మనస్సంటే నమ్మకం లేదు, ఈనాడు నాకో మనస్సంటూ కల్పించారు. అది ఏడుస్తోంది. బరువు తగ్గిపోయింది. దాన్ని మీరు తీసుకుపొండి. పుట్టబొయ్యే సంతానానికి కావాలి" లేచింది. ఆమె ఇంటి వైపు నడుస్తున్నారు. గుమ్మం దగ్గరికి చేరుకున్నారు. నక్షత్రాలకిమల్లె మెరుస్తున్నాయి ఆమె కళ్ళు; సంధ్యలో కొంగలబారు పీకలకి మల్లె పళ్ల తళతళలు; చందమామ కోసం మిడిసిపడి ఇసక మీద త్రుళ్ళి పడిన పెద్ద సముద్ర కెరటంకి మల్లె వక్షం కదుల్తోంది. మనస్సు కనబడదు. ఆకాశం అంతటా ఆవరించి అంతర్ధాన మైనట్లు.

రంగనాయకమ్మ పట్టు మీద పార్టీ ఇవ్వక తప్పింది కాదు ప్రసాద్ కి. అతనికి మనస్పూర్తిగా ఇవ్వాలనుంది, నిజమే. కాని శోభాసుందరిని పిలవాలా, ఆమెని పిలిస్తే, పార్టీ ముగిసింతర్వాత భార్యతో కొంత ఘర్షణ తప్పదు; ఆమెని పిలిస్తే మరి కొందర్ని పిలవకూడదేమో, తీరా పిలిచాక శోభాసుందరి రానంటే, తనెంతో బాధపడతాడు. ఇదంతా గొడవగా వుంది. ఈ పిలుపులన్నీ రంగనాయకమ్మకి విడిచేశాడు తుదకి.

ఆనాడు శనివారం. ప్రసాద్ ఇంట్లో పార్టీకి ఎక్కువగా స్త్రీలే వొచ్చారు. కామాక్షి పెత్తల్లి, రంగనాయకమ్మ అతిథులను కనుక్కుంటున్నారు. ఆ నాడు విద్యాసాగర్ కేసు తీర్పు జరిగింది. రాజీ కుదిరి పెంచుకున్న తల్లి ఆస్థిలో మూడొంతులు ఇతనికే దక్కింది, నలభైవేలు రొఖ్కం, పదహారెకరాల భూమి, కోర్టుఖర్చులు సగం మినహా, విద్యాసాగర్ కి వొచ్చినట్లు తీర్పు జరగడంతో, మాణిక్యాలరావు, సహాయపడిన జూనియర్లు, లెక్కలతో, పంపకాలతో బిజీగా, హుషార్ గా వున్నారు. వారినందర్నీ తనింట్లో పార్టీకి తీసుకొచ్చాడు ప్రసాద్. జనార్ధనం వీణవాద్యం ఏర్పాటైంది. మాణిక్యాలరావు, బృందం, పదినిమిషాలు గడిపి, ఆరింటికే వెళ్ళిపోయ్యారు. వారిని సాగనంపడానికి రోడ్డు మలుపు దాకా వెళ్ళాడు ప్రసాద్. విద్యాసాగర్ బుష్ కోటు, పాంటు వేసుగుని తిన్నగా హాల్లోకొచ్చాడు. ఆకుపచ్చరంగు పట్టుచీర, తెల్లసిల్కు జాకెట్టు, కొప్పులో గులాబీలు, కొవ్వొత్తి వెలుగు ఆకారంలో కుంకుమ, కాటుకలోంచి ధగధగ మెరిసిపొయ్యే కళ్ళు. అందరూ ఆమెకేసి చూసేటట్లు చేసే వొక ప్రత్యేకమైన ఠీవితో కదుల్తూవున్న కామాక్షిని చూసి, విభ్రాంతుడై, వొకడుగు వెనక్కి వేశాడు విద్యాసాగర్.

హరిప్రసాద్ హాల్లోకొచ్చాడు.

"మన పార్టీ కూడా రేపే. మీరు పాడాలి. నేనెప్పుడూ వినలేదు _ మీరెవర్ని చెబితే వారిని పిలుస్తా, వయలిన్ కి, మృదంగానికి, మాణిక్యాలరావు గారు ఎన్నో మార్లన్నారు, గొప్పగా పాడతారని..." అన్నాడు విద్యాసాగర్.

"మరో సారి వినిపిస్తాను. ఈ దఫాకి వొదిలెయ్యండి. టైర్డ్ గా వున్నాను. మా అందరికీ నిజంగా వో నెలపాటు రెస్టు కావాలి."

"దానికేముంది, అందరం ఊటీకి వెళ్ళి. వో నెలపాటు కులాసాగా గడుపుదాం. అన్ని ఏర్పాట్లు నేచేస్తానన్నాను మాణిక్యాలరావుగారితో. వారు, ఎక్కడ తీరుతుందండీ అనేశారు నేనేం చెయ్యను. మీరు ఏదడిగితే, అదివ్వడానికి సిద్ధం..." అన్నాడు నవ్వుతూ విద్యాసాగర్, బల్లమీద సిద్ధం చేసిన సామాగ్రి రుచి చూస్తున్నాడు. "నే నెప్పుడూ చూడలేదు మీ వార్ని.. వారేగా.." అన్నాడు కామాక్షిని చూపుతూ. అవునన్నట్లు తల పంకించాడు ప్రసాద్. ఆరుబైట జరుగుతూన్న వీణకచ్చేరీ మధ్యలో, కొందరు స్త్రీలు బైటకొచ్చి, శెలవు తీసుకుని వెడుతున్నారు. గోడగడియారం ఏడు కొట్టింది.

"చాలా థ్యాంక్స్. మరి వెడతాను." అన్నది శోభాసుందరి. బోర్డరు లేని ఊదారంగు కాటన్ చీర. అదేరంగు బ్లౌస్, వేసుకుంది. మెడలో వొక్క గొలుసు. చేతికి నల్ల స్ట్రాప్ రిస్ట్ వాచ్, వున్నాయి. హాండ్ బాగ్ ని వేళ్లతో కదుపుతూ, దీనంగా చూసింది ప్రసాద్ కేసి.

"రాగలిగినందుకు, మిమ్మల్ని థ్యాంక్ చెయ్యాలి. హాస్పిటల్ పనులు..."

వాక్యం పూర్తికాకుండనే. చరచరా నడుచుకుంటూ వెళ్ళింది శోభాసుందరి.

విద్యాసాగర్, గొంతులో ఏదో అడ్డుకున్నట్లై, గ్లాస్ లో నీళ్ళు త్రాగి, తెప్పరిల్లి,

"ఆమె.. మీ... ?"

"ఆమె వొక డాక్టర్. సంగీతం అంటే చాలా ఇష్టం. కామాక్షి ఫ్రెండ్. ఫామిలీ డాక్టర్. కామాక్షి అక్క అనుకున్నారా. చాలా మంది అల్లా అనుకుంటారులెండి. బాగా పోలిక వుంది. ఆమె గ్రేట్ బ్యూటీ. కాని మొగుడొదిలేశాడు. వాడో దౌర్భాగ్యుడు. చదువు అబ్బలేదుట. బోలెడాస్థిట, వ్యవసాయంట; ఇంకా బోలెడాస్థి కలుపుకోవాలని కోర్టులు, దావాలూట. పెళ్ళాం చదువుకోకూడదుట. కట్నంలో పదివేలు ఎగేశారన్న మిషమీద వొదిలేశాట్ట. ఏమిటో జీవితం. డబ్బుంటే సంస్కారం వుండదు; సంస్కారం వుంటే, డబ్బుండదు. రెండూ వుండి కూడా, అదృష్టం అంటూ వుండాలిలెండి..."

విద్యాసాగర్ లేచాడు. మొహానికి చెమట్లు పోసేస్తున్నాయి. తుడుచుకుంటున్నాడు.

"మరి వెడతా. రేపుదయం కారుపంపుతా..."

"ఏం అల్లావున్నారు. యు ఆర్ ఆల్ రైట్ ?"

"కాస్త టైర్డ్ గా ఫీలవుతున్నాను..."

విద్యాసాగర్ వెళ్ళాడు, తొందరగా వొస్తున్నా రంగనాయకమ్మను ఢీకొనకుండా తప్పుకుని వెడుతున్న ఆయనకేసి ఎగాదిగా చూసింది రంగనాయకమ్మ.

"ఇట్లా రా ప్రసాద్..."

"ఆజ్ఞ, చెప్పండి..."

"చెవులో వూదాలి. తెలుసా?"

"సర్వజ్ఞుణ్ణి కాను. వింటె తెలుసుకోలేనంత శుంఠనీ కాను..."

"వెడుదూ, నీ వెటకారం, నువ్వూనూ."

"ఆ వెళ్ళినాయనే, శోభమ్మ ముద్దుల మొగడు. వొదిలేసిందిట."

"వాట్ !"

"కేస్ గెల్చాడుగా. బాగా గుంజండి. ఏ ముహూర్తంలో పెట్టారో పేరు, విద్యాసాగర్ ట. చదువులేదుటగా ధనసాగరం బాగా తోడండి."

అని తొందరగా వెళ్ళింది రంగనాయకమ్మ. మరింక ఎవరితో చెప్పాలన్న ఆతృతతోనో.

నే చెప్పదల్చుకున్న వృత్తాంతం ఇంతటితో ముగిసినట్లే. ఇలా విడిచేస్తే పాఠకుడిలో కాస్తంత అసంతృప్తి వుండి పోతుందని తెలుసు. జీవితంలో సంఘటనలకి ఆద్యంతాలు స్ఫుటంగా వుండవు. కళలో స్ఫుటంగా వుండి తీరాలని శాసిస్తాడు పాఠకుడు. అతన్ని తృప్తి పరచడం కోసం కళాకారుడు, ఊహని ప్రయోగించి "ఫరవాలేదు, ఇట్లాంటి ముగింపు అసహజం కాదు" అని; తనకు సబబని తోచిన ముగింపు చేసి, అంగీకరింప చేసేటందుకు, కొంత వ్యాఖ్యానం చేసి సమాప్తి చేస్తాడు. చమత్కారంగల కొందరు రచయితలు, ఆ ఊహాగానం పాఠకుడికే విడిచేస్తారు. పాఠకుడు తన సంస్కారాన్ని, వైజ్ఞానిక సంపదనూ అనుసరించి, ముగింపు సూచించుకొన్నా అసంతృప్తి మాత్రం తొలగి పోదు.

ఇల్లా పాఠకుణ్ణి గాలిలో వొదిలెయ్యడం నాకిష్టం లేదు. పైగా కథలో పాత్రలకి వోవిధంగా అన్యాయం చెయ్యడమే అవుతుందిగాన, ఆరు నెలల తర్వాత వ్యక్తమైన ఈ కథ ముగింపు చెప్తాను. పుట్టడం, చావటం ఆద్యంతాలు కావాలనే ప్రశ్న రావొచ్చు. నిజానికి ఆ రకం అద్యంతాలు, సృష్టికి సంబంధించినవి. కాని, జీవితానికి సంబంధించినవి కావేమో, ఈ కథ ముగింపులో, ఈ రెండూ లేవు. కామాక్షి మరో ఆరుమాసాలకి కాని ప్రసవించదు. మగ శిశువో, ఆడశిశువో మనకి తెలియదు. సుఖప్రసవమైందా? తల్లీ, పిల్లా క్షేమమా? ఇవన్నీ సృష్టికి సంభంధించిన ప్రశ్నలు. ఆరు నెలల తర్వాత వొక శుభలేఖ అందుకున్నాడు హరిప్రసాద్. అది తమ నూతనగృహ ప్రవేశానికి, శోభాసుందరి, విద్యాసాగర్ పంపిన ఆహ్వాన పత్రం. అతన్ని వొచ్చి కచ్చేరి చెయ్యవలసిందిగా, భార్యా భర్తలు ఇరువురి సంతకాలతోనూ వొక ఉత్తరం కూడా ఉంది. "అనురాగములేని రాగప్రస్తార ప్రథమ అంశంగా ప్రోగ్రాములో వేయిస్తున్నాం మరువకండేం !"

★★★

.

# దొంగ సొత్తు

- దాసరి సుబ్రహ్మణ్యం

(యువ మాసపత్రిక - జనవరి, 1962 సంచిక నుంచి)



రాత్రి పడిన జల్లుతో నేలంతా తడీ పొడీగా వున్నది. గురప్ప గుడిశె ముందు ఓ చింకిపట్టా పరుచుక్కూచుని, సాగనార తడపల్తో ఉచ్చులు అల్లుతున్నాడు. ఎదురుగ్గా రోడ్డవతల కూతవేటు దూరంలో గ్రామం పక్కన వున్న దొరవారి తాటితోపులోంచి సూర్యుడు తాపీగా ఆకాశం మీదికి ఎగబాకుతున్నాడు.

గుడిశెలో చిన్నచప్పుడైంది. నారపోచను చూపుడువేలి మీంచి తిప్పి ముడివెయ్యబోతున్న గురప్ప చప్పున దాన్ని బొటనవేలితో వెనక్కునెట్టి తలతిప్పి చూశాడు. గంగి గుడిశెవాకిలి దగ్గిర నిలబడి నిద్రమత్తు కళ్ళతో బయటికి చూస్తున్నది. ఆ చూపు తనకేసో, లేక రోడ్డుకేసో గురప్పకు అర్థంకాలేదు. "ఊహూఁ, ఈ పిట్ట నిలవదు. దీన్ని ఎగిరిపోకుండా పట్టుంచే ఉచ్చులు అల్లటం నావల్ల కాదు." అనుకుంటూ గురప్ప తలవాల్చేసుకుని విసుగ్గా నారతడపను కాలి మడం కింద తొక్కిపట్టి, వేళ్ళతో నిలువునా చీల్చసాగాడు.

"ఇప్పుడు కొంగలూ, కొక్కిరాయిలూ పట్టతానికి ఎళతావన్నమాట ! శూద్రోడివై పుట్టి యానాది పనులు చెయ్యటం నీవల్ల ఎట్టవుద్ది?" అంటూ గంగిపక్కగా వున్న మేదర తడికెను లాగి కిర్రుమనిపిస్తూ వాకిలి మూసింది.

“ఎహెయ్, నీ కొక్కిరాయి మాటలు కట్టిపెట్టేయ్, గంగీ!” అంటూ గురప్ప చేతులో వున్న నార తడపను దూరంగా విసిరికొట్టాడు.

గంగినుంచి ఏ జవాబూ లేదు. గురప్ప పట్టరాని కోపంతో పెదాలు గట్టిగా బిగించి, లేచి నిలబడుతూనే కిందున్న చింకిపట్టాను వాకిలికి అడ్డంగా వున్న తడికెకేసి తన్ని, పెద్ద పెద్ద అంగలేస్తూ పోయి రోడ్డుపక్కన వున్న వేపచెట్టు మొదట్లో చదికిలబడి కూచున్నాడు.

గురప్ప మనస్సు చీకాకైపోయింది. ఈ మధ్య నెలరోజులుగా గంగి తనను అనరాని మాటలు అనేస్తున్నది. దాని నోరు మూయించటం ఏమంత కష్టం కాదు. సాచి చేత్తో చెంపమీద ఒకటీ, కాలితో నడ్డిమీద రెండూ తంతే.. మరి వారం రోజుల వరకూ కుక్కిన పేనులా వుండిపోతుంది. కాని, యిప్పుడు దాన్ని తన్నేందుకు లేదు. దానికి ఏడో నెల కడుపు.

“ఛీఛీ, దాన్ని బస్తీలో ఆ ఎంగిలి యానాదోడి దగ్గిరే బతకనియ్యాల్సింది,” అనుకున్నాడు గురప్ప. వెంటనే అతడికి బస్తీనుంచి గంగిని ఈ పల్లెటూరు లేపుకు రావటానికి తానుపడ్డ అవస్థలూ, తెగించి ఒంటరిగా దాని మొగుణ్ణీ, వాడికి జత వచ్చిన మరో యిద్దరు రౌడీలనూ ఎదిరించి పోట్లాడిన సంగతులూ గుర్తుకొచ్చినై. అతడు అప్రయత్నంగా మీసం దువ్వుకున్నాడు.

“నన్ను చూసి ఎవడైనా నలభైయ్యేళ్ళవాడనుకుంటాడా? కాయపాటు శరీరం, దండీలూ, బస్కీలూ కొట్టిన ఒళ్ళు! నన్ను మొట్ట మొదటగా చూసినపుడు... అది.. గంగి... ముప్పైయేళ్ళ వాడిననుకున్నదంట ! అహ్హహ్హ...” అనుకుంటూ గురప్ప సంతోషంగా ఒళ్ళు విరుచుకుని, వేపచెట్టు మొదలుకు చేరగిలబడ్డాడు.

సూర్యుడు దొరవారి తాటితోపు లోని చెట్ల తలల మీంచి తొంగి చూస్తున్నాడు. ఆ కాంతిలో గురప్పకు రెండు తలల తాటిచెట్టు స్పష్టంగా కనిపించింది. అతడి మనస్సులో రకరకాల ఆలోచనలు కదలబారినై. ఉండీ, తాను దరిద్రం అనుభవిస్తున్నాడు. దొంగ సొత్తును పరులు అనుమానించకుండా ఖర్చు పెట్టటం చాలా కష్టం. తనకు హఠాత్తుగా ఏ లంకెలబిందో దొరికిందంటే ఎవరూ నమ్మరు; నమ్మినా అది పోలీసువాళ్ళ పరం అవుతుంది. దొంగతనాలు చేసినందుగ్గాను రెండు సార్లు జైలుకు పోయి వచ్చిన వాడిదగ్గిర డబ్బు మెదులుతూండటం చూస్తే, వెంటనే అది దొంగసొత్తని అందరూ పసికట్టేస్తారు.

ఇలాంటి, దారీడొంకా తెలీని ఆలోచనలతో గురప్పకు శరీరం నీరసపడిపోయినట్టనిపించింది. “కొన్నాళ్ళ పాటు కూలీ నాలీచేసి గంగిని బతికించాల్సిందే. దానికి ఎన్నాశలు పెట్టాను ! చీరలూ.. సొమ్ములూ... అవేవీ కొని పెట్టకుండా దాన్ని ఇక్కడ వుంచటం కష్టం. ఏదో రోజున నేను యింట్లో లేకుండా వుండటం చూసి, అది బస్తీకి వుడాయించేస్తుంది. ఊహూఁ, దాన్ని ఎట్టా పోనిస్తానూ ? ముందు నా బిడ్డని యిక్కడ కని పడేసి, తరవాత యిష్టం వచ్చినచోటికి పారిపొమ్మను, ఓటల్లో ఎంగిలి కప్పులు కడుక్కునే.. ఆ మొగుడి దగ్గిరికి పోయినా నాకేం పట్టదు.”

మగత నిద్దర్లోంచి ఉలిక్కిపడిలేచినట్టుగా, బిత్తరపోతూ గురప్ప గుడిశెకేసి చూశాడు. గుడిశెలోంచి పెద్దగా దగ్గూ, ఆ వెంటనే ‘ఓక్’ అంటూ డోక్కోవటం అతడికి వినిపించింది.

గురప్ప గుండెలు వేగంగా కొట్టుకున్నై, కాళ్ళూ చేతులూ స్వాధీనం తప్పినట్టయింది. “ఏదో అగాయిత్యం చేసింది” అనుకుంటూ అతడు ఎక్కడలేని సత్తువతో ఎగిరి నిలబడి, రివ్వుమంటూ గుడిశెలోకి పరిగెత్తి, వాకిలికి అడ్డంగా వున్న తడికెను చర్రున పక్కకు లాగాడు.

గంగి గోడనానుక్కూచుని పెద్దగా డోక్కుంటున్నది. గురప్ప ఒక్క అంగలో దాని దగ్గిరకు వెళ్ళి, రెండు చేతులతో దాని తల గట్టిగా పట్టుకుంటూ, “ఏం చేశావే గంగీ? ఏం చేశావ్ ?” అంటూ ఆదుర్దాగా ప్రశ్నించాడు.

“ఛీ, నన్నంటుకోమాక, నన్నిట్టాగే సావనీ,” అంటూ గంగి గురప్ప చేతుల్ని తన చేతుల్తో పక్కకు నెట్టింది. ఆ సమయంలో దాని గుప్పెట్లోంచి, ఏదో కిందపడి దూరంగా దొర్లుకు పోయింది. గురప్ప ఆ దొర్లుకు పోతున్న దానికేసి ఓ తృటికాలం చూసి, నివ్వెరపోయి ఒక్క గంతులో వెళ్ళి దాన్ని చేతిలోకి తీసుకుని పరీక్షగా చూశాడు. అది గన్నేరు కాయ. ఒక పక్కన కాస్త కొరికినట్టు వుంది. గురప్ప నిశ్చేష్టుడయాడు.

"నన్ను బతకానియ్యవూ, సావను కూడా సావనియ్యవు" అంటూ గంగి గొంతెత్తి శోకం ప్రారంభించింది.

గురప్పకు కాళ్ళూ చేతులూ వణికినై. ఆ క్షణంలో అతడికి గంగిమీద ఎక్కడ లేని మమకారం పుట్టుకొచ్చింది. తాను మొట్ట మొదటిసారి బస్తీలో చూసిన గంగి అతడి కళ్ళముందు కదుల్లాడింది.

గంగి మాంచి ఒడ్డూ పొడుగూ, ఒంపూ సొంపూ వున్న ఆడది. రంగు నల్లనైతేం గాక; పెద్దకళ్ళూ, తీరైన ముక్కూ, నిండు తలకట్టూ... చక్కని మాటతీరూ దాని సొత్తు. గురప్ప జైలు నుంచి బయటికి వచ్చిన రోజున, దాన్ని హోటల్లో అంట్లు తోముతూండగా చూసి, యిట్టే ఆకర్షించబడ్డాడు.

తను యిక దొంగతనాలు చెయ్యనని మాట యిచ్చింతరవాతే, గంగి తనతో లేచి రావటానికి ఒప్పుకున్నది. బతికినంత కాలం సుఖంగా బతికేందుకు అవసరం అయిన డబ్బు తను జాగర్త పరిచానని కూడా దానికి చెప్పాడు. చీరెలూ, నగలే కాక, మంచి ఇల్లూ, పొలాలూ కూడా కొనుక్కోవచ్చని నమ్మబలికాడు. కాని, ఈ సంవత్సరంన్నరలో తాను యిందులో ఏ ఒక్క మాటా నిలుపుకోలేదు.

"గంగీ, నువ్వుపోయాక నేను బతికుంటాననుకున్నావా? నేనూ చస్తాను. ఇద్దరం ఒకేసారి చద్దాం పట్టు," అంటూ గురప్ప గంగి పక్కన కూచుని, దాని భుజం మీద చేయి వేశాడు. గంగి అతడి చేతిని విసురుగా లాగి పారేస్తూ, పెద్దగా ఓక్ మని, "నువ్వు కులపోడివి, నేను యానాద్దాన్ని. నాకు  ముక్కుకి పుడకా వద్దు, మెళ్ళోకి కంటే వద్దు. నీ గుబులంతా నా మీద కాదు, నా కడుపులో వున్న పిల్లోడి మీద. ఆణ్ణి కనంగానే నన్ను తన్ని తరిమేస్తావ్. ఎప్పుడో ఎందుకు, ఆణ్ణి యిప్పుడే నీ ఒళ్ళో ఏస్తాను. ఆ మూలున్న పీట పెట్టి, పొట్ట మీద రెండు పోట్లు పొడువ్," అంటూ బావురుమన్నది.

ఆ క్షణంలో గంగిని సముదాయించటం ఎట్లాగో తెలీక గురప్ప బెంబేలు పడిపోయాడు. నయం, గన్నేరుకాయ సొంతం తిన్నది కాదు; అంతవరకు అదృష్టవంతుణ్ణి అనుకున్నాడు.

"కులం పేరెత్తి నన్ను సూలం పోట్లు పొడవకే, గంగీ!" అంటూ గురప్ప కళ్ళనీళ్ళ పర్యంతమై, దాని గడ్డం పట్టుకుని బతిమాలటం ప్రారంభించాడు : "నువ్వు ఎవరో శూద్రోళ్ళ పిల్లవనీ, పుట్టంగానే నిన్ను యానాది గుడిశెల ముందు వదిలిపోతే యానాదోళ్ళు పెంచారనీ, లోగడే నాకు చెప్పావ్ గందా.. గంగీ అని పిలిసినందుకు, మొన్నామధ్య నేను చినకాపు కొడుకు యీపు పగలెయ్యలా ? ఆడు ఆ రోజు నుంచీ నిన్ను గంగమ్మానే పిలుస్తున్నాడు గదా ! నువు చెప్పిన సంగతి అబద్ధం అనుకున్నాననుకున్నావా ?"

"అబద్ధాలాడేది నువ్వు," అంటూ గంగి గట్టిగా కసిరి కొట్టింది.

"నేనాడిన అబద్ధం ఏంటి ?" అన్నాడు గురప్ప బతిమాలుతూ.

"అంత డబ్బు... యింత డబ్బు ఎక్కడో దాశానన్నావ్ ?"

"అవునే, దాశాను."

"దాశావా ? ఎక్కడ ? నిజంగానే దాస్తే, నాకు ఒక్క ముక్కు పుడుకైనా సేయించవేఁ ?"

గురప్ప పెద్దగా నిట్టూరుస్తూ, "ఆ డబ్బు యిప్పుడే బయటికి తీయటం పెమాదమని ఎన్ని సార్లు సెప్పానే ! దొంగతనాలు సేసినందుకు రొండు సార్లు జయిలుకెళ్ళినోణ్ణిగందా. పోలీసోళ్ళు లాటీలు పెట్టి డొక్కల్లో, గుండెల్లో ఎన్ని కూపీ పోట్లు పొడిసినా, ఆ దాసిన చోటు బయట పెట్టకుండా వూరుకున్నాను. ఇప్పుడా డబ్బు తీసి వాడకం పెడితే, వాళ్ళకి దొరికి పోవటమే గందా ? కాస్త ఓపిక పట్టే. పిల్లాణ్ణి కన్న మరసటి రోజున, ఆ దాసిన డబ్బూ, బంగారం నగలూ నీ కళ్ళకి సూపిస్తాను. అయన్నీ అమ్మి కర్చుపెట్టే యవారం మాత్రం..  ఆ తరవాతే. ఆ బంగారమంతా కాత్త కాత్త నిదానంగా అమ్మి, ఒక్కొక్కటీ.. పొలం, పుట్రా కొనుక్కుందాం," అన్నాడు.

"ఆ డబ్బూ, నగలూ ఏయో నా కళ్ళపడితే కాని నేన్నమ్మను," అంది గంగి, మళ్ళీ డోక్కోపోయేదానిలా ముఖంపెట్టి.

గురప్ప చప్పున చేతుల్తో దాని తల పట్టుకుంటూ, " కక్కోవే, కక్కో ఇంకా లోపల ఆ గన్నేరు పప్పేమన్నా మిగిలుంటే బయటికి పోద్ది," అని కాసేపాగి, "ఆ డబ్బూ అదీ నీకు సూపిద్దామని మొన్నామధ్య ఆ దాసిన చోటుకి వెళితే, ఆ చుట్టుపక్కల మనుషులు తిరుగుతున్నారు ఏమయితే అదవుద్దిలెమ్మని మూర్కించి మరి కాస్త ముందుకు పోయి చూస్తును గందా ఆ పక్కనే చిన్న పుట్ట ఎలిసింది దానిమీద రెండు తాసు పాములు పెనేసుకు పడున్నై టారుకు తిరిగొచ్చాను," అన్నాడు.

"బలే కతలు సెపుతావే గురప్పా.. లేలే, నన్నంటమాక ! దొంగ బుద్దెక్కడికి పోద్ది" అంటూ విదిలించుకుని లేచి నిలబడింది గంగి.

గురప్ప ఓ క్షణకాలం స్తభించి పోయాడు అతడి ముఖం వెలవెల పోయింది కాసేపటికి తేరుకున్న వాడిలా చిరునవ్వు నవ్వుతూ, "నువ్వనే సూటిపోటీ మాటలకీ, కారు కూతలకీ, మరెప్పుడన్నా అయితే, గొంతు పిసికి మరీ సంపేవాణ్ణి అదుగో, ఆడున్నాడు ఆడి ముఖం చూసి నిన్ను వదిలేస్తున్నాను వాణ్ణి భూమ్మీద పడనీ నీ పాట్లు సూద్దువుగానీ," అంటూ గుడిశెలోంచి గబగబా బయిటికి వెళ్ళిపోయాడు.

"ఓ గురప్పో, ఎక్కడికీ ?" అంటూ ఓక్ మన్నది గంగి.

"నేనబద్దాలకోర్నో, నమ్మకస్తుణ్ణో తేలుస్తాను. ఆడబ్బూ, నగలూ తెచ్చి యిప్పుడే నీ మొఖం ఎదట పెడతాను," అంటూ గురప్ప ఉరుముతున్నట్టుగా అరిచాడు.

★ ★ ★

రెండు గంటల తరవాత గురప్ప తల వేలాడేసుకుని, పిల్లిలా అడుగులో అడుగేసుకుంటూ, రోడ్డుదాటి గుడిశె ముందుకు వచ్చేసరికి, వాకిటికి ఒక పక్కగా వాసెన కట్టివున్న ఒక చిన్న కుండ కనిపించింది. ఏమిటా యిదని అతడు ఆశ్చర్యపోయేంతలో, గుడిశె లోపలి నుంచి పెద్దగా నవ్వూ, ఆ వెంటనే ' చింతపూలా రైకదానా' అన్న పాటా వినిపించింది ఆ పాట వినబడగానే గురప్ప ముఖం జేవురించింది కోపంతో ముక్కు పుటాలు అదిరినై అతడు పళ్ళు పటపట కొరుకుతూ, "ఏవడ్రా వాడూ, రా బయిటికి !" అంటూ వాకిలికి అడ్డంగా వున్న తడికెను ఒక్క తన్ను తన్నాడు.

"ఏరోయ్, గురప్పా ! పొరుగూరోణ్ణి, సాటి కులపోణ్ణీ పట్టుకుని నోటికొచ్చిన మాట అనెయ్యటమే ! ఈడెవడనుకున్నావ్, సమ్మిట సత్తెయ్య రోయ్, సమ్మిట సత్తెయ్య !" అంటూ ఒక ఆజానుబాహుడు, రొమ్ము విరుచుకుంటూ గుడిశెలోంచి బయటికి వచ్చి, గురప్పకు ఎదురుగా నిలబడ్డాడు.

గురప్పకు వళ్ళు మండిపోయింది. సూట్టానికి సత్తెయ్య తనమీద ఓ గుప్పెడుంటాడు తనకన్నా మరి కాస్త కండలు తేరిన శరీరం కూడా అయినా, చేయీ చేయీ కలపటం వరకూ వస్తే, తను వాణ్ణి ఒక్క కూపీపట్టు పట్టి, మోచేయో మోకాలో విరగ్గొట్టగలడు కానీ, దానికి యిది సమయం కాదు. సత్తెయ్య డబ్బు కలవాడు కాకపోయినా, పలుకుబడి కలవాడు ఆ చుట్టుపక్కల అతడికి పాము మంత్రగాడుగా పెద్ద పేరుంది.

"ఎంత కులపోడివైతే మాత్రం మొగాడు లేనప్పుడు, ఇంట్లో జొరబడతావంట్రా? పైన ఆ ఉల్లాయి పదాలేంటి ? నువ్వు సమ్మిట సత్తెయ్యవయితే, నేను గాలం గురప్పని, తెలుసా ?" అన్నాడు గురప్ప పౌరుషం కనబరుస్తూ.

సత్తెయ్య గతుక్కుమన్నాడు తను అనవసరంగా దురుసు మాటలనటం పొరబాటని గ్రహించాడు. గురప్ప పేరు మోసిన దొంగ పైగా, కులం చెడినోడు తను వాణ్ణి కొట్టినా, లేక వాడే తన్ను కొట్టినా తన గౌరవమే పోతుంది.

"అంత కోపం తెచ్చుకోకురా, గురప్పా ! నేనేం పనిగట్టుకుని నీ యింటికి రాలేదు. క్రిష్ణమాచార్లు ఎవరికో ప్రాణం మీద కొచ్చిందని పచ్చి గరళం కావాలంటే, చెట్టూ పుట్టా తిరిగి, పామును పట్టుకుని కుండలో పెట్టి తీసుకు పోతున్నాను. కాస్త దాహమై, రోడ్డు పక్క యిల్లు గనక లోపలికెళ్ళాను. అంతే" అన్నాడు సత్తెయ్య రాజీ ధోరణిగా.

"అంత గొంతెండే దాహం అయితే బయటుండే అడగొచ్చుగా, యింటోకెందుకెళ్ళావ్ ? ఆ లుల్లాయ్ పదాలేంటి? కనపడదేఁ, ఆ లంజెక్కడ సచ్చింది ! ఏయ్, గంగీ" అంటూ గురప్ప లోపలికి వెళ్ళ బోయిన వాడల్లా ఆగి, ఏదో పూనకం వచ్చిన వాడిలా చప్పున వెనక్కు తిరిగి, "ఒరే సత్తెయ్యా, ఇదే ఆకరు మాట సెప్తున్నాను. ఎప్పుడైనా నేనింట్లో లేనప్పుడు యీ దరిదాపుల కనిపించావో, నీ నెత్తురు తాగుతాను. పో, యిక్కణ్ణించి ఫో ! ఆ దెవసం కుండ తీసెయ్," అంటూ కీచు గొంతుతో పెద్దగా అరిచి, కుండను కాలుతో ఒక్క తొక్కు తొక్కాడు. కుండ ఠపీమని శబ్దం చేస్తూ పగిలిపోయింది. లోపల ఉన్న నల్ల తాచు బుస్సుమంటూ పైకి లేచి, గురప్ప శీలమండను గట్టిగా పట్టుకుని కాటు వేసింది.

గురప్ప కెవ్వుమన్నాడు సత్తెయ్య కొయ్య బారిపోయాడు. 'అమ్మో' అని అరుస్తూ గంగి లోపలి నుంచి పరిగెత్తుకు వచ్చింది. గురప్ప తూలుతూ గడపకేసి రెండడుగులు వేసి, వికృతంగా అరిచి దభీమని కింద పడిపోయాడు. పగిలిపోయిన కుండ పెంకుల చాటున మెలికలు తిరుగుతున్న తాచు పాము బుస్ మంటూ పడగ విప్పి లేచి, కింద పడివున్న గురప్ప మీంచి చర్రున జరి, బాణంలా రోడ్డు కేసి పరిగెత్తింది.

"మూర్కం తొత్తుకొడకా ! నా కొచ్చే పది రూపాయలూ నీ ఎదాన పెట్టుకున్నావ్ గదరా," అంటూ సత్తెయ్య గురప్ప కేసి ఉరిమి చూసి, "ఏయ్, ఆగు, ఆగు !" అని ఆజ్ఞాపిస్తున్నట్టు కేకలు వేస్తూ, తాచుపాము వెంటపడ్డాడు.

గంగి, "అయ్యో, నా దేముడో," అని తల బాదుకుంటూ గురప్ప మీద వాలిపోయింది.

గురప్పకు నరాలన్నీ పీకుతున్నట్టూ, గుండెలు గరిశె పడుతున్నట్టూ బాధ కలిగింది. "విషం తలకెక్కుతున్నది, బతకను," అనుకున్నాడతడు. ఆ నిమిషంలో అతడికి తాను చచ్చిపోతున్నాననే భీతికంటే, గంగీ, దాని గర్భస్థ శిశువూ గురించిన భయం ఎక్కువైంది.

గురప్ప లేచి కూచునేందుకు ప్రయత్నించాడు. కాని, సాధ్యంకాలేదు. గొంతులో ఏదో గురగుర ప్రారంభమై నాలుకంతా చేదు చేదై పోయింది. వున్నట్టుండి యింత నురుగు భళుక్కుమంటూ కక్కాడు.

"గంగీ యిక నేను బతకను. దాచిన డబ్బు తెద్దామని ఎళితే, తోపులో తాటాకులు కొడుతూ నలుగురు మనుషులు కనిపించారు. పెదకాపు కూడా అక్కడే వున్నాడు. అందుకని వట్టి చేతుల్తో తిరిగొచ్చాను. ఆ డబ్బు ఎక్కడ దాచానో చెపుతా, జాగర్తగా యిను. దొరవారి తాడితోపులో రొండు తల్ల తాడుంది చూశావ్, దాని పక్కనున్న కుంకుడు చెట్టు పాదులో దాన్ని పాతేశాను. దాని మీద గుర్తుగా చిన్న జిల్లేడు మొక్క కూడా నాటాను... తెల్ల జిల్లేడు మొక్క..." అని చెపుతూ గురప్ప పెద్దగా మూలిగి, నేలమీద మెలికలు తిరగసాగాడు.

గంగి మరింత పెద్దగా శోకాలు పెట్టటం ప్రారంభించింది. గురప్పకు తన కళ్ళకేదో చీకటి పొర అడ్డం పడినట్టు భ్రమ కలిగింది. అతడు రెండు చేతులూ సాచి, గంగిని దగ్గిరగా లాక్కుంటూ, "గంగీ, బస్తీకెళ్ళి నీ మొగుణ్ణి యిక్కడికి తెచ్చుకో. ఇద్దరూ కలిసి ఆ డబ్బు చాటుగా తెచ్చుకోండి. చూశావ్... నా కుర్రాణ్ణి... ఎంగిలాకులెత్తే వాణ్ణిగా చేయమాక... చూశావ్.. చూశావ్.." అంటూ పెద్దగా మూలిగి, గోళ్ళతో నేలను ఓసారి గట్టిగా బరికి, 'అబ్బా' అంటూ కళ్ళు మూసుకున్నాడు.

గంగి గుండెలు బాదుకుంటూ గురప్ప మీదికి వాలిపోయింది. "నా మొగుణ్ణి మంత్రం ఏసి బతికించండ్రో బాబూ! నా దేముడు సచ్చిపోతున్నాడో, దేముడో ! ఓ సత్తెయ్య బాబో... తొరగా వొచ్చి మంత్రం ఏసి రచ్చించవయ్యో," అంటూ గురప్ప దగ్గర్నుంచి లేచి, రోడ్డు దాటి, సత్తెయ్య కోసం తాటితోపు కేసి పరిగెత్త సాగింది.

★★★

# నీలిమేడ

## - ఆత్రేయి

### (భారతి మాసపత్రిక - జూలై, 1946 సంచిక నుంచి)

ఒక రోజున మేమంతా "ఇలస్ట్రేటెడ్ వీక్లీ" లో బొమ్మలు చూసుకుంటున్నాము. అంతలో అక్కడికి మా పెద్దమామయ్య వచ్చాడు. "చూడు మామయ్య ! ఈ అమ్మాయి ఎంచక్కా నవ్వుతోందో!" అని మా చెల్లెలు సుశీల ఒక బొమ్మ చూపించింది. మా మామయ్య ఆ బొమ్మని చూశాడో లేదో, అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెదవులు మాత్రం నవ్వుతూనే ఉన్నాయి. వెంటనే అతడు అక్కడినుంచి వెళ్ళి, వసారాలో కుర్చీలో కూర్చుని మాలతిపందిరి వైపు చూస్తో ఏదో ఆలోచిస్తూన్నాడు.

నేను దగ్గిరికి వెళ్ళి, "ఏం మామయ్య, అల్లా వచ్చేశావేం ?" అని అడిగాను.

"అబ్బే, ఏం లేదురా, ఏదో జ్ఞాపకం వస్తేను.." అంటున్నాడు. అంత వృద్ధునికి కంట నీరు తిరిగిన విషయం ఏమిటా అని నాకు మరింత కుతూహలం కలిగింది.

"చెప్పవూ, మామయ్యా ?" అని మరీ మరీ అడగ్గా, చివరికి "అదో కథలే" అంటూ మొదలు పెట్టాడు.

మధ్య మధ్య ఏమైనా అడిగితే అసలు కథే మానేస్తాడేమో అని మాట్లాడకుండా కూర్చున్నాను. మా మామయ్య చెపుతున్నాడు.

"నేను వర్తకం కోసం తరచు మద్రాసు, బెంగుళూరు, బొంబాయిలమధ్య తిరుగుతూ ఉండేవాణ్ణని మీకు తెలుసనుకుంటాను. ఒకసారి ఒక చిన్న స్టేషన్ దగ్గర బండి ఆగింది. అక్కడ స్టేషనుకు దగ్గరగానే ఒక చిన్న అందమైన ఇల్లు కనపడింది. ఇంటికంతా నీలిరంగు వేశారు. వానకూ, ఎండకూ రంగు కొంచెం మాసిపోయి ఉంది. చుట్టూ చిన్న తోట ఉంది.

ముప్పైఐదు, నలభై సంవత్సరాల నాటిమాట. రైలులో కూర్చునే ఆ యింటిని చూశాను. నేనున్న పెట్టెకూడా సరీగ్గా ఆ యింటిముందరే ఆగింది. అక్కడినుంచే ఆ యిల్లు నా మనస్సులో బాగా నాటుకు పోయింది. ఇంటిముందర తోటలో ఒక చిన్నపిల్ల బంతితో ఆడుకుంటోంది. వయస్సు సుమారు పదిసంవత్సరాలుంటాయి. పచ్చని దబ్బపండులాంటి రంగు, నల్లని పట్టుకుచ్చులాంటి మెత్తని జుట్టు. ఆకుపచ్చ పరికిణీ

కట్టుకుని, గులాబిరంగు గౌను తొడుక్కుంది. జుట్టు నీలిరంగు రిబ్బనుతో కట్టుకుంది. వసంతకాలపు వనలక్ష్మి యేమో అన్నట్టుంది. ఆ బాలిక సర్వావయవాలలోనూ ఆనంద తరంగాలు ఉప్పొంగిపోతోన్నట్టూ, ఆమె మూర్తీభవించిన ఆనందదేవత అయినట్టూ తోచింది.

ఆ రోజు అసలు నా మనస్సు స్తిమితంగా లేదు. మానాన్నకు ఒంట్లో బాగుండలేదు. బొంబాయిలో వర్తక విషయాలలో కొన్ని పేచీలు వచ్చాయనీ, తొందరగా రమ్మనీ టెలిగ్రాము వచ్చింది. మానాన్న నన్ను వెళ్ళి ఆ పని చూసుకుని రమ్మన్నాడు. నేను ఆయనతో ఒకటి రెండు సార్లు బొంబాయి వెళ్ళినా, సొంతంగా వ్యాపారం చూడ్డం అదే మొదలు. పైగా, నాన్న జబ్బు విషయమై బెంగ. పిల్లలందరిలోనూ నేనే పెద్దవాణ్ణి. మనస్సు అనేక చింతలతో నిండిపోయి ఉంది.

అటువంటి సమయంలో ఈ చిన్న చిత్రం కాస్సేపు నా బాధంతనీ మరిపించింది. ప్రొద్దున్నే కన్నులు తెరవగానే ఎదుట, ప్రకృతినంతనీ తనలో వికసింపజేసుకున్న ఆ చిన్న తోటనీ, ఆ తోటలో వనలక్ష్మి లాగ ఆ బాలికనూ చూడగానే ఎందుకనో ఆ రోజు నేను పట్టినదంతా బంగారం అవుతుందనిపించింది. "ఇటువంటి ప్రశాంత ప్రదేశంలో ఉన్నవారికి ఎంత సుఖంగా ఉంటుందో ? వారికి చీకూ చింతా ఉండవలసిన అవసరం ఏమి ఉంటుంది ?" అనుకున్నాను. ఈ ఆలోచనలవల్ల ఆ బాలిక ఆనందం చూస్తే మనస్సులో కొంచెం అసూయ మొలకెత్తింది. ఇదేవిధంగా నేను కూడా అన్ని విచారాలూ మరిచిపోయి విశ్వసౌందర్యంలో తేలిపోతూంటే !

బండి కదిలింది. అదే సమయానికి ఆ నీలిమేడలోంచి ఎవరో "కళ్యాణీ !" అని పిలిచారు. ఆ బాలిక ఆట మానేసి ఇంట్లోకి పరుగెత్తింది.

కళ్యాణి ! ఆ పేరుకూడా నాకు ఎంతో మధురంగా అనిపించింది. రైలులో కూర్చుని ఆ నీలిమేడా, ఆ తోటా, ఆ బాలికా, ఆ బంతీ, ఆ పిలుపూ అన్నీ మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకోడం మొదలుపెట్టాను.

కొద్దిరోజులకే మా నాన్న చనిపోడం వల్ల వర్తకం అంతా నేనే చూసుకోవలసి వచ్చింది. అందుచేత చాలా రోజుల వరకూ సరుకులూ, రత్నాలూ, డబ్బూ తప్ప నాకు వేరొకచింత లేకపోయింది.

పది సంవత్సరాల తరువాత మళ్ళీ బొంబాయి వెళ్ళి తిరిగివస్తున్నాను. నేను కూర్చున్న పెట్టె మళ్ళీ నీలిమేడ ఎదుట ఆగింది. వెనుకటి విషయం జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడా మేడరంగు ఇంకా వెలిసిపోయినట్టు ఉంది. ఆ యింటిని గురించి ఎవరూ అట్టే శ్రద్ధపట్టడం లేదేమో అనిపించింది.

ఆ తోటలో సుమారు ఇరవై సంవత్సరాల తరుణి ఒకామె కూచుని అప్పుడే విచ్చిన గులాబీ పూలు దండ కడుతోంది. జుట్టు గులాబీరంగు రిబ్బనుతో కట్టుకుంది. ప్రక్కనే సుమారు పాతిక సంవత్సరాల యువకుడు కూర్చుని మాట్లాడుతూ, నవ్వుతూ ఉన్నాడు. ఆ యువతి బుగ్గలలో గులాబీపూలూ, కళ్ళలో సిగ్గుదొంతరలూ వెల్లి విరుస్తోంటే, ఆమె నవ్వుతో జవాబు చెపుతోంది. ఆమె తప్పక కళ్యాణే ! సందేహం లేదు. అదే శాంతి! అదే ఆనందం !

ఆ దృశ్యం చూసే నా మనస్సు సంతోషంతో నిండిపోయింది బండి కదలడం మొదలుపెట్టగానే నేను హఠాత్తుగా కిటికీలోంచి బయటికి చూస్తూ చెయ్యి ఊపి, "నమస్తే, నమస్తే, కళ్యాణీ !.. గుడ్ బై!" అన్నాను నవ్వుతూ.

ఆ యువతి విస్మయభరితాలైన పెద్ద పెద్ద కళ్ళు నా వైపు తిప్పింది. ఆ యువకుడు కూడా ఇటు తిరిగాడు ఒకరివైపు ఒకరు చూసుకుని వారిద్దరూ ఎందుకో విరగబడి నవ్వుకున్నారు. ఇద్దరూ జేబు రుమాళ్ళు విసిరి నాకు "గుడ్ బై" చెప్పారు. రైలు వెళ్ళిపోతూన్నా, నేను మాత్రం శాంతీ, ఆనందమూ మూర్తీభవించిన ఆ యువతీ యువకుల వైపే కిటికీలోంచి తొంగి తొంగి చూస్తూ నా సర్వవ్యథలూ మరిచిపోయాను. చాలా

దూరం వరకూ వాళ్ళ నవ్వు నా చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. వర్తకవ్యవహారభరితమైన నా మనస్సు కొంచెం సేపు స్వచ్ఛమైన ఆనందంతో నిండిపోయింది.

ఇంకా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. బెంగుళూరు, మద్రాసు, బొంబాయిల మధ్య ఎన్నో సార్లు నేను ప్రయాణం చేశాను. కాని, పగలెప్పుడూ ఆ స్టేషను తగిలే ప్రయాణాలు కావవి. ఎన్ని సార్లు వెళ్ళినా, రాత్రి చీకటిలోనో, నిద్రలోనో, రాత్రి రైళ్ళు అక్కడ ఆగకపోడం వలనో ఆ చిన్న స్టేషను దాటిపోయేది. ఎప్పుడో ఒక్కసారి అటువంటి అదృష్టం కలిగింది. అప్పటికి కళ్యాణిని తన ప్రియుని సమీపాన చూసి ఎన్ని సంవత్సరాలయిందో !.. పన్నెండో పదిహేనో బాగా జ్ఞాపకం లేదు.

ఈ మాటు రైలు ఆస్టేషను దగ్గర ఆగగానే కనుపించిన దృశ్యం ఆ నీలంగా ఉన్న యింటితోటలో ఒకచిన్న కుర్రాడు గడ్డిమీద దొర్లుతూ ఒక పెద్ద కుక్కతో, దాని తోక పట్టుకుని లాగి, చెవులకు 'కీ' పెట్టీ ఆడుకుంటున్నాడు. మధ్య మధ్య దాన్ని చూసి కిల కిలా నవ్వుతున్నాడు. అయితే నాకు కళ్యాణి ఒకసారి అయినా కనపడదా ? నాకు ఎంతో నిరాశ కలిగింది.. అంతలో ఆ కుర్రవాడు లేచి చప్పట్లు చరుస్తూ "అమ్మా, అమ్మా! రైలు వత్తింది!" అని అరిచాడు.

అప్పుడు మధ్యవయస్కురాలైన ఒకామె యింట్లోంచి బయటికి వచ్చింది. అదిగో ! కళ్యాణే ! కొంచెం లావయింది, కొంచెం నల్లబడింది. అయితేనేం ? ఆమె కళ్యాణే ! నేను వెంటనే గుర్తుపట్టాను. ఆమెను చూడగానే నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. వెంటనే నేనెంతో గౌరవంతో ఆమెకు నమస్కారం చేశాను. ఆమె కూడా నాకు నమస్కారం చేసింది కాని ముఖంలో విస్మయభావం కనపడింది... ఆమె యెప్పుడూ ఒక్కలాగే ఉంది... అదే సౌందర్యమూ, అదే సరళత్వమూ. బండి కదులుతోంది. నా రాకకు జ్ఞాపక చిహ్నంగా నేనొక కమలాఫలం తీసి బాలుని వైపు విసిరాను. అది గడ్డిమీద దొర్లి పోయింది. దాని వెనకే కుర్రాడూ, కుక్కా పరుగెత్తారు.

ఆ తరువాత నా జీవితంలో అనేక విచిత్రసంఘటనలు జరిగాయి. నేనొకసారి వ్యాపారరీత్యా రంగూను వెళ్ళి వస్తున్నాను. అప్పటికి యుద్ధం చాలా భయంకరంగా సాగుతోంది. దారిలో మా ఓడను జపాను వాళ్ళు కొట్టారు. నాకు సముద్రంలో మునగడమూ, ఒక రోజు ఈదడమూ జ్ఞాపకం ఉన్నాయి. ఎక్కడికో దూరప్రయాణం చేసినట్లు కొంచెం కలలాగ జ్ఞాపకం ఉంది చాలా బలహీనం అయిపోయాను. నాకు బాగా తెలిసే సరికి బొంబాయిలో నా స్నేహితుడైన ఒక వర్తకుని యింటిలో ఉన్నాను. సముద్రంలో కొట్టుకొని పోగా మిగిలిన కాగితాలలో అతని ఎడ్రసు చూసి అతనికి తెలుపగా, అతడు నన్ను తనయింటికి తీసికొని వెళ్ళి చికిత్స చేయించాడు. ఆ సమయంలో నాకానీలిమేడా, కళ్యాణీ జ్ఞాపకం వచ్చాయా అని నువ్వు అడగవచ్చు. మొట్టమొదట జ్ఞాపకం వచ్చినవే ఆవి. అప్పుడు నాలో నేనే "ఈ ప్రపంచంలో ఎన్నాళ్ళో ఎన్నో దేశాలు చూశావు. ఉన్నదానితో తృప్తిపడి ఒకచోట ఉంటే నీకీతిప్పలు వచ్చేవి కావు! నీ అపరిచిత మిత్రురాలైన కళ్యాణిలాగే సానందంగా జీవితం గడిపిఉందువే ! అదే శాంతి నీకూ దొరికి ఉండేదే! ఒక వేళ ఆ నీలిమేడలోనే నీకూ ఇంతచోటు దొరకి ఉండునేమో ! సుఖం అనేది నీ నుదుట వ్రాసిలేదు. ఏం చేస్తాము !" అనుకున్నాను. మృత్యుముఖంలో ఉన్న నన్ను అశాంతి ఆవరించి మరింత బాధపెట్టింది.

చివరికి ఎల్లాగో నా మిత్రుని దయవల్ల నా ప్రాణాలు నిలిచాయి. ఇంక పైన వర్తకం మాటే తల పెట్టకూడదనుకున్నాను.

నా జీవితంలో చివరిసారి బొంబాయి-మద్రాసు దారిలో ప్రయాణం చేస్తున్నాను. ఒక్కసారి కళ్యాణి కనపడి మాట్లాడితే ఎంత బాగుండును ! ఆమె శాంతి సందేశం నా జీవితంలో ఎంత సుఖాన్ని కలిగిస్తూ వచ్చిందో ఒక్కసారి నేను తెలియజేస్తే ఎంత బాగుండును ! రైలు రెండు నిముషాలకంటే ఏక్కువ ఆగదు. ఆ కాస్తలో అసలామె కనపడుతుందో లేదో!

స్టేషను వస్తుందనగానే బండిలోంచి తొంగి తొంగి చూడ్డం మొదలుపెట్టాను. ప్రొద్దుటి యెండలో ప్రకాశిస్తూన్న ఆ నీలిమేడను చూస్తే, నా జీవితమూ, సముద్రమూ, ఓడా అన్నీ జ్ఞాపకం వచ్చాయి. రెండిటికీ ఎంత తేడా.. ఆమె యింకా యిక్కడే, పూర్వం లాగే శాంతంగా, తృప్తిగా, ఆనందంగా జీవితం సాగిస్తూ ఉండి ఉంటుంది. రైలు అక్కడే, ఆయింటి ముందరే ఆగింది. వరండాలో ఒక వృద్ధురాలు జుట్టు విప్పుకుని కూర్చుని ఉంది. చుట్టూ చాలామంది పిల్లలు – మనుమలు కాబోలు ఆడుకుంటున్నారు. ఎంత సుఖం!

కళ్యాణి ! ఎవరూ ఆనవాలు పట్టలేరేమో ! నేను మాత్రం గుర్తించగలను... వెనుకటివన్నీ మనస్సులో నడిచాయి. అన్ని భిన్న రూపాలలోనూ ఒక్కటే అభిన్నత్వం.. ఆ నవ్వూ, ఆ శాంతీ !

నేను ఇంక ఈ వైపు రానే రాను. ఇదే తుదిసారి. ఎల్లా ఆమెతో మాట్లాడడం? అవకాశం లేదే ? ఏమనుకుంటుందో ? అనుకునేందుకు ఏముంది ? ఆ దివ్య రూపాన్ని యెప్పుడు యెల్లాగ చూశానో, భావించానో విపులంగా ఒక్కసారి ముందు పెడతాను. తుదిసారి సెలవు తీసుకునేందుకు వచ్చానని చెపితే ఏమనుకుంటుంది ?.. కాని టైము లేదే !...

ప్లాటు ఫారం అంతా గందరగోళంగా ఉంది. కనుక్కుంటే ఇంజన్ చెడిపోయిందనీ, గంటవరకూ కదలదనీ తెలిసింది. భగవంతునికి కృతజ్ఞతతో ఒక్కసారి నమస్కరించాను. నీలిమేడ వైపు కాళ్ళు నడిచాయి. కానీ వణుకుతున్నాయి. ఎల్లాగో ఆ గేటు ముందర నిలబడ్డాను.

బంట్రోతు వచ్చి “ఎవరికోసం అయ్యగారూ ?” అని అడిగాడు.

“అక్కడ కూర్చున్న ఆ వృద్ధురాలితో మాట్లాడాలి” అన్నాను.

“లోపలికి దయచెయ్యండి. అమ్మగారితో చెప్పుతాన”ని బంట్రోతు వెళ్ళిపోయాడు. నా గుండెలు అతిత్వరగా కొట్టుకుంటున్నాయి.

ఆమె వచ్చింది. ఇన్నాళ్ళయిపోయినా, ఇన్ని మాటలు మాట్లాడాలనుకున్నా, నేను ఒక్కటీ అనలేక పోయాను.

ఆమెయే నన్ను పలకరించి “తమరిల్లాగ మా యిల్లు పవిత్రం చేసిన కారణం...” అంది.

“మీరు నన్ను గుర్తుపట్టలేదా ?” అన్నాను.

“తమరెప్పుడూ__” అంది.

“నేను మిమ్మల్ని చాలా రోజులనుంచీ బాగా యెరుగుదును. జ్ఞాపకం తెచ్చుకోండి. చిన్నప్పుడు ఒకసారి మిమ్మల్ని ఇక్కడే బంతి ఆడుతోంటే చూశాను. తరువాత మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది.. ఆ రైలు కిటికీలోంచి మీకు నమస్కారం చేశాను. అప్పటికి మీ వివాహం అయి ఉంటుంది. తరువాత మీ అబ్బాయికి కమలాఫలం...”

వృద్ధస్త్రీ నా వైపు భయంతో చూస్తోంది. నేను తాగివచ్చాననుకుందో యేమో ! కాని నా వేషభాషలూ, నా వేళ్ళ రత్నాల ఉంగరాలూ చూసి కొంచెం సమాధానపడి, “తమరు పొరపాటు పడుతున్నారండి. మేమీ యింట్లోకి వచ్చి ఒక్క సంవత్సరం మాత్రం అయింది” అంది.

నా గుండె జారిపోయింది. “అయితే మీ పేరు కళ్యాణి కాదా?” అన్నాను.

“ఆ పేరు గలవారెవరూ మా యింట్లోనే లేరండి!” అని ఆమె లోపలికి వెళ్ళాలనుకుంటోన్నట్టు చూసింది.

నాకు ఏదో కలగంటోన్నట్టు తోచింది. లేచి, “క్షమించండి, పొరపాటు పడ్డాను. అయితే, మీకు పూర్వం ఈ యింట్లో యెవరుండేవారు ?” అని అడిగాను.

“మాకు ముందా ?... ఒక ముసలాయన ఉండేవాడు చిన్నప్పటినుండీ పెళ్ళి చేసుకోలేదు... అయినా, ఆయన చనిపోయి ఐదేళ్ళు అయింది. ఆ తరువాత మేం వచ్చేవరకూ ఇల్లు కాళీగా ఉంది”...

నేను లేచివచ్చేశాను. నా వెనకాల ఆమె భయపడుతూ భయపడుతూ వచ్చి తోట చిన్నగేటు వేసి వెళ్ళిపోయింది.

నా తల తిరిగిపోయింది. గుండెమీద ఏదో పెద్ద బరువు పెట్టినట్టు అయింది. ఇందులో ఏదో పెద్ద పొరపాటు ఉండి ఉంటుంది. అదేమిటో కనుక్కునే వరకూ నాకు శాంతి ఉండదు.

స్టేషనుకు వెళ్ళి, స్టేషను మాష్టర్ని అడిగాను అతనికేమీ తెలీదన్నాడు. చాలాకాలంనుంచీ ఆ నీలిమేడకు ఎదురుగానే ఉన్న ముసలివాణ్ణి అడిగితే తెలుస్తుందన్నాడు.

ముసలివాడు వచ్చాడు. ఎన్నివిధాల ప్రయత్నించినా అతనికి జ్ఞాపకం రాలేదు.

“పది పదిహేనేళ్ళ క్రితం నేనామెను చూశాను. ఒక చిన్న కుర్రాడూ ఒక పెద్ద కుక్కా... బాగా జ్ఞాపకం ఉన్నాయి.”

“ఉండండి, ఉండండి, పెద్దకుక్కా ?.. అవును... కాని ఆమె పేరు కళ్యాణి కాదే ? సరస్వతి. నాకు తెలుసు.”

నాకు పిచ్చెత్తిపోతోంది.

“అయినా ఉండండి. మా ముసలిదానికేమైనా తెలుస్తుందేమో ?” అన్నాడు వృద్ధుడు. ముసలిది వచ్చింది. చూడగానే చాలా తెలివైనదనీ, మంచి జ్ఞాపకశక్తి కలది అనీ తోస్తుంది. ముసలివాడు ఆమెకు ఒక్కొక్క విషయమే చెపుతూ వచ్చాడు.

“ఓహో ! ఆ యువతి.. నాకు తెలుసును. ఆమె పేరు జమునాబాయి. కొంచెం పొడుగ్గా ఉండేది. ఎప్పుడూ జుట్టు రిబ్బనుతో కట్టుకునేది. ఇక్కడే ఒక వర్తకుని కొడుక్కి ఇచ్చారు. పాపం, అతనితో చాలా బాధలు పడింది. చివరికి వదిలి పెట్టేశాడు కూడా. చాలా...”

నేను వెళ్ళివస్తానని చెప్పబోయాను. రైలు ఇంకొక పావుగంటలో కదులుతుంది.

“నాకు బాగా జ్ఞాపకం ఉంది. భ్రమా కాదు, ఏమీ కాదు. చిన్న పిల్లప్పుడు చూశాను. ఇప్పుడు కూడా నాకళ్ళకు కట్టినట్టుంది. ఇంకా వసంతలక్ష్మి లాగ, సీతాకోక చిలుక లాగ, నా కళ్ళ యెదుట ఆడుతోన్నట్టే ఉంటుంది. పేరుకు తగినట్టే ఆమె నిజంగా కళ్యాణే!” అంటూ వృద్ధుని వైపు తిరిగి, “నాకు బాగా గుర్తుంది” అంటున్నాను.

వృద్ధురాలు “ఆ మాట ముందే చెప్పకపోయారా మరి ? ముందు ఒక పిల్లల తల్లిని గురించి చెప్పారు. తరువాత యువతి విషయం అడిగారు. ఇప్పుడొక బాలికను గురించి మాట్లడుతున్నారు. బాలిక అయితే నాకు బాగా తెలుసును.. కళ్యాణి ! అవును. అదే దాని పేరు... ఎప్పటిమాట ! నలభై సంవత్సరాలవుతుంది... ముద్దులు మూటకట్టినట్టుండేది పాపం. వాళ్లు మాకు కొంచెం బంధువులే. పదేళ్ళయినా నిండక ముందే చచ్చిపోయింది అది !” అని వృద్ధురాలు కళ్ళు తుడుచుకుంది. ఇంక నేనక్కడ నిలవలేకపోయాను.

... పదేళ్ళ వయసులో,... అంటే నేను చూసిన కొద్దిరోజులకే. నేను మాత్రం నలభై సంవత్సరాలనుంచీ ఆ బాలికను గురించి కలలుగంటూ, ఆమెనే మనస్సులో వెతుక్కుంటో ఉన్నాను.. కళ్యాణి!

★ ★ ★

మా మామయ్య ఇంక మాట్లడలేకపోయాడు. నాకూ కళ్లలో నీళ్ళు తిరిగాయి.

సుశీల ఆ “వీక్లీ” లో బొమ్మలన్నీ కత్తిరించి తన పుస్తకాల అలమారుకు అతికించింది. అది చూసినప్పుడల్లా నీలిమేడ నాకళ్ళకు కట్టినట్టు జ్ఞాపకం వస్తో ఉంటుంది.

★★★

# సాక్షి

- ముళ్ళపూడి వెంకటరమణ

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక – అక్టోబర్10, 1959 సంచిక నుంచి)



రెండు ఝాముల పొద్దు తిరిగింది. ఊరు భుక్తాయాసంతో మాగన్నుగా వుంది. జోరీగల జోడొకటి మునసబుగారి లోగిలి వీధరుగుమీద స్తంభం చుట్టూ తిరుగుతూ ఊరు నిశ్శబ్దంగా ఉందని జోకొడుతుంది. అరుగు పక్క నీడలో మగతగా పడున్న ఊరకుక్క, మీది మీదికి జరిగిపడుతున్న ఎండవేపు చిరాగ్గా చూసి ఇంకాస్త వారకి సర్దుకుంది. నెత్తిమీద జోరీగల రొదకి ఛీదరించుకుంది. ఎదురుగా నాలుగిళ్ళ కావల తెలిగలవారింట గానుగ కిఱ్ఱుమని నిరంతరంగా నిశ్శబ్దానికి నేపథ్య గీతం పాడుతోంది. వీధరుగు మీద పడక్కుర్చీలో మేను వాల్చిన మునసబుగారు వార్తాపత్రికను పడేసి కన్నులరమూసి చింతాలు ఖూనీకేసు గురించి లీలగా ఆలోచిస్తూ సన్నగా గుర్రు పెడుతున్నారు.

★ ★ ★

చుక్క వొగురుస్తూ తూలిపడబోతూ తిట్టుకుంటూ పరిగెడుతోంది. గుర్రు పెడుతున్న మధ్యాహ్నం మీద చుక్క కాలికడియాలూ

గొలుసులూ టక్ టక్ మని కొట్టుకుంటూ ఉండుండి ఘల్లుమంటున్నాయి. “నా దేవుడోయ్...” అని గొణుక్కుంది చుక్క... “నా దేవుడోయ్! నా కొంపదీశావురోయ్. సందేళకి నివ్వింక నేవురోయ్ నాయనోయ్..” అంటోంది. మాట మాటకీ వొగురుస్తోంది. శాస్త్రుల వారి వాకిలి ముందర నిలిచిపోతూ జుట్టెగదోసుకునే సరికి చుక్క చేతి గాజులమలారం గలగల మంది. వామన గుంటలాడుకుంటున్న బామ్మ గారూ, సీతా “చుక్కా..” అన్నారు.

చుక్క పరిగెడుతోంది. “నాయనోయ్ నాకొంప దీశావురోయ్...”

“ఏం కొంపలంటుకున్నా యేవిషి చెప్మా!?” అని బామ్మగారు చుక్క పరిగెత్తిన వైపు చూసింది.

★ ★ ★

మగతనిద్రలో ఉన్న మునసబుగారికి చింతాలు కేసులో తలుపుల్నురిదీయబోతున్నట్టు కలొచ్చింది. సంకెళ్ళ చప్పుడు గూడా వినబడినట్టయి గతుక్కుమని కళ్ళు దెరిచారు. వీధిలో చుక్క పరిగెడుతోంది. మధ్యాహ్నపు నిశ్శబ్దం మీద చుక్క కాళ్ళ కడియాలు గొలుసులూ గళ్ళు గళ్ళు మంటున్నాయి చుక్క సుడిగాలిలా పరిగెడుతోంది. శివాలెత్తినట్టు ఊగిపోతోంది.

“ఏవిటే చుక్కా?” అన్నారు మునసబు గారు.

“నాయనోయ్ నా కొంప ముంచాడయ్యోయ్.” అంది చుక్క అని వెనకి తిరక్కుండానే పరుగు సాగించింది కాలవొడ్డువేపుకి.

సుడిగాలి వెనకాల ఆకలముల్లా వస్తున్నాడు చుక్క తమ్ముడు. చింపిరిజుట్టు, బాన బొజ్జా ఎగరేసుకుంటూ. చిన్న చిన్న అంగలతో అడుగులేస్తూ.

“ఈరిగా ఇలా. ఆగు. చుక్కేవిటిలా పరిగెడు...”

“పకీర్నొగ్గేశారంటండీ పోలీసోళ్ళు. ఆడు మూడు గంట్ల కారుకొచ్చెత్తన్నాడు. తలుపులు మావని సంపేత్తాడంటండి.” అని ఏడుస్తూ పరిగెత్తాడు ఈరిగాడు అక్క, చుక్కవెనక. మునసబు గారు పూర్తిగా మేలుకున్నారు. పిల్లాడి మాట పూర్తిగా బుర్రలో నాటుకునే వరకూ ఆయన అయోమయ స్థితిలో పడిపోయారు.

ఫకీర్నెవరొగ్గేశారు ? ఎలా ఒగ్గేశారు ? కేసు పూర్తికాందే ఇది ఎలా జరిగింది ? పకీరుగాడు ఊళ్ళో వచ్చిపడితే ఈ సారి ఊరు వల్లకాడవడం ఖాయం. అందరికన్న ముందు తలుపుల్ని కాలికిందేసి నల్లిని నలిపినట్టు నలిపేస్తాడు వాడు. కండకండలుగా తరిగి కాకులకీ, గెద్దలకీ ఎగరేస్తాడు. రెండేళ్ళక్రితం సంకురాత్రి పండగలికి కోడిపందాల్లో ఓడినందుకు ఉక్కురోషం వేసుకొచ్చి చూస్తువుండగా నరసయ్యని అట్టే పీక నులిమి చంపేశాడు. అంతా అట్టే గుడ్లప్పగించి నిలబడిపోయారు. ఒక్కడికీ అదేమనడానికి దమ్ములు చాలకపాయే, సాక్ష్యానికి మనుష్యుల్ని పోగేసుకు రాబోయేసరికి ప్రాణం సాలొచ్చింది.

పకీరుగాడు పరమ కిరాతకుడు.

“బాబోయ్ కొంపలు మునిగినయ్యండి” అంటూ వచ్చాడు ముత్యాలు.

“పకీర్నొగ్గేశారంటగా, తలుపులెదవ ఒణుకుతో సచ్చేట్టున్నాడండి. ఏందారి?” అన్నాడు.

మునసబుగారు గయ్ మన్నారు ఒక్కసారి.

“ఏవుంది. ఒకటేదారి... అసలాణ్ణి సాక్షానికెళ్ళమన్నదెవడంట. యదవలు. ఒక్కడు ముందర చెప్పినట్టి నడు; ఆ మాత్రం మగసిరి ఇంకోడికి లేదనే బయల్దేరాడేం యదవ. ఇప్పుడేడిచేం లాభం?” అన్నారాయన.

ముత్యాలు మాటాడలేదు. తలొంచుకు నిలబడ్డాడు.

మునసబుగారు కండువా బుజానేసుకుని కరణంగారింటికి బయల్దేరారు. “నరిసిరెడ్డినికేకేసుకురా. కరణం గారింటికాడుంటానన్జెప్పు” అన్నారు.

“ఆరక్కడే వున్నారండి” అన్నాడు ముత్యాలు.

ముత్యాలమ్మ గుడిమలుపులోనే శివాలు వినిపించాయి మునసబుగారికి. ఇంకో అడుగేసేవరకూ గుడిదగ్గర గణాచారి ఉగ్రంగా ఊగిపోతోంది. తలుపులు నేలబారుగా సాగిలబడి దండాలెడుతున్నాడు. చుక్క చతికిలబడి, నెత్తికొట్టుకుంటూ శోకన్నాలెడుతోంది.

తలుపులు పెద్దపెళ్ళాం సావాలు ధైర్యం చిక్కబట్టుకు గణాచారిని ప్రశ్నడుగుతోంది. మునసబు గారు ఆగదల్చుకోలేదు కాని, అంతకితం వరకూ గణాచారి గాబోలు బాగుచేస్తున్న కందుల్ని కాకులు దినిపోతుంటే, “హుష్ కాకీ!” అన్నాడు.

సాగిలపడున్న తలుపులు తలిటు దిప్పి చూసి, బారుమని ఏడుస్తూ మునసబుగారి కాళ్ళు చుట్టేసుకున్నాడు.

"నాన్నగారోయ్ నను సంపేత్తాడండోయ్. ఆడొచ్చేత్తన్నాడండోయ్" అని భోరున ఏడవసాగాడు. "మావోయ్.." అని చుక్క బావురుమంది. గణాచారి ప్రశ్న చెబుతూనే ఉంది...

మునసబుగిరీ కొచ్చాక నాయుడుగారు చాలా చూశాడు ఇలాటి సందర్భాలు. బడితెల్లాంటి మొగవీరులు బావురుమని ఏడవటం ఆయనకొత్తగాదు. గాని తలుపులు ఎన్నడూ ఏడవగా ఆయన చూళ్ళేదు. సన్నగా బక్కపలచగా పొట్టిగా ఉన్నా, పదితినే సత్తా లేకున్నావాడు ఎన్నడూ జంకూ ఝుడుపూ ఎరగడు. దేనికేనా ఎగబడేరకం. ఎదుర్దెబ్బ తినక అలా మిడిసిపడుతున్నాడని అనుకుంటూ వచ్చాడు మునసబుగారు. తలుపులలా కంట తడిబెడితే ప్రాణం బేజారైపోయింది మునసబుగారికి. కంఠం బిగించుకుపోయింది. అందుకనాయన మాటాడకుండానే తలూపి కరణంగారింటివేపు బయల్దేరి వెళ్ళాడు.

సావిట్లో అంతా సందడిగా ఉంది. కరణంగారూ, వారి పట్నపల్లుడూ, ప్రెసిడెంటు నర్సిరెడ్డి, ఇంకిద్దరు మెంబర్లు, జనాభా లెక్కలు రాసుకోడానికొచ్చిన ఓ దొరటోపీ మనిషీ రెండుభాషల్లో మూకుమ్మడిగా ఏకటాకీన ఖూనీ కథలూ బ్రెమ్మరాతా కర్మ సిద్ధాంతం, ఆబాపతు వేదాంతం వాళ్ళ చిన్న నాటి ముచ్చట్లు, నేతిబీరకాయలో నెయ్యి ఉండని వైనం, అమెరికాలో గాంగ్ స్టర్లు ఖూనీలు చేసే శిల్పం(అల్లుగారిది), ఫకీరుగాడి పుట్టు పూర్వాలూ, తలుపులుగాడి రెండో పెళ్ళాం చుక్కకీ మధురశిల్పాలలో అచ్చరలకీ కొట్టొచ్చినట్టు కనబడే పోలికలు (ఎవరో తెలీదు) ఖూనీలు కామాపుజేసే వాళ్ళ కథలూ చెప్పుకుంటూ, హఠాత్తుగా దయచెయ్యండి అన్న ఒకమాటని మాత్రం ఏకగ్రీవంగా అన్నారు.

తరవాత, జరిగిన కథను సమీక్షించి కర్తవ్యం గురించి నిశ్శబ్దం తీవ్రంగా ఉపన్యసించింది.

కరణం గారు గొంతు సవరించుకున్నారు. ప్రెసిడెంటుగారు అనుకరించారు.

"అసలు వాణ్ణెలా వదిలేశారూ అంట?" అన్నారు మునసబుగారు.

"మరే కేసు పూర్తిగాందే.. అసలూ?" అన్నారు కరణంగారు.

"పారిపోయుండాల" అన్నారు ప్రెసిడెంటు గారు.

"ఇంఫాసిబుల్" అన్నాడు దొర టోపీ ఆయన.

కరణం గారి అల్లుడు సాహసించి కలగజేసుకున్నాడు." వైనాట్. అమెరికాలో జైళ్ళలాటి వాటినే తప్పించుకుంటారు, అక్కడ__"

ప్రెసిడెంటు గారి చూపు చూసి ఆగిపోయాడు కరణంగారల్లుడు.

"నే సెలవు దీసుకొంటానండీ" అన్నాడు దొరటోపీ ఆయన.

"తలుపులు గాడి పాణానికి ముప్పే" అన్నాడు ముత్యాలు.

"వాడి పెళ్ళాం ఒకటే ఏడుపు పాపం. కట్టుకుని ఆర్నెల్లు కూడా తిరగలేదింకా" అన్నాడు ఏదో పెద్ద ఆర్నెల్లు తిరిగితే ఫరవాలేదన్నట్టు.

"సార్ జనాభా లెక్కల్లో జనసంఖ్య ఎంత రాసుగున్నారో గాని, ఒకటి తగ్గించి ఖర్చు రాయొచ్చు" అన్నాడు అల్లుడుగారు విట్టీగా అని చుట్టూ చూసి నవ్వబోయి కొయ్యబారి పోయాడు.

"బాబూ కాఫీ అయినట్టుంది. ఇంటో పిలుస్తున్నట్టున్నారు చూడు" అన్నారు కరణం గారు బాధగా.

★ ★ ★

ప్రెసిడెంటు గారు జనాభాలెక్కలాయన్తో మాటాడుతూ సాగనంపబోయారు.

మిగతా వాళ్ళు ఆలోచనలో పడిపోయారు. పకీరు మూడుగంటల మెయిలు కారుకి దిగుతాడన్న వార్త అందరికీ తెలుసు. ఏలూరు బెజవాడ కారులా టైము పరిగెడుతోందనీ తెలుసు.

ఐదు నిముషాలయేసరికి చుక్కా, తలుపులూ వచ్చారు.

"నాన్నగారోయ్ నాకేం దారి చెప్పండ"న్నాడు తలుపులు ఏడుస్తూ.

ఏ నాన్నగారూ ఏ దారీ చెప్పలేదు.

“అసలు నీకెందుకురా గోల, నువ్వెందుకు సాక్ష్యమిచ్చావు? పకీరుతో చెలగాటవేవిటి. అదీ ఖూనీ కేసులో ! మాకామాత్రం దమ్ములేకనే!? “ _ అన్నారు కరణంగారు.

“సర్లెండి అదంతా ఎందుకిప్పుడు. ఆడి మొఖానలా రాసిపడేసుంది గావాల. కుదురుగా ఇంటికాడెలాగుండగల్డా.. “ అన్నారు మునసబుగారు.

ఊళ్ళో యిందరున్నారు జెమాజెట్టీల్లాంటవాళ్ళు. ఇందరు కలిసి పట్టపగలు ఒక్క పకీరుగాడికి అడ్డపళ్ళేరా అనిపించింది ఎవరిమటుకు వాళ్ళకి. ఆమాటే చుక్క పైకి అనేసింది.

“అవున్నాన్న గోరు. ఆడురాగానే బెడిత్తిరగేసీ__“ అన్నాడు తలుపులు.

“ఛస్ నువ్వూర్కో ఇలాటెదవాలోచన్లు జేసే ఇంతకి దెచ్చుకున్నావు“ అన్నారు మునసబు గారు.

మునసబుగారి మనసు ఆయనకన్న ముత్యాలుకు బాగా తెలుసు ఇలాటి సమయాల్లో అతనే టికా తాత్పర్యాలు భాష్యాలు చెబుతాడు. ఇపుడూ నమ్మినబంటుగా ఆ పని చేశాడు. పకీరుది పాముపగ అని వెల్లడించాడు. పాముతో చెలగాటాలు మంచివి కావన్నాడు. పకీరుగాడు ఇవాళ నలుగురడ్డుపడితే తగ్గినా ఆనక నలుగురి పనీ విడివిడిగా పడతాడు. పొరుగూరెళ్ళి అక్కడి వాళ్ళని చావదన్నీ, చంపీ రాగల మొనగాడికి పలుకుబడి ఎంతుండాలీ?...

★ ★ ★

“మరిపుడేటిచేదారి ఏటిదారీ? “ అన్నాడు తలుపులు.

“దారికేటుంది. ఎవడిదారాడిదే. నన్నడిగితే ఆడలా మెయిలు కారు దిగేతలికి నువ్విట్నించిలా పొలాలకడ్డబడి పో. లేదా పడవెక్కి పట్నానికెళ్ళిపో. ఆనాక మేవంతా ఆడికి నచ్చచెబుతాం. సల్లబడ్డాక మెల్లంగ రావచ్చు. “ అన్నాడు ముత్యాలు.

“వాడు శాంతించకపోతే అదే పాయని, పట్నంలోనే స్థిరపడిపోవచ్చున“ని సలహా చెప్పారు కరణంగారు. “పట్నంలో లాండ్రి పెడితే సుబ్బరంగా నెలకొంద రూపాయలు కళ్ళచూసి మారాజులాగుండచ్చున“ని కూడా ఆశపెట్టారు.

తలుపులికి మనసు కొద్దిగా స్థిమిత పడుతోంది. కొంచెం కుడి ఎడమా ఆలోచిస్తున్నాడు. ముత్యాల్లాంటి వాళ్ళిద్దరు తనకెడాపెడా నిలబడి, కర్నం మున్సబులూ పంచాయితీ ప్రెసిడెంటూ వెనక నిలబడితే చాలు. పకీరుగాడికి దర్జాగా ఎదరపడవచ్చు.

“ఎటేస్ వల్లకుండావు. ఎల్ల దల్చుకుంటే బేగీలగెత్తు“ అన్నాడు ముత్యాలు తమాషాగా చుక్కవంక చూసి నవ్వి. తలుపులు చుక్కవంక చూశాడు. తలకొట్టేసినట్టయింది.

“బతికుంటే బలుసాకేరుకు దినొచ్చన్నా“రు కరణంగారు.

“అవును మావా“ అంది చుక్క కళ్ళు చెంగుతో వొత్తుకుంటూ.

తలుపులు చుట్టూ చూసి “ఎదవనాయాళ్ళు. యదవకళ్ళేదవ నోళ్ళు“ అనుకున్నాడు.

“మంత్రాలు సతుకుతున్నావా. పకీరు గాడు జడిసేరకం కాదు“ అన్నాడు ముత్యాలు.

“నువ్వలాగుండేస్“ అన్నాడు తలుపులు చిరాగ్గా.

“ఓరబ్బో. కోపం వచ్చింది దొరగోరికి ఆడొచ్చి మక్కెలిరగదంతే దిక్కెలేదుగాని నేను మాటంటే గుబులేం. “

“మావా నివ్వలాగూరుకో ఆడితో నీకేటి. నాన్నగారేం జేయమన్నారూ, నివ్వేటిసెయ్యాలా అచ్చాదు ముంగల“ అంది చుక్క.

కరణం గారు మునసబుగారు ఒక్క మారే బరువుగా నిట్టూర్చారు. అనిందికేముంది గనక, పకీరు పరమ దుర్మార్గుడు. అన్నిటికీ తెగించినవాడు. వాడికి అడ్డపడిందికి ఆలుబిడ్డలున్నవాడేవడూ ముందుకు రాడు. అంచేత తలుపులు, ప్రాణాలమీద ఆశవుంటే తక్షణం వెళ్ళిపోడం మంచిదని వారభిప్రాయపడ్డారు.

తలుపులు మరోసారి ఆలోచించుకున్నా ఊరొదిలి పోబుద్ధికాలేదు. ప్రాణభయం ఎంత పీకుతున్నా కొంపా గోడూ వదులుకుని పారిపోడం వాడికి అవమానంగా తోచింది. పకీరు గాడు తల్చుకుంటే ఎక్కడున్నా తరుముకు రాగలడు. తప్పకుండా తల్చుకుంటాడు కూడా.

“నా బాబు, నా బాబు బాబు ఈడనే పుట్టి ఈణ్ణే మట్టిలో గలిశారు. నేనెందుకు పోవాల నేనేం కూనీల్జేశానా? “ అన్నాడు.

కరణం గారు నవ్వారు. "ఇదెప్పట్నించిరోయ్ దేశభక్తి. ప్రాణమ్మీదికి ముంచుకొస్తూవుంటే ఈ వేదాంతం ఏమిటి. నీబాబూ ఆడి బాబూ ఖూనీకేసుల్లో సాక్షాలిచ్చి పీకెలమీదికి _ _"

"ఎవరదీ? " అన్నారు మునసబుగారు వాకిట్లో కొచ్చిన మనిషిని చూసి.

"నేనండి ఎఱ్ఱెంకన్నని. తలుపులుగాడింకా ఈణ్ణే ఉన్నాడాండీ, అయిబాబో! పకీర్నొగ్గేశారండి. ఆడొచ్చి సంపేత్తాడండియ్యాల... ఊరంతా : "

"అదేనోయ్, పారిపొమ్మంటే అవునుగాని నీకెవరు జెప్తారిది. వదల్దం నిజమేనా అని. "

"ఎవరేటండి దాన్నడగండి. ఆ చుక్కకే తెల్సు. ఇందాక పన్నిండుగంట్ల కారుకి డైవోరు రెడ్నాయుడే సెప్పాడంటండి. "

"అదే మేం వూరొదిలి పొమ్మంటున్నాం. వాడు శాంతించాకా... "

"ఇంకేడికి పోతాడండి. కబురపుడే అందరికీ తెల్సిపోయింది. ఆడి మనుసులు ఈడు వూరొదిలిపోకుండా కాలవకాడ తోపుకాడ వుంతినకాడా కాపేశారంటండి. ఆడు మూడుగంటల కారుకొచ్చేత్తన్నాడంట. "

"నాయనోయ్" అంటూ చుక్క ఏడుపు లంకించుకుంది. చూస్తుండగానే తలుపులికీ ముచ్చెమటలు పోసేశాయి. గజ గజ వణికి పోయాడు. రెండు చేతుల్తో తలపట్టుకు కూలబడిపోయాడు. కళ్ళు తిరిగిపోయాయి.

"నా తల్లి ముత్తేలమ్మో" అంటూ చుక్క వొళ్ళోకి ఒరిగిపోయాడు.

★ ★ ★

"అయితే ఏం చేదాం? " అన్నారు కరణం గారు.

మునసబు గారు మాట్లాడలేదు.

"చేసేదేముంది, ఎవడిఖర్మ కెవరు కర్తలు. అటు కోరటు వాళ్ళలా మంచీ చెడ్డా లేకుండా ఖూనీకోర్లని దేశం మీద కొదిలేస్తుంటే చేసేదేవుంది? " అన్నారాయనే మళ్ళీ.

మునసబుగారు గొంతు సవరించుకొన్నారు. "చిన్నా పెద్దా మనమంతా కల్సి ఆదూళ్ళో దిగ్గానే అడ్డంపడితే.? ". అన్నారు.

కరణం గారు తల తాటించారు. "మీరేమన్నా అనుకోండన్నగారూ, నాకా సాహసం లేదు. కొంప దుంపనాశనం చేసుకోదలిస్తే తప్ప _ "

మునసబు గారు ముత్యాలు కేసి చూశారు.

"అవును బాబూ ఆడిది పాంపగ. తెగించినోడు. ఆడేదో అగాయిత్తెం జేశాక ఆణ్ణి మళ్ళా జైల్లో యేసేం, సంపేం లాబం. ఈ యెదవ సేసిన తప్పుకి మనవా కాసుకోడం. మనకొద్దు బాబూ, అసలాడి సేతికింద మణుసులెలాటెలాటో మీకు తెల్దు. వత్తా బాబూ పనుంది. " అంటూ ముత్యాలు విసవిస నడిచి వెళ్ళిపోయాడు.

"వత్తాను బాబో దండాలు" అంటూ వెఱ్ఱెంకన్న కూడా వెళ్ళిపోయాడు.

"దారుణం, ఇది ఊరో అడివో నాకు తెలీటం లేదు. ఇందరం ఉండి ఒక్కడి ప్రాణానికి అడ్డు పళ్ళేకున్నాం. " అన్నారు మునసబు గారు లేస్తూ.

"ఏం చేస్తాం... పోనీ పోలీసు ఠాణాకి కబురంపండి మనిషి నిచ్చి... వస్తా. అల్లుడూ అమ్మాయి సినిమాకోయ్ అని గోలబెడుతున్నారు. మాయాబజారుట... మీరూ వస్తారా? " అన్నారు కరణం గారు.

"రాను.. " అంటూ వెళ్ళిపోయారు మునసబు గారు. సందు మలుపు దిరిగాక కండువాతో కళ్ళొత్తుకుని ఇల్లు చేరి పడక్కుర్చీలో కూలబడ్డారు.

కరణం గారు, చుక్కకి ధైర్యం జెప్పారు తలుపులికి స్పృహే వున్నట్టు లేదు.

"రాగానే మీ సవుతులిద్దరు వాడి కాళ్ళమీద పడండి. అంతకన్న మార్గం తోచట్లేదు" అన్నారాయన.

★ ★ ★

చుక్క, తలుపుల్ని లేవదీసి నెమ్మదిగా ఇంటికి బయల్దేరింది. నెత్తిన ఎండ పేలిపోతోంది. కష్టకాలంలో దురదృష్టంలా వడగాడుపు బలంగా దెబ్బమీద దెబ్బ కొడుతోంది.

తలుపులికి ఒళ్ళు మసిలిపోతోంది. కళ్ళు మూసుకునే చుక్కనానుకు నడుస్తున్నాడు చుక్కకి పెదిమలు తడారిపోయాయి. గొంతు మండిపోయింది. అమ్మవారి గుడిదగ్గర ఆగి, " గండం గడిచి తెల్లారితే ఉపారాలెత్తుతాను తల్లీ పెట్ట నేయిత్తానమ్మా" అని దండమెట్టుకుంది.

★ ★ ★

ఇల్లు చేరి గుమ్మంలో అడుగెడుతుండగా, "ఆడు తొడిగింది కరణం గారి కమీజంట గాదూ, ఎందుకన్నా మంచిది ఇప్పించేసేయ్" అని చెప్పి వెళ్ళిపోయాడు కరణం గారింటి పాలేరు.

"థూ.. " అని ఉమ్మేసింది చుక్క. లోపల సవితి చామాలు పడుకుని ఉంది. అంపకం పాలతో జ్వరం వచ్చేసింది సావాలుకు. కలవరింతలు, కేకలు, చుక్కకి దుఃఖం పొంగి వచ్చేసింది. తలుపుల్ని మంచాన పడుకోబెట్టి దుప్పటి కప్పింది. సావాలు కణతలంటి చూసింది.

"నా కొంప ముంచాడే నాయనో" అంటూ గొల్లుమంది సావాలు. "ఏం సేత్తాం అన్నిటికా సల్లన్తల్లుండాది. ఈ గండం గడిత్తే రేపుపారాలెత్తించి పెట్టనేద్దాం. నువ్వు కూడా మొక్కుకో" అంది చుక్క.

"మల్లిద్దర వెందుకులే" అంది సావాలు.

"నీ జిమ్మడ బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు" అంది చుక్క.

★ ★ ★

తలుపులికి గంజినీళ్ళు పోసి, గుడిసివతిలికొచ్చింది చుక్క.

"మూడు గంటల కారొచ్చుండాలి. ఆడీ పాటికి దిగుండాలి. నా తల్లో! నివ్వే దిక్కు" అనుకుంటూ నించుంది.

పకీరొస్తే ఎందుకేనా వుంటుందని రెండు బడితెలూ ఓ పెద్దగెడా రెండు కొరకంచులూ తీసి ఓ పక్కన అట్టే పెట్టింది.

చుక్క తమ్ముడు పరుగున వచ్చి "అక్కా అక్కా కారొచ్చేసింది గాని ఆడురానేదు. నాను చూశా నాను చూశా, కిళ్ళీ బడ్డీ రంగన్నక్కూడా ఒకిటే ఆచ్చిరం ! పకీరు గాడు రానేదని అన్నాడు. "

చుక్క ఒక్క లగువున లోపలికెళ్ళింది. " ఆడురానేదు మావో. ఆడు రానేదు. అంతా అబద్దం. " అంటూ తలుపుల్ని కావలించుకుంది.

తలుపులు, మెల్లిగా కళ్ళు తెరిచి" ఆ ? " అన్నాడు.

"గండం గడిచింది మావా ఆడు రాలేదు. మద్దినేళ డైవోరు పరాసికం ఆడుండాల యదవ సచ్చినోడు మల్లీపాౖలానీ సెప్తా, అంది. "

తలుపులు అమాంతం చుక్కని గాఢంగా కౌగిలించుకున్నాడు. తలుపులు కళ్ళంట జొటజొట కన్నీళ్ళు కారాయి. జ్వరం దిగిపోయింది.

"ఎందుకన్న మంచిదిగాని, మావా, ఇపుడే నావకెల్లి, పట్నంలో పోలీసోళ్ళకి సెప్పరాదా సింతాలు ఖూనీకేసులో పకీరుగాడికి జేలు కాయమయేదాకా ఈడకాపలా వుండాలనీ" అంది చుక్క.

తలుపులు చుక్కని దగ్గిరకి తీసుకుని వీపుతట్టాడు. జుట్టు సరిచేశాడు. "ఎర్రిమొకవా మనకోసం పోలీసాళ్ళొత్తార్లే యెర్రిమొకవాని మొకం చూడు. " అన్నాడు. అంటూనే చుక్క మొహం చూశాడు. "ఎంత సక్కని మొకం. కళ్ళుబ్బిపోనాయిగాని, పాపం యంతేడిశావో నాకోసం" అన్నాడు.

"సర్లే బాగుండాయి సరసాలు. కాత్తుంటే ఆడొచ్చి ఈప్మీన రేవెట్టుండేవోడే గందా" అంది సావాలు నీరసంగానే నవ్వుతూ.

చుక్క పక పక నవ్వింది. "బుద్ధిపోనిచ్చుకున్నావుగాదప్పా. పకీరుగాడు; యములాడొచ్చినా సరే మావిలాగే కాయివించుకు సరసాలాడుతూనే సచ్చిపోతాం. నియ్యల్లే నాకు జెరం రాదు ఆపదలొత్తే " అంది.

"అలాగే అలాగే ఊసులాడ్డనికేవి. మద్దినాల మతిసెడి శోకాన్నాలెట్టినాళ్ళెవరో... సూద్దారి, ఆడు మూడుగంట్ల కారుకి రాపోతే ఆ తరవాద్దానికి రాడని కరారేటి, కాపీ నీల్లో కల్లునీల్లో దాగుతంటే కారు తిప్పుండచ్చుగా" అంది సావాలు.

తలుపులు పట్టు దప్పినట్టయి తలెత్తి చూసింది చుక్క.

మళ్ళీ వెర్రి చూపు పడిపోయింది.

"ఆ! ఏటేటీ ఎలాగెలాగా!? " అంటూ కొయ్యబారిపోయాడు తలుపులు.

"నీ జిమ్మడ. యదవనోరు నివ్వూను" అంటూ లేవబోయింది చుక్క.

తలుపులే చుక్కని పక్కకి తోసేసి లేచి నిలబడ్డాడు.

"ఆమాటా రైటే ఆమాటా రైటే" అంటూ గబగబ గుడిశవతలకి వెళ్ళిపోయాడు.

"యాడకయ్యోవ్ సామీ ! " అంటూ వెంటబడింది చుక్క.

"మల్లొత్తా మల్లొత్తా" అంటూ గబ గబ వెళ్ళిపోయాడు తలుపులు.

★ ★ ★

పొద్దు వాటారింది. ముత్యాలమ్మ గుడి దగ్గర రావిచెట్టు కింద కూర్చున్నాడు తలుపులు చిత్తుగా తాగేసి.

"నా సావిరంగ, రారా ఇయ్యాల నువ్వో నేనో ఐస్లా పైస్లా తేలిపోవాల. పుచ్చెలెగిరిపోవాల. నయ్యాల. " అని గొణుక్కుంటున్నాడు.

అరమైలు అసింటా అప్పుడే బస్సుదిగిన జమాజెట్టీ పకీరు కూడా అదేమాట అనుకున్నాడు కసిగా. దిగుతూనే ఎదర కిళ్ళీ బడ్డీ లోపలికెళ్ళి కూర్చున్నాడు. బస్సుకదిలింది, బస్సులోంచి ఒకే ఒక ఇస్తోకు దిగింది. "కాసిని సోడానీల్లియ్యవో" అన్నాడు పకీరు. బడ్డీ వాడు కాళీ సోడా కాయపట్టుకు లోపలికి వెళ్ళి 'నీళ్ళు' నింపి ఇచ్చాడు.

పకీరు గడగడ తాగేసి, "ఇంతకన్నా వుట్టినీల్లే ఇత్తే సరిపోయేదిగా యదవా" అన్నాడు. బుజం మీద తువ్వాలు తీసి తలపాగా చుట్టుకున్నాడు. లుంగీ సరిచేసి బిగించి కట్టుకున్నాడు.

ఈవల ఒకటే జట్కావుంది. అందులో ఇందాకటి ఇస్తోకులో రాణి కూర్చుని వుంది. రాజా బడ్డీ దగ్గిరకొచ్చి సిగరెట్టు కొంటున్నాడు. పకీరు బండి దగ్గర కొచ్చి, "దిగండమ్మా, ఈ బండెల్లదు" అన్నాడు.

బండిలో అమ్మాయి కంగారుపడి" ఏవండీ ఇటుచూడండి ఇతనేమిటో అంటున్నాడూ" అంది.

"దిగమ్మా తల్లే" అన్నాడు పకీరు విసుగ్గా.

రాజా విసురుగా వచ్చాడు. "ఎవడ్రానువ్వు ఆడవాళ్లని దబాయిస్తున్నావు బ్లడీఫూల్" అంటూ.

పకీరు వెనక్కి తిరుగుతూనే ఎడం చేయి తిరగేసి వెనక్కి విసిరాడు.

"అమ్మో" అని ఒక్క కేకపెట్టి చేయ్యి చెంపని తడుముకున్నాడు రాజా. మళ్ళీ మాటడలేదు. అలా చెంపని చెయ్యేసుకుని గుడ్లప్పగించి మాట లేకుండా, జేజెమ్మలా ఆరడుగుల ఎత్తున్న పకీరు వేపు చూస్తు వుండిపోయాడు. అమ్మాయి మాట్లాడకుండా బండిదిగిపోయి తనే పెట్టి కిందకి దించేసింది. మరచెంబు తీసి చేతపట్టుకుని తిన్నగా భర్త దగ్గరికి వచ్చేసింది. జెబ్బ పట్టుకుని "ఇలారండి" అని అసింటా చెట్టుదగ్గరికి లాక్కుపోయింది అతను చెంపని చెయ్యి తియ్యలేదు. కన్నార్పలేదు. పన్నెత్తి పలకలేదు. అలాగే చూస్తూ బొమ్మలా భార్య పక్కన చతికిలబడిపోయాడు.

పకీరు బండిలోకెక్కి కూర్చున్నాడు. "ఊళ్ళోకి పోనీ" అన్నాడు.

"రోడ్డు బావులేదు" అన్నాడు బండివాడు.

"పోనీ" అన్నాడు పకీరు.

బండి కదిలింది. బండిలో అమ్మాయి జోళ్ళుండిపోయాయి. ఇవతలకి విసిరేస్తూ "బుల్లోయ్ జోళ్ళొగ్గేసినావు" అన్నాడు పకీరు.

★ ★ ★

తూము మళుపు దగ్గరేనే జట్కా ఆపేశాడు బండతను. " బుడ్డోడికి జరం కాసిందని, ఇట్నించిలా ఇంటికెళ్తానని బతిమాలి దింపేశాడు" పకీర్ని.

పకీరు నవ్వాడు, "ఎదవ నాయాల. ఏవాబద్దాలాడావుగా, ఎంత బయ్యంరా? కూడా వత్తే సాచ్చాలియ్యాలని గదా బయ్యం. నాకు తెల్దేటీ, అందుకే బండి దోలుకు బతుకుతున్నావు. బీడీపోటిచ్చెల్లు" అన్నాడు.

★ ★ ★

రావిచెట్టు దగ్గిర బండకానుకుని వెల్లకిలా పడుకుని కాలుమీద ఏసుకుని వెకిలి ధైర్యంతో ఏడుపులాటి నవ్వుతో, పిచ్చిలాంటి తెలివితో లొల్లాయి పదాలు పాడుతున్నాడు తలుపులు గట్టిగా. పుచ్చపువులా వెన్నెల కాస్తోంది. బూతుపదాలు నాలుగు వీధుల వినిపిస్తున్నా ఎవరూ ఈవలకొచ్చి వాణ్ణి మందలించలేకపోయారు. కరణం గారు సకుటుంబంగా సినీమాకెళ్ళిపోయారు ఎందుకేనా మంచిదని. ప్రసిడెంటు గారూ వారికి తోడుగా వెళ్లారు.

దశమినించి చవిద్దాకా వెన్నెల బంతులాడే పిల్లలు ఇళ్ళలోనే సర్దుకుపోయారు. ఎక్కడా సందడిలేదు. అలికిడి లేదు. ఊరందరికీ ప్రాణం ఖంగారుగా వుంది. మనసు గుబులుగా ఉంది. తెల్లరేలోగా ఓఘాయిత్యం జరగడం ఖాయమని అందరికీ అనిపిస్తోంది.

చుక్క రెండుమార్లొచ్చి తలుపుల్ని బతిమాలింది కొంపకి రమ్మని.

"నా సావిరంగా ఇయ్యాల ఆడో నేనో తేలిపోవాల, " అన్నాడు తలుపులు, రెండోసారి వచ్చినపుడు మళ్ళీ వస్తే సిగపాయిదీసి తంతానన్నాడు. మళ్ళీ ఏమనుకున్నాడో వెనక్కి పిలిచి అంతపనీ చేసి పొమ్మన్నాడు.

మునసబుగారు పెందలాడే భోంచేసి అరుగు మీద కూర్చున్నారు చుట్ట ముట్టించి. ఆయనకి ప్రాణం కుతకుత ఉడికిపోతోంది. చూస్తూ చూస్తూ ఓ మనిషిని మరోడు ఖూనీ చేస్తు వుంటే దిక్కు మాలినట్టు ఊరుకోడం ఆయనకి నచ్చలేదు. తను వయసుమీదవున్నప్పుడు, అనేకసార్లు ఇలా కలగజేసుకోకుండా ఉండగలిగాడు. ఈనాడు వయసు తనమీదికెక్కి సత్తా తగ్గిన మీదట ఇలాటి బుద్ధిపుడుతోంది. గట్టిగా ఓటి చరిస్తే మూణ్ణెల్లు మంచమెక్కాల్సిన స్థితి తనది. మొన్న పాలేరు మీద నోరు చేసుకుంటేనే ఆయాసం వచ్చి ప్రాణం కడంటింది.

వొంటో ఓపిగున్న వాడికి లేని బెడదలు నాకేల అనుకున్నాడు కాని సావిట్లో కెళ్ళబోతూ ఉండగా చుక్క తమ్ముడు ఎక్కణ్ణించో తుర్రునవచ్చి "బాబుగోరూ పకీరుగోడు బండిదిగి వచ్చేత్తన్నాడండి. మా మావని సంపేత్తాడు" అనేసి పరుగెత్తాడు, ఆయన జవాబు కూడా వినకుండా.

మునసబుగారు ఓ నిమిషం మేనువాల్చారుగాని ఉండబట్టలేక చివాల్న లేచి చేతికర్ర పట్టుకుని ఇవతలికొచ్చారు. ఆడవాళ్ళు లోపల పనుల్లో వున్నారు. గుమ్మంలో ఓ నిమిషం నిలబడి మళ్ళీ ఆలోచించారు. చివరకి అడుగు ముందరకేసి నడక సాగించారు మెల్లిగా. పకీరు తలుపులు కొంపకెళ్ళాలంటే ముత్యాలమ్మ గుడిమీదుగానే దారి. గుడికి ఎడమ వేపున పదిగజాల్లో అవతల వేప చెట్టుంది. అక్కడ లోగడ స్కూలుకని వేసిన పాక కూలిపోయి ఉంది. రెడ్డి రెండెడ్లబండి గుమ్మానికి అడ్డంగా ఉంది. మునసబు గారు నెమ్మదిగా వెళ్ళి చెట్టు మొదట్లో బండి చాటు చేసుకుని కుదురుగా నిలబడ్డారు.

★ ★ ★

తలుపులు నానా గోలా చేస్తున్నాడు, వెల్లకిలా పడుకుని వెకిలిగా నానా కూతలూ కూస్తున్నాడు, పాడుతున్నాడు, నక్కపిల్లి కర్రముక్క _ మూరెడున్నది, దిరమైనదోటి పక్కన పెట్టుకున్నాడు. ఐదు నిముషాలకోసారి రంగణ్ణి తలుస్తున్నాడు. " నా సావిరంగా మళ్లీ ఈ పదం విన్నావా. నిమ్మసెట్టూకూ నిచ్చెన్నేసీ నిమ్మపళ్ళే కోయాబోతే నిమ్మా ముల్లే రొమ్మునంటేరా ఓరందక్కాడ తకడి దిందెకాడ కోడి పందెక్కాడ __ "

హఠాత్తుగా తలుపులు పాట ఆపేశాడు.

మునసబు గారి గుండెఝల్లుమంది. కొంచెం ముందుకు వంగి తొంగి చూశారు.

అల్లంత దూరాన యములాడిలా పకీరు.

కాలిమీద కాలేసుకు విలాసంగా పడుకున్న తలుపులుకు కాలి సందులోంచి పకీరు విగ్రహం కనబడింది. భయంకరంగా కనబడింది. వాడు దర్జాగా ఏనుగులా వొస్తున్నాడు. పొగరుగా వస్తాదులా వస్తున్నాడు.

భయంకరంగా పకీరులా వస్తున్నాడు.

తలుపులు పాట ఆగిపోయింది. చూపు ఆగిపోయింది. కదలిక ఆగిపోయింది. ఓ క్షణం గుండె ఆగిపోయింది. హఠాత్తుగా ఒక్క సారిగా మళ్ళీ ఒళ్ళంతా వణకడం మొదలు పెట్టింది. రావిచెట్టు మీది కాకి కావుమని అరిచి టపటప రెక్కలు కొట్టుకుని వేపచెట్టు మీదికెగిరింది. ఎక్కడొ కుక్క భొయిమని మొరిగింది. రెండుమూడు ఇళ్ళ కిటికీ తలుపులు టపటపమన్నాయి. మునసబు గారు కదిలి అరవబోయారు. మాట రాలేదు. కాలు కదల లేదు. అలాగే స్తంభించిపోయారు.

తలుపులికి వొళ్ళంతా చెమట పోసేసి, బిగించుకు పోయిన శరీరం పట్టు సడలింది. పకీరు వచ్చేశాడన్న సంగతి పూర్తిగా బుర్రకెక్కింది. కెవ్వున అరవబోయాడు గాని అంతలో తిరిగి ఒళ్ళు బిగించుకుపోయింది. చేతులు నేలకి వాలి పిడికిళ్ళు బిగించుకుపోయాయి. గొంతు ఎవరో నొక్కేస్తున్నట్లయింది.

పకీరువచ్చి తలుపులుకెదురుగా కాళ్ళ దగ్గిర ఆగింది... క్షణంలో సగం పరకాయించి చూసి ముందుకు వంగింది. వెండ్రుకలతో దట్టంగా దిట్టంగా ఉన్న చెయ్యి ఒకటి ముందుకు వచ్చి తలుపులు కమీజు కాలరు పట్టుకుంటోంది. తలుపులేనా అంటోంది; గేదె కొమ్ముల్లాటి మీసాలూ, మీసాల్లాటి

కనుబొమలూ ఉన్న మొహం, ఇవన్నీ చూస్తే సాక్ష్యం ఇవ్వాల్సివస్తుందనీ మళ్ళీ ఈ రాక్షసుడు ఏం చేస్తాడోననీ దూరం ఆలోచించి చంద్రుడు మొహం మబ్బుచాటు చేసుకున్నాడు; సినిమా కెళ్ళిన కరణం గారిలా, తప్పుకున్న ముత్యాలులా, ఊరుకున్న ప్రెసిడెంటులా, మునసబులా....

తలుపులు తొడుక్కున్న కరణం గారి కమీజు కాలర్ని పకీరు పిడికిలి బిగించి పట్టుకుంది. కొయ్యబారి నోరు తెరచి గుడ్లు తేలవేసి చూస్తున్న తలుపులు ఒక్కసారి "బాబోయ్" అని, పెద్దగావు కేక పెట్టాడు. అతనిలో అణిగి పోయిన మగసిరి తిరగబడి మేలుకుంది. భయం మొండితనమైపోయింది. ఒక్క సారి సర్వేంద్రియాలా చైతన్యం నిండిపోయి అన్నీ ఎగిరాయి. అతని పక్కన నీరసంగా ఎండిన తోటకూర కాడలా పడున్న రెండు చేతులూ గుప్పెళ్ళలో దుమ్ము తీసుకుని, ముందుకు వాలిన పకీరు మొహంలోకి కొట్టాయి. పకీరు పట్టు వదిలి 'ఛా' అంటూ రెండు చేతులా మొహం మూసుకొని కళ్ళు వత్తుకోబోయాడు. విలాస ముద్రలో ఉన్న తలుపులు కాళ్ళు రెండూ తెగిన స్ప్రింగులలా తన్నుకుని విడిపడ్డాయి; ముడుచుకుని ముందుకురికి పకీరును పొత్తికడుపు మీద తన్నాయి.

పకీరు వెనక్కి తూలి తమాయించుకుని పెద్దకేక పూరు మారుమోగే దాకా వేయబోయాడు గాని తలుపులు శరీరం మట్టగిడసలా తన్నుకుని బంతిలా పైకెగిరింది. తలుపులు తల పొట్టేలు మల్లె ముందుకు వంగింది. సన్నగా రివటలా ఉండే తలుపులు తాలూకు శరీరం దాన్ని తీసుకువెళ్ళి సరాసరి తూలి తమాయించుకోబోతున్న పకీరు పొట్టమీదకు గురిపెట్టి కొట్టింది. బాణంలా వెళ్ళి తగిలాడు తలుపులు.

పకీరు వెనక్కి పడుతూనే రెండు చేతులా తలుపులు జెబ్బలు పట్టుకున్నాడు. పడీ పడగానే పక్కగా ఒరిగి, ఒక జెబ్బ వదిలి ఆచేత్తో తలుపులు రొమ్ము మీద గాఢంగా పొడిచాడు. తలుపులు కిక్కురుమనలేకపోయాడు గాని ఆ బాధలో అప్రయత్నంగా అతని అరచేతి కిందిభాగం పకీరు కింది పెదిమకు కొట్టుకుంది. పెదిమ చితికి, హడావుడిగా పకీరు కుడిచేతిని ఓదార్పుకు పిలిచింది. ఎడమ చెయ్యి అతని అనుమతి తీసుకోకుండానే, సగంలో వదిలేసిన కళ్ళకు సేవచేయబోయింది.

ఈ విధంగా ఊపిరి తీసుకోడానికి సదుపాయం సంపాదించిన తలుపులు ఆ పని పూర్తికాగానే ఇంకో దొర్లు దొర్లి లేచి ఉట్ల సంబరాలకి అలవాటైన ఒడుపుతో ఎగిరి శక్తి కొద్దీ రెండు మడమలతోటీ పకీరు ఎదురు రొమ్ము మీదకి దిగాడు. పకీరుకి ఆ క్షణం ఈశ్వరుడు గురించిన జిజ్ఞాస కలిగితే, ఆయన రెండే చేతులిచ్చినందుకు తిట్టుకునేవాడు.

ఉన్న రెండిటికీ డ్యూటీ ఫిరాయించి తలుపులు కాళ్ళు పట్టుకు లాగబోయే లోగా తలుపులు ఒక కాలుతో పకీరు గడ్డం మీద తన్ని తూలి ముందుకు పడిపోయాడు.

పకీరు కోలుకునేలోగా తలుపులుకు కర్ర అందితే బాగుణ్ణని చెట్టు చాటునించి చూస్తున్న మునసబుగారు చాలా ఆశపడ్డారు గాని ఆ సదుపాయాలు కనబడలేదు.

తలుపులు లేచికూర్చుని వెనక్కి చూశాడు. పకీరు నోటివెంట ఎర్రటి రక్తం తెల్లటి వెన్నెలలో నల్లగా మిల మిల మెరుస్తూ చెంపమీదుగా నేలకి జారుతోంది.

అమాంతం తలుపులికి బలం ధైర్యం తొలిసారి ఆవేశించాయి. కూర్చున్న పళంగానే ముందుకు వంగి రెండు పిడికిళ్ళూ బిగించి పకీరు రెండు చెంపల మీదా ముక్కు మీదా మూడు గుద్దులు గుద్దాడు. పకీరు తిరగబడి లేవబోయేవరకూ తలుపులు పైకిలేచి నేల మీద ఆని వున్న పకీరు కుడిచేతిమీద బలం కొద్దీ అడుగేసి తొక్కేశాడు.

"బాబోయ్ ! " అని పెద్ద కేక పెట్టాడు పకీరు. ఊరుమారు మోగిపోయింది. లోకంలో మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ, బలవంతులూ బలహీనులూ, హింసా ప్రియులూ అహింసా పరులూ ఎవరెవరెన్న భేదాలకు అతీతమైన అరిచిన బాధ అది. చావుబతుకుల రెంటికీ ఐదు నిముషాలుగా సాగుతున్న ఆ భీకర సంగ్రామంలో చిన్న చిన్న మూల్గులూ, నిట్టూర్పులూ తప్ప అంతవరకూ వినరాని తొలి పొలికేక అది.

తలుపులు ఈసారి బలమంతా పూన్చిన పిడికిలితో నారి సారించినట్టు చెయ్యి వెనక్కిలాగి ఒక్క ఊపున పకీరు మెడనరం మీద పోటు పొడిచాడు.

"బాబోయ్" అని మరో పొలికేక వేసి గిల గిల తన్నుకున్నాడు పకీరు.

ఇంకో దెబ్బకి తలుపులు సన్నాహం చేస్తు ఉండగా పకీరు పిడికిట పొదిగి బిగించిన బొటనవేలుతో అతని డొక్కలో, గాఢంగా పొడిచాడు.

అర్భకుడు తలుపులు, జాతరలో కోడిపెట్టలా తన్నుకుని లేచి చెట్టు దగ్గిరకి పరుగెత్తాడు. అక్కడ నక్కపిల్లి కఱ్ఱ ఉందన్న సంగతి అప్పుడు తట్టింది. కఱ్ఱ తీసుకుని గిరుక్కున వెనక్కి తిరిగాడు తలుపులు.

ఆరడగుల పకీరు గాయపడ్డ పులిలా తూచి, చూచి వొడుపుగా అడుగులేస్తున్నాడు తన వేపు.

పకీరు చేతిలో నాలుగంగుళాల బాకుంది.

ఎత్తిన కఱ్ఱ ఎత్తినట్టే ఉంచి అట్టే నిలబడిపోయాడు తలుపులు.

దగ్గరకు వచ్చాడు పకీరు.

"ద్దొంగ_ _"

"పకీరూ" అని హఠాత్తుగా పెద్ద గర్జన వినబడింది.

తుళ్ళిపడి కేక వేపు చూడబోయి ఇటు తిరిగేలోగా పకీరు నెత్తిన తలుపులు శక్తి వంచనలేని దెబ్బకొట్టాడు, చేవగల కఱ్ఱతో.

"బోబోయ్" అని ముత్యం మూడోసారి కేకవేసి కూలిపోయాడు పకీరు.

తలుపులు తీరికగా కుడివేపు చూశాడు. అందాకా చెట్టు చాటున ఉన్న మునసబు గారు ఇవతలికి వచ్చి వెన్నెలలో నిల్చున్నారు, చేతికఱ్ఱ పట్టుకుని గంభీరంగా.

తలుపులు మళ్ళీ ఇటు తిరిగి కళ్ళు మూసుకుని కసిదీరా పకీరును బడితెతో బాదుతున్నాడు.

"ఇక చాలు తలుపులూ" అన్నారు మునసబుగారు...

★ ★ ★

పంచాయితీ ఆఫీసు అరుగు దగ్గిర జనం చాలామంది చేరారు. ఆఫీసువారి మూడు హరికేను దీపాలూ ధర్మ విజయంలా ఉజ్వలంగా ప్రకాశిస్తున్నాయి. పకీరు కాళ్ళూ చేతులూ కట్టేసి అరుగుమీద పడేశారు. ముత్యాలు అతని గాయాలు కడిగి మంచినీళ్ళు పడుతున్నాడు. చుక్క పసుపుకుంకాలనీ, తలుపులు తాకతునూ మెచ్చుకుంటున్నారు ప్రేక్షకులు. చుక్క మర్నాడు తప్పకుండా అమ్మవారికి ఉపారాలెడతానంటోంది. తలుపులు నీరసంగా గోడకి జారబడి పడుకున్నాడు. మళ్ళీ జ్వరం వచ్చింది ఒంటిన తెలివిలేదు.

ఇంకో ఘడియకి కారు అలికిడి వినబడింది. సందడి తగ్గి కొత్త గొంతుక వినబడడంతో మెల్లిగా కళ్ళు తెరిచాడు తలుపులు;

ఎదురుగా పోలీసులు, జనం అంతా అమ్మయ్య అంటున్నారు.

"పకీర్ని మీరెలా వదిలేశారండీ!? " అంటున్నారు, మునసబు గారు ఆశ్చర్యంగా.

"తలుపుల్ని పట్టుకోడానికి, చింతాలు కూనీ కేసులో వీడో సైదు హీరో, వాడూ వీడూ కలిసే చంపుంటారు. వీడెలాగో పారిపోయి పైపెచ్చు కోర్టుకొచ్చి ప్రాసిక్యూషన్ తరపున పకీరు మీద సాక్షం ఇచ్చి వచ్చాడు. వీడి ప్రతిభ ఈ సంగతి మధ్యాన్నమే తెలిసింది. పకీరు ముందరే చెబితే మేం నమ్మలేదు. అందుకని మేమొచ్చేలోగా పకీరు తొందరపడీ మాతో చెప్పకుండా వచ్చేశాడు" అన్నారు ఇన్ స్పెక్టరు గారు.

" కాని వీడెంత నాటకం ఆడాడూ. మొగుణ్ణి గొట్టి మొగసాలెకెక్కినట్టు_ సర్లెండి దొంగని దొంగే బట్టుకోవాలి. " అన్నారు మునసబు గారు.

"బావుంది ఇపుడు మీరంతా కలిసి వాళ్ళని పట్టిచ్చారు మరి మీరంతా దొంగలేనా ?"

"ఏమో దొరికాక ఒకొక్కడూ ఒకొక్క రకం దొంగ... దొరికేదాక ఒకొక్కడూ ఒకొక్క దొర" అన్నారు. మునసబుగారు.

★★★

(ఈ కథ ఆధారంగానే పదేళ్ళ తర్వాత బాపుగారు సాక్షి చిత్రం రూపొందించారు)

★★★

.

# దొంగలున్నారు జాగ్రత్త

శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక – ఏప్రిల్ 08, 1940 సంచిక నుంచి)

అప్పుడే ఇంటర్మీడియెట్ ఎగ్జామినేషన్లో పేపరు రాసివచ్చిన విసుగున—ఒక్క విసురున కారులోంచి దూకి, ఒక్క అంగలో మేడపైకి వెళ్లి, టెక్స్టునూ, నోట్సునూ 'మీ దిక్కున్న చోట చెప్పుకో'మన్నట్టు టేబిల్ మీదకు విసరి, ఆత్రంగా కిటికీలన్ని తెరచి, హఠాత్తుగా గదిలో చొరబడే మలయపర్వత సానువులనుండి దిగుమతియగు కమ్మతెమ్మెరలకు నల్లపట్టు ముంగురులూ, తెల్లనిపైటా తపతప కొట్టుకోగా, గ్రామొఫోన్ టేబిలుకు దగ్గరగావున్న ముఖమల్ సోఫాను ఆప్యాయంగా అనుగ్రహించింది శకుంతలాదేవి.

కమ్మని కళావలయాలుగా, మాధుర్య నిలయాలుగా... అక్కడి శబ్దగుణక ఆకాశాన్ని ఘాటైన హాయితో, పరిమళపు తేనెల్తో నింపుతూ గిరగిర సైగాల్ మహాశయుడు పాడుకుపోతున్నాడు– "సుఖ్ కే... ... దుఃఖ్ కే...ఏక్ స్వపన్ హై' ఇత్యాది.

ప్లేటు మార్చడానికి రికార్డు బాక్స్ వైపు చేయి చాచుతూ, చట్టున ఆత్మారాధన జ్ఞప్తివారి, అధోలోకాన్ని ఉద్దేశించి

"మంగా, కాఫీ... కాలేజీనుంచి రావడం చూడ లేదూ?"

"అమ్మా, ఇదిగో తెస్తున్నా_ మరిచిపోలేదు"

శకుంతల కావలసిన రికార్డు కోసం తడవుతూ వుండగా... టేబిల్ మీద ఒక కవరుత్తరం కంటపడింది.

ఆకస్మికంగా ఆమె ముఖంలో ఒక వెయ్యి ప్రశ్నార్థక చిహ్నాలు! ఇదేమిటీ! అపరిచిత అక్షరాలు?

ఆశ్చర్య బరువున అనుకోని అనిమేషత్వం దఖలుపడ్డ ఆ అచ్చర ఆ ఉత్తరం అందుకుని చించింది.

చిత్తరంజన విలాసం,

4 ఏప్రిల్ 1932

ప్రియమైన శకుంతలకు

ఈ ఉత్తరం ఎట్లా ప్రారంభించాలో నిజంగా నాకర్థం కాలేదు.

నీవు నన్ను సరిగ్గా అర్థం చేసుకోక. నీ చల్లని నల్లని కళ్లల్లో కెంపులు చెరుగుతూ నా వైపు చూస్తే... మరణాన్ని శరణు పొంద వలసి వస్తుంది.

నీవు మోహినీ దేవతవలె ఒక్క చూపుతో నా హృదయాన్ని – ప్రాణాలను ఆకర్షించావు,

ప్రేమ సాక్షాత్తూ భగవత్స్వరూపం. దానిశక్తి అనంతం. దానికి ఏవీ అడ్డురాలేవు. పవిత్రమైన ప్రేమలో ఎవ్వరూ తప్పులు పట్టలేరు.

హృదయపూర్వకంగా ఒకరినొకరం ప్రేమించుకుని, రెండు నీలిమబ్బుల్లాగ——గువ్వజంటవలె నీలాల నింగిపై తేలిపోవడం కన్న భాగ్యం ఏమిటి ? నీవు మనస్ఫూర్తిగా ఒక్క పరి....

నీ,

రాజా రావు.

సగంలోనే చదవడం పూర్తిచేసి ... చివాలున సోఫాలోనుంచి లేచి_కవరుతో సహా ... కాదగినంత ఉండచేసి చిత్తు కాగితాల బుట్టవైపుగా విసరి, కిటికీలో నుంచి శూన్యంగా చూస్తూ__

“ఎవరీ అయాచిత ప్రేమమూర్తి ? ఎప్పుడూ క్లాసులో ఇతన్ని నిదానించి చూచినట్లైనా జ్ఞాపకం లేదే?

“మొగవాళ్లు ఎంత బుద్ధిహీనులు ! పొరపాటున గోడలవైపు _ దూలాలవైపు చూచినట్టు చూసినా ఆ మూమూలు చూపులోగూడా ‘తివిరి ఇసుమున తైలంబు తీసినట్టు ప్రేమనుతీసి ఉత్తరాలు రాస్తారు కాబోలు !”

“అప్పటి అమాయిక శకుంతలను దొంగ రాజు ప్రేమను అభినయించి టోపీ వేసినట్టు... పిచ్చివాడు... ఈ రాజా రావెవరో 20వ శతాబ్ది శకుంతల మీద ట్రయి చేస్తున్నాడు”

అని విరగబడి నవ్వుతూ సోఫాలో ఒరిగింది.

మంగ ట్రేలో పింగాణీ కాఫీ కెటిలూ, కప్పులూ తెచ్చి ఎదుట పెట్టి, శకుంతలను చూసి తెల్లబోయి నించుంది.

శకుంతల ఆగి గంభీరంగా_

“మంగా, నే వచ్చేసరికి నా టేబిలు మీద ఒక ఉత్తరం ఉంది. ఎట్లా వచ్చింది ఇక్కడికి? నిజం చెప్పు”

పాపం, మంగకు అంతా అయోమయంగా వుంది. నిజం చెప్పివేస్తే ఏంతప్పుగా పరిణమిస్తుందో? అబద్ధంగా నేనేమీ ఎరగనంటే ఇప్పుడే ఇక్కడనుంచి గెంటి వేస్తారేమో?

గొంతులో పది పచ్చి వెలక్కాయలు పిసిగినట్లయింది.

“మాట్లాడవేం? నువ్వు దీనిసంగతి ఎరగవా ?”

“అమ్మా, కోపం చెయ్యకండి. ఆ కాగితం మడత కూడనిదని తెలిస్తే, తెచ్చి మీ బల్ల మీద పెట్టను. ఈ వేళ పొద్దున్న దొరలాంటి ఒకాయన మన ‘గేటు గుమ్మం’ దగ్గిర నాక్కనిపించి మంచిగా నన్నుపిల్చి ‘ఇది మీ అమ్మాయిగారి కిచ్చెయ్యి.. చాలా అవసరం’ అని ఇచ్చి వెళ్లారు. ఈ కాలపు చదువుకునేవారికి ఇల్లాంటి తప్పులుండవు కాబోలనుకుని మీ బల్ల మీద పెట్టానమ్మా ... తెలివితక్కువదాన్ని” నీళ్లు తిరిగే కళ్లను చాటుచేసుకోబోయింది,

అవమాన క్లిన్నమైన సాటిస్త్రీ హృదయ వేదనను గ్రహించి, జాలిగా

“ఛా ! నిన్నేమీ అనలేదుగా? ఈ పైని ఎవరిచ్చినా ఇట్లాంటివి పుచ్చుకోకు. ఏ కాలపు చదువులైనా చదువుల్లో ఏముంది ... బుద్ధి సూటిగా వుంటే ?”

కాఫీకప్పు అందుకుని రెండుగుక్కలు తాగి మళ్లా ఆలోచనలో పడింది.

మంగ బల్లలమీద వస్తువులను సర్దుతూ తన పనుల్లో నిమగ్న ఆయింది,

“ఎవ రీ రాజా ... రావు ? మంగ చెప్పినట్టు సూటుతో వుంటాడా ? ఓహో... ఈ వీధి చివ్వరి మేడ ... ప్లీడరు బలరామయ్యగారి మేనల్లుడు. సరే.. తరచు ఆడపిల్లలకంటెగూడా శ్రద్ధగా టాయిలెట్ చేసుకుని అందరికళ్లనూ ఆకర్షించాలని చూస్తూ వుంటాడు. ఔను, యువతులు తిరిగిచూడదగిన కోమలమూర్తే ! కాని ఇంత దుర్బలహృదయుడా? నిజంగా ప్రేమారాధకుడైతే ఎంత నిదానిస్తాడు? మహాభక్తుడికి తాను భక్తుణ్ణనే తెలియదే... మహాకవికి తాను కవిననే జ్ఞాపకం ఉండదే? తన ఉన్నతిని ఎదుటివారు గ్రహించినప్పుడే దానికి స్థిరత్వం ! గొప్పవారు గొప్పసాధన చేస్తారు సిద్ధి పొందుతారు.

“ఈ కుర్రప్రేమికులు మా సిల్కు చీరలను, రిబ్బను జడలను చూసి భ్రమసి, ప్రేమలనీ విరహాలనీ షెల్లీలను చూసి, కృష్ణపక్షాల్లో కుంగి ప్రేమలు నేర్చుకుని కంటి ఎదటివారినీ ఇంటి ఎదటివారినీ పీడిస్తారు.

“వీళ్లు-ప్రేమకోసం కొన్నియేళ్లు తపించి ఉండగలరా? అగ్నిపరీక్షలకు ఓర్వగలరా? ఒకప్పుడు ... అవసరమైతే_ ఎట్టి త్యాగమైనా చెయ్యగలరా? వట్టిది.

“అదృష్టవశాత్తూ ఏ అమాయిక కోమలి ఐనా వలలో పడితే_ పీల్చివేసి ‘విమ్ టో’ సీసాలా మూలకు విసరి చక్కాపోతారు.”

దుష్యంతుడేం చేశాడు ? మధుర వనదేవత శకుంతలను చల్లని మాలినీతీరాన కుసుమిత పాటల వృక్షచ్ఛాయల్లో బెల్లించి, అనుభవించి, ఛీ!!

“ఈ పురుష వంచకులకు ఈశకుంతల ఘాటైన పాఠం చెప్పాలంటే ఎట్లా?

“సరే అట్లాగే చెయ్యాలి. సాహసం? ఫర్వా లేదు.

ఉత్సాహ బలవన్నిశ్చయంతో లేచి

“మంగా, ఈ వేళ రాత్రి... మనమో చిత్రనాటకం చూడబోతున్నాం. నువ్వుకూడా నాతో వుండాలి. మూడోకంటివాళ్లకు తెలిస్తే తల ఎగిరిపోతుంది సుమా !”

“మీ మాటకు ఎదురు చెప్పడం... ఎప్పుడేనా వుందా అమ్మా!?”

“సరే న... డు ... వు”

హుషారుగా లేచి శకుంతల మేడకిందికి వెళ్లింది.

2

స్లేట్ కలర్ పారిస్ సిల్కు చీర కొత్త ఫక్కీలో తీర్చి కట్టుకొని, లేత ఊదారంగు బ్లౌజు తొడుక్కుని, నిగనిగ లాడే నల్లనిజుట్టును వదులుగా చెవులు కమ్ముకునే లాగు వాలుజడగా మలచి మెడమీద నుంచి వక్ష స్థలం మీదకు విడచి, ఆననశ్రీకి ‘హిమానీ’ స్పర్శతో లావణ్యదోహదాన్ని పచరించి, రాత్రి పదిగంటలకు తన ప్రసాధనం పూ ర్తిచేసి శకుంతల. డ్రెస్సింగ్ టేబిల్ వద్ద ఒకసారి తన అందాన్ని కొంటెకళ్ల తో పరీక్షించి “బస్.. మంగా, రెడీ” అంది.

మంగకు వట్టి గందరగోళంగా వుంది. ఈ మహా ప్రస్థానం ఎంతవరకో, ఎందుకో సూచాయగా అడగడానికైనా దమ్ములు లేవు. సినిమాకా ? వేళ దాటి పోయింది. ఇందాకా నాటకం అన్నమాట వట్టి తమాషాకు. ఉహుఁ తెలియదు.

శకుంతల అప్పడే మేడమెట్లు దిగిపోతోంది. గది తలుపులు దగ్గరగా లాగి మంగ ఆమెను అనుసరించింది.

మేడముందటి మాలతిబవరును దాటి, గేటును వెనక్కి నెట్టి, రోడ్డుమీదుగా చైత్రశుద్ధ చవతిమసక వెన్నెల్లో ఇద్దరూ ముందుకు నడుసున్నారు.

3

రెండు మళుపులు తిరిగి తిన్నగా వీధి చివర ప్లీడరు గారి ఇంటిముందు హఠాత్తుగా ఆగి వీధిగదిలో వెలిగే దీపపుకాంతిని నిదానించి, మంగను గదికి చేరువగా ఒక స్తంభం చాటున నుంచునేటట్టు సంజ్ఞ చేసి, గంభీరంగా తలుపు దగ్గిరకు వెళ్లి మెల్లగా తలుపుమీద ‘టాప్’ చేసింది.

కొన్ని నిమిషాల్లో గదితలుపులు 'హల్లో కమిన్' అంటూ మామూలు స్నేహితులెవరో అనుకుని విడుతూండగా శకుంతల లోపల ప్రవేశించింది.

గళ్లలుంగీ, చేతులు లేని తెల్ల బనియనూ, పాంపియా తలనూనె సువాసనతో చిక్కులు చిక్కులుగా వేల్లాడే ఉంగరాలక్రాపూ, ఒక చేతిలో 'సిజరు' ధూమవర్తిక సుగంధధూమం, రెండవ చేత మర్నాడు పరీక్షకు కసరత్తు చేసే షేక్స్పియరు నాటకంతో కుసుమ సుకుమార మూర్తి ... రాజారావు తన బంగారుకలల్లోని ప్రేయసి ఆకస్మికంగా ప్రత్యక్షం కావడం చూసి నిశ్చేష్టితుడై విస్తుపోయి, మంచి మాటలకోసం పెదుక్కుని, ఎట్టకేలకు __

"స్వర్గలోకపుదారి తప్పి ... అప్సరస ఇట్లా నడచివచ్చిందా?"

"★ ★ ★ ★"

"ఉత్తరం చూసి... ఏమనుకుంటావో, నా పవిత్రప్రేమను అపార్థం చేసుకుని ఎలా అవమానిస్తావో అని మహ పరితపించాను."

"అనురాగాన్ని అర్థం చేసుకుని, ఉత్తమ ప్రేమకు స్వాగతం ఇచ్చి ఆదరించగలవని నాకు మొదటినుంచీ ధైర్యమే."

"★ ★ ★ ★"

"అదేమిటి_పలుకే బంగారం అయిపోయిందా? ఒక్కసారి కుర్చీలో కూచుని అనుగ్రహించరాదూ? రేపటి పేపరుకు నీవు ఎంత సేపు చదవాలి _ రా ! వీణ వాయించినట్టు కాస్సేపు హాయిగా మాటాడు."

ఇంతవరకు శకుంతల పొంగివచ్చే నవ్వును నల్లని కొంటె కళ్ల పుక్కిట బట్టి

"ఇదేమిటి, రాజా, నన్నింతగా మన్నిస్తున్నావు? అచ్చర తోవతప్పినా నలకూబరుడి చైత్రరథంలోకేగా వచ్చిపడింది ? ఎన్నాళ్లు నా ప్రియుడి కోసం కలలుగన్నాను! ఇంతవరకూ __ ఈ పాడు లోకంలో నన్నింతగా ప్రేమించిన వారే కరవైపోయారు. ప్రేమ పరమార్థం నీవంటి బుద్ధిమంతులకు తెలుస్తుందిగాని తదితర క్షుద్రులకు ఎట్ల తెలుస్తుంది?"

"★ ★ ★ ★"

"కొందరు మూర్ఖులు మా మెరుగులు వారే యౌవనాన్ని చూసి, మా విలోలనేత్రాలకు తల్లకిందులై మమ్మల్ని తరింపచెయ్యడానికిమల్లె మోహించి అనేక విధాల పీడిస్తారు. నాకు తెలుసు, నువ్వు అట్లాంటివాడవు కాదు."

"★ ★ ★ ★"

"అవును : నీవంటి పక్వహృదయుడు ప్రేమ కోసం ఎంతటి త్యాగమైనా చేస్తాడు_కదూ?"

"★ ★ ★ ★"

"నేను గాఢంగా ఆలోచించి ఒక్క నిమిషం మా ఇంట ఇక ఉండలేక ఇక్కడికి వచ్చేశాను. నిరీక్షించగా నిరీక్షించగా శిశిరలతానికుంజానికి వసంతమూర్తి లాగా నువ్వు దొరికావు. ఈవేళ నీఉత్తరం చూసి నా జన్మ ధన్యం అనుకున్నాను.

ఏమీ అక్కర్లేదు, లే క్షణం ఆలస్యం చెయ్యకు. నాది ఓమర్ ఖయ్యాం మతం, నాకు పాస్టు, ఫ్యూచరు లేదు ఉన్నది ఒక్క– ప్రెజెంటెన్స్.

స్త్రీ హృదయం ఇవ్వడమేగాని తీసుకోడం ఎరగదు. రా _ ఈరాత్రే ఏ దూర దేశాలకో వెళ్లిపోయి హాయిగా పావురా దంపతుల్లా విహరిస్తూ ధన్యజీవితాలను గడుపుదాం. అడ్డు చెప్పకు_"

తన ప్రేమ ఇట్టా నడికి రేయిలో గొంతు పట్టుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తుందని రాజారావు ఎప్పుడూ అనుకోలేదు. పాపం!

అతనికి శకుంతల ధోరణి ఏ ఉల్లోలకల్లోల సముద్రంలోకో తనను విసరి వేస్తూన్నట్టు అనిపించింది. కళ్లు గిర్రున తిరిగాయి.

అతను ఊహించుకునే భవిష్యత్తంతా వికృత దృశ్యాలతో, తెరలుగా తన ఎదుట వేలాడుతోంది. మామయ్య ఇంక తన గుమ్మం ఎక్కితే మాట దక్కదన్నాడు. అతని ఆశ్రయంవల్ల తనకు లాభించే బి.ఎ. డిగ్రీ, ఉద్యోగం అన్నీ, రైల్లో కూచున్నప్పుడు చెట్లు వెనక్కు పరిగెత్తుకు పోయినట్టు, వెనక్కు పరుగెత్తుకు పోతున్నాయి. దేశాంతరాల్లో స్వయంపోషక శక్తి లేక ఈ సుకుమారితో... అన్నానికి కూడా బాధపడి తిరుగుతున్నాడు. అంతా ఈసడించి నవ్వుతున్నారు...

ప్రేమ ఆదర్శాలు కథల పుస్తకాల్లో చదువుకోడానికి బాగుంటాయి గాని ప్రాక్టికల్ లైఫ్లో ఫెయిల్యూర్ అనుకున్నాడు. కుదేలయిపోయి__

"శకుంతలా! నిర్మల ప్రేమ అంటే నీకంతగా బోధ పడినట్టు లేదు ! బుద్ధిమంతురాలవు – వూహించు, ప్రేమకు ఇంత తొట్రుపాటు పనికి రాదు. బహు నిదానించాలి, ఓపికపట్టాలి; తొందరపడి ఎట్టి నిర్ణయాలకూ రాకూడదు." ఏం తోచక ఖంగారుగా లాలనగా అన్నాడు రాజా. శకుంతల మరింత బిగిసి ...

"నే నిప్పు డేమీ ఆలోచించలేను. నేనింక ఆ నీరసపు టింటికి శుష్కజీవితానికి ఏం చేసినా వెళ్లను. నా ప్రేమమూర్తి దగ్గరనే నేనుండిపోతాను"

రాజా...కు కర్తవ్యం తోచలేదు, మామయ్య ఇదేమైనా వింటే కొంప మునిగిపోతుంది. తానసలు చాలా తెలివితక్కువ పని చేశానని తాత్కాలికంగా అనుకోక తప్పింది కాదు. తెగించి అన్నాడు——

"శకుంతలా, నిన్ను బతిమాలుకుంటా: ఇప్పటికి వెళ్లిపో.. వెళ్లు దీనితో నా ఫ్యూచరంతా ధ్వంసమై పోతుంది. క్షమించమనడం కన్నా ఇప్పుడేమీ చెప్పలేను. నన్నింక హింసించకు_"

శకుంతల విజయగర్వంతో చటాలున విజృంభించి__

"రాజారావ్! ఇప్పటికేనా నీ దుర్బల హృదయం నీకు బోధపడిందా ? మొగజాతిది ఎంత తేలిక బుద్ధో అర్థమయిందా ? స్త్రీ యౌవన విలాసాలకు గుండె చెదిరి, ప్రేమ అనుకుని ఆత్మవంచన చేసుకుని ఏ అమాయిక ఐనా దొరికితే ద్రోహంచేసి తమదారిని పోతారా ? ఇకమీదనైనా బుద్ధిగా చదువుకుని బాగుపడు. ప్రేమను గూర్చి ఇప్పుడు నువ్వు నాకు చెప్పిన సూత్రాలను నువ్వు బాగా మననంచెయ్యి. ఇట్లా మనం తేలిక బుద్ధులతో సంచరిస్తున్నాం గనకనే కాలేజీల గౌరవం గంగలో కలిసింది. అజ్ఞానులూ _ సుజ్ఞానులూ ఇందుకే కో ఎడ్యుకేషన్ అంటే చులకనగా మాట్లాడుతారు. ఇకమీదనైనా నావలె ఎవ్వరి మనశ్శాంతినీ చెడగొట్టకు. ఇట్లా అన్నందుకు మనస్సులో ఏమీ కించపడకు. ఇట్లా జరిగినట్లే జ్ఞాపకం ఉంచుకోకుండా ఈ పైని ఆప్తస్నేహితులుగా వుందాం. గుడ్ నైట్!"

జయప్రదంగా, పాంచజన్యం ఊదిన ఉత్సాహంతో, నవ్వుతూ శకుంతల మంగతో .... గబగబ ఇంటిమార్గం పట్టింది.

★★★

.

# మధురక్షణాలు

టి.వి.రత్నావళి

## (తెలుగు స్వతంత్ర – జనవరి 08, 1954 సంచిక నుంచి)

పెద్ద బడిభవనం దెయ్యంలా నిలబడి ఉంది. దానిని ఆనుకుని కుడివైపున పెద్ద మైదానం ఉంది, మైదానాని కెదురుగుండా బాలకృష్ణుని ఇల్లు. మైదానానికి ఈశాన్యమూలగా ఒక పెద్ద జామిచెట్టు, నైరుతిమూల మామిడిచెట్టు, ఆగ్నేయాన్ని చింతచెట్టు పిల్లల్నందర్నీ పిలుస్తూ ఉంటాయి. పిల్లలందరు పెరిగి పెద్దవారై మనుమల్నెత్తుతున్నా ఆవి మాత్రం తరతరాలుగా నిలుడి పిల్లల్నే పిలుస్తూన్నాయి. బాలకృష్ణుడు మామిడి పిందెలు నములుతూ చెట్టెక్కి అందరికీ కాయలు రాలుస్తున్నాడు. చెట్టు క్రింద గుంపు పిందెల కోసరం పెనుగులాడుకుంటున్నారు. చింతచెట్టు క్రింద గుంపు లొట్టలేసుకుంటూ లోకాన్ని మరచి పోయింది. ఎనిమిదిన్నరకు చెట్టు క్రిందికి చేరి చెడుగుడి ఆడి, చెమటలు కక్కుతూ, చింతకాయలు, మామిడిపిందెలు తింటున్నారు. మధురక్షణాల్లో బడి సంగతి మరిచిపోయిన వాళ్ళందరికీ లీడరు బాలకృష్ణుడు.

మధుర క్షణాల్ని మాయం చేయడానికి బడి గంటలు గణగణ మని చెవులు గింగురుమనేటట్లు మ్రోగుతున్నాయి. పిల్లలందరు పుస్తకాలు పుచ్చుకు పరుగిడుతున్నారు. మంత్రగాడి మంత్రాలకి యంత్రాల్లాగుండే కీలుబొమ్మలలాగ బడి గంటల కందరూ బడిలో బంధింపబడ్డారు——బాల కృష్ణుడు తప్ప.

"అబ్బ! దిక్కుమాలిన గంట మృత్యువులా ప్రత్యక్షమైంది. అయినా అందరూ ఫస్టు బెల్లుకు పరుగెట్టడమెందుకు? థర్డు బెల్లుకి అందుకోలేక పోతామా?" అని బాలకృష్ణుడు చెట్టుదిగి తన చుట్టూ ఉన్న గేంగు చెదరకుండా చూసుకున్నాడు పళ్లు తింటూ,

సెకండు బెల్లు కూడా కొట్టేశారు. తన గేంగు కూడా గల్లంతవుతూ ఉంది. "అబ్బ! ఈ మూకకి చెప్పలేం!" అని సణుక్కుంటూ ఎదురుగుండా ఉన్న యింటికి పుస్తకాలకోసరం బయలుదేరాలని చూస్తున్నాడు.

గడియారంలో పదిగంటలుకొట్టాయి. కళ్లల్లో కట్టేసుకున్న కాగితాలకట్టల్ని కదిలించి మైదానం కేసి ప్రసరించాడు కళ్ళని కాంతారావు. కొడుకు చింతచెట్టుమిదికి రాళ్ళు రువ్వుతున్నాడు. బాలకృష్ణుడు ఎంత అల్లరి వాడైపోతున్నాడు! బడంటే బద్ధకం. చదువంటే నిద్ర. ఎంత ఆందంగా అల్లరితో కాలక్షేపం చేస్తున్నాడు! చీకూ చింతా లేని జీవితం. బాధ్యత భారం లేని బాల్యం మళ్ళీరాదు కదా! కళ్ళముందరి కట్ట రెప్పల్ని బరువెక్కించింది. బాలకృష్ణుని చిలిపి ముఖం ఆతణ్ణి ముగ్దుణ్ణి చేసి, రెప్పల బరువుని లాగిపారేసింది. ఔను! తనూ చిన్నప్పుడు అంటే కొడుకు ఈడప్పుడు పన్నేండేళ్ళప్పుడు అలా పొలాల గట్లలో తిరుగుతూ, ఎడ్లని బెదిరిస్తూ, రైతుల మీద రంకెలేస్తూ చేలల్లో చెడుగుడి ఆడుకుంటూ అల్లరిచిల్లరగా తిరిగేవాడు. ఎంత ఆనందంగా ఉండేది? నాన్న చదువుకోమని సాధించినా లక్ష్యపెట్టేవాడు కాదు. ఆటలాడుకుంటూ మధురక్షణాల్లో మైకమెక్కి తన్మయుడైపోయేవాడు. ఇప్పుడు అమ్మ ఆదరించి మళ్ళీ గడ్డపెరుగేసి అన్నం పెట్టదు. నాన్న చదువుకోమని సాధించదు, చేలగట్లు చెడు గుడి ఆడమని కవ్వించవు. మధుర క్షణాలు మరిరావు! మరిచిపోవాల్సిందే!

తను తండ్రి పాత్ర ధరించి తన ఆకారంలోనున్న "బాల"ని చదువుకోమని సాధించాలికదూ! ఔను మధురక్షణాల్ని మసిపూసి మారేడు కాయ చేసి చదువుకోమని సాధించాలి. లేక పోతే... మళ్లీ తనలాగే గుమాస్తాగిరీకి స్వాగతం చెప్పాల్సి వస్తుంది. గుమాస్తా సంకెళ్ళలో గింజుకుపోతూన్న తన జీవితం లాగ తన కొడుకు జీవితం జీర్ణం కాగూడదు. వీల్లేదు, నల్లమందు నిషాలో నవ్వులాగ బాల్యంలోని ముధురక్షణాలు బానిసగా తయారుచేస్తాయి. కళ్ళముందరి కాగితాల కట్టలు అతని హృదయాన్ని కదలించేశాయి. కొడుకుని కోప్పడాలని కాగితాలన్నీ కట్టకట్టి ఆఫీసుకి మోసుకుని వెళ్ళవలసిన సరంజామంతా సవరించుకుని వీధి వరండాలో కొచ్చాడు. అప్పడే ఆవిడగారి చేతుల్లో బాలకృష్ణుడు వెన్నదొంగలా దొంగ చూపులు చూస్తూ ఏమి ఎరగని అమాయకుడిలా బంధించబడి ఉన్నాడు. వెనక్కాల ఒక ముఫై యేళ్ళముదిత, మెటికలు విరుస్తూ తిట్టిపోస్తూంది నోటికొచ్చినట్లాను. ముదిత వెనక్కాల పదేళ్ళ అమ్మాయి పరికిణీ చౌక్కా తొడుక్కుని వెక్కి వెక్కి ఏడుస్తూంది కళ్లు వాచిపోయేటట్లు. నెత్తురు చిమ్ముతూన్న నెత్తిమిది గాయం నేరాన్ని నిరూపిస్తూంది. సాక్షి సావకాశంగా నేరాన్ని నిరూపిస్తూంటే, ఆవిడగారు ఆలకిస్తూంది. తనను చూసి మరీ మండిపడింది, "మళ్ళీ యిలాంటి దుండగీడు పనులు చేస్తే దుమ్ములు రేగ్గొడతా"నని దుమ్మెత్తి పోసింది.

"ఏమిరా?" అని కళ్లెర్రజేసాడు!

చింత కాయలు కొట్టుకుంటూంటే, తగిలిందని తనేమి ఎరగనని మొరబెట్టాడు బాల.

"ఆవిడ ఎదురుగుండా మరెప్పుడు అలాంటి పనులు చెయ్యొద్ద"ని నాలుగు బాదా! ఆవిడ మనసు తృప్తిపడింది. పిల్ల ఏడుపు మానేసింది "కసిదీర్చుకున్నా గదా!" అని పిల్లని చేత్తోపుచ్చుకుని విసురుగా వెళ్ళిపోయిందావిడ. భయపెట్టి బళ్ళోకి పంపించి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని కట్టల్ని కౌగలించుకుని ఆఫీసుకి హాజరయ్యాడు. ఆప్పటికప్పడే ఆఫీసరు ఆజ్ఞలు హాహాకారాలు చేస్తూ ఆహ్వానిస్తున్నాయి. అడుగుల్లో అడుగులేసుకుంటూ వెళ్ళి నిలబడ్డాడు.

ఫైళ్ళు పట్టుకురమ్మని అధికార స్వరంతో ఆజ్ఞాపించాడు. వర్కంతా వప్పజెప్పి ఆఫీసర్ని జోకొట్టి జోలపాటపాడి సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి మనస్సు శాంతపడింది. సాయంత్రం చల్లబడింది. అబ్బాయి అల్లరిలో ఐక్యమై మైదానంలో ఆడుకుంటున్నాడు.

ఏళ్ళు వేళ్ళమీదినుంచి లెక్క పెట్టుకుంటూ వెళ్లిపోతున్నాయి. జీవితాలు శిధిలాలయాలలో జీర్ణించుకు పోతున్నాయి. భూచక్రం చుట్టూ ఊహారేఖలు ఉరకలేస్తున్నాయి. సంవత్సరాలు సంగీతం పాడుకుంటూ, సాహిత్యాలు చదువుకుంటూ, సంఘాన్ని సాగదీస్తూ, నటీనటులతో నాట్యం చేస్తూ సాగిపోతున్నాయి, బాలకృష్ణుడు కాలేజీలో చదువుకుంటున్నాడు.

కాగితాలు కళ్ళముందేసుకొని కాంతారావుగారు కుర్చీలో కూర్చున్నారు భోజనం చేసి తమలపాకులు నవులుతూ, గంట ఎనిమిదిన్నర అయిఉంటుంది. మెల్లిగా పిల్లడుగులేసుకుంటూ తలపాగా పెద్దమనిషి స్వయంగా తనకి తనే ఆతనికి పరిచయం చేసుకుని సంబంధం విషయం కదలేసాడు. కాగితాల కట్టల్ని చూసిచూసి అతనికి బాలకృష్ణుడికి సంబంధం చూడాలని గాని, పెళ్ళి చెయ్యాలన్న తలంపే రాలేదు. సందర్భంగా సమాధానం చెప్పి వచ్చిన పెద్దమనిషిని సాగనంపాడే కాని సంబంధ విషయం ఆతనికి ఒకవిధమైన కదలికని తెచ్చింది. బాలకృష్ణుడు అప్పడే ఎంత వాడై పోయాడూ? భోజనాలు చేసి రాత్రి తను తాంబూలం నములుతూ కాగితాల కట్టముందు కూర్చుంటే ప్రక్కనేతల్లి ఒడిలో తలదాచుకుని మధురక్షీరాన్ని గ్రోలుతూ దోబూచులాడే బాలకృష్ణుడికి పెళ్ళా? ఉత్త. . . అల్లరివాడై పోయాడు. ఆవేళ పదేళ్ళ పిల్లని రాయుచ్చుకు కొట్టాడు. ఎంత అప్రతిష్ట! కాలేజీకి వెళ్ళాక మరీ రౌడీలా తయారయ్యాడు. సిగరెట్లు! సినిమాలు! ఒకటేమిటి? ఆఖరికి వీడు ఎందుకూ పనికి రాకుండా పోతాడేమో? వాడి పుస్తకాలనిండా కాలేజీ ఆడపిల్లల ఫోటోలే? ఇప్పడే పెళ్ళి చెయ్యకపోతే లాభంలేదు. చేస్తే... ఇంకా చదువైనా పూర్తి కాలేదు. ఉద్యోగంలేందే పెళ్ళేమిటీ అయినా వేసవి శలవుల్లో పరీక్షలైపోతాయి గదా!రిజల్ట్సు వచ్చాక ఉద్యోగమిప్పించి పెళ్ళిచేస్తే వాడి కాపరం వాడు సుఖంగా చేసుకుంటాడని నిశ్చయించుకున్నాడు. తనకలాగే స్కూలుఫైనలు ఆవగానే నాన్న పెళ్ళి చేసేసాడు. సంసార భారం నెత్తిమీద వేసి చల్లగా సాగనంపాడు. కాలేజీ జీవిత మధురక్షణాల మాధుర్యం కలలోనే అణిగిపోయింది. తను కాలేజీలో చదివిన మొదటిసంవత్సరం! ఎంత enjoy చేసాడు, అడుగులోనే హంసపాదులా ఆర్నెల్లకు నాన్నపోవడం, సంసార తాపత్రయం నెత్తిన పడడం! ఉద్యోగం చెయ్యందే ఇంట్లో గడవక పోవడం!! అన్నీ ఆలా జరిగిపోయాయి. కొడుకునైనా కాలేజీ చదువు చదివించి ఆఫీసర్ని చెయ్యాలి. ఆప్పుడు కాని వాడికి

పెళ్ళి చెయ్యనని అనుకున్నాడు. జీవితమాధుర్యంలోని మధురక్షణాల్ని కలుగజేస్తూ వచ్చాడు. కొడుకు కాశీలో ఇంజనియరింగు ప్యాసై వచ్చాడు. కొడుకుని చూసుకుని కొండెక్కాడు కాంతారావు. కొడుకు పెద్ద వాడైనట్టు అప్పుడనిపించిందతనికి. సంబంధాల కోసరం తాపత్రయపడ్డాడు. జాబితా సెట్టి సంబంధాలన్నీ ఎకరువు బెట్టాడు. బాలకృష్ణుడు మాట్లాడలేదు. ఎప్పుడూ యింతే! ఉత్త.. అల్లరి వాడు, పెద్దవాడైనా అల్లరి, పెంకితనం మాత్రం పోలేదు. వాడి చూపు ఏవైపునుందో కూడా తెలియదు! చిన్నప్పటినుంచీ దుడుకుతనం తప్ప. మంచీచెడ్డా ఏమీలేదు...ఇంక రెండు నెలల్లో తను రిటైరై పోతున్నాడు. వీడికి ఏమీ తెలియదని సణుక్కుంటూ ఆఫీసు నుంచి ఇంటికి చేరాడు. ఇంట్లోకి ప్రవేశించాడు.

సావిట్లో ఇద్దరు ముగ్గురు స్త్రీల సంభాషణ వినిపిస్తూంది. ఆవిడగారు హడావిడిగా తిరుగుతూంది. కొడుకొక్కడూ మేడమీది గదిలో నిశ్చింతంగా నిద్రపోతున్నాడు. ఆవేళ ప్రత్యక్షమైన తలపాగా ఆసామియే మళ్ళీ సాక్షాత్కరించాడు. పెళ్ళి విషయం ప్రస్తావించాడు. అబ్బాయినడిగి ఒక రోజున బయలుదేరి వస్తామని చెప్పాడు. అసలు అబ్బాయికి ఒక్క సంబంధమూ నచ్చడంలేదు. ఇంతకీ వాడితో ప్రస్తావించి మెల్లగా నచ్చచెప్పి తీసుకుని వస్తానని చెప్పి సాగ నంపాలని చూశాడు తండ్రి.

"చూపులనవసరముండీ! పెళ్ళికొడుకు, పెళ్ళి కూతురు ఎప్పడో కాలేజీలో చూసుకుని ప్రేమించుకున్నారు. ఉద్యోగమైతేనే కాని చేసుకోనన్నాడు. అందుకని ఇన్నాళ్ళు ఆగాము" అన్నాడు ఆ ఆసామీ,

బిత్తరపోయాడు కాంతారావుగారు. ఆంత నాటకం మళ్ళీ తన నెత్తినెందుకో? ఏమిటి? అమ్మాయిని అబ్బాయి, అబ్బాయిని అమ్మాయి కాలేజీలోనే ప్రేమించుకొన్నారా! వీడు ఉత్త అల్లరివాడు... వీడింక ఈ అల్లరి తగ్గదు... ఎన్నేళ్ళొచ్చినా వీడికి యింతే! అల్లరికి అంతు లేదు. పుస్తకాల్లో కాలేజీ ఆడపిల్లల ఫోటోలు చూసినప్పడే అనుకున్నా! వీడి వేషమంతాను. నయం యింకా ఏవో అక్షరం ముక్కలబ్బాయి! లేకపోతేనా?... ఎంతనగుబాటు! అని ఆలోచిస్తుండగానే నిద్రలేచి వచ్చాడు బాలకృష్ణ, సంగతంతా కనుకున్నా! "ఆ పిల్లని తప్ప ఇంకెవర్నీ చేసుకోనని" కచ్చితంగా చెప్పేసాడు. చేసేదేమి లేక ఒప్పకున్నాడు. ఇంతకీ పిల్ల అందంగానే ఉంది. ఇంత చదువుకుంది. చక్కగా పాడుతుంది ఇంకేం కావాలి అబ్బాయికి!

"తండ్రిలేని పిల్లా! . . . ఇంతకీ నియ్యోగులా? తల్లి మేస్టరుటగా?"

"ఆయినా ఆ పిల్ల తల్లి రెండో పెళ్ళి చేసుకుందిటగా! అప్రతిష్ఠ!" అని అందుకుంది తల్లి.

ఆయినట్టే యిక పోనీ కట్నమన్నా... కాసన్నా లేదాయే!... ఈ సంబంధం వీడికెక్కడొచ్చిందో? నిర్భాగ్యుడికి ... మంకుపట్టు ... తామునిగింది గంగ, తావలచింది రంభ అని సణుక్కుంటూ చేసేదేమీ లేక ఒప్పకున్నాడు. కాలేజీలో చదువుతూన్నప్పడు ఎన్నో గొడవలు జరిగాయట! మన శూరాగ్రేసరడు కాశీ వెళ్ళే ముందు చెయ్యికోసుకొని రక్తంతో "నిన్నుతప్ప ఇంకెవర్నీ పెళ్ళిచేసుకోను!" ఆని రక్తాక్షరాలు ప్రమాణాలు రాసియిచ్చి మరీ వెళ్ళాడట! ఎంత వాడయ్యాడో! సుపుత్రా! కొంపతీయకురా" ఆని వీడికి ఏం పొయ్యేకాలం వచ్చిందో! వేలకి వేలు కట్నాలిచ్చి చక్కని చుక్కల్ని కాళ్ళముందు పడేస్తూంటే...!

ఈ కాలం వాళ్ళ కేమీ చెప్పలేం బాబూ! మాట్లాడితే మరచిపోలేని మధురక్షణాలని కలవరించడం. కథలు వ్రాయడం అంతా పిచ్చి మాలోకం.

పెళ్ళి జరుగుతూంది. మనోహరమైన మధుర క్షణాల్ని మందహాసంతో చూపిస్తున్నారు, కాంతారావుగారు కోడల్ని పెద్దకళ్ళ చేసుకుని పరికిస్తున్నాడు. కోడలి కేవిధమైన లోటూ లేదు. పిల్ల మతాబులా వెలిగిపోతూంది. పైగా చదువుకున్న పిల్ల. అని మురిసిపోతూండగా కణతకి కొద్దిగా పైన నుదిటిమీద మచ్చ కనబడింది. ఈ చిన్న మచ్చ లేకపోతే ఎంత బాగుణ్ణు! అనిపించింది కాంతారావుగారికి.

"కోడలు చక్కగా ఉందా?" అని పలక రించింది వియ్యపురాలి చెల్లెలు వీరమ్మ,

నుదుటిమీది మచ్చ లేకుండా ఉంటే ఎంత బాగుణ్ణు? అని చూస్తున్నానన్నా డాయన. ఏదైన ఒక వంక కనిపిస్తుందా? చూద్దామా అని వెతుకుతూ,

"మీరు తెచ్చిపెట్టుకున్నదేగా ఆ మచ్చ! మీ అబ్బాయి పదేళ్ళక్రిందట చింతచెట్టు చాటు నుంచి రాయి విసరకపోతే ఎంత బాగుణ్ణు? ఈ మచ్చకూడా ఈ పిల్లకి ఉండేది కాద"ని దెప్పింది వియ్యపురాలు. విస్తుపోయాడు వియ్యంకుడు, కథ విని ముక్కుమీద వేలేసుకున్నారు ముత్తైదువలు. ఆ

మదురక్షణాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఔను! ఆవేళ ఆపిల్లకి ఎంత గాయం తగిలింది! పూలతో బంతు లాడుకుంటే మీ అబ్బాయి రాళ్లతో రత్నాలతో బంతులాడాడు!" అని పక్కనుంచి వినిపించిందొక సన్నని కంఠం.

అబ్బాయి చేతికి కంకణం కట్టడానికి వాచీ విప్పాడు – వాత ప్రత్యక్షం! చెయ్యి కోసుకుని రక్తాక్షరాలతో ప్రమాణం చేసాడు పెళ్ళికొడుకు అవేనా మధుర క్షణాలు! తీయని తలపులా? ప్రణయ బాధలా? ఏమిటిదంతా! ఆవలించాడు తండ్రి.

కోయంబత్తూరులో కొడుకు ఆఫీసరు. కాంతారావు రిటైరై కొడుకుదగ్గరే ఉండిపోయాడు. సంధ్యావార్చుకుని జపం లోంచి కళ్ళు విప్పాడు తను. ఉదయభానుని అరుణకిరణాలు అబ్బాయి మీదపడి ఆడుకుంటున్నాయి. అబ్బాయి ఉంగలు కొట్టుకుంటూ అరుణకిరణాల్ని అందుకుంటున్నాడు. కొడుకు ఈజీ ఛైరులో పడుక్కుని సిగరెట్టు తాగుతున్నాడు. నిశ్చింతగా కోడలు కాఫీ అందిస్తూంది. మళ్ళీ మధురక్షణాలు మందహాసం చేసాయి.

పాతిక సంవత్సరాలక్రితం పాలు త్రాగుతూ తల్లి ప్రక్కలో ఉంగలుకొట్టిన బాలకృష్ణుడు చింతచెట్టు క్రింద అమ్మాయిల మీద రాళ్ళు రువ్విన బాలకృష్ణుడు, కాలేజీ చదువులో రక్తాక్షరాలు రాసుకున్న బాలకృష్ణుడు... ప్రేమతో పెళ్ళిపీటల మీద కూర్చున్న బాలకృష్ణుడు... మళ్ళీ మధురక్షణాలు... బాలకృష్ణుని భాగ్యదేవత, భారతదేశపు భావిపౌరడు ఉయ్యాలలో ఉంగలేస్తున్నాడు. మధురక్షణాలు పరావర్తనంచెంది, పలకరించాయి. ఇంక ఒక్కటే మధురక్షణం... మిగిలింది. బాలకృష్ణుడు చేత్తో... భక్తిగా నిప్పు పెట్టడం.

★★★

★★★

.

# బీ

# బుచ్చిబాబు

## (జయంతి – జూలై 1959 సంచిక నుంచి)

పూర్తి పేరు హాషిమా బీ. పనుండి హైదరాబాదు వెళ్లాను. స్నేహితుడు కుటుంబారావు ఇంట్లో దిగాను. ఆమెను అక్కడ చూశాను, పదకొండు, పన్నెండు సంవత్సరాల వయస్సుంటుంది. కుటుంబరావు అల్లా ఊర్లోకెళ్లాడు. ఒక్కడినీ ముందు గదిలో కూర్చుని పత్రిక చూస్తున్నాను. బుట్టలోంచి పూల గుత్తితీసి నాముందు బల్లమీద పెట్టింది 'హాషిమా బీ' ఆమె కేసి చూశాను. నవ్వింది. వాలకం, వైఖరి చూసి ముస్లింకన్య అనుకున్నాను. కోలమొహం, చామనచాయ. కొలతబద్దతో కొలిచి అమిర్చినట్లుగా తీర్చిన పళ్ళవరస– లేత పెదవుల వెనక చీకటి అడివిలో మంటలా, స్ఫుటంగా మెరుస్తుంది. అతికించి పెట్టినట్లు క్రమమైన కనుబొమ్మలు, మధ్యపాపిట ఇరుప్రక్కలా గూళ్లు తెలియని నల్లపిట్టలులా, సగం సగం వొచ్చిన రెక్కలమీద ఎగిరిపడుతున్నట్లు ముంగురులు– చిన్ని గడ్డం. దాని మధ్య సున్న ఆకారం పచ్చబొట్టు. చినిగిపోయిన ఎర్రగౌను. తెల్లలాగు; మెడచుట్టూ పెనవేసుగుని బాధతో విడిచి విరహంతో వొదలలేక భుజాలు పట్టుగుని దేవుల్లాడుతున్న రెండు జడలు– పల్చటిగౌను, దాని కంతలలోంచి, ఎదిగి ఆకృతి తెచ్చుకుంటూన్న అపురూపమైన శరీర అవయవాల కదలిక కనబడుతూంది. నదివొడ్డున గడ్డకట్టిన మట్టిముద్ద నీటితాకిడికి వొక స్వరూపం తెచ్చుకుంటుంది. ఆ మట్టిముద్ద మధ్యలో యుగాలక్రితం యిరుక్కుపోయిన మణిలా ఆమె శరీరంలో జీవితతృష్ణ మూలమూలల మెరుస్తోంది. పరిశుభ్రతకి అలవాటుపడని శరీరం– దుస్తులకు, జుట్టుకు దుమ్ము, మట్టి. చటుక్కున ఆకర్షించేది ఆ పిల్ల చూపులు. దంతపు పెట్టె తెరవగానే, లోన బంగారపు తమలపాకులా కనురెప్పల గుండా దూసుకొచ్చి వెడల్పుగా కనబడి, పక్కకి వొదిగి నిలబడ్డట్లు మొనలు తేరి, ప్రకాశించి కలవరపెట్టే చూపులు 'బీ' వి.

ఆకళ్ళ ఆకర్షణ మామూలు ఆకర్షణకాదు, అది అందంగా కూడా కనబడదు. కొన్ని జలచరాల మెదడుపైన మణులుండేవంటారు. ఆ మణిలో భీభత్సంగా కనబడి గగుర్పాటు కలగజేసే వొక వికృతమైన ఆకర్షణ వుంటుంది. అల్లాంటి ఆకర్షణ ఆమె కళ్లలో వుంది. గుండ్రటి కళ్లు అంత బాగుండవు. ఆమె కళ్ళు గుండ్రంగా లేక పోయినా, నల్లపాప గుండ్రంగా కదలడంవల్ల, చూపులు అల్లా గుండ్రంగావున్నట్లు కనబడతాయేమో అనుకుంటా. నిశ్చలమైన చూపుకాదది. కంటిలో పాప గుండ్రంగా, గిరగిర తిరుగుతూ వుంటుంది. మనకేసి చూడదు, మనచుట్టూ చూస్తుంది. అల్లా చూస్తూ నవ్వుతూ నిలబడింది. లోపలనుండి పనికుర్రాడు. మరెన్న వొచ్చి బల్ల మీద పూలగుత్తిని తీసుకువెళ్లాడు.

బీ గది అవతలకినడిచి, తలుపు వెనక నిలబడి, మొహం మాత్రం కనబడేటట్లు వొంగి నాకేసి చూస్తూ నవ్వుతూ నిలబడింది. లోపలికి రమ్మన్నాను.

రానన్నట్లు తలవూపి నవ్వింది.

"నీ పేరేమిటి ?"

"బీ"

"ఇట్లారా... !"

వొచ్చిందీ, కళ్లు నాచుట్టూ చూస్తున్నాయి.

"ఇదిగో.. మరి నువ్వు పూలెట్టుగోవా ?"

"ఉహు" అన్నట్లు తల ఊపింది. జడలు బుజాల మీద కదులుతున్నాయి.

"ఏం పని చేస్తావు ?"

నవ్వింది. మాట్లాడదు. నా పక్కనే బల్లమీద ఫాన్ కేసి చూస్తోంది.

"తెలుగు మాట్లాడతావా ?"

మాట్లాడతాను అన్నట్లు తల ముందుకు వూపింది.

మూగ పిల్లేమో అనుకున్నాను, ఫాన్ కేసి వొకటి రెండడుగులేసింది. ఫాన్ ముందు చెయ్యి జాచింది.

"ఇంద–ఏమన్నా కొనుక్కో" అని జేబులోంచి వొక అణా తీసిచ్చాను.

పుచ్చుగోనన్నట్లు తలవూపింది.

"ఫరవాలేదులే."

తీసుగుంది. ఫాన్ కేసి చూసి నవ్వుతొంది,

ఫాన్ రెక్కలతోపాటు ఆమెకళ్ళు గిరగిర తిరుగుతున్నాయి,

"గాలి వేస్తోందా?"

ఊ అన్నట్లు తలపంకించింది.

"ఇప్పుడు" అని ఫాన్ నిలిపివేశాను.

నవ్వింది బీ. ఫాన్ తిరగడం బీకి వొక వింత. బీదపిల్ల అట్లాంటిది ఎప్పుడూ చూసివుండదు.

"మళ్ళా తిప్పండి" అన్నది బీ.

అమ్మయ్య మాటలొచ్చు. మూగది కాదు. ఫాన్ తిప్పాను. ఆమె కళ్ళు ఆఫాన్ రెక్కలతోపాటు గిరిగిర తిరుగుతున్నాయి. కాసేపు తిరగనిచ్చి, ఆమె స్విచ్ ని కదిపి ఫాన్ నిలిపివేసింది. అదంతా ఆమెకి వినోదంగా వుంది. ఫాన్ అల్లా కదిపితే పాడైపోతుంది. వొద్దు అందామనిపించింది. స్వంత ఫానవుతే అట్లా అప్రయత్నంగా అని వుందునేమో.

మళ్ళా స్విచ్ ని కదిపి ఫాన్ తిప్పింది బీ. నాకు నవ్వొచ్చింది. కుటుంబరావు ఇంట్లో రేడియో సెట్టు, గోడమీద ఎత్తుగా బల్లమీద పెట్టాడు. కిందగా వుంటే పిల్లలు దాన్ని కదిపి పాడుచేస్తారని భయంట.

ఈ ఫాన్ కి జైలుకడ్డీలు లేవు. వొక రకం చట్రం వుంది; కాని దాని అల్లిక దగ్గరగా లేదు. చెయ్యిపట్టే సందులుగల చట్రం అది. నా కోసం ఆ ఫాన్ తీయించి పెట్టినందుకు నవ్వొచ్చింది. పిల్లలు స్కూలు కెళ్ళారు. 'అమ్మో' అని కేక వినబడింది. పక్కకి తిరిగి చూశాను. ఉంగరం వేలుని నోట్లో పెట్టుకుంది బీ. ఏం జరిగిందో తెలిసింది. ఆ ఫాన్ తిరుగుతుంటే అందులో వేలు పెట్టింది. వేలుకి దెబ్బ తగిలింది. చెయ్యి తీసేసి, వేలు నోట్లో పెట్టుగుంది.

"దెబ్బ తగిలిందా ?"

వేలు పైకి తీసి చూపించింది. రక్తం లేదు. మంట పెట్టే దెబ్బ తగిలివుండొచ్చు. లోపలినుంచి పనికుర్రాడొచ్చి ఆమెను కసిరాడు. మళ్లా ముట్టుగుంటే చేతులు విరగ్గొడతానన్నాడు. అవతలకి పొమ్మన్నాడు. బీ నాకేసి జాలిగా చూసింది. నేనేం చెయ్యను ?

"అందులో వేళ్లు పెడితే దెబ్బ తగులుతుంది. అల్లా చెయ్యకేం" అన్నాను.

సరేనన్నట్లు తలవూపి, నవ్వింది. పనికుర్రాడు ఆమెను దూరంగా నెట్టి, తలుపు వేశాడు. ఆ వీధిలో మాంసంకొట్టు సాయబు పిల్లట బీ. వాళ్ళమ్మ మిషను కుడుతుంది. ఆ వీధిలో వున్న యిళ్లల్లోకి వెడుతూ, యజమానులు చెప్పిన చిల్లరపన్లు చేసిపెడుతూ వుంటుందిట. పూలు, పాలు, పేపర్లు, రిక్షాలు– యిట్లాంటివి తెచ్చిపెట్టడం, ఎవరికి తోచింది వారు ఇస్తోంటారుట. పిల్లలతో ఆడుకుంటూ వుంటుందిట. గదుల్లో కొచ్చి ఫాన్ లో చేతులు పెడుతూ వుంటుందిట.

పిల్లలందరికీ ఫాన్ లో వేళ్ళు పెట్టడం మామూలే. పిల్లలకి కదలికంటే చాలా ఇష్టం. ఫాన్ నిలిపి, మళ్లా కదిలేటట్లు చెయ్యడంలో వారి శక్తి ప్రకటితమవుతుంది. ఆ ప్రకటనలో వారికానందం వుంది. నేను మరొకటి గమనించాను.

మగపిల్లలకి కదిలే ఆటవొస్తువులంటే యిష్టం; ఆడపిల్లలకి కదలని బొమ్మలంటే ఎక్కువ యిష్టం. ఈ సూత్రాన్ని గుర్తుంచుకునే నేటి ఆటవొస్తువులు తయారవుతున్నాయనుకొంటా. అందుకనే గిరగిర తిరుగుతున్న ఫాన్లో చెయ్యి పెట్టి నిలిపివేసిందేమో బీ అనిపిస్తుంది.

ఆ మర్నాడు మరొక చిత్రమైన దృశ్యం చూశాను. కిటికీలోంచి రోడ్డుమీద నడిచే జనం కేసి చూస్తూ కూర్చున్నాను. చెట్టుపక్కన చిన్న మాంసం దుకాణం ముందు. ఎవరిదో బైసికులొకటి స్టాండ్ మీద నిలబెట్టబడి వుంది. హాషిమాబీ అటుకేసి వెడుతూ ఆ సైకిల్ ముందు చూస్తూ నిలబడి వుంది. పెడల్ తిప్పి, వెనక చక్రం కదిపింది. పెడల్ వేగంగా తిప్పింది. చక్రం మరింత వేగంగా తిరుగుతోంది. బీ తన చేతిని ఆ చక్రం కడ్డీల మధ్య పోనిచ్చి, నిలపబోయింది. దెబ్బ తగిలినట్లుంది. చటుక్కున చెయ్యి తీసివేసి వేలుని నోట్లో పెట్టుకుంది.

తనకేసి ఎవరేనా చూశారేమో అన్నట్లు నలుదిక్కులా చూసింది. నే కూర్చున్న కిటికీ వేపుకూడా చూసింది. నవ్వింది. పరుగెత్తుకు పోయింది.

నాకూ నవ్వొచ్చింది. ఆ అమ్మాయికీ నాకూ ఏలాంటి సంబంధమూ లేదు; వుండదు. అయినా ఎందుకో మాయిద్దరి మధ్యా వొక చిత్రమైన సన్నిహితత్వం ఏర్పడినట్లైంది. తరిచి చూస్తే అది కనబడదు; కారణాలు వెదికితే దొరకవు. సముద్రంలోంచి ఆవిరి లేచి మేఘంగా మారి క్షణంలో భూమ్యాకాశాలని ఏకంచేసి, కదిలి మాయమవడంలోవున్న స్థూలత్వమే ఈ ఆప్యాయతలోని అనుభవానికీ వుందనిపిస్తుంది. ఫాన్లో వేళ్ళు పెట్టి నిలపాలని పిన్నలకేకాక, పెద్దలకి కూడా అనిపిస్తుంది. నాకట్లా ఏన్నోసార్లు అనిపించేది, దీనికి కారణం ఏమిటో మానసిక శాస్త్రజ్ఞులు చెప్పాలి.

తెలియనివాటిని శోధించి తెలుసుకోవాలన్న అభిలాష మానవ నైజం ! స్విచ్ లో చెయ్యి పెట్టి, విద్యుత్ ద్వారా షాక్ తింటే ఎట్లావుంటుందో ! అల్లాగే ఫాన్లో చెయ్యి పెట్టి ఆపితే ఏం జరుగుతుందో ! దెబ్బ తగులుతుంది. ఆ దెబ్బలో బాధ వూహించుకుని మనపట్ల మనకి సానుభూతి కలగడం, ఆ సానుభూతితో ముడిపడే ఆదరణ, శాంతి– యీ రకం చేష్టలకి ప్రేరణ అని తోస్తుంది. నాలుగంతస్తుల మేడమీద నుండి కిందికి చూసినప్పుడు, వొక్కక్షణం, ఆ గోడమీద నుండి కిందికి దూకాలనిపిస్తుంది. ఊపిరి బిగపెట్టి అంతపనీ జరిగినట్టు వూహించి, గోడనుంచి వొకడుగు వెనక్కి వెయ్యడం జరుగుతుంది. మనల్ని మనం మానసికంగా బాధించుకోడం కిందకొస్తుంది యీ తృష్ణ. కాని చాలామందిలో, నాలోలాగే, యీ తృష్ణ ఊహలోనే వుండిపోతుందేమో ! బీ విషయంలో, కార్యరూపం దాలుస్తోంది యీ బుద్ధి. నాకు చెయ్యాలనిపించి కూడా చెయ్యలేకపోయిన పనిని కాస్తా, ఆమె సాహసంతో చేసేసింది. అందుకనే ఆమె పట్ల ఆ రకం ఆకర్షణ, అన్యోన్యం ఏర్పడిందేమో అని స్ఫురిస్తుంది. “నువ్వు చెయ్యవు కాదూ ! చూడు, నేను చెయ్యి పెట్టి ఆపుజేస్తా” అన్నట్లు. ఆపని చేసి, చేసినట్లు నవ్వు ద్వారా ప్రకటించి వెళ్ళిపోయింది బీ. ఇంతటి స్వల్పవిషయంతో మా ఇద్దరిమధ్య ఒక స్నేహభావం ఏర్పడినట్లనిపించిది. ఆమె జీవితం ఆమెది– నాది, నాది. మా మార్గాలు వేరు ఏదో బాధ, బాధని తీసెయ్యాలన్న బాధ, –తీసెయ్యలేనందుకు నాకు బాధ, నా బాధనిచూసి ఆమె బాధ– అంతా ఆ గిరగిర తిరిగే బీ కళ్లల్లో, తిరిగిపొయ్యే కళ్ళని నిలిపినట్లుగా నవ్వినప్పుడు నిశ్చలంగా మెరిసే ఆమె పళ్ళమధ్య తళుకు– శాశ్వతంగా కదిలిపోయిన మధుర క్షణం ఆ అనుభవం.

కుటుంబరావింట్లో గడిపిన ఆ రెండు మూడు రోజులూ, లోలోన యిట్లాంటి ఆలోచనలు సాగించినట్లు గుర్తు. పని కాగానే వెళ్ళిపొయ్యాను. ‘బీ’ విషయం మరిచిపొయ్యాను కూడా.

నాలుగేళ్ల తర్వాత మళ్లా హైదరాబాదురావడం జరిగింది. కుటుంబరావింట్లో శుభకార్యం. నాకు వేరేపనికూడా వుంది. బీ కనబట్టంలేదేం ? అని అడిగాను. ఏడాది క్రితం మహబూబ్ అనే వొక ముస్లిమ్ కుర్రవాడిని వివాహం చేసుకుందిట. అత్తవారింటికి వెళ్ళిందిట.

“రేపొస్తుందంటండి” అన్నాడు పనికుర్రాడు మరెన్న. వెనక బీ ని కసిరి గదిలోంచి పంపించి తలుపేసింది వీడే. వీడూ ఎదిగాడు. కంఠం బరువైంది. క్రాఫ్ పెద్దగా పెంచి వెనక్కి దువ్వాడు. నుదుటిమీద పడే వెంట్రుకలని వెనక్కి తోసివెయ్యడం, వాటిని ముందుకు లాగి, మళ్లా వెనక్కి తోసెయ్యడం– అది వాడికి సరదా. గోడ వెనక్కి నక్కి సిగరెట్టు పీలుస్తున్నాడు. అది నే గ్రహించినట్లు తెలుసుకుని, కాస్తంత సిగ్గుపడి, నవ్వుతాడు. వాడిని చూస్తే బీ జ్ఞాపకం వొచ్చింది.

“బీ మొగుడి కేంపనిరా ?” అని అడిగాను.

“మోటారు సైకిల్ మీద డర్ బిర్, డర్ బిర్ మజాయించడము” అని నవ్వుతున్నాడు.

“నవ్వు దేనికిరా ?”

"అదేమో ఎనకాల కూర్చుంటుందండి. ఓ-డర్ బర్, డర్ బర్ మంటూ వూరంతా కజాయింపండి" అని నవ్వుతూ గోడ వెనక నక్కి సిగిరెట్టు దమ్ము తీస్తున్నాడు పనికుర్రాడు మరెన్న. 'మజాయింపుట', 'కజాయింపుట'--ఏవో క్రొత్త ప్రయోగాలు నా మీద పడేస్తున్నాడు యీ బాలభాషా కోవిదుడు, మరి !

నాకు నిజంగా బీని, భర్తని చూడాలనుంది. బీ కి పెండ్లయిందనగానే, చిన్నప్పుడు నేచూసిన ముస్లింల పెండ్లిండ్ల తంతు దృశ్యాలు జ్ఞప్తికొచ్చాయి- మేలి ముసుగులు, గుర్రాల మీద ఊరేగింపులు, మల్లెపూలదండలు, షహనాంలు వాద్యం, ఘాటైన పరిమళాలు – గ్యాస్ లైట్ వెలుగులో ముసుగు మధ్యలో మెరిసిన లేతనవ్వులు, నోరు విప్పితే అందులో వజ్రాలని దొంగిలించుకుపోతారన్న భయంతో బిగించిన పెదవులు.

బీ భర్తకి భారత భూసేనలలో పనిట- కుటుంబరావు చెప్పాడు. కొంతకాలానికి ఆమె భర్తకి పెద్దపదవి దొరుకుతుంది. భర్తసైన్యాన్ని అటూయిటూ నడుపుతుంటే, ఆమె వాటిని సంజ్ఞలుచేసి నిలిపివేస్తుందా ? ఆ దంపతులు గుర్రాల మీద స్వారీ చేస్తారా ? వెనకటి యుద్ధాలలో, గుర్రాలు, ఏనుగులు. ఇప్పుడు టాంకులు, మోటార్లు. బీ భర్తకు వొక మోటార్ సైకిల్ వుందిట. దానిమీద అతివేగంగా ప్రయాణం చేస్తూ వుంటాడట; భార్యని వెనకాల సీటుమీద కూర్చో పెట్టుగుని.

కాని మొర్నాడు, అత్తవారి వూరు నుండి బీ రాలేదు మరెన్న చెప్పాడు.

"ఎందుకో?"

"అసలు వొక చోట వుంటే గదండీ. ఆ మోటారుసైకిలు మీద, దాన్ని ఎనక కూకో పెట్టుగుని, చర్ సర్, చర్ సర్, గర్ బర్, గర్ బర్ మంటూ లగాయించడంతోటే సరిపోతుందండి" అన్నాడు మరెన్న, మరికొన్ని కొత్తప్రయోగాలు నా నెత్తిన రుద్దుతూ. ఆ మొర్నాడు నేను బైలుదేరి వొచ్చేశాను.

నేను ఇంటికొచ్చిన నెలరోజులకి కుటుంబరావు వ్రాసిన ఉత్తరంలో బీ భర్త మోటార్ సైకిలు మీద వెడుతూ ప్రమాదవశాత్తు సైకిల్ మీద నుండి ఎగిరిపడి, గాయాలవల్ల హాస్పటల్లో మరణించాడన్న వార్త చూసి దిగులుపడ్డాను. వెనక సీటుమీద బీ కూడా వుందిట. ఆమె కూడా పడిందిట. ఒకటి రెండు చిన్నగాయాలు తగిలాయిట, కాని పెద్ద ప్రమాదం జరగలేదుట.

ఏం జరిగిందో ఊహించవచ్చు. యువకులకి వేగంగా ప్రయాణంచెయ్యడం అంటే చాలా సరదా. కదలిక, పురోగమనం, వేగం—— వీటిని కాంక్షిస్తుంది యవ్వనం. భర్త మోటారుసైకిల్ మీద వెళ్ళినప్పడల్లా తనూ వస్తానని, వెనక సీటుమీద కూర్చుని, ప్రయాణం చేస్తూ వుండేది. అతివేగంగా వెడుతుంది మోటారుసైకిలు. వడికి పడిపోకుండా అతని భుజాలు గట్టిగా పట్టుగుని కూర్చుని వుంటుంది తాను. శృంగారపు తృష్ణని తాళ్లగా పేని అతని మెడచుట్టూ బిగించి ఇంక మోటారుసైకిల్ నిలపమంటుంది. అతను వినిపించుకోడు; ఆ శృంగారం చక్కలిగింతకి ఉద్రిక్తుడై మరీ వేగంగా సైకిల్ నడిపివుంటాడు. ముందుచక్రం వేగంగా కదలడం ఆమె చూస్తుంది. అందులో చెయ్యి పెట్టడానికి అందదు. అందులోనో వెనక చక్రంలోనో, కాలు పెట్టివుంటుంది- ఏమో ! మొత్తానికి నడుస్తున్న సైకిల్ ని నిలిపేయత్నం చేసివుంటుంది.

ఆ ఊగిసలాడ్డంలో భర్త పట్టు సడలివుంటుంది. వేగంలో మతిపోయి, ఏ మలుపు తిరగడంలోనో యంత్రంపట్ల ఆధ్వర్యం విస్మరించి, సైకిల్ తిరగబడి, ప్రమాదానికి గురై వుంటాడు. వేగంగా పెడుతున్న ఆ మోటార్ సైకిల్ ని, ఉద్రేకంతో కొట్టగుంటున్న ఆ గుండెలని, వొక్కసారి అరికట్టి, శాశ్వతంగా, స్థిరంగా, తనదిగా చేసుకోవాలన్న యత్నం అల్లా అంతమొందిందనుకుంటేనే నాకు తృప్తి. మృత్యువుకి కారణాలు ఏమిటో వేదాంతులు చెప్పొచ్చు. మరో కొత్త కారణం కల్పించింది. 'హోషియా మహబూబా బీ' ! అర్థరహితమైన జీవితానికి అర్థం కల్పించడం తప్ప, మానవుడు చెయ్య గలిగిన మహత్కార్యం ఏముంటుంది ?

పెండ్లికూతురుగా 'బీ' ని ఊహించుకున్నాను. తెల్లటి పైజామా – ఆకుపచ్చరంగు పొడుగాటి జుబ్బా– నారింజ రంగు కండువా మేలిముసుగులా తలమీద నుండి భుజాలపైకి రెండంచులూ జారేటట్లు ఆ పల్చని కండువా మడతలలోంచి ఆకుపచ్చ జుబ్బా – వక్షంమీద వ్రేలాడ వేసిన రెండు జడలు, –ఏ అవయవం కేసి చూడనీకుండా, గిరగిర తిరిగే కంటిలో పాప, నిలిచి చూడమని శాసించే పళ్లతళుకు, శాశ్వతంగా నవ్వే శిలాప్రతిమలా విడిన పెదవులతో నిర్మాణమైన విడని మొగ్గలాంటి ఆ చిన్నినోరు, దోవ వెదుకుతూ, గుండ్రటి ఆవరణ చేసుకుంటూ, బెదిరి వెనక్కి వెళ్ళి, తెగించి ముందు కొచ్చి, వొకరికొకరు తోడన్నట్లు వక్షంపై తేరుకుని శిఖరాలని అందుకుంటున్న చిన్ని గుండ్రటి స్థనాలు– రక్త మాంసాల పిల్ల.. పర్వతద్వయం నడుమ లోయలో కదలని నదిలా సన్నటి నడుం– హాషిమాబీని పెండ్లికూతురుగా అల్లా ఊహించుగున్నా, మరిప్పుడో వైధవ్యంలో బీ. అడివంతా వొక్కసారి మండినట్లు, యవ్వనపు శృంగారం వొక్కసారి ప్రజ్వరిల్లి, భూకంపంలా భర్త కోర్కెని చీల్చి, కిందికి పడేసి ఆశక్తితో అతన్ని చంపేసి, మండి మిగిలిన అడవిలో వొంటివృక్షంలా, ఎడారిలో మతిపోయి మిగిలిపోయిన చెట్టు వేరులా, చంద్రబింబాన్ని కామించి గెంతి మరి కిందికి దిగి రాని సముద్రం కెరటంపై తుంపరలా– ఎక్కడో హిమాలయ మంచుశిఖరాన ఇరుక్కుపోయిన తెల్ల మేఘంలా "బీ" నా ఊహలో నిల్చిపోయింది. పెండ్లికూతురుగా, తనూ భర్తా నన్ను చూడ్డానికొచ్చి సలాం చేసినప్పుడు, ఏవేనా కానుక ఇద్దామనుకున్నాను. వైధవ్యంలో ఆమెను తల్చుకుంటే అల్లా చూడకపోవడమే మంచిదనిపిస్తోంది. నాకెందుకీబాధ !

భర్త చనిపోయిం తర్వాత బీ ని కుటుంబరావు చూశాడుట. నేను మరోసారి హైదరాబాదు వెళ్ళినప్పుడు చెప్పాడు, వాళ్ళ పాతింట్లో కిటికీ వెనక నిలబడి, సంధ్యకేసి చూస్తూవుందిట. నల్లజుబ్బా. అక్కడ చిరిగిన తెల్లకండువా ముసుగులా జడ మీద కప్పి వేసి నిలబడిందట. అతన్ని చూడగానే గుర్తించినట్లు, వోపిగలేని మందహాసంలో, పళ్ళతళుకు, పెదవుల వెనక వికసించని పుష్పంలో పుప్పొడిలాగ ముక్కలై పోయిందిట. "నువ్వు చెప్పింది నిజమే. కంటిపాప గుండ్రంగా తిరుగుతున్నట్లు కనబడుతుంది." అన్నాడు కుటుంబరావు.

ఆ దృశ్యం కూడా నే చూడకుండా చేసిన విధికి లోలోన కృతజ్ఞత చెప్పుకున్నాను. విధిని వెక్కిరించనివారూ, తిట్టని వారూ లేరు. నాకు విధిపట్ల గురిలేదు. కాని యీ వొక్కసారి దాని వునికిని గుర్తించి, జోహారు చెప్పుకున్నాను.

కుటుంబరావుకి అక్కడ నుండి మరో ఊరు బదిలీ అయింది. వెడుతూ నాపని ముగిసేవరకూ తనింట్లోనే వుండవల్సిందిగా ఏర్పాట్లన్నీ చేసి, పనికుర్రాడు మరెన్నని వప్పగించి వెళ్ళాడు. ముందుగదిలో ఫాన్ లేదు. వీధులో వెనకవున్న మాంసం దుకాణం, చెట్టు, లేవు, ఇప్పుడక్కడ ఒక టీ దుకాణం అవతరించింది. రాత్రి పగలూ, గ్రామఫోను పాటలు లవుడ్ స్పీకరులోంచి బిగ్గరగా వినిపిస్తుంటాయి, ఆలోచన తోచనివ్వని ధ్వనులు. ఒకటి రెండు రోజుల్లోనే దానికి అలవాటు పడిపొయ్యాను. ఆ దుకాణం రోతగా తోచినా, ఎందుకో అది దగ్గరలో వుందనుకుంటే కాస్తంత ధైర్యంగా, అహ్లాదంగా కూడా వుండేది. అయిష్టత పురిగొల్పే వాటితో కూడా సమాధానపడి, వాటిని తనవిగా చేసుకుంటాడు కాబోలు మానవుడు.

టీ దుకాణం ముందు, సైకిలాగింది; వొక మోటారు సైకిలాగింది. ఇద్దరుముగ్గురు పిల్లలు చేరి వాటిని పరీక్షగా చూస్తున్నారు; బీ జ్ఞాపకం వొచ్చింది. ఆ యంత్రాలతో చెలగాటం ఆడి వినోదించేవారు లేరు కదా. బీ ఇప్పుడు ఎవరిళ్ళకీ వెళ్లడం లేదని చెప్పాడు, కుటుంబరావు. నాకామెని చూడాలనివుంది ఎందుకో! చూస్తే బాధగావుంటుంది నిజమే. బాధపడటంలో కూడా కాస్తంత ఆనందం పొందాలనిపిస్తుంది. త్రాచుపాము పడగపై గుర్తు, సముద్రం లోతులో ముత్యపు చిప్పలో ముత్యం, పౌరాణిక యుగంలోని జలచరం నుదిటిమీద వజ్రం, జుగుప్స కలిగిస్తాయి, ఆకర్షిస్తాయి. పాముని పెంచింది క్లియోపాత్ర. ముళ్ళపొదనీడలో వెన్నువాల్చింది ఈజిప్టురాణి నేఫెర్ టేరిటి. కత్తిని తన రక్తంలో ముంచి జాబు వ్రాసింది ఝాన్సి. ఈనాడివి 'బీ' కి సాధ్యంకావు. ఆమె చరిత్రకట్టల వెనక స్త్రీ. జమునా వొడ్డున పాడుపడిపోయిన మహల్లో మూలగదిలో గులాబిపూల మధ్య మొహం దాచుగుని, ఎఱ్ఱటి సంధ్యాలావణ్యం చూసి ఎఱ్ఱటి పెదవి కొరుక్కుని, కారిన రక్తంచుక్కలని రాని

ప్రియుడికోసం, తన గుండెవలె, ఆ చుక్కలు గడ్డకడుతుంటే చూసి విషాదంలో జారిన కన్నీటి బొట్లద్వారా, గడ్డకట్టనీకుండా, కామంతో శోకిస్తున్న చారిత్రక జనానాలోంచి విముక్త అయిన ముస్లింకన్య బీ. శాసించేటందుకు రాకొమారులు లేరు యీనాడు: జయించేటందుకు రాజ్యాలు లేవు; ఎక్కేటందుకు పల్లకీలులేవు. భగ్నంచేసేటందుకు ప్రేమించే హృదయాలు గుర్రాలమీద స్వారీచేస్తూ రావు. ఆ దొరికిన వొక్కదాన్ని, ఆయంత్రంలో పడేసి చంపేసింది.

టీ దుకాణంలోంచి తిన్నగా నాగదికొచ్చాడు కొత్తగా పరిచయం అయిన, రాజన్నగారు.

"పాపం బీ ఎల్లావుందో. చూశారా ?"

"ఆ మధ్యచూశాను. రెండు నెలలైందేమో"

"దానికేం నిక్షేపంలావుంది" అన్నాడు.

"అంటే ?"

"మా యింటికొచ్చింది చూడ్డానికి."

"దిగులుగా వుందా ?"

"దిగులేం తెగులు, ఆటీన్ రాణిలాగుంది. పైగా మా గోడగడియారం తగలేసింది."

"అంటే ?"

"మాదో పాతది, గోడగడియారం వుంది లెండి. మావాడు కీ ఇచ్చి, అద్దంతలుపు వెయ్యడం మరిచినట్లున్నాడు, బీ వెళ్ళి అందులో చెయ్యెట్టి, పొడుగాటి తీగకివుంటుందే పెండ్యులమ్ బిళ్ళని కదిపినట్లుంది. ఏంచేసిందో నేచూడలేదు. మొత్తానికి ఆ గడియారం కాస్తా మూలపడింది" అన్నాడు రాజన్న,

నాకు నవ్వొచ్చింది– ఆపుగున్నాను. పాడైంది మన గడియారం కాదుగా–నవ్వితే ఆయనకి కోపం రావొచ్చు.

"అన్నీ అట్లాంటి పన్లే. ప్రతిదాంట్లో వేళ్ళు పెట్టడం, చెడ గొట్టడం, వేళ్ళు విరగకొట్టుకోడం" అన్నాడాయన.

"మరంతే,––ఆ పిల్ల జీవితం? భవిష్యత్తు మాటేమిటి?" అన్నాను.

"ఏమో, ఎవడికి తెలుసు. వాళ్ళమ్మ మిషను కుడుతుంది. ఇదికూడా ఆ పని నేర్చుకుని, గడుపు గుంటుంది– ఏదో ఉపాధి దొరక్కపోదుగా" అని వెళ్ళాడు రాజన్న.

తరవాత, పనికుర్రాడు మరెన్న నడిగాను బీని గురించి. మరెన్న తన చెయ్యి బోర్ల తిప్పి చూపించాడు.

"చూడండి" అన్నాడు.

"ఏముంది ? ఏమీ కనబడ్డంలేదే" అన్నాను.

"ఇప్పుడంతా సాఫై పోయిందిలెండి–అబ్బో,–వెనక నాలుగైదేళ్ళయిందండి–దొడ్లో ఆ వరండా ముంగల మెట్లున్నాయి చూశారు– ఆడ కూర్చుని ఫినైలతో నేల తుడుస్తుండానండి. గుడ్డ పీలిక ముంచి చదునకు తుడుస్తుండా. ఆడ కొచ్చింది బీ –– నా చేతికేసి చూస్తూ విలబడింది. 'లెగు, పో, అవతలకి' ఆన్నానండి. గిరగిర తుడుస్తుంటే, నా చేతి మీదకి గెంతి, కాలుతో తొక్కిందండి. 'అమ్మో చచ్చా' అన్నానండి. ఫినైల్

గొట్టం బుద్ది పైకెత్తి, నెత్తిన పెడదామని తరుముకెళ్ళానండి. షర్ కిర్, బర్ కిర్ మంటా, ఓ దౌడు తీసిందండి” అని ప్రత్యేకమైన వాడిభాషలో కొన్ని అమూల్యమైన ధ్వనులతో మేళవించి వర్ణన చేశాడు మరెన్న.

“భర్త పోయింతర్వాత, ఆమెను చూశావా ?”

“లేదండి. మొగుడు చస్తే బైటకి రారండి వాళ్ళు–”

“మరి రాజన్నగారింటి కెళ్లిందిట.”

“కూరకో, పచ్చడికో ఆళ్ళమ్మ పంపివుంటుందండి.”

“ఇప్పుడు వూళ్ళో లేదా ?”

“లేదండి”

“ఏమైందో”

“హాయిగా మరో సాయబుని పెండ్లిచేసుకుందండి.”

“అదెప్పుడు ?”

“రెండు నెల్లయిందంటండి. అదుగో మిషనుకుట్టు మస్తాన్ చెప్పాడండి.”

“నిజంగా” అన్నాను ఆశ్చర్యం ప్రకటిస్తూ,

“అవునండి. మలబార్ సాయిబంట. హాఫీజంటండి ఆడిపేరు. ఇమానం నడుపుతాడంటండి. ఆణ్ణి చేసుకుంది.”

“వారి పెళ్ళి నువ్వు చూడ లేదా ?”

“పై ఊళ్ళో స్నేహం కలిసిందంటండి. కసిబిసిగా, బిగి జిగిగా, గప్ చిప్ గా చేసేసుకుందంటండి–ఇమానంలో తర్ మర్ సర్ మర్ గా తిరగొచ్చునని.” అంటూ పనిమీద వెళ్ళాడు మరెన్న,

నాకు నవ్వొచ్చింది–బీ మళ్ళా పెండ్లి చేసుకుందన్నవార్త వినగానే, ఏదో కొంత భారం తగ్గినట్లనిపించింది. కన్య జీవితం మాతృత్వంలోగాని సంపూర్ణమవదు. అందుకనే, కథలలోనూ, నవలల్లోనూ, విడివిడిగావున్న నాయికా నాయికలను జోడాలుగా కేటాయించ వల్సిందిగా రచయితని శాసిస్తాడు పాఠకుడు, వివాహంలో వారి కథ సమాప్తం కావాలి. తరవాత వాళ్ళు ఎట్లా వున్నదీ, ఏం చేసిందీ, అతను ఊహించుకోగలడు. తర్వాత ఏముంటుంది ? వారికి సంతానం కలుగుతారు. పెంచి, పెద్దలని చేసింతర్వాత, తలిదండ్రులు జీవితం చాలించుకుంటారు.

యుక్తవయస్సులో ఎవరేనా పెండ్లికానివారున్నారంటే, వారిపట్ల సమాజానికి బాధ్యత వుండితీరుతుంది. వారినో ఇంటి వారినిగా చేసేవరకూ సమాజం నిద్రపోదు. నాలో వున్నది యీ రకం తృప్తికాదు. వివాహం చేసుకోడంలో ‘బీ’ వ్యక్తిత్వం బైట పెట్టింది. ఆమె చాలా బీదది. నేను ఎదిగింతర్వాత చూడకపోయినా, పెద్ద చక్కంది కాదనే అనుకుంటాను. రోడ్డు ముగిసింతర్వాత ఊరవతల వానకి తడిసిన మన్ను గుట్టలు ‘బీ’ లాంటి స్త్రీలు. తోచక చేతులో వో ముద్దని తీసుకుని కాలక్షేపానికి దాన్ని కదిపి, దువ్వి. నొక్కి వొక ఆకృతి తెస్తాడు అటు నడిచిన పురుషుడు. ఎండకి గట్టిపడి ఆరూపం ప్రతిమగా నిలిచిపోతే వూళ్ళోకి తీసికెళ్ళి వొక చూరుకింద పెడతాడు. బొమ్మ పగిలి విడుతుంది. అందులోంచి మరో

బొమ్మ బైటపడొచ్చు, ఏమీ లేకపోవచ్చు! ఈసారి నాకు 'బీ' ని చూడాలనివుంది, కానీ వాళ్ళు హైదరాబాద్లో లేరు. భర్తకి ఔరంగాబాద్ విమానాశ్రయంలో పనిట. అక్కడికి వెళ్లారు. ఆమె తల్లికూడా అక్కడికే వెళ్లిందిట.

నేనూ మా ఊరు వెళ్ళిపొయ్యాను. 'బీ' కి పెండ్లికాగానే ఆమెపట్ల కుతూహలంకూడా సన్నగిలింది. ఆమెనిగుర్చి ఆలోచించడంకూడా జరగడంలేదు – ఎప్పడేనా ఆకాశంలో విమానం వెడుతూ చేసే చప్పుడుకి పైకిచూసినప్పుడు తప్ప.

రెండుమూడు నెలలకిగాని మళ్లా హైదరాబాదు వెళ్లే అవకాశం కలగలేదు. బదిలీ అయిన కొత్త ఊరు కుటుంబరావుకి సరిపడలేదు. అతని ఆరోగ్యం బాగుండలేదు. మళ్లా తనని హైదరాబాదు బదిలీచెయ్యవల్సిందిగా దరఖాస్తు పెట్టుగున్నాడు. దానికేమీ సమాధానం వొచ్చినట్లు లేదు. ఆరోగ్యం కోలుకొనే నిమిత్తమై రెండునెలలు శలవు పెట్టి హైదరాబాదు వొచ్చేశాడు. చికిత్స నిమిత్తమై హాస్పిటల్లో చేరాడు. చూడ్డానికి రమ్మంటే వెళ్లాను.

కుటుంబరావుకి విశ్రాంతి కావాలన్నారు డాక్టర్లు. విశ్రాంతి కావాలన్న డాక్టర్లంటే నాకిష్టం. ప్రపంచంలో అరిష్టాలన్నీ అందరూ విశ్రాంతిలేకుండా, పనిలో నిమగ్నులు కావడంవల్లనే సంభవిస్తాయనుకునే వాళ్ళలో నేనొకణ్ణి. ప్రతి సంవత్సరం వొక్కరోజేనా, ప్రతివ్యక్తి తనుచేసేపని నిలిపివేసి, తమాయించి, తన్ను తాను సింహావలోకనం చేసుగుని, ప్రయోజనం కోరకుండా, ప్రపంచాన్ని తిలకిస్తే సత్ చిత్ ఆనందాలు సమకూరుతా యనుకుంటాను.

ప్రపంచం నా మాట వినదు. ఈ ముక్కలు ఎందరెందరో చెప్పారు. ఏవొకరిద్దరు ధన్యజీవులో తప్ప, యీ బోధ ఎవ్వరూ పాటించరు. గోళాలు తిరిగిపోతున్నాయి. భూమి తిరిగిపోతూంది. ఎవ్వరూ ఆపలేరు. సమాజాలు కదిలి పోతున్నాయి. మనిషి నిత్యకర్మ అనే చక్రంలో నలిగి తిరిగిపోతున్నాడు. ఆ చక్రం అతను తయారుచేసుకున్నదే. 'బీ' లాంటి వారెవరేనా ఆపుదామని చెయ్యి పెడితే, ముక్కవూడి పడుతుంది. మధ్య నాకెందుకు ?

కుటుంబరావున్న వార్డు పక్కగదిలో మిషనుకుట్టు మస్తాన్ వున్నట్లు, మరెన్నవల్ల తెలిసింది. చూడ్డానికి వెళ్లాను. ఏమిటో మిషినుకుట్టే వాళ్ళు సన్నగావుంటారని నా ఊహ. అతని పేరు మస్తానైనా, మిషనుకుట్టు మస్తానే అనబుద్దేస్తుంది ఎందుకో. సన్నగా వున్నాడు. చిరుగుల జుబ్బా– టోపీ. లోతుకు పోయిన కళ్ళు, ఎదిగినగడ్డం, మధ్య వొక పన్ను లేదు. మూతికి ఇరు ప్రక్కలా కాపలా కాస్తున్నట్లు, లోతైన గీతలు. నీరసంగా కిందికి చూస్తూ, నవ్వుతూ మాట్లాడతాడు. ఆతనికి కీళ్ళజబ్బుట– ముఖ్యంగా మోకాళ్ళు పట్టేస్తాయిట. మోకాలు చిప్పలపై ఏవో రబ్బరుగొట్టాలు తగిలించారు. ఇప్పుడు కొంచం మెరుగేట– నడవగలుగుతున్నాడుట. ఇంక నాలుగైదు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోతాడుట.

"ఊరికే రాత్రి పగలు, మిషను కుట్టడం వల్ల కాళ్ళు పట్టేశాయేమో–పోనీ కొంతకాలం చేతిమిషను వాడరాదూ?" అని వోదారుస్తూ మాట్లాడాను. మరెన్న నవ్వుతున్నాడు.

"ఈడొక్కడేనంటండీ, కస్ పిస్, కస్ పిస్ మని మిషను తొక్కడం– బోలెడంత మంది లేరంటండీ– ఆళ్ళందరూ కాళ్ళు పట్టి చస్తున్నారంటండీ– ఈడి కర్మ."

నిజమేనన్నట్లు మస్తాన్ నవ్వుతూ తన కాళ్ళకేసి చూసుకుంటున్నాడు.

చేతులతో కాళ్లమీద రబ్బరుగొట్టాలు సరిగ్గా సర్దుకున్నాడు.

ఎడమచెయ్యి వెనక భాగాన మానిపోయిన దెబ్బ గుర్తు కనబడింది. ఆ దెబ్బకేసి చూశాడు మస్తాన్. నవ్వాడు. ఏమిటన్నట్టు చూశాను.

“ఇది ఔరంగాబాద్లో జరిగిందండి. ఆ మధ్య అక్కడ మిలటిరీవోళ్ల మిషన్లు వేలం పాడుతున్నారు. చవకగా కొనుక్కెదుదువుగాని రమ్మందండి ‘బీ’. సరేనని వెళ్లాను.”

“ఎట్లా వుంది ‘బీ’ ?”

“బాగానే వున్నారండి. రేకుల గది వొకటుందండి. అందులో తనూ, హఫీజు వుంటారండి. వెనక మరో చిన్న గది. అందులో వాళ్లమ్మ, ఏదో గడించి పడేస్తాడండి. అయినా అలవాటు చొప్పున వాళ్లమ్మ మిషను కుడతా వుంటుందండి. ఆ చుట్టుపక్కల ఇళ్లవాళ్ల చిరిగిన బట్టలు అయ్యి, మరమ్మతు చేసి పెడుతూ వుంటుందండి.”

“మరి బీ కి కాలక్షేపం ?” అన్నాను.

“మొగుడుతో షికార్లండి. ఆళ్ళకో జీపుందండి. అందులో....”

ఆతని మాట పూర్తిచెయ్యకుండా ఆ వాక్యాన్ని అందుకున్నాడు మరెన్న.

“తర్ బిర్, తర్ బిర్ మంటూ మొగుడితో షికార్లండి” అని నవ్వుతూ పూర్తిచేశాడు మరెన్న,

“విమానంలో వెళ్ళరా ?”

“నాకేం తెలుస్తుందండి. రెండురోజులే నే వుంట. ఓ రోజల్లా వేలం పాటతో సరిపోయిందండి. మొగుడు హఫీజు–విమానం నడపడం నేర్చుకున్నాడండి. అందులో కొత్తవాళ్ళకి, నేర్పుతానికి ఎక్కించుకుపోతా వుంటాడటండి. ఆడోళ్ళని రానీరంటండి.”

“మరి నువ్వెక్కావా ?”

“లేదండి.”

“మిషను కొన్నావా ?”

“కొన్నానండి. ఆళ్ళ గది వెనక మండువాలో పెట్టి మిషను తొక్కి– రైటు చూస్తున్నానండి సాయంత్రం. బీ వొచ్చి తొక్కుతుంటే ఆ చక్రంలో చెయ్యి పెట్టి వెనక్కి నెట్టిందండి. పై బెల్టు వూడి, నా వేళ్ళు సూది కింద కుట్టడి పోయాయండి. అదండి యీ దెబ్బ” అని చేతి వెనకభాగం కేసి దిగులుగా చూస్తున్నాడు.

“మా బాగా అయిందిలే” అన్నాడు మరెన్న, మస్తాన్ కి వో పాతలాల్చీ పంపించాను.

“కుట్టమంటారాండి?”

“లేదు నువ్వు తొడుక్కో” అన్నాను. అందరం నవ్వుకున్నాం.

ఆ సాయంత్రం హోటలుకెళ్ళి కడుపారా భోజనం చేశాను, హాస్పిటల్లోంచి బైట పడగానే, మనం ఇంకా బ్రతికి వున్నందుకు దైవానికి కృతజ్ఞత చెప్పకుంటాం. నీళ్ళు పోసుకోడం, తినడం, నిద్రపోడంలాంటి దినచర్య మరింత తీక్షణంగా, వుత్సాహంలో జరుపుతాం, సినిమాకు కూడా వెళ్ళాను. ఆ సినిమా ఏమీ బాగా లేదు. కాని నేను చాలా ఆనందించాను. ఆ ఆనందం అంతా నాలో వున్నదే అని నాకు తెలుసు.

ఆ మొర్నాడు కుటుంబరావు హాస్పిటల్ నుండి విడుదలయి, యింటికొచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం.

మరెన్న ఎక్కడా అయిపులేడు. పక్కగదిలో మస్తాన్ కూడా కనబడలేదు. ఏమయ్యారు? రాత్రి విడుదలయి ఇంటికి వెళ్ళాడా మరెన్నని తీసుగుని ? ఏమో. డాక్టర్ని అడగాలనుకున్నా, ఆయన ఇంకా రాలేదు. ఈ లోగా ఏర్పాట్లు పూర్తయి యింటికొచ్చేశాం.

మరెన్న లేకపోతే ఇంట్లో పనికి కష్టంగా వుంది కుటుంబరావుకి. ఆ వీధిలో దుకాణంలోవుండే గాలిబ్ తన కూతుర్ని చిల్లర పనులకి పంపించాడు. ఆ పిల్ల పేరు 'కైరున్నిసా' నల్లగా వుంటుంది. చెవులకు పోగులుంటాయి, కోల మొహం. బుగ్గమీద పచ్చబొట్లు, చలాకీగా వుంటుంది కాని ఎక్కువ మాట్లాడదు.

బ్రెడ్ పట్టుగురమ్మని పంపించాడు కుటుంబరావు. నేను స్నానంచేసి, కిటికీ ముందు కూర్చుని పత్రిక చదువుకుంటు న్నాను. రోడ్డుమీద టీ దుకాణంనుండి సంగీతం గంద్రగోళంగా వినబడుతూంది. దానికితోడు మరో సివిమాలారీ లోంచి పాటలు లవుడ్ స్పీకర్లో భీకరంగా పోటీచేస్తూ వాతావరణాన్ని కల్లోల పరుస్తున్నాయి. ఆ గంద్రగోళంలో నా మనస్సెందుకో ప్రశాంతంగా వుంది.

ఒక్కసారి ఆ ధ్వనులు నిలిచిపొయ్యాయి. అంతా నిశ్శబ్దంగా వుంది. లయ, క్రమం తప్పినట్లు నాకు చీకాకేసింది. ఆ పాటలు నిలిచిపోతే పిచెత్తినట్లయింది. టీ దుకాణం కేసి చూశాను. జనం గుమిగూడారు. నిశ్శబ్దంగా వున్నారు.

ఆ గుంపులో 'కైరున్నిసా' చేతిలో పొట్లం పట్టుగుని నిలబడివుంది. ఇంటివైపు పరుగెత్తుకొస్తోంది, ఏమిటో చూద్దామని నేనూ లేచి రైటికి రాబోతున్నాను, ఆపిల్ల గబగబ వొగరుస్తూ వచ్చింది.

"ఏమిటది ?"

"బీ చనిపోయిందట" అన్నది.

"నేను, కుటుంబరావు వొక్కసారి 'ఆ' అని నిలబడిపొయ్యాము.

"అదుగో మరెన్న అని రోడ్డుమీద గుంపు కేసి చూపించింది. మేం గబగబ రోడ్డుమీది కెళ్ళాం, మరెన్న వాడివెనక కుంటుకుంటూ మిషనుకుట్టు మస్తాను వొస్తున్నారు.

"ఏం జరిగింది ?"

మెల్లిగా నడుచుకుంటూ వొచ్చి, వరండాలో బల్లమీద కూర్చున్నాడు.

"విమానంలో పడి చచ్చిందండి–బీ" అన్నాడు. వివరాలు చెప్పమన్నాం,

"నిజం భగవంతుడికి తెలియాలండి. హఫీజు మరొకమ్మాయిని చేరతీశాడంటండి. దానికి కూడా విమానంలో పనిటండి. అందులో వెళ్ళేవాళ్ళకి టిఫిన్, టీ, అయ్యి యివ్వడంటండి. దాన్నికూడా తర్ఫీదుకోసం తిప్పమన్నారంటండి. హఫీజు ఆ పిల్ల నెక్కించుగుని పోతూంటం, బీకి నచ్చలేదండి. అదంతా వొట్టిది– ఆడోళ్ళని విమానం ఎక్కనివ్వరు, ఆ పిల్లతో ఆ మిస మీద షికార్లు తిరుగుతుండావు, వొల్లకాదని మందలిస్తే ఆడు వినడంలేదంటండి. హఫీజ్, ఆ కొత్తపిల్ల జీపులో తిరగడం–సాయంత్రాల విమానంలో ఎల్లడం చూసి 'బీ' కి బిసెక్కిందండి.

ఆ సాయంత్రం విమానం ఎగిరే చోటకి బైలుదేరాడంట హఫీజు. నేనూ వొస్తానంది 'బీ'. వల్ల కాదన్నాడు. వొచ్చి తీరతానంది. హఫీజు లగెత్తుకుపొయ్యాడు. ఆడెనకాల బీ పరుగెత్తింది. ఆళ్ళమ్మ, పోమాకే, ఆ చచ్చినోడితో నీకేం కతుకు అంటానేవుందంట–యిది...."

"...వో దిగడదిగడమని దేవుడు" అన్నాడు మరెన్న. అతన్ని చెప్పనీమని మరెన్నని మందలించాడు కుటుంబరావు.

“ఇంకేముందండి, విమానాల కాడ ఎవ్వరు లేరంటండి. వో విమానంలో హాఫీజు ఆ నేర్చుకునే మార్వాడీ పిల్ల ఎక్కారంటండి. తలుపులేశారంట. బీ పరుగెత్తుకుంటా విమానంకాడి కెళ్ళిందండి. విమానం కదిలిందంట. నిలపమంది ‘బీ’. పరుగెత్తుకుంటా, పైకి ఎగిరి గది తలుపు పట్టుకోబోయి, చెయ్యిజారి కిందపడి చచ్చింది అంటదండి ఆ మార్వాడీపిల్ల. అదేం లేదు. విమానం ముందుగా నిలబడింది, విమానం కదిలింది. అది తప్పకోలేదు. దాన్ని గుద్దేసి సర్రున వెళ్ళింది–ఫర్లాంగు వెళ్లాక నిలిపాను. దిగి చూసేతలికి ఎక్కడా మనిషి ఐపులేదు, అంటాడు హాఫీజు. నిజం భగవంతుడికి తెలియాల. మొత్తానికి సచ్చిందండి– పసందైన పిల్ల పాపం...” అని మస్తాన్ తన మోకాలి కేసి చూస్తున్నాడు.

కుటుంబరావు కళ్ళల్లో తడి చూశాను. అప్రయత్నంగా నా కళ్లు కూడా తడిశాయి. రుమాలుతో తుడుచుకున్నాను.

“హాఫీజు అది సావాలనే ఇమానం పోనిచ్చాడండి. అందుకనే ఆణ్ణి పట్టుకున్నారు పోలీసోళ్ళు ఆణ్ణి ఆపిల్లనీ.” అన్నాడు మరెన్న.

“ఏముందండి– ఆడు గోల– నాకేం లేదు బాబో అని ఏడుస్తాడు. అది ఆపుచెయ్యమంటే, అదంతా వేళాకోళం అనుకున్నాడుటండి. నిజంగా చస్తుందని కల్లో కూడా అనుకోలేదన్నాడండి. ఆళ్ళిద్దరినీ ఆరెస్టుచేశారండి. బీ తుక్కు తుక్కు–అయి, మనిషెక్కడా కనబడలేదండి. తెల్లవార్లు లైట్లేసుగుని వెతికి, తెల్లారగట్ల, పొదల్లో దాని బట్టలపీలికలు, మిగిలినవాటినీ తెచ్చి భద్రంచేసి, గుర్తుపట్టే నిమిత్తం తెలిసిన వోళ్ళని పట్టకురమ్మని, పోలీసోళ్ళని కారులో పంపితే, నేనూ–నడవలేను కదండి–సాయంగా, మరెన్న, రాత్రికి కార్లో బైలుదేరి మధ్యాహ్నానికి చేరుకున్నామండి. గుర్తుపట్టామండి. ఆణ్ణి విడిచిపెడతారంట లెండి – పెద్ద పోలీసుదొర చెప్పాడండి. ‘బీ’ పోతాపోతా నన్ను విమానం ఎక్కించి మరీపోయిందండి–”అని నవ్వి మౌనంలో పడ్డాడు మస్తాన్.

“........ నానూ ఇమానంలో తస్ బిస్, గస్ బిస్ మంటా, జయ్ గుయ్ మంటా వొచ్చేశానండి– అదుగో ఆ పోలీసు దొరగారితో........” అని పూర్తిచేశాడు మరెన్న.

టీ దుకాణం సంగీతాలు మళ్ళా అందుకున్నాయి. గుంపు పల్చబడి, వాళ్ళవాళ్ళ పనులమీద పోతున్నారు. నిత్యజీవితం గిరగిర తిరుగుతూ కొనసాగుతోంది. సూర్యుడు పైకిపోతున్నాడు. నాకారోజున భోజనం చెయ్యబుద్ధిపుట్టలేదు. కుటుంబరావు. నేనూ కాస్తంత బ్రెడ్ తిని, కాసివి పాలు తాగి పరున్నాం. సాయంత్రం బైటికి నడిచాను. ఆకాశంలో అర్ధ చంద్రుడు తెగిన సౌందర్యంతో దిగులుగా మొహంచూపలేక మేఘం వెనక మరుగుపడ్డాడు. వీధిచివర ఇంట్లోకి పరుగెట్టింది కొత్త పెళ్ళిపిల్ల కైరున్నీసా. ఇళ్ళు, రోడ్డు, చప్పుళ్ళు, మనుషులు వెనక దిగడిపొయ్యారు. అవింక రాతిగుట్టలు అక్కడక్కడ ఎదిగేవిధం తెలీక మొలిచినచెట్లు. పైన ఆకాశం, తారకలు, దిగులు తగ్గినట్లయింది. బరువు ఎవరో తీసేశారు. సందేహాలు, శంకలు, ప్రశ్నలు లేవు. నాకర్థమైంది.

విమానాశ్రయం దగ్గరకి పరుగెట్టుకుంటూ వెళ్ళింది హాషిమాబీ. విమానంలో ఎక్కి, ప్రయాణానికి సిద్ధంగా వున్నారు, హాఫీజ్, శిక్షణపొందుతున్న ఆ అమ్మాయి. విమానం భూమిమీద కదలడానికి సిద్ధపడుతోంది, పైకి లేచే ముందు ఐదారొందల గజాలమేర నేలమీద చక్రాలపై సాగి, వేగం పూరించుగుని ఆ పైన పైకి లేస్తుంది విమానం. ఆ పరుగుకి సిద్ధపడుతూంది విమానం. దాని ముందు. ఫాన్లో రెక్కలలాంటివి పెద్ద పెద్ద రెక్కలుంటాయి. అవి వేగంగా తిరుగుతాయి, తరవాత విమానం కదలుతుంది. హాషిమాబీ విమానం పక్కకి వెళ్ళి పైకి చూసింది, పైన ఎవ్వరూ కనబడరు. విమానం ముందుకొచ్చింది. బ్రహ్మాండమైన వేగంతో ఫాన్ రెక్కలు గుండ్రంగా తిరుగుతున్నాయి. నిలపమని కేకేసింది. ఆ చప్పుడులో ఎవరికీ మాట వినపడదు. విమానం కదలబోతోంది. ఆ రెక్కలని పట్టుగుని నిలిపి వెయ్యాలి. తనకి తెలిసింది. అలవాటైంది. అదొక్కటే సాధనం. చెయ్యి పెట్టి పట్టుకోబోయింది. ఆ చక్రంలో శక్తి ఆమెని గిరగిరతిప్పి, తుక్కు చేసేసి, దూరంగా ఎక్కడో గిరవాటెట్టింది. ఆమెలో మిగిలిన భాగాలు గుర్తుపట్టడమే కష్టమైపోయింది.

ఆ విధంగా బీ అంతమొందిందనుకుంటాను. మధ్యాహ్నమంతా చెప్పుకుని కుటుంబరావు, నేనూ యీ నిర్ణయాని కొచ్చాం, కొన్ని విషయాల పట్ల కారణాలు స్పష్టంగా వుండనక్కర్లేదు; తర్కబద్ధమైనవిగా నిర్ణయానికి తరమనక్కర్లేదు. కాని పర్యవసానాన్ని మనస్సు ఆమోదిస్తుంది. ఆ ఆమోదంలో గొప్ప ఆనందం వుంది.

రాయి మీద కూర్చున్నా, నక్షత్రాలు మసగమసగగా కనపడుతున్నాయి. ఎక్కడ నుండో ఏజంతువు అరుపో వినబడుతోంది; ధ్వని నిశ్శబ్దాన్ని కామిస్తోన్నట్లు, పాదాలకింద కీచురాయి రోదిస్తోంది. ఆ నిశీధి ప్రశాంతతలో నా ఊపిరికి స్థానంలేదు. నిట్టూర్పు అక్కడ వొదిలేసి వెనక్కితిరిగాను. అక్కడే వొకరాయిలా స్థంభించి నిలిచిపోతుంది ఆ నిట్టూర్పు.

మృత్యువుతో కథని ముగించడం సులువే. కథలో ఇమడటానికి అనువైనవిగా సిద్ధంగా లభించవు జీవితంలో సంఘటనలు. కాని బీ కథ సిద్ధంగా అమిర్చిపెట్టిన కథ. దానికేదో అతికించి, కల్పించి, వ్యాఖ్యానించి, ముగించే అవసరం లేక పోయినా, చటుక్కున స్ఫురించే అర్థంమట్టుకు కనిపించడం లేదు. ఈ కథకేమన్నా అర్థంవుందేమో ఎవరైనా చెబితే సంతోషిస్తా.

ఏదో అంతరార్థం కల్పిస్తేగాని, మనస్సు కుదుటబడదు. ఈప్రాణి ఏ కొత్తవిషయం సాధిస్తుందో చూద్దామన్నట్లుగా వొక్కొక్క జీవుడిని లోకంలోకి నెట్టుతుంది సృష్టి. తన ఉనికిని పెంపొందించుకోవాలనే సృష్టి అభిలాష. దానికి తోడ్పడేటందుకు ప్రాణులను సృష్టిస్తుంది. ఒక్కొక్క ప్రాణీ వొక్కొక్క సృష్టి రహస్య పరిశోధకుడు. వారివారి కృషి ఫలించిందీ, లేనిదీ, సృష్టికే తెలుస్తుంది. పెడతోవని వెళ్ళినవారినీ, మిడిసిపడి, అతిగా శోధించినవారినీ, సృష్టి మందలిస్తూనే వుంటుంది. తన శక్తికి మించిన శక్తిగల ప్రాణులొచ్చిపడితే భరించలేదు.

అట్లాంటి ప్రాణి, హాషిమాబీ. గుండ్రంగా తిరిగే కంటి పాపల నేత్రాలుగల శారీరక వైచిత్రివి తెచ్చుకుని సృష్టి రహస్యాన్ని శోధించడానికి పూనుకుంది ఆమె. ఆ పరిశోధన స్వరూపం ఎట్లాంటిదో నే ఊహించగలను.

మొత్తం విశ్వంలోవున్న పదార్థం ఆంతా వొక చిన్న గోళంగా కుదించి వుండేది. సృష్టి ప్రారంభంలో అది ఎందుకు ఆల్లావుందో, ఎక్కడినుంచి వొచ్చిందో ఎవ్వరికీ తెలియదు. ఉంది. ఆంతే. ఆదిలో దాన్నెవరో గిర్రున తిప్పారు. అది కోట్ల సంవత్సరాలుగా గిరగిర తిరుగుతోంది. తిరగడంలో గోళంలోపల పదార్థం అణువులు వొత్తిడికి ఢీకొని, విడి. వేరువేరు గోళాలుగా తిరుగాడాయి, అట్లా ఒక్కొక్కగోళంలోనుంచి కొన్ని పిల్లగోళాలు వుద్భవించి, పరిభ్రమిస్తూ వున్నాయి. విడిపోయినా, వాటికి అన్యోన్య ఆకర్షణవుంది. నిర్ణీతమైన దూరంలో మార్గంలో తిరుగాడుతాయి. గోళాలు పెరిగిపోతున్నాయి. కొన్ని విడిపోయి, నుశైపోతున్నాయి. కొన్ని పెద్దవైపోతున్నాయి. విశ్వం పెరిగిపోతూవుంది. విశ్వంలో ప్రతి పదార్థమూ గిరగిర తిరిగిపోతూంది. దాన్ని ఎవ్వరూ ఆపలేరు. మొదట్లో ఏ శక్తి తిప్పిందో, ఆ శక్తికి కూడా నిలపడం సాధ్యంగాదు. సృష్టి ఆగదు. పరిభ్రమిస్తూ వుంటుంది. విశ్వంయొక్క– వైశాల్యం గాంభీర్యంతో పోలిస్తే మానవుడు ఆల్పుడు. కాని దాని వైశాల్యం, గాంభీర్యం ఎట్టివో ఎంతటివో తెలుసుకోగల మహత్తర శక్తీ, అద్భుత చైతన్యం, వొక్క మానవుడికే వున్నాయి. విశ్వంముందు మానవుడి అల్పత్వం ఋజువు కావాలంటే. అది మానవుడి ఊహవల్లే జరగాలి.

కాని, ఇది తెలుసుకోడం వేరు. ప్రత్యక్ష పరిశోధనకి పూనుకుని, ఊహని కార్యంలోకి మార్చడం వేరు. ఆ కదిలి పొయ్యే సృష్టిని, తిరిగే విశ్వాన్ని, వొక్క క్షణం ఆపుతానంటుంది హాషిమాబీ. అంతటి శక్తి యౌవ్వనానికి తగదు. అంతటిశక్తిని ఆమె శరీరం వుంచుకోలేదు. దైవానికి సాధ్యంకాని కార్యం ఆమెకి ఎందుకు సాధ్యం కాకూడదో ఆమెకి తెలీదు పాపం. ఈరకం పరిశోధనకా ఆమె నిక్కడికి పంపించటం ! తగదని తీసుకు పోయింది సృష్టి.

మళ్లా మనుషుల అలజడి, దుమ్ము, ధ్వని, దీపాలు, గుడ్డవిప్పుగుని నగ్నంగా గెంతుతూవున్న గాలి– యీ నా ఆలోచనల్ని భంగంచేశాయి. అదుగో దూరంగా రోడ్డుమొగ. అక్కడో రాతిబండ. దానిమీద వో కుఱ్ఱాడు. పరీక్షగా చూశాను. మరెన్న.

"ఏం మరెన్నా ఇల్లా కూర్చున్నావు వొక్కడవు? అయ్య గారిక్కావల్సినవన్నీ చూశావా ?"

"ఊరికేనే, ఏమీ తోచక యిట్లా గొచ్చానండి."

"ఏం ?"

"బీ ని గురించి తల్చుకుంటే దిగులేస్తుందండి."

"అవును పాపం." జేబులోంచి ఏదో తీశాడు మరెన్న. కాగితం మడత. అది విప్పాడు.

"తెల్లవార్లు తెగ వెదికినారంటండి,బీ జాడ కనబడలేదండి. సాయంకాలం వొచ్చేముందు, నేనూ ఎదికి నానండి–దిగమగ గమదిగ పుట్లంట నడుసుకుంటూ ఎళ్ళి. దాని బట్టల పీలికలు అయ్యి. ఆపొదంట దొరికినయ్యండి. ఆడ పడుందండి–యీ తలవెండ్రుక" అని కాగితం మడతలోంచి నల్లటి పొడుగాటి తలవెండ్రుక అరచేతిలో పెట్టి పైకి చూపించాడు.

"బీ జడలోదండి."

నేనేమీ మాట్లాడలేదు. ఏమనాలో తెలీదు.

"దాని జడలోదనెట్లా తెలుసు ?"

"చూడండి వొంకీలేదండి. ఆళ్ళమ్మది వుంగరాల జుట్టండి దానిదీ అదేనండి. దానికి వొంకలు తిరిగే ఉంగరాలజుట్టంటే యిష్టంలేదంటండి. జడవొంకర్లు తిరగకండా పెన్సళ్ళు, బలపాలు నెత్తిన పెట్టుగునేదండి..." అన్నాడు.

నడక సాగించాను. వాడూ లేచాడు. "అయిన మనకెందుకండి– దేనిజోలికీ పోగూడదండి." అని మరెన్న ఆ వెండ్రుకని నగ్నంగా వీస్తున్న గాలిలో విడిచేశాడు. చంద్రుడి కేసి ఎగిరిపోయింది. దానిలో నగ్నశరీరాన్ని మరుగుపరచుకుంది గాలి. వెనకటి కథలకి చివర గుణపాఠం తగల్చడం సంప్రదాయం. కదిలేవాటిని నిలపకూడదు అన్న నీతి పాఠంతో యీ కథ ముగించబుద్ధివేస్తుంది. ఇది నే నేర్చుగున్న పాఠంకాదు. అసలు దేని జోలికీ పోకూడదన్నాడు మరెన్న, గీతలో బోధ అది. ఆ వొక్కవాక్యంతో మరెన్ననీ. మరొకడినీ, అందరినీ, ప్రపంచంలో ప్రాణులన్నింటినీ, వొక అణువుగా చేసేసి చేతిలోబిగించి గుండెలకు హత్తుకోవాలనిపించింది. ఆ క్షణికమైన అనుభూతినిచ్చి వెళ్ళిన హాషిమాబీ, జీవిత రహస్య పరిశోధనలో కృతార్థురాలైందనుకుంటా.

★★★

.

.

# తాను వలచినది రంభ

## - కొడవటిగంటి కృష్ణమూర్తి

## (భారతి 1933 ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రితం)

రాత్రి ఎనిమిది గంటలయింది. గోపాలెం నరసింహారావుగారు మందస్మిత వదనంతో దీపం పెద్దది చేసి, సులోచనాలు ధరించి అప్పుడే జ్యోతిష్కుడు సమర్పించుకున్న తన కుమారుడి జాతకం చదవనారంభించాడు.

భాస్కరరావుకు మాంచి దివ్యమైన సంబంధాలు రెండు అందుబాటులో ఉన్నాయి. అందులో ఒకటి బంగారం మీదుగా నడిచి వస్తున్నది. కట్నం నాలుగువేలు, పదెకరాల ఆస్తి, మంచి యిల్లు పిల్లతో వస్తున్నది. రెండోది ఆట్టే చెప్పకండి. పిల్ల రత్నమేకాని తడిలేని పెళ్ళి తద్దినముతో సమానం!

కట్నం సిగ్గోసిరి! అన్నిటికన్న గట్టిచిక్కొకటి వచ్చిపడ్డది. వారం రోజులక్రితం ఎవడో బైరాగివెధవ భాస్కరుడి చెయ్యి చూచి వద్దంటున్న కొద్దీ, 'నువ్వు మంచి ధనంగల చోట పెళ్ళాడబోతువు! ఆడితివా ఆపద కద్దు!' అంటూ పాడుకొచ్చాడు దురాత్ముడు.

ఆ దెబ్బతో నరసింహారావు గారికి అదలెత్తి ఆక్షణమే కుర్రవాడి జన్మనక్షత్రం జ్యోతిష్కుడి చేతిలొ పెట్టి జాతకం తయారు చెయ్యమన్నాడు. అదిప్పుడే వచ్చింది. జ్యోతిష్కుడు డబ్బు మూటగట్టుకుంటూ "మా దివ్యమైన జాతకం" అని చెప్పి మరీ వెళ్ళాడు.

నరసింహారావుగారు జాతకం కాగితాలు తిప్పటం మొదలు పెట్టాడు. మొదట కొన్ని పేజీలు సంస్కృతం కాకుండా, తెలుగు కాకుండా అర్థం కాకుండా ఉన్నయి. అవన్నీ వదిలివేశాడు నరసింహారావుగారు. "ఆయురారోగ్యాలు!" అని వచ్చింది. నరసింహారావుగారు ఆకలిగా ఉన్నవాడు అన్నం తిన్నట్టు చదవటం మొదలు పెట్టాడు. ఏమీ ప్రమాదం లేదు. కావలసినంత ఆయువున్నది డెబ్భై అయిదు సంవత్సరాలు. భాస్కరానికి పసితనంలొ గడచినగండం కాక ఇంకొక్కటి ఉన్నది గండం. అది యాభై ఒకటో సంవత్సరము. భేష్! మా బాగా రాశాడు జాతకం.

"ఉద్యోగలక్షణం, ధనార్జన" అదీ బాగానే ఉన్నది. అబ్బాయి ఐ.సి.యస్. వరకూ చదువుతాడని ప్రమాణాలు చూపిస్తున్నాడు దైవజ్ఞుడు.

"సంతాన కళత్రాలు!" అదీ కావలసింది.

"ఈ జాతకునికి ద్వికళత్ర యోగము. వివాహమయిన సంవత్సరములోపుగా కళత్రమునకు మారకము. తిరిగి ఇరవై అయిదు దినముల లోపల వివాహము..." హారి భగవంతుడా!

ధనాశగలవారికి అంతరాత్మలుంటే, నరసింహారావుగారికున్నదా అంతరాత్మ. డబ్బుమీద ఆయనకు ప్రేమే కాని చూస్తూ చూస్తూ అంత ధనం లాక్కుని పిల్లగొంతు కొయ్యటం ఆయనకిష్టం లేదు. నరసింహారావుగారు దీర్ఘాలోచనలో మునిగిపోయినాడు.

జాతకాల్లో ఏదో ఉన్నదని పెళ్ళిళ్ళు మానేసుకుంటారా?... ఇటువంటి చిక్కులూ ద్వికళత్ర యోగాలూ జాతకులు అల్లరిచిల్లరిగా తిరిగితే పోతవంటారు ! జాతకాలెపుడూ నిజం అవుతాయా ?... అంతా గొంతుమీదకొస్తే పిల్లకే గాని పిల్లవాడికి కాదుగదా!... సావిత్రి కేమయింది ? మనం సంబంధం వెతుక్కుంటూ రావటం లేదుకద!

"చూస్తూ చూస్తూ ఉన్న సంబంధాలు చెయ్యలేను. పదెకరాలతో వస్తున్న పిల్లకు పెళ్ళి తొందరలేదు. అదృష్టం వుంటే భాస్కరుడికి ఆ పిల్లే రావచ్చును. ఉన్న రెండు సంబంధాలూ వదిలేసి ఈసారి వచ్చే సంబంధం చేస్తాను. కట్నంకోసరం పోట్లాడను. లాంఛనాలకోసరం సణగను!..."

"నరసింహం అన్నగారున్నారా ?"

నరసింహారావు గారు కొట్టినట్టు ఉలిక్కిపడి "ఎవరండి బాబూ ?" అన్నాడు.

"చిత్తం! నేను చంద్రశేఖరాన్ని లెండి!"

"రండి బావగారూ!" (ఎవరితోనో)

నరసింహారావు గారు కుర్చీమీదినించి లేచాడు, వచ్చినవారెవరో ఇంకా తెలియకుండా. ఇంతలో పెద్దమనుష్యులిద్దరు లోపలికొచ్చారు. అప్పుడు నరసింహారావుగారు చంద్రశేఖరాన్ని గుర్తించారు. చంద్రశేఖరంగారు నల్లని శరీరం, నెరిసిన గడ్డం, నెరవని మీసం, మధ్యాన్నం తాలూకా గంధం అక్షింతలూ, పైన చొక్కా లేకుండా ఉత్తరీయం, ముఖాన మాయలమారి మల్లయ్య నవ్వూ వగైరాలతో సహా మారు వేషం వేసుకున్న బలేరాముడి మోస్తరుగా ఉన్నాడు. ఆయనతో వచ్చిన పెద్దమనిషి కూడా ఆశాఖకు చెందినట్టే ఉన్నాడు చూపులకు.

"రండి! కూర్చోండి. ఏం పనిమీద వచ్చారూ?" అన్నాడు నరసింహారావు బలవంతంగా నవ్వుతూ.

"చిత్తం ! చిత్తం ! వీరు మా బావగారు ! మా తోబుట్టువు పెనిమిటి చెల్లెలి భర్త !"

"అలాగేం!"

"అవధాన్ల గోపీనాథం గారు! గోపయ్యని అంటూంటారు."

"ఆహా!" అన్నాడు నరసింహారావాశ్చర్యంతో.

ఇద్దరూ చెరొక కుర్చీ అలంకరించారు. గోపయ్య మాత్రం ఎన్నడూ కుర్చీలో కూర్చుని ఎరగని జీవి కావటం చేత ఊపిరి బిగబట్టి నిప్పులమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు.

"అబ్బాయి ఏడీ?" అన్నాడు చంద్రశేఖరం, కొంతసేపు ముగ్గురూ మౌనంగా కూర్చున్న తరువాత, అబ్బాయి ఆ ప్రాంతాలె ఉండాలన్నట్టు చుట్టూ చూస్తూ.

"భాస్కరరావు ఊళ్ళో లేడు!" అన్నాడు నరసింహారావు కొంచెం గంభీరంగా.

చంద్రశేఖరం నిష్కారణంగా గొంతు తగ్గించి, "అబ్బాయికి వివాహం చేసే ప్రయత్నం ఏమన్నా...?" అన్నాడు తలకాయి ఆడిస్తూ.

"అదే ఆలోచిస్తున్నాను!" అన్నాడు నరసింహారావు చిరునవ్వు నవ్వుతూ.

"ఏదైనా నిశ్చయం అయిందా ?"

"ఏదో వస్తున్నాయి కానీ బొత్తిగా పరాయి సంబంధాలు. ఏదైనా కాస్త మనలో మనకు కావలసింది వస్తే చేద్దామనే అనుకుంటున్నాను."

"బావగారు కుమార్తెకు సంబంధాలు విచారిస్తున్నాడు. పిల్లా, ఇప్పుడు కాస్త చిక్కి ఉన్నది, మొన్ననే మశూచికం పడి లేవటం చేత. లేకపోతే చాలా అందంగా ఉంటుంది. వారికి సాలుకి రెండుమూడు వేలు వచ్చే భూవసతి ఉన్నది. నలుగురితో తీసిపోకుండా కట్నలాంఛనాదులు జరుపుతారు. అయ్యా ! వారి వంశంలో ఉద్యోగ సద్యోగాదులు కలవారు లేకపోయినా చాలా పరువూ, ప్రతిష్ఠా గల సాంప్రదాయం, గోత్రసూత్రాలు కూడా సరిగానే ఉంటున్నవి !"

నరసింహారావు ఆలోచించినట్టు నటిస్తూ "సరే చూదాం !" అన్నాడు.

"చూచారు బాబూ! ఆలోచించటానికేమీ లేదు. మీకు నిజంగా మనలోనే సంబంధం కావాలంటే ఇంతకన్నా మంచిది దొరకదు. ఆలస్యం కూడా అవసరం లేదు. నాలుగైదు రోజుల్లోనే ముహూర్తం ఉన్నది. బావగారు అంతా సిద్ధంగానే ఉన్నారు. ఇక మీ విషయం అంటారా, ఒక్కరోజు ప్రయత్నం చాల్ను."

నరసింహా రావు నవ్వాడు. ఈ పీడ వదలటానికి ఎంత మంచి అవకాశం ఇచ్చాడు భగవంతుడు !

"ఇంకా మా వాళ్లను కనుక్కోవలసిన అవసరాదులున్నయి. కాబట్టి మీరు రేపు ఉదయం వస్తే ఏదో తేల్చుకుందాం!"

"చిత్తం ! చిత్తం ! అసలు రేపుదయమే వచ్చే వాళ్ళం కాని ఈ రాత్రి దివ్యంగా ఉందని చెప్పాడు శాస్తుల్లు గారు. సరేలేనిమ్మని తమదర్శనం చేశాం!"

"మంచిది ! రేపుదయం దయచెయ్యండి!"

ఇద్దరూ లేచారు. గోపయ్య చాటంత ముఖంతో "వస్తాం ! శలవు!" అన్నాడు మొదటి సారి నోరు విప్పి.

"మంచిది ! ఉంటాను!"

ఇద్దర్నీ బయటికి సాగనంపి నరసింహారావు వచ్చి కూర్చుని జాతకం తిరగవెయ్యటం మొదలు పెట్టాడు.

★ ★ ★

మర్నాడు భాస్కరరావు దిగాడు. ఇంకా మూడు రోజుల్లో ఉన్నదని తెలుసుకున్నాడు తన వివాహం.

"నిన్న ఉదయమే నిశ్చయించాము !" అన్నాడు నరసింహారావు.

"ఎందువల్ల ?"

"తొందర అయింది."

"నేను లేకుండానె ? పిల్లను చూడకుండానే ?" అన్నాడు భాస్కరరావు ఆశ్చర్యంతో.

"పిల్లను చుడ్డమా ? నేను చూడలేదు ! మనలో మాట ! ఇది పిల్లను చూచి చేసుకో తగ్గ సంబంధము కాదు. పిల్లను చూస్తే బహుశా చేసుకో బుద్ధిపుట్టదు."

"నేను డబ్బును పెళ్ళి చేసుకోను. తరువాత మీ యిష్టం. ఎక్కడికైనా లేచిపోతాను !" అన్నాడు భాస్కరరావు కోపంతో.

నరసింహారావు తొణకలేదు.

"ఎక్కడికి పారిపోవు. కట్నానికాశపడి ఈ సంబంధము చెయ్యలేదు. ఎందుకు చేశానొ నీకే తెలుస్తుంది.. నన్నేమీ నువ్వడగక్కర్లేదు. నీకే తెలుస్తుంది."

౨

భాస్కరరావు పెళ్ళి పీటల మీద తన భార్యను చూచుకున్నాడు. వెంటనే కళ్ళు మూసుకున్నాడు.

అతని ముఖం పాలిపోయింది. అప్పటికే తన మామగారిని ఇతర బంధువులను చూచి అసహ్యించుకోవట మయిందతనికి. కాని ఈ భార్య అందరి తలా తన్నింది. ఆమె ముఖం కారు నలుపు. స్ఫోటకం మచ్చలు. జబ్బుపడ్డట్టు ముఖమంతా పీక్కుపోయింది. నెత్తిన వెంట్రుకలు దాదాపు ఏమీ లేవు. ఇతర విషయాలు వర్ణించటానికేమున్నది! ఆ రంభ అతనివంక సిగ్గు పడుతూ ఒక్కసారి చూచి తలవంచుకునేసరికి భాస్కరావుకు పైత్య వికారం వచ్చినట్టయింది.

పీటలమీదనించి లేవగానే భాస్కరావు తండ్రి దగ్గిరికి వెళ్ళాడు.

నరసింహారావు ఒక గదిలో కట్నం లెక్కపెట్టుకుంటూ వంటరిగా కూర్చున్నాడు. ఒంటరిగా ఉండటం వల్ల ఆయన మానం ఎక్కువ సురక్షితం కాలేదు. భాస్కరావు కఠినంగా "ఈ సంబంధం చేసినందుకు మీ మేలు బతికి ఉన్నన్నాళ్ళు మరవను!" అన్నాడు.

నరసింహారావు తొందరపడలేదు. డబ్బుతో పనిగలవాడికి ఆగ్రహం మీద కట్టుబాటు జాస్తి.

"నీకేమైనా కృతజ్ఞత ఉంటే నిజంగా మరవవు. నీకా సంగతి ఇప్పుడు తెలియదు. కొంచెము ఓర్పు తెచ్చుకో. శాంతంకన్నా లాభకరమైనది లేదు. నా జీవితంలో నేనా సంగతి ఒక లక్షసార్లు నిరూపించాను. తొందరపడటం వల్ల నష్టం తప్ప ఏమీ రాదు. శాంతం ! శాంతం ! శాంతం !" భాస్కరావు లేచిపోయినాడు.

ఈ సంభాషణ వింటూ ఇద్దరు పెద్దమనుష్యులు పక్కగదిలో నవ్వుకున్నారు !

౩

ఆ రోజు నుంచి తండ్రీకుమాళ్ళు మాట్లాడుకోలేదు, ఉత్తరాల ద్వారా తప్ప. ఆ ఉత్తరాలైనా చాలా వాడిగా ఉండేవి. సంవత్సరం గతించింది. భాస్కరావు భార్య కల్యాణి మరణవార్త రాలేదు. ఈ లోపల గోపయ్య వియ్యంకుడితో మాట్లాడాలని రెండు మూడు సార్లు ప్రయత్నం చేశాడు. కాని నరసింహారావు ఆయన్ను బయటికి తరిమి వేశాడు.

గోపయ్య తరపున చంద్రశేఖరం జ్యోతిష్కుణ్ణి సమీపించి "అయ్యా, తమరు నరసింహారావుగారబ్బాయి జాతకం చూస్తున్నారా ?" అన్నాడు.

"అవును !"

"ఒక్క సహాయం చెయ్యగలరా ?"

"ఏమిటి ?"

"ఈ కుర్రవాడికి ద్వికళత్రయోగమున్నట్టు రచించగలరా ?"

"ఎందుకు ?"

"ఊరికేనే !"

"రచియించలేను.!"

"ఒక్క వందరూపాయిలిస్తే కూడా ?"

"అది వేరేమాట !"

"అయితే సరే !"

కాని ఈ సంగతి జ్యోతిష్కుడు ఇంకోవిధంగా అందరితో చెప్పాడు. గోపయ్య రాయమన్నది ద్వికళత్రయోగమనే. కానీ గోపయ్య జ్యోతిష్కుడికివ్వవలిసిన ఫీజు ఎగగొట్టాడు. గోపయ్య ఉద్దేశ్యం జ్యోతిష్కుడూహించాడు. బహుశా తన కుమార్తెను అంటగట్టాలని చూస్తున్నాడు నరసింహారావు కొడుక్కు. అట్లా అయితే ఆపని కాకుండా చెయ్యటమెంత సేపు ? జ్యోతిష్కుడు జాతకం తిరిగి రాశాడు. ఈ సారి వివాహమైన సంవత్సరానికి మారకం కూడా వచ్చింది జాతకంలోకి. ఆ సంగతి నలుగురితోనూ అన్నాడు. కాని ఆయన ఊహించినట్టు వివాహమాగలేదు. ఈ వదంతి గోపయ్య దగ్గిరికి పోవటానికి రెండు రోజులు చాలలేదు. ఈ లోపల వివాహమయిపోయింది. వివాహం అయిన నెలరోజులకు గోపయ్య మండిపడుతూ జ్యోతిష్కుడి దగ్గరకు వచ్చి "జాతకంలో పెళ్ళి అయిన సంవత్సరానికి భార్య చస్తుందని రాశావుట !" అన్నాడు.

జ్యోతిష్కుడు నవ్వి "అది తమ ఉపయోగార్థం రాశాను. ఆ మాటంటే ఇంకో సంబంధము రాదుగా ?"

గోపయ్య సంతోషంతో నవ్వటం మొదలు పెట్టాడు.

"కాని ఆ పిల్లవాడికి నిజంగా ద్వికళత్ర యోగం సిద్ధం !"

"నన్నాడిస్తున్నావేమిటి ?"

"నమ్మకపోతే ఏం చెయ్యను ? భార్యకు మారకం తప్పదు. దాని ఫలితంగా ద్వితీయవివాహం తప్పదు."

గోపయ్య నివ్వెరబోయినాడు.

"మారకం ఎప్పుడున్నది ?"

"ఇంకా అయిదు సంవత్సరాలకు. నేను సంవత్సరానికనే రాశాను... ఇదిగో, ఆపత్తు అంటే ఏమిటో తెలుసునా ? భర్త చేతుల్లో పిల్లకు మరణం. అలాంటి విషయాలు విప్పిరాయం!"

"నేను నమ్మను!" అన్నాడు గోపయ్య పూర్తిగా నమ్ముతూ.

"నేను నమ్మమనలేదు."

"నిజమంటావా యిది ?"

"లేకపోతే నా తాటాకు పుస్తకాలు చలిమంటేసుకుంటాను."

"అరి అభాజనుడా !"

జ్యోతిష్కుడొకటాలోచించాడు. వివాహం ఎట్లాగో అయిపోయింది. కాపరం ధ్వంసం చేస్తే అదే చాలు. గోపయ్య కుమార్తె చచ్చిపోతుందని భయం చేత నరసింహారావుతో ఏదో పోట్లాట పెట్టుకుందామని రెండు మూడు సార్లు చూచాడు కాని ఆయన గోపయ్యను గెంటేశాడు మాట్లాడకుండానే.

రాగాపోగా మిగిలినది భాస్కర్రావుకూ తండ్రికి వైరం. కల్యాణికి బతికినన్నాళ్ళూ మనోవేదన.

★ ★ ★ ★ ★

భాస్కర్రావు జీవితంలో అతని వివాహం చాల మార్పు కలిగించింది. కొద్దికాలం వరకూ అతను మనస్సులో మథన పడ్డాడు. ఎంత దారుణం ! పెద్దవాళ్ళు ఎవరిని అంటగడితే వారిని భార్యలుగా భర్తలుగా స్వీకరించాలీ ? స్వీకరించకపోతే పాపమా ? ఇంకా విధంటే ఏమిటి ? చిన్నవాళ్ళకు పెద్దవాళ్ళే విధి.

ఈ ధోరణిలో భాస్కరరావు అప్పుడప్పుడు కాలేజీలో ఉపన్యాసాలిచ్చేవాడు అప్పుడప్పుడు పత్రికలకు వ్యాసాలు పంపేవాడు. అతని ఉపాధ్యాయులు కొందరతన్ని చాలా మెచ్చుకున్నారు. వారిలో మార్కండేయులుగారొకరు. భాస్కరరావుకు మార్కండేయులుగారు అప్పుడప్పుడు బ్రహ్మసమాజ మతాన్ని గురించి చెబుతూండేవాడు. భాస్కరరావు చాల శ్రద్ధతో వింటూండే వాడు.

తరచుగా భాస్కరరావు మార్కండేయులుగారింటికి వెళ్ళి కాఫీగాని టీగాని పుచ్చుకుంటూండటం ఉంటూండేది. దానిక్కారణం చాలా వరకు మార్కండేయులు గారి కుమార్తె లక్ష్మి. ఆమెకూ పదహారేళ్ళ ప్రాయం ఉంటుంది. కొద్దికాలంలో కాలేజీలో చేరటానికి సిద్ధంగా ఉన్నది.

భాస్కరరావు ఈ సమయంలో ప్రేమ కోసరం తపించటం మొదలు పెట్టాడు. అంతా ప్రేమలో ఉన్నది ! ప్రేమే లోకం. అది లేకపోతే జీవితం వ్యర్థం.

కాని అతనికి ఎవరిమీద ప్రేమ ఉన్నదో తెలియదు. మొదట తనక్లాసులో చదువుతున్న క్రిష్టియను పిల్లను ప్రేమించాననుకున్నాడు. ఒకరోజున ఆమె ఇంకొక క్రిష్టియను యువకుడితొ కొంచెము అతిగా సరసాలాడుతూండగా అతను పొరపాటున చూడ్డం తటస్థించింది. అంతటితో అతని ప్రేమ కాస్త పోయింది. తరువాత తనగదికి కొద్ది దూరంలో ఉన్న సానిపిల్లను గాఢంగా ప్రేమించాననుకున్నాడు. కాని ఆమెను గురించి చాల మంది చిత్రవిచిత్రంగా మాట్లాడ్డం విన్నపుడతనికి ప్రేమ స్థిరంగా ఉండలేకపోయింది. కాని ఇంతకూ అతనికి ప్రేమతత్వం తెలియలేదు.

బాగా ఆలోచిస్తే ప్రేమ దేనివల్ల కలుగుతుంది ? అవతలమనిషి అందం వల్ల ఏర్పడుతుంది. ఆ స్ఫోటకం మచ్చలు గల పిల్లను ఏవిధంగానైనా ప్రేమించగలడా ? వట్టిది. కనక అందం ముఖ్యం. ఆ మాటని ఒక్క అందం చాలునా ప్రేమకంటే, చాలదే! చాలితే ఆ క్రిష్టియను పిల్లను, ఈ సానిపిల్లను ప్రేమించేవాడే. కాబట్టి అవతల మనిషి అందంగా ఉండడమే కాక తన్ను తిరిగి ప్రేమించాలి !

అయితే మరి అందరికీ ప్రేమించటం చేతకాదన్నమాట ! అందరూ ఏవిధంగా అందంగా ఉంటారు ?

భాస్కరరావుకేమీ తోచలేదు. కాని ప్రేమాన్వేషణ మానలేదు. ఇంకా ప్రేమిస్తూ ఉండాలి అనుకున్నాడు. ఇట్లా ప్రేమించగా ప్రేమించగా అది ఒక చోట ఆగుతుంది. అదీ అసలు ప్రేమ అని అతనికెందుకో తట్టింది. ఇంతలో లక్ష్మి దొరికింది ! ఈ సారి నిజమైన ప్రేమ అనుకున్నాడు. ఆమె అతన్ని చూచినప్పుడల్లా చాల సంతోషంగా ఉండేది.

అతనికి వివాహం అయిందని ఎవరికీ తెలియదు. అందరితో తనకు వివాహం కాలేదంటూండేవాడు. యజ్ఞోపవీతాలు సొంతంగా లాగేయ్యటం వల్ల నిజం కనుక్కోటానికవకాశం లేకపోయింది. అందరితోనూ తాను బ్రాహ్మసమాజకుడనని చెప్పేవాడు. వారి మీటింగులకు పోయేవాడు.

౪

భాస్కరరావు బి.ఎ. రెండవతరగతిలో ప్యాసయినట్టు తెలిసింది. ఆ కాలేజీలో ఆ సంవత్సరం ట్యూటరు కావలసి వచ్చాడు. ఎమ్.ఎ.కు పోదామనుకుంటూ లక్ష్మిని ఏ విధంగా వదిలి పెట్టడమా అనుకుంటున్న భాస్కరరావు మార్కండేయులు గారి సహాయంతో ఆ ఉద్యోగం సంపాదించాడు.

జులైలో కాలేజీ తెరిచారు. తనతోపాటు చదివిన సుబ్బారావు బి.ఎ. తప్పాడు. ఇద్దరూ కలిసి మంచి విశాలమైన గదులు పది రూపాయలు అద్దె పెట్టి తీసుకున్నారు. ఎక్కువకాలం భాస్కరరావుకు మార్కండేయులు గారింట్లోనే గడుస్తూ ఉండేది.

లక్ష్మికిప్పుడు పద్దెనిమిది సంవత్సరాలు. ఇంటర్మీడియెట్ చదువుతున్నది. ఆమె చూడటానికి సన్నగా పొడుగ్గా సుకుమారంగా ఉండేది. దాన్నే నాజూకు అనేవాడు భాస్కరరావు. ఆమె జుట్టు ఉంగరాలు తిరిగేది. ఆమె శరీరఛ్ఛాయ బాగా తెల్లగా ఉండేది. ఆమె ఎప్పుడూ కళ్ళు చెదిరిపోయే రంగుల చీరలు ధరిస్తుండేది; బాగా ఖరీదు కలవి.

కాలేజీ తెరచి పదిరోజులయింది. ఒకరోజు మధ్యాహ్నం భాస్కరరావు కాలేజీనించి త్వరగా తిరిగి వచ్చాడు. సుబ్బారావు చదువుతూన్న పుస్తకం పక్కన పెట్టి “ఏమిట్రా అప్పుడే వచ్చావు ?” అన్నాడు.

“చాలా చలిగా ఉంది ! జ్వరం తగిలినట్టుంది !” అన్నాడు భాస్కర్రావు కుర్చీలో కూర్చుని. సుబ్బారావతని చెయ్యిపట్టుకు చూచి “కాలిపోతున్నది” అన్నాడు.

భాస్కర్రావు కళ్ళు మూసుకున్నాడు. సుబ్బారావు పక్క తయారుచేశాడు వెంటనే. భాస్కర్రావు కాలిబూటు విప్పేసి దానిమీద పడ్డాడు. ఇక అతనికి వళ్ళు తెలియదు.

సుబ్బారావు డాక్టరుకోసం పరుగెత్తాడు. ఆయన వచ్చి చూచి ‘జ్వరంగా ఉన్నది. మందిచ్చి చూదా’మన్నాడు. సుబ్బారావు మందు తెచ్చాడు.

రెండు మూడు రోజులు గడిచినా జ్వరం ఏమాత్రమూ తగ్గలేదు. నాలుగోరోజుని డాక్టరు సన్నిపాత జ్వరమన్నాడు. సుబ్బారావు తన పినతల్లి భర్తకొక అర్జంటు తంతి ఇచ్చాడు, వెంటనే రమ్మనీ భాస్కర్రావుకు చాల ఎక్కువ జబ్బుగా ఉన్నదనీ. ఒంటరిగా పాపం సుబ్బారావు చాల శ్రమ పడుతున్నాడు. ప్రతి పనీ అతనే చెయ్యటం చాలా కష్టంగా ఉన్నది.

నాలుగురోజులకు పినతల్లి భర్తా, కుమార్తె వచ్చారు. అక్కడే ఆమెను వదలి తండ్రి వెళ్ళిపోయినాడు జాగ్రత్త అని చెప్పి.

నానాటికీ భాస్కర్రావు స్థితి విషమించటం మొదలు పెట్టింది. మూడురోజులు రాత్రీ పగలూ లేకుండా సుబ్బారావూ చెల్లెలూ భాస్కరరావు మీద ఆశ వదులుకుని కూర్చున్నారు. డాక్టరేమీ చెప్పలేదు. ఆమూడు రోజుల్లో ముప్పయి ఇంజక్షనులిచ్చాడు.

అక్కడినించి జాడ్యం తిరుగుముఖమయింది. తిరిగి ఇరవై రోజులకు భాస్కరరావు మనుష్యలోకంలో పడ్డాడు. రోజుకు రెండు మూడు గంటలు కళ్ళు తెరచి చూస్తుండటం మొదలు పెట్టాడు. సుబ్బారావును మొదటిసారి చూస్తూనే గుర్తుపట్టాడు. తనకడ్డమైన చాకిరీ చేస్తున్న పిల్లను గుర్తు పట్టలేకపోయినా ఆముఖాన్ని చూచినప్పుడతనికి చాల సంతోషంగా ఉండేది.

పదిరోజులు గడిచింది. మత్తుగా కళ్ళు మూసుకుని పడుకోటం మానేశాడు. ఎక్కువభాగం సుబ్బారావింట్లో ఉండేవాడు కాడు. ఆ పిల్లె ఇల్లంతా తిరుగుతుండేది. ఆమెను చూస్తుంటే అతనికి తృప్తిగా ఉండేది. ఏనిద్రనుంచో లేవగానే ఆమె కనిపించకపోతే ఎట్లా వచ్చిందో అట్లాగే పోయిందేమోనని అతను చాలా దిగులుపడేవాడు. ఉదయం సాయంత్రం అతనికి హార్లిక్సు కలిపి ఇస్తూండేది. చిన్న చిన్న పనులొక లక్ష్య చేసేది.

తనకీమాత్రం భార్య అయినా లభించకూడదూ ? స్ఫోటకం మచ్చలున్న పిల్ల తలపుకు రాగానే అతని శరీరం జలదరించింది. అన్నట్టు లక్ష్మి ఏమయింది ? ఇన్నాళ్ళూ ఆమెనేవిధంగా మరిచిపోయినాడు ? తన ప్రాణంతో సమానమైన లక్ష్మి__

అబద్ధం ఆడితే అంతరాత్మ అంగీకరించదు. లక్ష్మి తన ప్రాణంతో సమానం కాదని అంతరాత్మ పెద్ద గోల చెయ్యటం మొదలు పెట్టింది. తన జబ్బులో ఒక సారి అయినా వచ్చి ఉంటుందా ? తప్పక వచ్చి ఉంటుంది ! ఒకవేళ రాకపోయినా, ఆమెకు తెలిసి ఉండదు. తెలియకపోతే విచారించి ఉండదా ? తన ఉద్యోగం ఏమయింది ?...

“సుబ్బారావ్, నా ఉద్యోగ మేమయింది ?”

“నేనే నీ తరఫున శలవు పెట్టాను. ఏమీ గోలపడకు.”

“లక్ష్మి వచ్చిందా?”

“ఎప్పుడు ?”

“ఎప్పుడైనా ?”

“రాలేదు!”

భాస్కర్రావు తుది ప్రయత్నం చేశాడు లక్ష్మిని పూర్వస్థానంలో నిలపటానికి.

"చూడు సుబ్బులూ, లక్ష్మికి తెలుసునా నా జబ్బు సంగతి ?"

"నేను తెలియజేశాను."

భాస్కరరావు నిట్టూర్పు విడిచాడు దీనంగా.

ఇంతలో ఈ పిల్ల హార్లిక్సు తయారు చెయ్యటం మొదలు పెట్టింది. లక్ష్మి తనకీవిధంగా హార్లిక్సు తయారుచేస్తుందా ? ఉత్తది !

ఏమీ సందేహం లేదు ! ఈ పిల్లను చూస్తే ఒక విధమైన ఆనందం కలుగుతుంది. ఆమె ఎవరో, పేరేమిటో ఏమీ తెలియదు తనకు. ఆమె పరాయిది కదా అనుకున్నప్పుడల్లా అతనికి కష్టంగా ఉండేది. సుబ్బారావును ఆమె గురించి అడగటం ఇష్టం లేకపోయింది. ఆమె మీద అతనికి స్నేహభావం కలిగింది. స్నేహానికి కొత్త, పాత లేదు. మనకత్యంత ప్రియుడైన స్నేహితుడు కొంతకాలం కింద మనకు పరాయివాడనుకోటానికి ఎంతో కష్టంగా ఉంటుంది.

ఆమె సుబ్బారావు చెల్లెలా ? ఆమె అతన్ని అన్న అని పిలుస్తుంది ! అతనికి చెల్లెళ్లుగాని, అప్పలు గాని లేనట్లు భాస్కరరావుకు నమ్మకంగా తెలుసును.

భాస్కరరావుకేమి తోచక ఏదొ వెర్రి ఆలోచన వస్తూండేది. ఈమెను లక్ష్మిని పోల్చి చూడ్డం మొదలు పెట్టాడొకరోజుదయం. ఈమె చామన ఛాయ శరీరం కలది.లక్ష్మి తెల్లగా ఉంటుంది. ఈమె జుట్టు లక్ష్మి జుట్టు మాదిరిగా తిరగదు. అయినా మొత్తం మీద లక్ష్మి కింత తలకట్టు లేదు. ఉన్న తలకట్టింత అందంగానూ ఉండదు. లక్ష్మిని కొత్తగా చూచినప్పుడు భాస్కరరావు తన జన్మలో తిరగని జుట్టు మెచ్చుకుంటాడనుకోలేదు. ఇప్పుడు చూస్తే ఈమె జుట్టు నమ్మకంగా లక్ష్మీజుట్టు కన్న బాగున్నది. ఈమె బొద్దుగా ఉంటుంది. లక్ష్మి నాజూకుగా ఉంటుంది. కాని ఆమె శరీరంలో ఈమె కున్నంత యౌవనం దారుఢ్యం లేదు. అందుకని ఈమె మోటుగా ఉన్నట్టూ లేదు. ఇద్దరి కళ్ళూ పెద్దలే కాని లక్ష్మి కళ్ళల్లో నల్లగుడ్డు చిన్నది కావటం చేత పైనా కిందా తెల్ల గుడ్డు కనిపిస్తుంది. ఈమెకళ్ళల్లో ఎంత జీవం ఉన్నది ! ఈమెకు పదిహేనేళ్ళకంటే ఎక్కువ ఉండవు. లక్ష్మి పద్దెనిమిదేళ్లదయినా స్వల్పంగా రోగిష్టిగా ఉంటుంది. ఏమయినా లక్ష్మిని మరిచిపోవటం చాలా తప్పుగా తోచింది. ఆమెను తలచుకుంటూ ఈమెను చూస్తూ ఆమెను మరిచిపోవటమా ?

"కొంచెం పంచదార కూడా వెయ్యనా హార్లిక్సులో ?" అన్నదీమె.

"మీ యిష్టం !" అన్నాడు భాస్కరరావు పరధ్యానంగా. అంటూనే ఆమెవంక చూచాడు నవ్వుతూ. ఆమె ముక్కు మీద వేలు పెట్టింది, అతని వంక చూచి నవ్వుతు.

భాస్కరరావు నిర్ఘాంత పోయినాడు అర్థంకాక.

బయట అడుగుల చప్పుడు వినిపించింది. సుబ్బారావు ఇంకొక మనిషితో లోపలికొచ్చాడు. ఆ రెండో మనిషి వంక చాలాసేపు చూచాడు భాస్కరరావు. ఆయన్ను కలలో ఎక్కడో చూచినట్టున్నది. కాని ఏమీ జ్ఞాపకం లేదు. ఆయన తన్ను సమీపించాడు. అతను ఆశ్చర్య పడ్డాడు.

"ఎట్లా ఉన్నది ?" అన్నాడాయన కఠినంగా.

భాస్కరరావు నిర్లక్ష్యంగా తల ఊపాడు. ఎవరైతేనేం తనతో అంత నిర్లక్ష్యంగా మాట్లాడిన తర్వాత ?

ఆ పెద్దమనిషి లోపలికెళ్ళాడు. ఆపిల్లకూ ఆయనకూ ఏదో ఘర్షణ జరిగింది లోపల. అతనికర్థం కాలేదు. చివరకు ముఖం మటమటలాడుతూ అతను వెళ్ళిపోయినాడు.

"సుబ్బారావ్!"

"ఏమిటి "

"ఎవరాయన "

"మా పెత్తల్లి భర్త !"

"ఎక్కడో చూచినట్టున్నది." భాస్కరరావు పక్కకు తిరిగి పడుకున్నాడు. ఆ రోజల్లా ఆ పిల్ల అతని వంక సరిగా చూడలేదు. ఏదో పరధ్యానంగా ఉన్నది పాపం! దీనికంతా ఆ ఉదయం వచ్చిన దుర్మార్గుడే కారణం అయి ఉండాలి.

సాయంత్రం నాలుగు గంటలయింది. బయట కారు వచ్చి ఆగిన చప్పుడయింది. ఇంకొక నిముషంలో లక్ష్మి లోపలికి వచ్చింది. ఆమెను చూడగానె అతనిలో ఒక విధమైన భయం బయలుదేరుతూండేది. ఆమెను చాలా గౌరవం చెయ్యాలి. దానిలొ ఎక్కడ పొరబాటు వస్తుందో, ఆమె ఏమనుకుంటుందో అనే భయం. ఈ పిల్ల దగ్గర ఆభయం లేదు చక్కగా !

"ఆ కుర్చీమీద కూర్చో!" అన్నాడతను అనుమానిస్తూ.

ఇంతలో లోపల్నించి ఆ పిల్ల ప్రవేశించింది. లక్ష్మి ఆ వైపు చూచి పక్కగా చూచి తిరిగి ఆమెను చూచి, భాస్కరావును చూచి, చివరకు ఆమెమీద దృష్టి నిలిపింది. ఆ పిల్లమెల్లగా లక్ష్మిని సమీపించి నవ్వుతూ భుజం మీద చెయ్యి వేసి "మరచిపోయినావు లక్ష్మీ?" అన్నది.

లక్ష్మి ఒక్క గంతుతో లేచింది. "ఎన్ని రోజులైందే కల్యాణీ నిన్ను చూచి? ఎక్కడుంటున్నావు? ఇక్కడెందుకున్నావు?" అన్నదామె కల్యాణి చెయ్యి పట్టుకుని.

భాస్కరావు సహాయం లేకుండానే మంచం మీద కూర్చుని కొంతసేపు ఇద్దర్ని తేరిపార చూచి నవ్వటం మొదలు పెట్టాడు. లక్ష్మి కొంతసేపు అర్థం కాకుండా అతనివంక చూచి, "మీరిద్దరూ బంధువులా?" అన్నది.

"కొద్దిగా! అది నా భార్య!" అన్నాడు భాస్కరావు తాపీగా.

"మీకు పెళ్ళికాలేదన్నారే?" అన్నది లక్ష్మి ఆశ్చర్యంతో.

"అప్పటికి కాలేదు. ఈ మధ్యనే అయింది."

"జబ్బులోనా?" లక్ష్మికేమి అర్థంకాలేదు.

"మనుష్యులు చేసే వివాహాలకు జబ్బు, ఆరోగ్యం, మంచి, చెడ్డ ఉంటయ్యి కాని భగవంతుడు చేసే పెళ్ళికివన్నీ లేవు. నేను మూడు సంవత్సరాలనించీ నా అంతట నేను వివాహం చేసుకుందామని ప్రయత్నం చేస్తున్నాను. భగవంతుడు నేను వళ్ళు తెలియకుండా ఉన్న సమయంలో పెళ్ళి చేశాడు. మన శరీర వాంఛలు ఎప్పుడూ ఉండేవే. వాటికి మనం ఎక్కువ స్థానం ఇవ్వక్కర్లేదు. నీ అంతట నువ్వే వివాహం చేసుకుందామని ప్రయత్నం చెయ్యకు. మనక్కావలసిన మనిషి మనదాక వస్తాడు. వచ్చేవరకూ ఆగివుండటం ఉత్తమం."

లక్ష్మి మాట్లాడలేదు. భాస్కరావు తిరిగి పడుకున్నాడు. కల్యాణి వంచిన తల ఎత్తి "పోతున్నావా లక్ష్మీ" అన్నది. లక్ష్మి వెనక్కు తిరిగి చూడకుండా తల ఊపి వెళ్ళిపోయింది.

కల్యాణి మెల్లగా భర్తను సమీపించి అతని రొమ్ముమీద చెయ్యి వేసి, "లక్ష్మికి కోపం తెప్పించారు" అన్నది.

భాస్కరావు ఆమె వంక చూచి "అట్లాగా? నా తప్పు లేదు" అన్నాడు.

"లక్ష్మి చాల మంచిది. ఒకప్పుడు మేమిద్దరం మంచి స్నేహితులం!"

"నిన్ను గుర్తుపట్టలేదేం మరి? ఇంతకు ముందు వచ్చింది మీ తండ్రా?"

"ఆ !"

"ఏమంటాడు ? నా కర్థం కాలేదు !"

"నన్ను రమ్మంటాడు."

"ఎక్కడికి ?"

"ఇంటికి !"

"దేనికి ?"

కల్యాణి నవ్వి మాట్లాడలేదు.

"ఎందుకు ?"

"ఆ ! పిచ్చి !"

"ఎందుకు ?"

"మీరు నన్ను చంపుతారని భయం ఆయనకు !"

"ఏం?"

"మీ జాతకంలో ఉందిట!"

"నీ వెట్లా వచ్చావు ?"

"నేను పోట్లాడి వచ్చాను. మా సుబ్బారావు టెలిగ్రాము ఇచ్చాడు."

"మీ ఇంటికి పోతావా ?"

"పోను !"

"నేను నిన్ను చంపితే ?"

"చంపండి !"

"నవ్వులు కాదు !"

"అవును !"

"ఒక్కటి చెబుతారూ కోప్పడకుండా ?"

"ఏమిటి ?"

"ఇన్నాళ్ళూ నా ముఖం ఎందుకు చూడలేదు మీరు ?..... పోనివ్వండి మీకిష్టం లేకపోతే ! అన్నీ కుంటి ప్రశ్నలేస్తుంటాను. నానోరూరుకోదు" అన్నది, కల్యాణి, తొందరగా భర్తముఖం మీద దైన్యం కనిపెట్టి.

"ఇక నిన్ను వదలిపెట్టి ఉండను."

"థాంక్స్."

"అబ్బో !"

★★★ .

# నేను పెద్దవాడినయ్యానా ?

## - పి.ఎస్.నారాయణ

(లత - 1968 జనవరి సంచికనుంచి పునర్ముద్రితం)




మా వదిన వ్రాసిన ఉత్తరంలో ఇలా వ్రాసింది. “నీవు చాలా పెద్దవాడి వయిపోయావ్. నీవు మా యింటికి ఎందుకు వస్తావిప్పుడు. నిన్ను పూర్వపు కృష్ణుడిగా వూహించుకోవటం నాదే తప్పు. హైద్రాబాద్ లో వున్న నీవు గుంటూరు దాకా వచ్చి అక్కడకు తొంభై పైసల దూరంలో వున్న మా దగ్గరకు రాకుండా వెళ్ళిపోయినావంటే... నిజం! నిన్ను చాలా పెద్దవాడిగానే వూహించుకోవాలి ! అసలు నీకు ఉత్తరం గూడా వ్రాయగూడదన్నంత కోపమొచ్చింది. కాని ఒకటి మాత్రం గుర్తుంచుకో. ఏ తల్లీ తన కొడుకుని ఎన్ని తప్పులు చేసినా ద్వేషించదు ! అందుకే నేను నీకు ఉత్తరం వ్రాయకుండా వుండలేక పోతున్నాను.

ఆమె వ్రాసిన ఉత్తరం నన్ను చాలా బాధ పెట్టింది.

ఆ రాత్రే, నేను వాళ్ళింటికి వెళ్ళలేకపోవటానికి గానూ పరిస్థితులు వివరిస్తూ చివరకు ఇలా వ్రాశాను. “నేను రాకపోతే నీవు బాధ పడతావని నాకు తెలుసు. అలా తెలిసీ నేను రాలేకపోయినానంటే నేను ఎలాంటి పరిస్థితులలో రాలేక పోయానో అర్థం చేసుకో. నేను మొన్న రాలేకపోయినందుకు క్షమించాలి. ఈసారి, మరోసారి అటు వచ్చినప్పుడు ఏలాంటి పరిస్థితులలోనైనా మీ వూరు వస్తాను. ఒక్క అరగంటయినా వుండి నీవు ప్రేమతో పెట్టింది తిని వెళతాను వదినా!”

అలా వ్రాసి కళ్ళుమూసుకొని పడుకుంటే అకస్మాత్తుగా రెండు సంవత్సరాల క్రితం రాజేశ్వరి వ్రాసిన ఉత్తరం కళ్ళముందు కదిలింది. ఆనాడు రాజేశ్వరీ నా మీద ఇలాంటి అభాండమే వేసింది _ అయితే కారణం వేరు ! విషయం వేరు !

ఆ రాత్రీ నాకు నిద్రలేదు.

నేను రాజేశ్వరికి ఎలా సమాధానం వ్రాయాలో _ ఎలా ఆమెను సమాధాన పర్చాలో అర్థంగాక కలవరపడి పోయాను రాజేశ్వరి నన్ను అర్థంచేసుకో లేకపోతోంది.

ఆ ఉత్తరంలో ఇలా వుంది.

“....... ...... .......

.... నిన్ను డొంక తిరుగుడుగా ఏవేవో చెప్పి విమర్శిస్తున్నాననుకోబోకు నీరాజూతో మనస్సు విప్పి మాట్లాడు.

ఏఁవైనా గాని నీవు చాలా పెద్దవాడివైపోయినావు ! ఊఁహూఁ... నా కళ్లవెంట కారే నీటి వెనుక అగాధాల్ని నీవు చూడనక్కరలేదు. ఒక్కసారి ఊహించుకో. నీ రాజూ నీకోసరం ఎలా పరితపించుతున్నది నీకు తెలుస్తుంది !

రెండు నెలల క్రితపు నాలోని భయం ఈ నాడు నిజమై కూర్చున్నది.

ఆనాడు ___

డాబామీద పిట్టగోడ ప్రక్కగా సన్నని కొబ్బరి ఆకుల క్రీనీడలలో నాకు అడుగు దూరంలో కూర్చొనివున్న నీవు... ఏఁవన్నావు?

'రాజూ! నా కళ్ళల్లోకి చూడు. నీకు ఏం కనిపిస్తోంది.... నీవు.... అవునా... అంటే నీవు నాలో ఇమిడి వున్నావన్నమాట... అటువంటప్పుడు... మనిద్దరం ఒకటే గాని వేరు ఎలా అవుతాం... జీవితాంతం మనం ఒకటే రాజేశ్వరీ.. మనని ఎవ్వరూ వేరుచెయలేరు.... ఇది నామాట. తిరుగులేని మాట రాజూ!”.... దగ్గరకు జరిగి పొదివి పట్టుకున్నావ్.

కాని ఈనాడు ఏఁవైంది? నేనెవర్ని ? ఆనాటి నీలోని నేను ఈనాడు ఎంత దూరంలో వున్నాను. గుర్తుకు తెచ్చుకో కృష్ణ !

దీపాలు వెలుగుతున్న వేళ, కోరికలు కోటలు కట్టుకుంటున్న వేళ _ ఆర్పబోకు కృష్ణా. కూల్చబోకు

___నీ రాజేశ్వరి”

నేనేం చేయాలి? నేనెంత నీచుణ్ణయిపోతున్నాను?

ఇందిర వచ్చి ఎదురుగ్గా నిలబడింది చేతిలో పాలగ్లాసుతో.

“అక్కడ పెట్టు!”

ఆ మూగస్త్రీ ముఖంలోని భావాలను నేను చూడలేను !

ఇందిర , రాజేశ్వరి!

నేను ఎవర్ని కాదనాలి ?

ఎవరి గుండెల మీద నిప్పుల కుంపటి నా చేతులతో పెట్టాలి ?

అగమ్యమైన ప్రశ్న. నా తల వాలిపోయింది.

రాజేశ్వరీ.... ఓ రాజూ...

ఒక మంచుతెర ఆవరించింది. నా కళ్ళను ఏవో పొరలు కప్పి వేస్తున్నాయి. నేనేదో మరో ప్రపంచంలో కాలు పెడుతున్నాను.

అవును... ఆనాడు...

అప్పుడే కాలేజీనుంచి వచ్చాను. ఇంట్లో కాలుపెట్టే టప్పటికి ఎవరో చాలామంది కొత్త వ్యక్తులున్నారు. నాన్నగారు వాళ్ళతో మాట్లాడుతున్నారు.

లోపల అమ్మ ఓ ముసలమ్మతో మాట్లాడుతోంది.

పుస్తకాలు డ్రాయరు మీద పడేసి, వెనుదిరుగుతుంటే, “వీడే మా కృష్ణుడు” అమ్మ మాటలు వినబడుతున్నాయి.

నాన్నగారు పిలిచి కూర్చోమన్నారు.

వచ్చినవాళ్ళు పెండ్లికూతురును చూడటానికి వచ్చి అమ్మాయిని ప్రశ్నించినట్లుగా ప్రశ్నలు వేశారు.

ఎందుకొ అర్థంగాకపోయినా అన్నిటికి నమ్రతగా సమాధానాలు చెప్పాను. తరువాత కాసేపటికి ఏదో స్వేచ్ఛకావాలన్నట్లుగా బయటపడ్డాను.

ఇంటికి వచ్చేటప్పటికి ఇందాక జరిగిన ఇంటర్వ్యూ ఫలితం అందునా నాకాశ్చర్యం కలిగించేది తెలిసిపోయింది!

నేను ఆ ముసలమ్మకు దత్తుపుత్రుడనవుతున్నానట!

దానికితోడు ఆ రాత్రే రాజేశ్వరి నా హృదయానికి హృదయం.. మా పక్కింటి రాజేశ్వరి నన్ను మేడమిద ఒంటరిగా నిలవేసింది !

"అయితే లక్షాధికారీ ! ఇక ఈ బీద రాజేశ్వరి నీకు గుర్తుంటుందా ?" ఆమె నవ్వటానికయితే ప్రయత్నిస్తున్నదిగాని కళ్ళల్లో నీరు తిరుగుతున్నదని ఇట్టే గుర్తించాను.

"ఛ! ఛ! ఏఁవిటామాటలు రాజూ నేను లక్షాధికారిని అవుతున్నంత మాత్రాన నిన్ను మర్చిపోవాల్సిన అవసరమేఁ వున్నది? నేను ఆమెకు కొత్తగా ఎలా పుత్రుణ్ణవుతున్నానో ... నీవూ అలాగే కోడలివవుతావ్!"

చాలా నిర్మలంగా, ఏలాంటి కల్మషమూ లేకుండా అన్నమాటలవి! కాని అవి ఏమాత్రమూ రాజేశ్వరిని ఊరడించలేక పోయినయి. ఆమె అనుమానాలు ఆమెకి.

ఆమె అనుమానాలను వమ్ముచేసే ప్రయత్నంలో ఆమెకు దగ్గరిగా జరిగి, అన్నాను : "రాజూ! నా కళ్ళల్లోకి చూడు. నీకు ఏం కనిపిస్తుంది. నీవు, అవునా? అంటే నీవు నాలో ఇమిడి వున్నావన్నమాట"

★ ★ ★

దత్తు తంతు జరుగుతున్న సమయములో ఆ గృహములో ఓ అందమైన మూగపిల్ల తిరుగుతున్నదన్న విషయం గ్రహించిన మాట వాస్తవమే గాని, ఆ తరువాత పదిహేను రోజులకు గాని మా కొత్త అమ్మ దృష్టిలో ఆ అమ్మాయే నాకు నిర్దేశింప బడిందన్న సత్యాన్ని గ్రహించలేక పోయాను!

అదైనా

ఓ నాడు రాత్రివేళ రాజేశ్వరి మీద ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతూ పడుకొనివున్న సమయంలో

ఇందిర నా గదిలో కాలుపెట్టింది

చేతిలో పాలగ్లాసు, పెదాల మీద చిరునవ్వు ;

చుట్టాలంతా వెళ్ళిపోయినా, ఇంకా ఆ అమ్మాయి ఎందుకు వెళ్ళలేదా అని ఆశ్చర్యపడుతున్న రోజులవి!

పాలగ్లాసును బల్లమీద పెట్టి తాగమన్నట్లుగా సౌంజ్ఞ చేసింది.

ఆ క్షణంలో సర్వం మరచి రాజేశ్వరి అనే ప్రపంచంలో ఆనంద డోలికలలో ఊగుతున్నాను నేను. ఇందిర రాక నాకు కాస్త చికాకు కలిగించింది. అందునా ఆ మూగ పిల్ల పెదాల మీద చిరునవ్వు నాలో ఏదో ఈర్ష్యను, ద్వేషాన్ని రేకెత్తిస్తున్నాయి... ఎందుకు ? నాకు తెలియదు !

విసుగ్గా, "అక్కడ పెట్టు !" అని మొఖం చిట్లించాను.

నా మొఖంలోకి ఒక్కసారి భయంగా చూసి చటుక్కున అక్కడ పెట్టి వెళ్ళి పోయింది.

మరుక్షణంలోనే నేను నా ప్రవర్తనకు బాధపడ్డాను గూడా. కానీ, అంతలోనే మా కొత్తమ్మ లోపలికొచ్చింది.

"చూడు కృష్ణా ! అది తల్లీతండ్రీ లేని మూగది... దానికి ఏ కష్టమూ కలిగించబోకు నాయినా.. అది తెలిసో తెలియకో ఏఁవైనా తప్పులు చేయవచ్చు.... దాన్ని నీవూ నేనూ తప్ప ఎవ్వరూ ఆదుకోలేం తండ్రీ.. నీకు కోపం వచ్చిందని తెలిస్తే అది భరించలేదు... అసలే సున్నితమైన మనస్సు... అది యెందుకో ఏడుస్తూ కూర్చున్నది... ఎంత అడిగినా చెప్పటం లేదు నీ గది తలుపులవైపు చూస్తూ కూర్చోవటం తప్ప ! "

"నేనేం అనలేదే !" అన్నాను కాస్త విసుగ్గా ఇందిర ప్రవర్తన చికాకు కలిగించింది.

"నీవన్నావని అనటం లేదు... ముందు జాగ్రత్త కోసరం చెబుతున్నాను !" అని వెళ్ళబోతూ, " ఏదైనా ఆ మూడు ముళ్ళూ పడేంతవరకే నా యీ రాయభారాలు... తరువాత మీరూ మీరూ చూచుకుంటారు !" అని ఫక్కున నవ్వింది.

నాకేం అర్థంకాలేదు ఆమె మాటలు. విభ్రాంతిగా ఆమె వంక చూడసాగాను.

" ఇందిర పెళ్ళా ?" చేతుల మీద సగం లేచి అన్నాను.

" అవును మీదే "

నా అనుమానం కాస్త నిజమయింది !

ఒక్కసారిగా నెత్తిన బాదినట్లనిపించింది.

నాకు ఆ మూగపిల్లతో పెళ్ళా ?

మరి రాజేశ్వరి ?

"అదేవిటి?... ఆ మూగపిల్లను నేను పెళ్ళి చేసుకోవాలా ?... అసంభవం" విసురుగా లేచి నిలబడ్డాను.

వెనుదిరిగిన ఆమె మొఖం నల్లబడటం గమనించాను.

"ఒక్క గొంతు లేకపోవటం తప్ప ... మరేం లోపమున్నదని !" భయంతో ఆమె కంఠం వణుకుతోంది.

"లోపాలోపాల సంగతిగాదు ప్రస్తుతం... ఇందిర అన్నీ వున్న అప్సరస అయినా నేను చేసుకునే ప్రసక్తే లేదు !"

"ఎందుకని ?" విభ్రాంతిగా కండ్లప్పగించి అడిగింది.

"నీకు తెలియక పోవచ్చు. నా కాబోయే భార్య ఎవరో ఇదివరకే నిర్ణయించుకోవటం జరిగింది. ఆ ఊహలతోటే ఎన్నో కోరికల కోటలు. అందమైన హర్మ్యాలు నిర్మించుకున్నాను. అలాంటి ఆమెను దూరంగా నెట్టివేసి, జీవితాన్ని నరకం చేసి, నన్ను పిచ్చివాణ్ణిగా చేయటం నీకు మాత్రం ఎం భావ్యమమ్మా?" జాలిగా ఆమె మొఖం లోకి చూచాను.

"ఏది భావ్యమనను ? ఏది కాదనను ? ఇదంతా నా ఖర్మ !"

ఆమె మాటలకు తిరిగి నా కళ్ళు ఎర్రరంగును పులుముకున్నయి.

" అమ్మా! నీ ఉద్దేశ్యం నాకర్థం కావటం లేదు. అసలు ఇందిర విషయం ముందుగా మా వాళ్ళకు ఎందుకు చెప్పలేదు ? ఆనాడే చెప్పి వున్నట్లయితే..."

"అవును ! చెప్పివున్నటయితే నిన్ను అమ్మా అని పిలిచి వుండేవాడిని కాదంటావ్! అంతేనా ! సరే ఒక విషయం గుర్తుంచుకో. ఈ విషయంలో నిన్నేవిధంగానూ ఒత్తిడి చేయను. కాని ఇందిర విషయం చెబుతాను. ఆమెను గురించి ఆలోచించు తరువాత నీ యిష్టం వచ్చింది చేయి.... ఇక నీ యిష్టంరా కృష్ణా ! నీ యిష్టం!" ఆవేశంగా అన్నది.

ఆమె ఆవేశం నా కోపాన్ని అణగతొక్కుతోంది.

"అది నా అన్నకూతురు. ఒకే రక్తం పంచుకు పుట్టిన నా అన్నయ్య కూతురు. అది మూగది. తల్లి లేదు, తండ్రిలేదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. నేను పెంచాను. పదేళ్ళ వయసులో నా చేతుల్లోకి తీసుకొని, దాన్ని ఈ నాటికి ఇలా తయారు చేయగలిగాను. దాని లోపం నాకు తెలుసు, నీకు తెలుసు నలుగురుకీ తెలుసు నేనేం దాచిపెట్టి నీకంటకడదాం అనుకోవటం లేదు. నీకు ఎలాంటి భార్య కావాలని, కోరుకునే మనస్సు వున్నదో, నాకూ అలాంటి కోడలే కావాలని కోరుకునే మనస్సు వున్నది. అంతే గాదు నన్ను నేను వంచించుకొని, నిన్ను మోసం చేసి దాన్ని నీకు అంటగట్టి నేను పాంవుకు తినేదేవీ లేదు. ఆ మూగదాన్ని నా కోడలిగా చేసుకొని దాని వెనుక వున్న ఆస్థుల కుప్పలన్నిటినీ నా నెత్తిన వేసుకొని రుద్దు కుందామనుకోవటం లేదు. నీవు చూస్తూనే వున్నావు గదా గొంతులేక పోవటమొక్కటే గాని, దానిలో మరే లోపమూ లేదు. దానంత అందమైన దాన్ని మరోదాన్ని నాకీనాడు చూపించు" విసురుగ లేచి నిలబడింది.

ఎందుకో నాకు తెలియకుండానే నేను మెత్తబడిపోయాను. "అది గాదమ్మా! ఇందిర లోపం సంగతి నేను మాట్లాడటం లేదు. మరి రాజేశ్వరి"

ఆమె మరింత విసురుగా నా ముందుకు వచ్చింది. "రాజేశ్వరి, రాజేశ్వరి అంటావ్! నాకు అర్థంకావటం లేదు. నీవు ఆ మాత్రం అర్థం చేసుకోలేవా ? రాజేశ్వరికి అయినంత తేలిగ్గానే ఇందిరకు వివాహం అవుతుందంటావా?"

నిజమే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పటం కష్టమే నేనేదో అనబోయాను.

అప్పటికే ఆమె నన్ను నా ఆలోచనలకు, నా ఆవేశాలకు వదిలివేసి వెళ్ళిపోయింది!

తరువాత నాలుగు రోజులకే రాజేశ్వరి ఆ పెద్ద ఉత్తరం కాస్తా వ్రాసేసింది!

సమాధానం ఏంవి వ్రాయను ?

నిన్ను గాదని మా కొత్తమ్మ ఆ మూగ పిల్లను చేసుకోమంటుందని వ్రాయనా ?

నా మానవత్వ మేమయింది ?

నాకు మనస్సు లేదా ? నాకు హృదయం లేదా ?

వాటిని కాస్తా ఆమె యిచ్చిన లక్షరూపాయిల ఆస్థీ మ్రింగివేసిందా ?

అదే రాజేశ్వరి అడిగితే ?

నేను ఆమె జాబుకు సమాధానం వ్రాయలేదు. అంతేగాదు. తరువాత వచ్చిన రెండు ఉత్తరాలకు గూడా తిరిగి సమాధానం వ్రాయలేక పోయాను.

నేను సర్వం మరచి ఆ గదినే ప్రపంచంగా చేసుకొని  రాజేశ్వరా ? ఇందిరా?  ఎటూ మొగ్గలేక విచలితుడనై కూర్చుని వున్నాను ఆ రోజులన్నీ.

క్షణం క్షణం రాజేశ్వరికి చేసిన బాసలు, గుర్తుకు వస్తున్నాయి. ఆమె ఉత్తరాలు గుర్తుకు వస్తున్నాయి. ఆమె జాలిగా వ్రాసిన అక్షరాలు గుర్తుకు వస్తున్నాయి కాని, ప్రతిక్షణం కంటబడే ఇందిర జాలిచూపులు, కన్నీటి భావాలు...??

అంతేగాదు

నా మీద ఎన్నో ఆశలు పెట్టుకుని, నన్ను తన పుత్రుడిగా చేసుకున్న ఆ ముసలి విధవ స్త్రీ !

ఆ రోజు టపాలో ఉత్తరం వచ్చింది.

“ఓ లక్షాధికారీ !

నేను ఆనాడు నవ్వుతూ నిన్ను అలా సంబోధించలేదు... డబ్బున్న మనుష్యుల మనస్తత్వం నాకు తెలుసు.... లోక సహజంగానే నీవూ ప్రవర్తించావు. కాదనగలవారెవరు ?

ఈ బీద రాజేశ్వరి మీద నీకెందుకుండాలి దయ ?

నీకు చెప్పటం అంతగా ఇష్టము లేకపోయినా మీ కొత్తమ్మద్వారా మీ అమ్మకు వ్రాయించిన జాబు నాకు తెలియాలని చేసిన పనేనని నాకు తెలుసు !

కాని, చివరిసారిగా  ఆశ లేకపోయినప్పటికీ, తెలియని ఆశతో  ఈ ఆఖరి ప్రయత్నం చేస్తున్నాను.... ఈ ఉత్తరం అందిన మరుక్షణంలో నీవు బయల్దేరితే సరే... లేకపోతే ఇదే రాజేశ్వరికి ఆఖరి సారి ఉత్తరం వ్రాసే అవకాశం అని గుర్తుంచుకో.

ఇట్లు,

ఇప్పటికీ, ఎప్పటికీ,

నీ రాజేశ్వరి.”

“రాజేశ్వరీ !” ఉత్తరం చూస్తూనే తెలియని ఆవేశంతో లేచి నిలబడ్డాను.

సూట్కేస్ ను మంచం మీద పడేశాను. నాలుగు గుడ్డలు దాంట్లో కుక్కుకున్నాను దబదబా ఇస్త్రీ గుడ్డలు తీసి తొడుకున్నాను.

ఇంతలోకే అమ్మ వచ్చింది.

“ఇంటికి వెళ్ళి రెండు రోజుల్లో వస్తాను”

“నీ యిష్టం !” చాలా ముభావంగా అన్నది.

ఆమె అనుమానాలు నాకు తెలుసు !

నేను సూట్కేసు చేతిలోనికి తీసుకొని వరండాలో కాలు పెట్టాను.

అక్కడ ఇందిర నిలబడి వున్నది !....

జాలిగా నావంక చూస్తోంది....

ఎర్రగా, సన్నబడినట్లున్న ఆమె, తన లోతుకుపోయిన కళ్ళతో నా వంక చూస్తున్నది. ఆమె కనుగుడ్లను నీటి పొరలు క్రమ్మివేయగా  ఏదో తెలియని భయంతో విలవిల లాడిపోతున్నట్లుగా నావంక చూస్తున్నది  సరియైన ఆచ్ఛాదన ఇవ్వలేనట్లుగా చిందరవందరగా ఎగిరిపోతున్న జుట్టు మరింత జాలిగొలిపేలా వున్నది.

ఆమె మొఖం ఆ జాలిగొలిపే ముఖాన్ని చూస్తుంటే  మాటిమాటికి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్లుగా నోరు తెరవబోతున్న ఆమెను చూస్తూంటే అడుగు ముందుకు పడటం లేదు

అక్కడే చలనరహితంగా ఆగిపోయాను.

కొత్తమ్మ చెప్పినట్లుగా రాజేశ్వరి ! అన్నీ వున్న రాజేశ్వరి !

ఇందిర భగవంతుడి, సృష్టిలో కూడా అన్యాయం చేయబడిన ఇందిర !

ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

ఇందిర రెండుచేతులూ వణుకుతున్న రెండు చేతులనూ మొఖం మీదకు లాక్కున్నది ఒక్కసారిగా పెద్ద ఎక్కు వచ్చింది మెడ విరిగేలా చటుక్కున మొఖం పక్కకు తిప్పుకున్నది ఎవరో బాదినట్లుగా తల వంగిపోయింది తన సర్వస్వం కోల్పోయినట్లుగా అక్కడే కూలబడిపోయింది.

ఇందిరా !

చేతిలోని సూట్కేసును అక్కడే వదిలివేసి గదిలోకి వెళ్ళి మంచం మీద కుప్పలా పడిపోయాను...

తరువాత రెండు నెలలకు గాబోలు ఇందిరతో నా వివాహ సమయంలో అమ్మ చెప్పింది ! " మన పక్కింట్లో వుండేదే... నీతో చదివేదిరా ... మాష్టారమ్మాయి... రాజేశ్వరి.. నెల క్రితం చచ్చిపోయింది !" అని.

ఆమె మాటలు వింటూనే ఉలిక్కిపడి బిగుసుకుపోయాను.

" ఏదో విషజ్వరంతో చచ్చిపోయిందని అంతా అనుకుంటున్నా... ఏదో మందు తిని చచ్చిపోయిందనే మా అనుమానం !"

నా మీద నాకే కసితో ఒంటరిగా కూర్చొని జుట్టు పీక్కున్నాను.

నేను హంతకుణ్ణి !

★ ★ ★ ★ ★

ఆలోచనలకు అడ్డు పడుతున్నట్లుగా ఇందిర వచ్చింది పెద్దగా నవ్వుకుంటూ.

రాజును తెచ్చి నా పొట్టమీద పడేసింది.

" ఊఁ ... ఊఁ...." అంటూ తన ఎర్రటి చేతి వ్రేళ్ళను వాడి గులాబి రంగు బుగ్గల్లో పొడుస్తూ ఏదో చెబుతోంది.

ఆమె నవ్వు పాల నురగలా, స్వచ్ఛంగా, తెల్లగా వున్నది.

★ ★ ★ ★ ★

ఆ రాత్రికే మా గుంటూరు ప్రయాణం.

అదైనా ఆ రోజు అమ్మ దగ్గరనుండి వచ్చిన ఉత్తరం మూలకంగా

" కృష్ణ!

నీవు చాలా పెద్దవాడివై పోయావురా!... లేకపతే పదిహేడు సంవత్సరాలు నిన్ను పెంచిన నన్ను రెండు సంవత్సరాలలోనే ఇంతగా మర్చిపోతావని. నా మాటలకు ఇంత విలువలేకుండా చేస్తావని నేను కలలోగూడా అనుకోలేదు... నిన్ను ఆరేడు నెలలకైనా ఒకసారి వచ్చి చూచి వెళ్ళమన్నాను... అప్పుడే నీవు క్రితంసారి వచ్చి పదినెలలయింది..."

ఇలా సాగిస్తుంది ఉత్తరం.

ఎలాగూ, మా వదినా అన్నయ్యా గూడా రావటంలేదని మనస్సు కష్టపెట్టుకుంటున్నారు

గుంటూరు మరునాడు ఉదయానికల్లా వెళ్ళాం.

పక్కనున్న రాజేశ్వరి వాళ్ళ ఇల్లు చూచినప్పుడల్లా మనస్సు కలుక్కుమంటుంది. శరీరమంతా చెమటలు పడుతుంది. గిలగిలలాడిపోతాను... సర్వం అంధకార బంధురమయిపోయింది.

ఇంతలోనే ఇందిర కనబడుతుంది.

నేనేం చెయ్యాలి ? నేనేం చేయగలను ? నేను అశక్తుణ్ణి.

మూడు రోజుల తరువాత మా అన్నయ్య గారి ఊరు బయల్దేరేను ఇందిరను, రాజును తీసుకొని !

నేను బయల్దేరినట్లుగానే వానా బయల్దేరింది. చిన్న చిన్న జల్లుతో ప్రారంభమయి మేం బస్సుస్టాండు దగ్గరకు మా అమ్మ వద్దంటున్నా వినకుండా వెళ్ళేటప్పటికి జోరున వానగా మారి కూర్చుంది.

బస్సు వచ్చింది కలవరపడుతూనే ఎక్కాం!

గంట ప్రయాణం... బస్సు ఆగే చోటుకి పది అడుగుల దూరమే ఇల్లు అంత ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదనే మా ధైర్యం!!

కాని

అనుకున్నవి ఏంవి అయినయ్యని నా జీవితంలో

ఇంకా నాలుగు మైళ్ళ దూరంలో అంటే పదినిముషాల్లో మా అన్నయ్య గారి ఇంట్లో ఉంటామనగా, కృష్ణ ఒడ్డున బస్సు ఆగింది.

ఎదురుగా ఉరవళ్ళు, పరవళ్ళు తొక్కుతూ పారుతున్న కృష్ణ... ఆ బస్సుకు అదే ఆఖరు స్టేజీ వరద తగ్గేటంతవరకు! నా నవనాడులూ కృంగి పోయినయి.

నా ఉత్సాహమంతా చప్పగా చల్లారి పోయింది.

అదే బస్సు వెనక్కు తిరిగింది మళ్ళీ టిక్కెట్లు కొనుక్కున్నాం !

నాకు తెలుసు

నేను హైద్రాబాదు వెళ్ళేటప్పటికి మళ్ళా ఉత్తరం వస్తుంది.

“.. నీవు చాలా పెద్దవాడివైపోయావు కృష్ణ!....

ఈ నాడు నీవు లక్షాధికారివని తెలిసే నీవు మా యింటికి వస్తావని ఆశపెట్టుకోవటం... నీళ్ళను మూట కట్టుకోవటం లాంటిది!!......

అలా... అలా....

భగవాన్ !

★★★

★★★ .

# తిరుపతికొండ మెట్టు

## - అడివి బాపిరాజు గారు

## (భారతి - 1933 ఏప్రిల్ సంచికనుంచి పునర్ముద్రితం)

శ్రీ తిరుమల మహా పుణ్యక్షేత్రంలో గాలి గోపురానికి పోయే మొదటిమెట్ల వరసలో సగము దాటిన పైన ఏకాకి, కుంటి బిచ్చగాడు, పున్నెడు నివాసం. ఏ బిచ్చగాళ్ళ ఋషి కులానికి చెందకుండా పున్నెడు ఆశ్రమం ఏర్పరుచుకున్నాడు. రెండుకాళ్ళూ మొండే. కానీ వాడికున్న బలం విపరీతం. వాడు చేసే దొమ్మరి విద్యల సాహసం ఏ ఇసాకో గ్రాండు రషియను సర్కసు జట్టులో వుండే పరమ సాహసికిన్నీ లేదు. చేతులతో మెట్టెక్కుతాడు. కోతిలా కొమ్మనుంచి కొమ్మకు ఎగిరి ఛంగున పోతాడు. వేలాడుతూ చక్రంలా గిరగిర తిరుగుతాడు. దేహమంతా వాలఖిల్య మునిలా పైకెత్తి వేళ్ళమీద తలక్రిందులా నిలబడి నడుస్తాడు. మెట్టుమీదనుంచి పైమెట్టుకి బంతిలా ఎగురుతాడు. ఒంటి చేతిమీద నిలుస్తూ, చేతుల్లోంచి దేహమంతా దూరుస్తూ చూపించే విచిత్రపు ఆసనాలా, మొగ్గలా ముందర హఠయోగి విరూపానందస్వామి యోగవిద్య గాని, జపాను మాంత్రికుడు మసుకాకో కనబరచే "ఫీట్లు" గాని, నూరు వోల్టుల ఎలక్ట్రిక్ దీపం ముందర పడకగది దీపంబుడ్డిలా తెలతెలపోవలసినదే!

యాత్రికుల తండాల మేఘాలు పున్నెడు ముందర ఆగి, ఆతని అద్భుత చర్యల చూసి విస్తుపోయి దమ్మిడీలు, కానులు, అణాలు వర్షం కురిపిస్తే, రాత్రి తొమ్మిది అయ్యేటప్పటికి అయిదూ, ఆరు రూపాయల చిల్లర చెరువులు కట్టుంది. ఏ బ్రహ్మోత్సవమో అయితే పది పదిహేను రూపాయలు పోగుచేశాడన్నమాటే. తిరుపతి కొండల ఎక్కుదిగుడుల ఏడు మైళ్ళలో ఉన్న మూడువందల ఏబదియారు బిచ్చగాళ్ళలో పున్నెడుకు వచ్చే రాబడి ఇంక ఎవరికీ లేదు. వికలాంగులు ఉన్నారు. ముక్కునోరు అంతా ఏకరంధ్రమైనవారు, కుష్టు రోగులు, మాంత్రికులు, సన్యాసులు, ముళ్ళమీద హంసతూలికా తల్పం మీదలా పండుకొనే యోగీశ్వరులు, గుడ్డివారు, కోకిలకంఠంతో పాడే గాయకులు, ఆడవాళ్ళు, మగవాళ్ళు, బిడ్డలు; భయం కలుగచేసేవి, కళాసౌందర్యం వెల్లి విరియజేసేవి విగ్రహాలను ముందుంచుకొని పూజారిపని చేసేవారు ఎన్ని రకాలున్నారో తిరుమలేశ్వరుని కొలువుచేసే అయ్యంగార్లు, అయ్యరులు, అయ్యలు, రెడ్లు, మొదలియారులు, సెట్లతో పాటు, కోతులతో పాటు, ఈ బిచ్చకుల బృందాలు !

ఆ విచిత్ర ప్రపంచంలో ఉన్న బిచ్చగాళ్ళంతా పున్నెణ్ణి చూసి అసహ్యించుకునేవారు. పున్నెడు ముష్టివాళ్ళందరకూ విరోధి అయిపోయినాడు. వాడి సంపాదన వాళ్ళ కడుపుమండజేసింది. వాడికి ఉడుకుబోతుతనం కాశ్మీర దేశాన్ని సహారా ఎడారి చేయగల శక్తితో విజృంభించింది. ధర్మ ప్రవాహాలు వాడిదగ్గర ఆనకట్టకట్టబడి నిర్జల వాహినులు కొండంతా ప్రవహిస్తున్నవి. పున్నెణ్ణి త్వరగా కొండమీద నుంచి జపాను వారు చీనాను తరిమినట్లుగా నెట్టివేయవలెనని బిచ్చగాళ్ళా సంఘంలో సంచలనం కలిగింది. వారిలో ఏకబురున్నూ తీగెలేని వార్తలా నిమిషంలో ఆ కొండలోయల మోకాళ్ళ పర్వతం చుక్కల పర్వతం ఏడుమైళ్ళూ వ్యాపిస్తుంది. పున్నెణ్ణి శ్రీ వేంకటేశ్వర సన్నిహిత భక్త బృందంలోంచి రెండువేల మైళ్ళన్నా విసిరివేసేటందుకు ఒక మాఘ శుద్ధ ఏకాదశినాడు బిచ్చకుల ఆశ్రమాలన్నీ తీర్మానించుకున్నవి.

ఆ తీర్మానం ప్రకారము బిచ్చగాళ్ళకు అన్నము, సాంబారు అమ్మేవాళ్ళు అమ్మడం మానివేసినారు. నీరు తెచ్చేవాళ్ళు నీరు తేవడం మానివేశారు. సరుకులు ఏడుమైళ్ళ దారి పొడుగునా విక్రయించేవాళ్ళు విక్రయించడం మానివేశారు. పున్నెడు మొదట వేళాకోళం అనుకున్నాడు. క్రింద ఆశ్రమంలో వున్న దిగుడు బావిలో నుంచి నీళ్ళు పై ఆశ్రమాలవాళ్ళకి విడి బిచ్చగాళ్ళకి అమ్మే నీళ్ళ మనిషి పున్నెణ్ణి వెక్కిరించి, “నీళ్ళు నీళ్ళు” అని పున్నెడు గోలపెట్టున్నా నడుమూ కటిభారం ఆడించుకుంటూ వెళ్ళిపోయింది. పున్నెడికి కళ్ళు పచ్చబడ్డాయి.

చెట్టునీడనే కూలబడి తల మొండి కాళ్ళ మీద అన్చి వున్నాడు. ఆలోచనలో మునిగి పోయాడు. తన జీవితమంతా ఒక్కసారిగా ఫిల్ము తిరిగినట్లు పొడచూపింది.

పున్నెడు అనంతపురం జిల్లాలోని ఒక గ్రామములో నివసించే అభిమానవంతులైన ఒక రెడ్డికులంలో ఉద్భవించాడు. ఆవూరి రెడ్డి వారికి పక్కగ్రామం రెడ్డివారికి ఒక గ్రామం తగాదా వచ్చి కురుపాండవ యుద్ధమైపోయింది. అప్పుడు పున్నెడి పేరు పుణ్యంరెడ్డి. పుణ్యంరెడ్డి తండ్రిన్నీ, ముగ్గురు అన్నదమ్ములును వీర స్వర్గం అలంకరించారు. పుణ్యంరెడ్డి కాళ్ళు రెండూ విరిగినాయి ఆస్పత్రిలో రెండుకాళ్ళూ ఛేదించి మొండిజగ్గణ్ణి చేసినారు. కుటుంబం యావత్తు నశించిన వెనుక వ్యాజ్యాలలో ఆస్తీ మాయమైంది. కతిపయ ప్రయాణాలు చేసి రెండేళ్ళకు వెంకటాచల సోపాన పంక్తి రెండవ శేషాచలపతిలా అవతరించినాడు పుణ్యంరెడ్డి. ఇంక రెండేళ్ళలో పున్నెడయ్యాడు రెడ్డి.

పూర్వ చరిత్రలన్నీ మాయమై పున్నెడు కళ్ళ రెండు చుక్కలు రాలినవి. అతని గొంతుక ఎండినది. ఆకలితో మాడినాడు. కొండమీద దుకాణాలకు సరుకు అందుబాటు చేసే వర్తకులు వచ్చినప్పుడు పున్నెడు కొంత డబ్బు వారికి ఇచ్చి సాయంత్రానికి వంట సామాగ్రి తెప్పించుకున్నాడు. డోలీలవాళ్ళకు ఒక అర్ధణా చేతిలో వేసి కుండెడు నీళ్ళు తెప్పించుకున్నాడు. ఆ సరుకుతో ఆ నీటితో మూడు రోజులు గడిపినాడు.

నాలుగో రోజు తెల్లవారగట్ల మూడింటికే లేచి ముష్టికి తయారైనాడు. తెల్లవారే వరకూ ఒక రూపాయిన్నర మూడు దమ్మిడీలు ప్రోగయినవి. ఇంతలో మామూలుగా కొండమీద దుకాణాలకు సరఫరా దారుదు కందసామి వంట సామాగ్రి తెచ్చియిచ్చే సమయమైందని కొండపైకి దిగువకు చూసి ఆ ప్రక్కనే నాలుగు బారల దూరంలో తాను నిద్రపోవుటకు ఏర్పరచుకొన్న పొదకడకు పోయి ఒక పెద్దరాయి తీసి చూసినాడు. అతని కళ్ళు తిరిగి “అమ్మయో” అని వెనక్కు వాలిపోయినాడు. ఆ రాతిక్రింద పున్నడు దాచుకున్న ఐదువందల డెబ్బై అయిదు రూపాయల మూట మాయమై పోయింది. పున్నెడు ప్రాణం మరిగిపోయింది. రాతి మీదనుంచి క్రిందకు కూలబడిపోయినాడు. కొంత సేపటికి ఆతని మొగము జేవురించింది. ఈ పని చేసినది మామూలుగా బిచ్చగాళ్ళతో వర్తకం చేసే కుప్పుస్వామిపని అని అనుమానము తట్టినది. వ్రటువలు తిరిగి కండలు కట్టి, హనుమంతుని హస్తాలవంటి బలమైన అతని చేతులు భయంకరంగా వంకరలు తిరిగినవి. ఆ సమయంలో ఆతని చేతులకందిన ప్రాణి కబంధుని వాత బడినట్లే.

ఆ రోజు దొరికిన డబ్బునిచ్చి వంటసామాగ్రి కొనుక్కున్నాడు పున్నెడు. ధనంతో పాటు అతని బలమూ నశించింది, జీవితేచ్ఛా పోయినది. ప్రపంచంలో యుద్ధక్రమంగా సంసారయాత్ర చేసే ఆశ అడుగంటింది. తన చర్యలు చూపించి ముష్టి ఎత్తుట మానివేసినాడు. డబ్బు లేకపోతే తిండీ తిప్పలు పోయినవి. అయిదు రోజులయ్యేసరికి పున్నెడు అస్థిపంజరమై పోయినాడు. పున్నెడు దురదృష్టము వెంకటాచలాన రాళ్ళలా ఆశ్రయించి ఉన్న వర్తకులు మొదలగు యావన్మందికీ తెలిసిపోయింది.

శేషాచల బిచ్చకుల లోకానికంతా సంతోషమైనది. వదులుతాదురా పిశాచి అనుకున్నారు. అందరికీ ఇక కొంచెమో గొప్పో దొరుకుతుంది. ఇదివరకు పున్నెడున్నంత కాలము అదృష్ట దేవత అతన్నే ఆవహించింది. ఇప్పటి నుంచి కొండ మెట్ల దారి ఏడుమైళ్ళు కిందకీ పైకీ ఆమె తిరుగుతూ ఉంటుంది. మళ్ళీ మంచి దినాలు వచ్చినవి_ _ అనుకున్నారు.

నీరసించి పోయిన పున్నెడు ఆరో దినం రాత్రి స్పృహ తెచ్చుకొని కొండమీదనుంచి పక్కనున్న లోయలోనికి ఉరికి వెంకటేశపాద సన్నిధి చేరుదామనుకున్నాడు. చేతులతో పాకి ఆరడుగుల దూరంలో ఉన్న ఎత్తుబండల మీదికి పోయినాడు. "గోవిందా ! వెంకటరమణా, గోవిందా" అని ఉరకబోయినాడు. కాని చల్లని చేయి అతని చేతిని పట్టి వెనక్కు లాగివేసింది.

కళ్ళు మూసుకున్న పున్నెడు శ్రీ వెంకటేశ్వరుదు ప్రత్యక్షమైనాడనుకున్నాడు. ఆతని దేహము పులకరించింది. చల్లని గాలులు ప్రసరించినట్లయింది. వెన్నెలలు పిండి ఆరగా కాచినట్లయింది. ఆతడు కళ్ళు తెరిచేటప్పటికి ఎట్ట ఎదుట ఆ చుట్టుప్రక్కల బిచ్చగాళ్ళ ఆశ్రమాలికి నీళ్ళు బోసే బోయపిల్ల కనబడినది. ఆమె తీరైన నల్లని మొగమంతా నక్షత్రాల వెలుగుల కాంతిలో కళ్ళ నీళ్ళు మెరుస్తూ కనిపించింది. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ “పున్నెడు, నాను

బహు పాపిని! నిండా దోసం చేసినా. ఆరుమాసాల క్రిందు రోగం వచ్చి దుడ్డులేక సబ్బరపడినప్పుడు సత్తురూపాయి రహస్యంగా పంపిన నీ చల్లని గుండే నాను తలుచుకున్నా! చచ్చిన శుక్ల పర్వతం కుష్టు ముసలి దానికి నువ్వు చేసిన చాకిరిదా నా ఒడంబు తిప్పినది. ఓ సామి నీవు దేవుందు! నీకు వీండ్లు పిశాచిలు, నిండా ద్రోగం తలపోసినారే ! నాను కూడా సరిదా అంటిని ! ఓయ్ ! ఓయ్ ! నాను నరరక్కసి! నాకు పదునాలో కుంపిని నరకం!" అని పొంకమా వక్షం ఉబికి పోగా అతిదీనంగా పొర్లి పొర్లి వచ్చే ఏడుపును ఆపకుండా ఏడ్చింది.

పున్నెడు నిర్ఘాంత పోయినాడు. బోయపిల్ల మంగిని బలమైన చేతులతో దగ్గిరకు లాక్కున్నాడు.

"పిల్లా, నాకు కల్గిన యీ సెబ్బరకు నానుదా దుఃఖం పొందేది లేదు. నిండా ఇంతకు మించి కష్టాలు తీరినై ఈ పాణికి; కాని అతి మెత్తని నీకుదా ఏడ ఈ గెట్టిమణసు అని విచారింసినా ! మొణ్ణ నీ కళ్ళు మేఘాల రాత్రిలా ఉండినైదా. ఇంగ పెంపంచికంలో మంచీ, పున్నెం లేదని తోసినదే. ఏల ఈ పాణి బతికేది! అంతదా !"

"ఓ సామి, నన్ను చెమించు ! నాను రక్కసినిదా సెప్పుంటినే ! నీ సొమ్ము దుడ్డు ఏడ దాచేది నాకుదా తెలుసునే ! వాండ్లమాయలో చేరి వాండ్ల చెప్పినా ! ఆ పాపి కుప్పుసామిదా తీసిందు అయ్యో."

పున్నెడు మొగం నవ్వింది. ఆతని హృదయం వెన్నెల్లు కాసింది.

"పోయేలే ! ఈ పాణికి ఈ చేతులిచ్చిన వెంకటసామి చల్లగా, పది అయిదు నూలు సంపాదించలేనా ! నువ్వు నా దగ్గిరుండేది అంతదా !" అని ఆమెను తన చేతుల్లోకి తీసుకుని తల ముద్దు పెట్టుకొన్నాడు. మంగి తాను తెచ్చిన మంచినీళ్ళు, కూడు, పున్నెడుకి నెమ్మదిగా తినిపించింది.

చుక్కలు నవ్వినవి. తమవైపు తిరిగి మొకరించిన ఆ నూతన స్త్రీ పురుషుల తలపై సేవలు చల్లినవి మంచుబిందువులు. శ్రీ వెంకటపతి తాను సలిపిన పెండ్లిళ్ళ కన్న ఇది మించినదనుకున్నాడా !

★★★